ఈనాడు

విజయవాడ 8-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 88

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అశ్రు నివాళి



జననం
25-04-1959

మరణం
29-10-2025

శ్రీ ముక్కామల సురేంద్రబాబు గారు

చైర్మన్: శ్రీ విద్యా పాలిమర్స్, PP పాలిమర్స్ , జయశ్రీ పాలిమర్స్

అజరామరమైన కీర్తి.. అపారమైన ప్రేమ.. అంతులేని ఆప్యాయత.. అందరి యెడల ఆదరణ అన్నీ కలగలసిన అరుదైన వ్యక్తిత్వం మీది..
మీ చిరునవ్వే మా అందరి జీవితాలపై చిరకాలం నిలిచిపోయే చెరగని ముద్ర. మీరు లేరన్నది ఒక చేదు నిజం.
మీతో గడిపిన ప్రతి క్షణం ఒక తీపి జ్ఞాపకం. ఆ స్మృతులు స్మరించుకుంటూ..
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో.. అంజలి ఘటిస్తున్నాము...

భార్య: ముక్కామల రజిత బదరి విశాలాక్షి (పండు)

కుమార్తెలు - అల్లుళ్ళు:
పొట్లూరి పూజిత - పొట్లూరి శ్రీనివాస్
నాగభైరవ పూర్ణిమ- నాగభైరవ కృష్ణ ఫణీందర్

మనుమరాండ్రు:
నందిని- జయవర్షిణి
ప్రజ్ఞ మనుమడు: హర్షిత్ శ్రీరామ్

బావగారు - చెల్లెలు:
తిపిర్నేని పార్థసారథి - వాణి

మేనల్లుడు:
తిపిర్నేని వెంకయ్య చౌదరి

మేనకోడలు: ముళ్ళపూడి శృతి - నిత్యానంద్
హాసిని, హర్షిణి

సహస్ర, శ్రద్ధ

అత్తగారు- మామగారు : యనమదల ఈశ్వరి విజయలక్ష్మి (లేటు) - వీరరాఘవరావు

బావమరిది: యనమదల నెహ్రూ - ప్రమీల
యనమదల మాధుర్ - లక్ష్మీ మానస

మేనకోడలు: యనమదల పల్లవి

తోడల్లుడు: అడుసుమిల్లి శ్రీరమేష్ - రమాదేవి, సత్య రాజీవ్ దత్తు - శ్రేయ

పెద్దకర్మ: ది. 08-11-2025 శనివారం గన్నవరం గ్రామములోని A.B. కన్వెన్షన్ హాల్ నందు (ఎయిర్‌పోర్ట్ దగ్గర) పెద్దకర్మ జరుపబడునని తెలియపర్చడమైనది. Cell: 96666 39410

ఈనాడు

విజయవాడ 8-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 88


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కండర గండాలు రాకుండా!



15 ఏళ్లకే పిల్లల్లో కాళ్ల లాగడం, మెడ నొప్పులు 50 ఏళ్లు దాటిన మహిళల్లో నడుము నొప్పులు చేతుల్లో, కాళ్లలో బలం లేని పురుషులూ ఎందరో.. వీటన్నింటికీ ప్రధాన కారణం.. మన కండరాలను(మజిల్)ను నిర్లక్ష్యం చేయడమే! ఫలితంగా మజిల్‌లాస్(శార్కోపీనియా)ను కొనితెచ్చుకుంటున్నాం!

కండరాలు ఎంత బాగా ఉంటే మన మోకాళ్లు, కీళ్లు అంత బలంగా ఉంటాయి. జాయింట్లకు మజిలే సపోర్టింగ్ సిస్టమ్‌లా పనిచేస్తుంది.

మోకాళ్లపైనున్న మజిల్ బలం తగ్గితే మోకాళ్ల నొప్పులు, అరుగుదల వంటి సమస్యలు వస్తుంటాయి. ఇంతటి కీలకమైన కండరాలను కాపాడుకోవాలి.. పెంచుకోవాలి..బలోపేతం చేసుకోవాలి. కానీ, శారీరక శ్రమ, కసరత్తు, పోషకాహార లేమి కారణంగా వయసుతో సంబంధం లేకుండా.. కండరాల సమస్యలు వెంటాడుతున్నాయి.

మజిల్ అరుగుదల ఇలా..



- సహజంగా 20-30 ఏళ్ల మధ్య కండరాల పెరుగుదల అత్యున్నతంగా ఉంటుంది. 30ఏళ్ల నుంచి మజిల్‌లాస్ మొదలవుతుంది.
- 30-40 పదేళ్లలో 3-5శాతం ● 40-50 పదేళ్లలో 3-8శాతం
- 50 ఏళ్ల నుంచి ఏటా 1-2శాతం
- 60 ఏళ్ల తర్వాత మజిల్‌లాస్ మరీ వేగంగా ఉంటుంది.
- ఎలాంటి కసరత్తులు చేయకుండా, జాగ్రత్తలు పాటించకపోతే 70 ఏళ్లు వచ్చేసరికి 25-30 శాతం మజిల్ లాస్ అవుతుంది.

కండరాల పెరుగుదలను ప్రభావితం చేసేవాటిలో కొన్ని

- **జెనెటిక్స్:** కండరాలను నిర్మించడంలో జెనెటిక్స్‌ది కీలక పాత్ర. కొంతమందిలో కండరాల పెరుగుదల ఇతరుల కంటే వేగంగా ఉండవచ్చు, మరికొందరిలో నెమ్మదిగా ఉండవచ్చు.
- **వయస్సు:** 30 ఏళ్ల తర్వాత కండర ద్రవ్యరాశి సహజంగా తగ్గుతుంది, వయసు పెరుగుతున్నకొద్దీ సమస్య పెరుగుతుంది. తిరిగి శక్తిని, బలాన్ని పొందడం కష్టమవుతుంది.
- **గాయం:** గాయం ప్రభావిత ప్రాంతాన్ని ఎక్కువ కాలం ఉపయోగించకపోతే కండరాల క్షీణతకు దారితీస్తుంది.
- **వ్యాధి:** క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధి, శ్వాసకోశ వ్యాధులు కండరాల క్షీణతకు కారణమవుతాయి.
- **నిష్క్రియాత్మకత:** కండరాలను క్రమం తప్పక వినియోగించకపోతే అవి క్షీణిస్తాయి. 8 నుంచి 12 వారాలపాటు క్రియారహితంగా ఉంటే గణనీయమైన కండరాల నష్టాన్ని ఎదుర్కోవాల్సిందే.

బలోపేతానికి ఏం చేయాలి..?

మజిల్‌ని మనం పెంచకపోతే పెరగదు. కండరాలను ఏ వయసులోనైనా పెంచుకోవచ్చు. ఇందుకోసం జీవితకాల కసరత్తు...ప్రొటీన్ డైట్ తప్పనిసరి.

- ప్రొటీన్ కోసం చికెన్, చేపలు, గుడ్లు, పాలు, బీన్స్, చిక్కుళ్లు, తృణధాన్యాలు, సోయా ఉత్పత్తులు తీసుకోవాలి. రాగి, బాదం, పిస్తా, నట్స్ తీసుకోవడం వల్ల మంచి హెల్తీ ఫ్యాట్ అందుతుంది. ఇది మజిల్ రికవరీకి సహాయపడుతుంది. మినరల్స్, విటమిన్ల కోసం పండ్లు తీసుకోవాలి.
- మెంతులు, గుడ్లు, పాలు, చికెన్, చేపలు వీటిలో కాల్షియం కంటెంట్ ఎక్కువ ఉంటుంది. ఇది ఎముకలకు ఉపయోగకరం.
- ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. చక్కెర పూర్తిగా తగ్గించగలిగితే మంచిది. వీటిని తీసుకుంటే మజిల్‌ని బ్రేక్ చేస్తాయి.
- డి విటమిన్ కోసం కొద్దిసేపు ఎండలో ఉండాలి. అవకాడో (ఇందులో హెల్తీ ఫ్యాట్ కూడా ఉంటుంది), పుట్టగొడుగుల్లోనూ డి విటమిన్ ఉంటుంది.
- కండరాల పెరుగుదల నిద్రలోనే జరుగుతుంది. నిద్రలో శరీరం కండరాల కణజాలాన్ని మరమ్మతు, పునరుత్పత్తి చేస్తుంది. కాబట్టి 7-8గంటల నిద్ర తప్పనిసరి.
- మహిళల్లో పీరియడ్స్ ఆగిపోయి మెనోపాజ్ వచ్చాక వారిలో కాల్షియం స్థాయులు బాగా తగ్గిపోయి ఎముకల్లో బలం తగ్గుతుంది. ఆ ఎముకల బలం కోసం మహిళలు కచ్చితంగా స్ట్రెంథ్ ట్రెయినింగ్ చేయాలి.

తరుగుదలను రివర్స్ చేయవచ్చు

'మజిల్‌లాస్‌ను రివర్స్ చేయవచ్చు. ఒకసారి తగ్గిన మజిల్‌ను ఏ వయసులోనైనా మళ్లీ పెంచుకోవచ్చు. డైట్‌లో ప్రొటీన్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. కేజీకి కనీసం 1.2గ్రామ్‌ల ప్రొటీన్ తప్పనిసరి. జిమ్‌లో బాగా అగ్రెసివ్‌గా వర్కవుట్లు చేసి, హెవీ వెయిట్లు లిఫ్ట్ చేసే వారైతే కేజీకి కనీసం 1.5 నుంచి 1.8 గ్రామ్ ప్రొటీన్ తీసుకోవాలి. స్ట్రెంథ్ ట్రైనింగ్ తీసుకునే వాళ్లు రాత్రిళ్లు కచ్చితంగా 7-8గంటలు నిద్రపోవాలి. శిక్షణలో మైక్రో టెయిర్ అయిన మజిల్ నిద్రలో రిపేరై, తిరిగి పెరుగుతాయి. చివరగా అదీ అవసరమైతేనే మెగ్నీషియంతోపాటు డి-విటమిన్‌ను సప్లిమెంట్‌గా తీసుకోవచ్చు'

– డాక్టర్ పిన్నమనేని ప్రశాంత్, ఆర్థోపెడిక్ సర్జన్, విజయవాడ.

- ఈనాడు, అమరావతి

జెండాల వెనక స్ఫూర్తి ఎజెండా



విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(వర్క్స్) భవనం ఎదుట ఎగురుతున్న ఈ జెండాల వెనక ఆసక్తికరమైన అంశం ఉంది. కర్మాగారంలోని కోకోవెన్, ఎస్ఎంఎస్, బ్లాస్ట్ ఫర్నేస్, సింటర్ ప్లాంట్, ఎస్ఎంఎస్-2, ఎస్ఎంఎస్1, సీఆర్ఎంపీ, మిల్స్, థర్మల్ పవర్ ప్లాంట్ వంటి తొమ్మిది విభాగాలను ఈ జెండాలు ప్రతిబింబిస్తుంటాయి. ఒక్కో విభాగానికి ఒక్కో జెండా రంగు కేటాయించారు. ఇందులో ఏ విభాగమైనా ఆ రోజు ఉత్తమ ఉత్పత్తి, పనితీరు ప్రదర్శిస్తుందో ఆ విభాగం జెండా మరుసటి రోజు మిగతా జెండాల కంటే ఎక్కువ ఎత్తులో ఎగురవేస్తారు. లక్ష్యాలను చేరుకోలేని విభాగాల జెండాలను కిందికి దించుతారు. ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపటం, పోటీతత్వం పెంచడమే దీని ఉద్దేశమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో ఆర్ఎంహెచ్‌పీ, మిల్స్ విభాగాల జెండాలను ఎత్తులో ఉంచారు.

–న్యూస్‌టుడే, విశాఖపట్నం(ఉక్కునగరం)

పిల్లలకు ఇవి కూడా నేర్పండి



- ఇతరుల మాటలను శ్రద్ధగా వినడం.
- మాట్లాడుతున్నప్పుడు ఎదుటివారి కళ్లలోకి సూటిగా చూడటం.
- ఆత్మవిశ్వాసంతో కరచాలనం చేయడం.
- మర్యాదపూర్వకంగా పలకరించడం.

కమ్యూనికేషన్ నైపుణ్యాల్లో ఇవి కూడా కీలకం. వీటిని పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయండి. దానివల్ల భవిష్యత్తులో వారి కెరియర్‌తో పాటు వ్యక్తిగత సంబంధాల విషయంలోనూ మెరుగ్గా ఉంటారు.

– అమీ, పేరెంటింగ్ కోచ్

మ్యూజియం కాదు.. ఇంజినీరింగ్ కాలేజ్





రాజుల కాలం నాటి కత్తులు, గొడ్డళ్లు, శూలాలు, పూర్వీకులు వినియోగించిన పాత్రలు, ఉంగరాలు, కరెన్సీ నాణేలు, తాళపత్ర గ్రంథాలు, తేలు ఆకృతిలో తాళం, ఏనుగు దంతంతో తయారుచేసిన దువ్వెన వీటన్నింటినీ చూస్తే ఇదేదో పురావస్తు ప్రదర్శనశాల అనుకుంటారేమో.. కానే కాదు, భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని వస్తువులివి. ప్రాచీన భారతీయ సాంస్కృతిక, సామాజిక, ఆధ్యాత్మిక, కళా రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని నేటితరం యువతకు అందించాలనే సంకల్పంతో ఈ కళాశాలలో సృజనవాటిక పేరిట ఓ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్(ఐకేఎస్) కార్యక్రమంలో భాగంగా అరుదైన వారసత్వ సంపదను సేకరించి నిత్యం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పండుగలు, ఆహార వ్యవహారాలను కూడా వారికి తెలియజేస్తున్నట్లు సృజనవాటిక నిర్వాహకుడు ఈదరపల్లి సీతారామరాజు తెలిపారు.

– ఈనాడు, భీమవరం

వధూవరుల వందేమాతరం



వివాహ వేడుక వందేమాతర గేయంతో మార్మోగింది. మూడుముళ్లతో కొత్త జీవితంలోకి అడుగిడిన జంట బంధుమిత్ర సపరివారంతో దేశభక్తిని చాటుకుంది. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరులూదిన వందేమాతర గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శుక్రవారం ఉదయం 9.50 గంటలకు ఆలపించాలని కేంద్రం పిలుపునిచ్చింది. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అమడబాకుల గ్రామానికి చెందిన సురేశ్, మేఘన పెళ్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో జరిగింది. తాళి కట్టిన కొద్ది సేపటికే. వరుడు సూచన చేస్తూ వందేమాతర గేయాన్ని ఆలపించడంతో వేడుకల్లో పాల్గొన్న వారందరూ ఆయనతో గొంతుకలిపారు.

–న్యూస్‌టుడే, కొత్తకోట



ఈ ఏసీ ఆటో.. క్వీన్ ఆఫ్ విదర్భ

మహారాష్ట్రలోని అమరావతి నగరంలో తిరిగే ఈ ఆటోను స్థానికులు 'క్వీన్ ఆఫ్ విదర్భ' అంటారు. ఇందులో ఏసీ, డీజే, టీవీ, రంగురంగుల దీపాల వంటి సదుపాయాలున్నాయి. స్థానిక బడ్నేరా ప్రాంతానికి చెందిన కృష్ణా మధుకర్ రోడ్గే (32) ఇలా తన ఆటోరిక్షా స్వరూపాన్ని పూర్తిగా మార్చేయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. రూ.2.85 లక్షలు పెట్టి కొన్న కొత్త ఆటోకు అదనపు సదుపాయాల కోసం మరో రూ.3 లక్షలు ఖర్చు చేశారు. 8వ తరగతి వరకు చదువుకున్న కృష్ణ పగలంతా గ్యాస్ డెలివరీ పనులు చేసి, అర్ధరాత్రి వరకు ఆటో నడుపుతాడు. సౌకర్యాలను సాకుగా చూపి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదు. అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్లేవారి కోసం ఈ ఆటోలో బెడ్ సదుపాయం ఉంది. ఇలాంటివారి నుంచి డబ్బు కూడా తీసుకోవడం లేదు.

–ఈటీవీ భారత్



యూట్యూబర్ సాయంతో వంతెన

మారుమూల గిరిజనం పడుతున్న కష్టాలు చూడలేని ఓ యూట్యూబర్ వారికి చేయూతనందించి ఆదుకున్నారు. గ్రామానికి ముందున్న గెడ్డపై రూ.లక్షతో మినీ వంతెన నిర్మించి ఆదర్శంగా నిలిచారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయతీ శివారు గాదెల్లోవకు వెళ్లాలంటే గ్రామం ముందు ఉన్న గెడ్డ దాటాల్సిందే. ఇందులో ఏడాదికి సుమారు పది నెలల పాటు నీరు పారుతూనే ఉంటుంది. వంతెన లేక గెడ్డపై ఇనుప విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేసి దానిపై నుంచి రాకపోకలు సాగించేవారు. ఇటీవల వచ్చిన మొంథా తుపానుకు స్తంభం కూడా కొట్టుకుపోయింది. విద్యార్థులు బడికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎస్.కోటకు చెందిన యూట్యూబర్ రాంసింగ్ నవీన్‌కు తెలియడంతో వారధి నిర్మించాలని సంకల్పించారు. రూ.లక్ష వెచ్చించి ఇనుప ఛానల్స్ వేసి, పైన ఊచలతో మూడు అడుగుల వెడల్పున వంతెన నిర్మించారు. దీన్ని శుక్రవారం ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. నవీన్ హైదరాబాద్‌లో ఇంజినీరుగా పనిచేస్తున్నారు.

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఉద్యోగుల తండా.. సరంపేట



76 ఇళ్లు.. 230 మంది ఓటర్లు ఉన్న ఓ తండాలో 190 మంది వరకు ఉద్యోగులున్నారంటే నమ్మగలరా? అయితే మీరు నల్గొండ జిల్లా మర్రిగూడ మండల పరిధి సరంపేట గ్రామ ఆవాస ప్రాంతమైన సరంపేట తండా గురించి తెలుసుకోవాల్సిందే! ఒకప్పుడు అన్ని పల్లెల మాదిరిగానే ఈ తండాలో కూడా వ్యవసాయమే జీవనాధారంగా ఉండేది. ఇక్కడి పిల్లలు తల్లిదండ్రులతో సాగు పనులకు వెళ్తూనే చదువుకున్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం మర్రిగూడ, హైదరాబాద్‌కి వెళ్లేవారు. మొదటగా 1968లో మూడావత్ జగారం అనే వ్యక్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మిగతా వారు ఆ దిశగా అడుగులు వేశారు. ప్రస్తుతం 230 మంది ఓటర్లుంటే అందులో 120 మంది ప్రభుత్వ, 70 మంది వరకు ప్రైవేటు ఉద్యోగాలు సాధించారు. మిగతా వారు వ్యవసాయం, వ్యాపారాలు చేస్తున్నారు. ఒక్కో ఇంటి నుంచి ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులూ ఉన్నారంటే ఆశ్చర్యపోనవసరం లేదు. కొందరు పదవీ విరమణ పొందారు. జిల్లా స్థాయి అధికారి నుంచి నాలుగో తరగతి ఉద్యోగి వరకు వివిధ హోదాల్లో తండావారు పనిచేస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వీరంతా ఏటా దసరా, ఇతర పండగల సందర్భాల్లో గ్రామానికి వచ్చి సందడిగా గడుపుతుంటారు. పల్లె అనగానే వ్యవసాయం మాత్రమే గుర్తొచ్చే పరిస్థితుల్లో ఈ ఊరు కొలువుల ఖిల్లాగా మారడం ఎంతో స్ఫూర్తిదాయకం కదా!

–న్యూస్‌టుడే, మర్రిగూడ



సర్దార్ ఇంట్లో 65 దేశాల బొమ్మలు

పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా కల్యాణ్‌పుర్‌కు చెందిన ఉజ్వల్ సర్దార్ (35) దాదాపు 65 దేశాల నుంచి సేకరించిన వందలాది బొమ్మలతో తన ఇంట్లోనే మినీ మ్యూజియం ఏర్పాటు చేశారు. మట్టి, కలప, రాయి, లోహాలు, పింగాణీతో తయారైన ఈ అరుదైన కళారూపాలు ఆయా ప్రాంతాల సంస్కృతిని చాటేలా ఉన్నాయి. ఉజ్వల్‌కు చిన్ననాటి నుంచీ బొమ్మలంటే ఇష్టం. అందుకే ఎక్కడికి వెళ్లినా అక్కడ ప్రసిద్ధమైన బొమ్మలను కొనుగోలు చేస్తూ వచ్చారు. బంధుమిత్రుల సాయంతో విదేశీ బొమ్మలనూ సేకరించారు. 19, 20 శతాబ్దాల నాటి కళారూపాలు కూడా ఉజ్వల్ వద్ద ఉన్నాయి. ఈ అభిరుచికి ఆయన శ్రీమతి సైతం తోడ్పాటును అందిస్తున్నారు.

–ఈటీవీ భారత్


ఆ భయాల నుంచి అభయమిలా!

పైకి ఎంత గంభీరంగా కనిపించినా భయంలేని మనుషులే ఉండరు. కొంతమందిలో మాత్రం అది తీవ్రమై ఫోబియాగా మారుతుంది. మనసు పొరల్లో అలజడి రేపి ఆత్మహత్య దాకా తీసుకెళుతుంది. అందుకే అతిగా భయపడేవారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి...

హైదరాబాద్‌కు చెందిన ఓ వివాహితకు ఎప్పటి నుంచో చీమలను చూస్తే అంతులేని ఆందోళన. చివరకు ఆ భయంతోనే ఆత్మహత్య చేసుకున్నారు. చీమలకు అంతలా భయపడాలా.. ..అని చాలామంది అనుకోవచ్చు. అయితే ఈ భయం ఒక మానసిక రుగ్మత. కొందరికి బల్లులంటే, మరికొందరికి బొద్దింకలంటే, ఇంకొందరికి చీకటి అంటే భయం...ఇలా చాలామందిని ఏదో ఒక భయం వెంటాడుతుంది. నిజానికి ఇవేవీ ప్రాణాపాయం తెచ్చేవి కావు. కానీ ఈ ఫోబియాలతో కొందరు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురి అవుతుంటారు. చివరికి కుంగుబాటుకు గురై తీవ్ర నిర్ణయాలు తీసుకుంటారు. నిజానికి చిన్నప్పుడే ఈ ఫోబియాలు ప్రారంభమవుతాయి. చాలామందిలో వయసు పెరిగే కొద్దీ తగ్గిపోతాయి. మరికొందరిలో మెదడు పొరల్లో నాటుకుపోయి వయసుతో పాటు పెరిగి తీవ్రమవుతాయి. చిన్న వయసు నుంచే సరైన చికిత్స అందించడం ద్వారా ఇలాంటి భయాలను పూర్తిగా తగ్గించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

ఏ దశలో... ఏ చికిత్స?..

- కొన్ని ఫోబియాలు అవి అనుభవంలోకి వచ్చినప్పుడే మొదలవుతాయి. తర్వాత ఆ పరిస్థితి ఉండదు. కొన్ని మాత్రం నిరంతరం వెంటాడుతూ ఉంటాయి.
- ఒక దశలో తీవ్ర కుంగుబాటుకు గురవుతారు. పదేపదే భ్రమలోకి జారి పోతుంటారు. నాకే ఇలా ఎందుకు జరుగుతోందని అనుకుంటూ... తీవ్ర ఆవేదన చెందుతుంటారు.
- సమస్య తీవ్రతపై చికిత్స ఆధారపడి ఉంటుంది. తరచూ భయపడడం, కుంగుబాటుకు గురి కావడంలాంటి లక్షణాలు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలి.
- ఎక్స్‌పోజర్ థెరపీ, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీతో మంచి ఫలితాలు ఉంటాయి. ఎక్స్‌పోజర్ థెరపీలో భయపడే విషయాలపై నెమ్మదిగా రోగిని ఎక్స్‌పోజ్ చేస్తారు. తొలుత వీడియోలు చూపించడం, తర్వాత వాటితో కొంత సమయం గడిపేలా చేయడం ద్వారా భయం పోగొడతారు. బిహేవిరియల్ థెరపీలో భయం చుట్టూ ఉన్న ఆలోచనలను పటాపంచలు చేస్తారు.
- చురుగ్గా ఉండడం, పోషకాహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, మద్యం, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకపోవడం, ఇతర వ్యాపకాల్లో నిమగ్నం కావడం వల్ల క్రమేపీ ఈ ఫోబియాలను నుంచి దూరం కావచ్చు.



- ఈనాడు, హైదరాబాద్

శాస్త్రీయంగా ఆలోచించాలి...

- ఈ ఫోబియాలకు చిన్న వయసులోనే బీజం పడుతుంది. చంటి పిల్లాడు మారం చేస్తే...అదిగో చీకట్లో బూచోడు ఉన్నాడని...తినకపోతే దయ్యం తీసుకుపోతుందని ఇలా పిల్లలకు పదేపదే చెప్పడం వల్ల పిల్లల్లో అనవసర భయాలు నాటుకుంటాయి. కొందరిలో పెద్దయినా అవి పోవు. మరికొందరిలో తీవ్రమైన ఫోబియాగా మారతాయి.
- సాధ్యమైనంత వరకు పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం అలవాటు చేయడంతో అనవసర భయాలు, భ్రమలకు లోనుకారు. ఎర్రగడ్డ మానసిక కేంద్రానికి ఇలాంటి ఫోబియా కేసులు తరచూ వస్తుంటాయి.
- సమస్య తీవ్రంగా ఉన్న వారికి ఎక్స్‌పోజర్ థెరపీ, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ(సీబీటీ) సూచిస్తాం.
- సీబీటీ చికిత్సలో భాగంగా ఏది వాస్తవం...ఏదీ భ్రమ అనేది రోగికి తెలిసేలా చేయడం వల్ల కొన్ని రోజులకు ఆ భయం నుంచి బయట పడతారు. ఆందోళన..భయం తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి మాత్రం మందుల ద్వారా చికిత్స అందిస్తాం.
- ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. సూచనలు, సలహాల కోసం టెలిమానస్ 14416 నంబరులో సంప్రదించవచ్చు. ఫోన్‌లోనే కౌన్సెలింగ్ చేస్తారు. అవసరమైతే ఆసుపత్రిలో చికిత్సచేస్తారు.

– డాక్టర్ అనిత, సూపరింటెండెంట్, ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక ఆరోగ్య కేంద్రం

ఫోబియా లక్షణాలు...		
	హృదయ స్పందన పెరగడం	చెమటలు పట్టడం
	శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది	స్పృహ కోల్పోవడం
	శరీరంలో వణుకు	తీవ్రమైన మానసిక ఆందోళన

వయసుల వారీగా...	
యుక్త వయసు వారిలో	16%
మధ్య వయసులో	2–6%
60 ఏళ్లు దాటిన వారిలో	3–5%

రెస్ట్‌లో ఉన్నాను.. రేసులో లేను



ఈ చిత్రాన్ని చూస్తుంటే తాబేలు, బాతు ఈత పోటీ పెట్టుకున్నాయేమో అనిపిస్తోంది కదూ. హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ పార్కులో కనిపించిన చిత్రమిది. తాబేలు చిన్న రాయిని ఆసరాగా చేసుకుని సేద తీరుతుండగా... పక్కనే బాతు ఈదుకుంటూ ముందుకెళ్తుండగా 'ఈనాడు' కెమెరా క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, హైదరాబాద్

ఔను... ఇది కూరగాయల మొక్కే



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలోని ముత్యాల రజిత రమేష్ అనే రైతు వేసిన మిరపతోటలో ఒకే మొక్కకు వంగ, మిరప, టమాటా కాయలు కాయడం విశేషంగా మారింది. ఈ విషయం వైరల్ కావడంతో సమీప గ్రామాలకు చెందిన ప్రజలు ఈ వింతను చూడటానికి తరలివస్తున్నారు. దీనిపై జగ్గయ్యపేట డివిజన్ ఉద్యానశాఖాధికారి బాలాజీ మాట్లాడుతూ.. మొక్కలోని జన్యుపరమైన మార్పు వల్ల ఇలా జరిగి ఉండొచ్చని చెప్పారు. మొక్కకు కనిపించే మూడురకాల కాయలు ఒకే "సోలనేటి" వృక్ష కుటుంబానికి చెందినవని, ఆ కారణంగానే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ రకమైన పరిణామం జరిగి ఉంటుందని తెలిపారు.

– న్యూస్‌టుడే, జగ్గయ్యపేట



ఈనాడు



విజయవాడ 8-11-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 88
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 18
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

వందేమాతరం.. దేశానికి స్ఫూర్తినిచ్చే మహామంత్రం

- స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల గొంతుక
- ఆ గేయాన్ని 1937లో ముక్కలు చేశారు
- కొన్ని చరణాలను తీసేశారు
- జాతీయ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ వ్యాఖ్యలు
- స్మారక స్టాంపు, ప్రత్యేక నాణెం విడుదల
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్



వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్మారక స్టాంపును విడుదల చేస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

దిల్లీ: వందేమాతర గేయం.. దేశానికి స్ఫూర్తినిచ్చే మహామంత్రం అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భారతీయుల గొంతుకగా నిలిచిన మహోన్నత గేయమని కొనియాడారు. జాతీయ గేయం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మోదీ.. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో స్మారక స్టాంపు, ప్రత్యేక నాణెం విడుదల చేశారు. ఏడాది పొడవునా జరిగే 'వందేమాతరం' సంబరాలనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "వందేమాతరం గేయం కాదు.. భారతీయులు సాధించలేని లక్ష్యమంటూ ఏదీ లేదని చెప్పే ధైర్యం. ఓ మంత్రం, స్వప్నం, సంకల్పం. ప్రతి తరానికీ స్ఫూర్తినిస్తున్న గేయం. ఉగ్రవాదం ఆయుధంగా మన దేశంపై శత్రువు దాడి చేసినప్పుడు.. దేశం దుర్గామాత అవతారమెత్తడాన్ని ప్రపంచం చూసింది" అని అన్నారు. (మిగతా 3లో)



అవమానించిన చోటే.. సంపూర్ణ ఆలాపన

- వందేమాతర గేయానికి ఇదే నిజమైన గౌరవమన్న భాజపా నేతలు
- కాకినాడలో ఘనంగా 150 ఏళ్ల వేడుకలు


'వందేమాతరం' జాతి ఐక్యతకు ప్రతీక: ముఖ్యమంత్రి చంద్రబాబు 10లో

శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు


గ్రూప్-1 ఉద్యోగం, వెయ్యి గజాల స్థలం

- మహిళా క్రికెటర్‌కు రాష్ట్ర ప్రభుత్వ నజరానాలు
- ఆత్మీయంగా పలకరించిన చంద్రబాబు
- సాదర స్వాగతం పలికిన నారా లోకేశ్

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు, మంగళగిరి: వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగుతేజం, రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెటర్ శ్రీచరణిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ఆమెకు రూ.2.5 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. గ్రూప్-1 ఉద్యోగం, కడపలో వెయ్యి చదరపు గజాల ఇంటిస్థలం కేటాయించాలని నిర్ణయించింది. శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో మహిళా మంత్రులు వంగలపూడి అనిత, సవిత, గుమ్మిడి సంధ్యారాణి ఆమెకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఏసీఏ, శాప్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. క్రికెట్ అభిమానులు, యువ క్రీడాకారులు జాతీయ పతాకాలు ప్రదర్శిస్తూ ఆమెకు (మిగతా 3లో)



ముఖ్యమంత్రి చంద్రబాబు, క్రికెటర్ శ్రీచరణి, మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలి రాజ్‌లతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి లోకేశ్



రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు.. 86 వేల మందికి ఉపాధి

ఆమోదం తెలిపిన ప్రభుత్వం

- మూడు మెగా సిటీల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- 16 నెలల్లో రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు

ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో రూ.1,01,899 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాటితో ఏర్పాటయ్యే పరిశ్రమల ద్వారా 86,030 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) శుక్రవారం సమావేశమైంది. 26 సంస్థల నుంచి అందిన పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. సీఎం మాట్లాడుతూ 'పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సంస్థల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడం కాదు. అవి కార్యరూపం దాల్చేలా చూడాలి. కూటమి అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో నిర్వహించిన 12 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8,08,899 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించాం. వాటిద్వారా సుమారు 7,05,870 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆమోదించిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా అధికారులు చూడాలి. పారిశ్రామికవేత్తల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వైకాపా ప్రభుత్వంలో పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించినా ఇప్పటికీ ప్రారంభం కాని ప్రాజెక్టులను గుర్తించాలి. పురోగతి లేకపోతే అనుమతులు రద్దుచేయాలి. భవిష్యత్తు అవకాశాల దృష్ట్యా ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రత్యేకపార్కు ఏర్పాటుపై దృష్టిపెట్టాలి. చిప్, సెమీకండక్టర్లు, డ్రోన్ వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి' అని పేర్కొన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. 'ఎస్ఐపీబీ ఆమోదించిన పరిశ్రమల శంకుస్థాపనలు వేగంగా జరిగేలా చూడాలి. నాతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సహా వివిధ శాఖల మంత్రులు శంకుస్థాపనలు చేస్తారు. విశాఖలో నిర్వహించే సదస్సులో భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి' అని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, (మిగతా 3లో)

మూడు మెగా సిటీలు

రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. 'అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగాసిటీగా అభివృద్ధి చేయాలి. తిరుపతి, అమరావతి నగరాలనూ మెగా సిటీలుగా అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్లు రూపొందించాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్‌ప్లాన్ సిద్ధంగా ఉంది. ఈ మెగాసిటీలను పర్యాటకం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలి. మున్సిపల్ శాఖ వాటితో సమన్వయం చేసుకోవాలి. గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖకు మరిన్ని కంపెనీలు రానున్నాయి. వాటికి భూములు అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రముఖ బ్రాండ్ల హోటళ్లు నిర్మించేలా చూడాలి. రాష్ట్రంలో మూడు ఆర్థిక నడవాలు ఏర్పాటవుతున్నాయి. వాటికి ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తాం. బీచ్ పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి' అని సూచించారు.

జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించండి

- విద్యా సంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వే స్టేషన్లలోకి వాటిని రానివ్వొద్దు
- జాతీయ, రాష్ట్ర రహదారులపై తిరిగే పశువులనూ తొలగించండి
- షెల్టర్లలో వాటికి ఆహారం, నీరు ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వ విభాగాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



దిల్లీ: దేశంలో కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు తదితర జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయాలని స్పష్టం చేసింది. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని తెలిపింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని పేర్కొంది. నిరంతర తనిఖీలు చేపట్టి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించింది. వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించి, సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని విస్పష్టం చేసింది. తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

పశువుల విషయంలోనూ...

రహదారులపై తిరిగే ఆలనా పాలనాలేని పశువుల విషయంలోనూ సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రత్యేక ఆదేశాలిచ్చింది. జాతీయ, రాష్ట్ర రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేస్‌పై పశువులు, జంతువులు వాహనదారులకు అడ్డురాకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)తో పాటు రాష్ట్రాల పరిధిలోని సంస్థలకు, హైవే గస్తీ బృందాలకు సూచించింది. ఆ పశువులు/జంతువులను (మిగతా 3లో)

డిసెంబరు 30 నుంచి వైకుంఠద్వార దర్శనాలు

- పది రోజుల పాటు అవకాశం
- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



2లో

తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్.. ఏపీలో రూ.5,642 కోట్ల పెట్టుబడులు

- ఆ సంస్థకు రికార్డు వ్యవధిలో భూములు కేటాయించాం
- ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ప్రకటన

13లో

రాష్ట్రంలో వాహనాల అమ్మకాలు రయ్ రయ్



జీఎస్టీ తగ్గుదలతో రెండు నెలల్లో విక్రయాల జోరు

- గతేడాదితో పోలిస్తే.. 55,765 అదనంగా అమ్మకాలు
- రవాణాశాఖకు పెరిగిన రాబడి

ఈనాడు - అమరావతి

జీఎస్టీ తగ్గింపుతో కలిగిన ప్రయోజనం.. రాష్ట్రంలోని వాహనాల అమ్మకాలపై స్పష్టంగా కనిపించింది. గత ఏడాదితో పోలిస్తే ద్విచక్ర వాహనాలు, కార్ల విక్రయాలు పెద్దఎత్తున పెరిగాయి. వీటివల్ల రవాణా శాఖకు రాబడి కూడా హెచ్చింది. చిన్నకార్లతో పాటు 350 సీసీ వరకు ఉండే ద్విచక్ర వాహనాలపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. దీన్ని సెప్టెంబరు 22 నుంచి కేంద్రం అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో రాష్ట్రంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 21 వరకు (30 రోజుల్లో) వాహనాల అమ్మకాల్లో సగటున 46 శాతం వృద్ధి నమోదైంది.

ద్విచక్ర వాహనాల జోరు..

- గత 30 రోజుల్లో 1.47 లక్షల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి.
- గతేడాది ఇదే కాలంలో 99,972 విక్రయిస్తే. . ఈసారి 47,953 ద్విచక్ర వాహనాలు అధికంగా అమ్ముడయ్యాయి. 48 శాతం వృద్ధి కనిపించింది.
- 30 రోజుల్లో 12,895 కార్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో 8,911 కార్లనే విక్రయించారు. 45 శాతం వృద్ధి నమోదైంది.
- ఇతర వాహనాల అమ్మకాలు ఈసారి 15,189 ఉంటే గతేడాది 11,361 మాత్రమే. 34 శాతం వృద్ధి కనిపించింది.
- మొత్తంగా అన్ని వాహనాలూ కలిపి 1,76,009 విక్రయిస్తే, గతేడాది 1,20,244 వాహనాలను అమ్మారు. అంటే 55,765 అదనంగా (46 శాతం) అమ్ముడయ్యాయి.

27% పెరిగిన రాబడి

- గతేడాది సెప్టెంబరులో రవాణాశాఖకు రూ.231.70 కోట్ల ఆదాయం వస్తే, ఈ సెప్టెంబరులో రూ.296.06 కోట్లు వచ్చింది. 27.78 శాతం రాబడి పెరిగింది.
- గత అక్టోబరులో రూ.581.16 కోట్ల ఆదాయం వస్తే, ఈ అక్టోబరులో రూ.616.39 కోట్లు వచ్చింది. 6.06 శాతం పెరిగింది.

సరిపడా నిధులున్నా.. పనుల్లో జాప్యమెందుకు?



మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ పథకాల అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్

- 'అడవితల్లి బాట' నిర్వహణలో అలసత్వం వీడాలి
- జలజీవన్ పనులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తా
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'అడవితల్లి బాట' పనుల నిర్వహణలో అలసత్వం వద్దని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఉద్దేశించి అన్నారు. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్‌మన్, ఉపాధి హామీ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సాయంతో కలిపి మొత్తం రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారుల పనులు (మిగతా 3లో)

గూగుల్ మ్యాప్స్ నుంచి ఆర్టీసీ టికెట్ బుకింగ్

- విజయవాడ- హైదరాబాద్ రూట్‌లో ప్రయోగం విజయవంతం
- వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రూట్లలో మొదలు


ఈనాడు, అమరావతి: గూగుల్ మ్యాప్స్‌లో ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు సెర్చ్ చేస్తే.. ఆ రూట్‌లో తిరిగే ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయం ఉన్న బస్సుల వివరాలను చూపించి, దాని ద్వారా టికెట్ బుక్ చేసుకునే అవకాశం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు ఏపీఎస్‌ఆర్టీసీ పలు వివరాలను గూగుల్‌కు అందజేసింది. ప్రస్తుతం ఆర్టీసీలో బస్టాండ్లలోని కౌంటర్లు, ఏజెంట్లు, సంస్థ వెబ్‌సైట్, యాప్‌లో టికెట్ రిజర్వేషన్ సదుపాయం ఉంది. ఇప్పుడు కొత్తగా గూగుల్ మ్యాప్స్ ద్వారా కూడా బుకింగ్‌కు అవకాశం కల్పించనున్నారు.



బుకింగ్ ఎలా?

- గూగుల్ మ్యాప్స్‌లో విజయవాడ నుంచి విశాఖపట్నం అని టైప్ చేస్తే.. వీటి మధ్య దూరం ఎంత, బైక్, కారు, బస్, (మిగతా 3లో)

ఇక పోలవరం- నల్లమలసాగర్ అనుసంధానమే!



- బనకచర్ల అనుసంధానం స్థానే కొత్త ప్రాజెక్టు
- తొలుత నల్లమలసాగర్‌కు నీటి తరలింపునకే ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇలాంటి కొత్త ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తుది రూపు ఇస్తోందని 'ఈనాడు' ఇంతకుముందే వెల్లడించింది. ఇందులో భాగంగా తొలుత బొల్లాపల్లి జలాశయానికి నీళ్లు తీసుకెళ్లి. . అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నల్లమలసాగర్ జలాశయానికి గోదావరి నీళ్లు తరలించాలనేది తాజా ప్రణాళిక. అవసరమైతే సోమశిలకూ ఈ జలాలు మళ్లిస్తారు. తొలుత ఈ ప్రాజెక్టును చేపట్టి.. తదుపరి దశలో బనకచర్లకు మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు తుది అంచనాకు వచ్చింది. అందుకే గత ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి పిలిచిన టెండర్లను జలవనరుల శాఖ తాజాగా రద్దు చేసింది. కొత్తగా పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం పేరుతోనే డీపీఆర్ తయారీకి టెండర్లు పిలవనున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పోలవరం-బనకచర్ల అనుసంధానం స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం ప్రాజెక్టుకు కొత్త రూపు ఇచ్చి ఆ మేరకు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర ఆర్థిక మంత్రికి సమర్పించింది. ఈ నేపథ్యంలో డీపీఆర్ తయారీకి పాత పేరు, పాత ప్రతిపాదన ఉంచితే (మిగతా 3లో)

డిసెంబరు 30 నుంచి వైకుంఠద్వార దర్శనాలు

- పది రోజుల పాటు అవకాశం
- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి 2026 జనవరి 8 వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తామని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఆ దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో టోకెన్ల జారీకి విధివిధానాలు మరో వారంలో తెలియజేస్తామన్నారు. శుక్రవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణతో కలిసి ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. శ్రీవాణి దర్శన టికెట్ల జారీతోపాటు ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ, ప్రివిలేజ్ దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా మెరుగైన విధానాలు అమలు చేసేందుకు వచ్చే తితిదే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే ఏఐని వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

★ వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఇంటిగ్రేటెడ్ సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తొమ్మిది రకాల సేవలు అందుబాటులోకి తేనున్నట్లు ఈవో సింఘాల్ తెలిపారు. భక్తుల రద్దీ నియంత్రణ, కంపార్ట్‌మెంట్ల పర్యవేక్షణ, ప్రతి భక్తుడి డేటా సేకరణకు ఈ సెంటర్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

★ తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుంచి 25 వరకు కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు.

★ తిరుమల అటవీ ప్రాంతంలో రానున్న పదేళ్లలో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు, పచ్చదనం పెంపొందించేందుకు ఇటీవల నిర్వహించిన తితిదే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు.

★ అమరావతి పరిధిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి పనులు ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతాయని ఈవో వెల్లడించారు.

‘పీఎంఏవై-గ్రామీణ్’ దరఖాస్తు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో ఇళ్లు లేని పేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ్ (పీఎంఏవై-జీ) పథకం కింద దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 30 వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 5న ముగిసిన గడువును రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు పెంచింది. కేంద్రం కొత్త లబ్ధిదారుల ఎంపికను ఆవాస్+ యాప్‌లో చేపడుతోంది. అర్హులు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.

భాష నశిస్తే జాతి నశిస్తుంది

- ఇంగ్లిష్ నేర్పిస్తూనే తెలుగును బతికించండి
- అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్
- గుంటూరు వీవీఐటీలో ఘనంగా బాలోత్సవ్ ప్రారంభం



చిన్నారులతో కలిసి ‘బాలోత్సవ్ మహాభారతం’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వై.మల్లికార్జునరెడ్డి, వాసిరెడ్డి విద్యాసాగర్, కె.మధుమూర్తి, వేమూరి రవికుమార్, మండలి బుద్ధప్రసాద్

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, పెదకాని, గుంటూరు (సాంస్కృతికం): భాష నశిస్తే జాతి నశిస్తుందనే సత్యాన్ని గుర్తెరగాలని, పిల్లలకు మన భాష, సంస్కృతి, సంప్రదాయాలపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీ వర్సిటీలో 3 రోజుల పాటు నిర్వహించే ‘బాలోత్సవ్ ప్రపంచ తెలుగు బాలల పండగ- 2025’ను బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ‘ప్రస్తుతం పిల్లలు తెలుగులో పేరు రాసే పరిస్థితుల్లో లేకపోవడం బాధగా ఉంది. అలాగని మనం ఇంగ్లిష్‌కు వ్యతిరేకం కాదు. ఆంగ్లం నేర్పిస్తూనే తెలుగుపై మమకారం పెంచుకునేలా చూడాలి. మన జాతి, భాష, సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో బాలోత్సవ్ నిర్వహించడం అభినందనీయం’ అని అన్నారు. బాలోత్సవ్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేసుకొని.. పిల్లలు స్నేహబంధాలు పెంచుకోవడానికి ఇదో మంచి వేదిక అని గుర్తుచేశారు. వందేమాతర గీతం 150 ఏళ్ల సంబరాల వేళ నేటి తరం ‘వందేమాతరం.. మనదే భారతం’ అంటూ దేశ మహోన్నతికి నడుంకట్టాలని పిలుపునిచ్చారు.

తరగతి గది ఓ సవాలుగా ఉండాలి

‘విద్యాలయాల్లో తరగతి గది విద్యార్థులకు ఓ సవాలుగా ఉండాలి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉపాధ్యాయులూ ఆ దిశగా సృష్టించలేకపోతున్నారు’ అని ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. ‘చేతిలోకి ఇంటర్‌నెట్ వచ్చాక ఆ వ్యామోహంలో పడి సోదరభావంతో వ్యవహరించే తీరును మర్చిపోతున్నాం. బాలోత్సవ్ మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తోంది’ అని తెలిపారు.

★ ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవికుమార్ మాట్లాడుతూ ‘ఇప్పటి తరం సామాజిక సేవలో ఎంతో చొరవ చూపుతోంది. ఇది గోల్డెన్ జనరేషన్. దేశ సమగ్రాభివృద్ధిలో అద్భుత తోడ్పాటునందిస్తోంది’ అని పేర్కొన్నారు.

★ వీవీఐటీ ఛాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కొత్తగూడెం వైద్యుడు సదుద్దేశంతో మొదలుపెట్టిన బాలోత్సవ్‌ను తామూ కొనసాగిస్తుండడం ఆనందాన్నిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య రాంబాబు కొడాలి, వీవీఐటీ రిజిస్ట్రార్ మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ సమన్వయకర్త కె.గిరిబాబు పాల్గొన్నారు.





చిత్రలేఖన పోటీలో చిన్నారులు ★ పొదరింటి ముందు రంగవల్లులు దిద్దుతున్న చిన్నారులు

ఆన్‌లైన్ మోసాలకు చిక్కుకోకుండా ఉండటమెలా? | ఈనాడు ఉచిత వెబినార్ | అసలైన పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి?

ఖాళీ సమయంలో ఏదో ఒక పార్ట్‌టైం ఉద్యోగం చేసి కాసిన్ని డబ్బులు సంపాదించాలి అనుకునేవాళ్లు చాలామంది. వారి ఆశలను అవకాశంగా తీసుకొని.. క్లిక్ చేస్తే కమీషన్ ఇస్తామంటూ, రిఫరల్స్‌తో అధిక ఆదాయం అంటూ స్కామర్లు నిలువునా ముంచేస్తున్నారు. పార్ట్‌టైంతో డబ్బుల మాట అటుంచితే.. ఆన్‌లైన్ మోసగాళ్ల వలలో చిక్కి జనమే అత్యధికంగా నష్టపోతున్నారు. విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు, యువత వీరి బారిన పడుతున్నారు. మరి ఇలాంటి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మోసాలకు చిక్కుకోకుండా ఉండటమెలా? దీనిపైనే ఈనాడు ఉచిత వెబినార్ నిర్వహిస్తోంది. ఇందులో భాగస్వాములైతే ఆన్‌లైన్ మోసాల గురించి తెలుసుకోవడమే కాదు.. అసలైన పార్ట్‌టైం ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి? ఎలా ఒడిసిపట్టుకోవాలి? నమ్మకమైన వెబ్‌సైట్ల వివరాలేంటి? ఇవన్నీ నిపుణులు మీకు తెలియజేస్తారు.

వెబినార్ విధివిధానాలు

సమయం: 90 నిమిషాలు. ఇందులో నిపుణులు, భాగస్వాముల పరిచయం, సందేహాలు- సమాధానాలుంటాయి.

కవర్ చేసే అంశాలు

- ఆన్‌లైన్ పార్ట్‌టైం ఉద్యోగాల వివరాలు (ఫ్రీలాన్సింగ్, ఆన్‌లైన్ సర్వేలు, కంటెంట్ రైటింగ్, ఆన్‌లైన్ ట్యూషన్లు.. తదితరాలు)
- పెట్టుబడి మోసాలు, నకిలీ ఉద్యోగ ఎరలు, నకిలీ స్కీంలు.. మోసపోవడానికి ఆస్కారం ఉన్న విషయాలపై అవగాహన కల్పిస్తారు.
- హెచ్‌టీటీపీఎస్, ట్రిపుల్ బీ రేటింగ్ ఉన్న నమ్మకమైన వెబ్‌సైట్ల పూర్తి వివరాలు అందజేస్తారు.
- మోసానికి గురవకుండా ఎలాంటి కట్టుదిట్టమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలి, 2ఎఫ్ఏ, సైబర్‌క్రైం చట్టాల వివరాల గురించి చర్చిస్తారు.
- ఆన్‌లైన్ మోసాలకు బలైన బాధితుల కేస్ స్టడీలు, వాటి నుంచీ నేర్చుకోదగ్గ పాఠాలనీ వివరిస్తారు.

జూమ్ మీటింగ్, యూట్యూబ్ లైవ్‌లో వెబినార్ నిర్వహిస్తారు

తేదీ: 09–11–2025 ఆదివారం ఉదయం 11 గంటల నుంచి

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

Webinar ID: 986 4456 9118
Passcode: 496377

యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి

Join from PC, Mac, iPad, or Android:
Zoom Webinar - https://hov.to/c8dc55dc

గ్రహం అనుగ్రహం

8–11–2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తీక మాసం, బహుళపక్షం
తదియ: మ. 12-08 తదుపరి చవితి
మృగశిర: తె. 3-49 తదుపరి ఆర్ద్ర
వర్జ్యం: ఉ. 10-36 నుంచి 12-06 వరకు
అమృత ఘడియలు: రా. 7-35 నుంచి 9-05 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-04 నుంచి 7-35 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6.05; సూర్యాస్తమయం: సా.5.24
సంకట హర చతుర్థి

వాతావరణం


ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	23.0
నెల్లూరు	35.1	26.2
ఒంగోలు	34.4	25.6
కర్నూలు	34.2	24.0
విజయవాడ	33.4	23.0
అనంతపురం	33.0	23.4
కడప	33.0	23.0
విజయనగరం	33.0	23.0
తాడేపల్లిగూడెం	32.0	27.0
గుంటూరు	32.0	25.0
శ్రీకాకుళం	32.0	23.0
విశాఖపట్నం	31.8	24.4

ప్రమాణ స్వీకారాలు 11, 12, 13తేదీల్లో చేయించాలి

పార్టీ శ్రేణులకు పల్లా శ్రీనివాసరావు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమాల్ని ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించాలని తెదేపా ఎమ్మెల్యేలను, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశించారు. ఆయా నియోజకవర్గ కార్యాలయాల్లో వీటిని నిర్వహించాలని సూచించారు. కార్యకర్తల ఆమోదంతో పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన తుది జాబితాను క్షేత్రస్థాయికి పంపినట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

డా.నాగేశ్వరరెడ్డికి.. అంబుజ్‌నాథ్‌బోస్ పురస్కారం



ఈనాడు, హైదరాబాద్: లండన్‌లోని ప్రతిష్ఠాత్మక రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ (ఆర్‌సీపీ) ఆధ్వర్యంలో అత్యుత్తమ పరిశోధనలకు ఏటా అందించే ప్రముఖ వైద్యవేత్త అంబుజ్‌నాథ్‌బోస్ పురస్కారాన్ని 2025 సంవత్సరానికి ప్రముఖ వైద్యులు, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డికి ప్రదానం చేశారు. ఎండోస్కోపీలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి చేసిన పరిశోధనలు, కృషిని దృష్టిలో పెట్టుకొని ఈసారి అవార్డుకు ఎంపిక చేశారు. 1998లో డాక్టర్ సి.గోపాలన్ తర్వాత అంబుజ్‌నాథ్ బోస్ పురస్కారం తెలుగు వైద్యులు నాగేశ్వరరెడ్డికి దక్కడం గొప్ప విశేషమని ఏఐజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.



విజయవాడ విమానాశ్రయంలో క్రికెటర్ శ్రీచరణికి స్వాగతం పలికేందుకు ప్లకార్డులతో ఎదురుచూస్తున్న విద్యార్థులు



విమానాశ్రయంలో శ్రీచరణికి స్వాగతం పలుకుతున్న మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, సవిత, వంగలపూడి అనిత, ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా పాల్గొన్నారు. అనంతరం ఉండవల్లిలోని సీఎం నివాసానికి చేరుకున్న శ్రీచరణి, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌లను మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. క్యాంపు కార్యాలయంలోకి తీసుకెళ్లి... సీఎం చంద్రబాబుకు పరిచయం చేశారు. ఆమెను సీఎం ఆత్మీయంగా పలకరించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేశారు. ప్రపంచకప్ సాధించడం ద్వారా దేశం సత్తా చాటారని కితాబిచ్చారు. భారత జట్టుకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందించాలని, వ్యక్తిగతంగా ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచకప్ గెలుచుకొన్న ఆనందక్షణాలు, తన క్రికెట్ జీవితాన్ని శ్రీచరణి సీఎంతో పంచుకొన్నారు. భారత మహిళా జట్టు సంతకాలతో ఉన్న జెర్సీని ఆయనకు బహూకరించారు. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రధాన కార్యదర్శి సానా సతీశ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు


తనను ఆదరించి, నజరానాలు ప్రకటించిన చంద్రబాబు, లోకేశ్‌లకు శ్రీచరణి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మహిళా క్రికెటర్లకు లోకేశ్ అండగా నిలుస్తున్నారని, వరల్డ్ కప్‌నకు ముందు విశాఖలో ఆయన ఇచ్చిన ప్రోత్సాహం తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ఆమె పేర్కొన్నారు. ఏసీఏ మద్దతుతోనే తానీ స్థాయికి చేరుకోగలిగానని వెల్లడించారు. అనంతరం శ్రీచరణి మంగళగిరిలోని ఏసీఏ స్టేడియంలో విలేకరులతో మాట్లాడారు. 'మా మావయ్యకు క్రికెట్ అంటే ఇష్టం. చిన్నప్పటి నుంచి ఆయనే నాతో ఆడించేవారు. గల్లీ క్రికెట్ నుంచి నా ప్రస్థానం ప్రారంభమైంది. ట్రైనర్ దినేశ్ మద్దతుగా నిలిచారు. మిథాలీ లాంటి క్రీడాకారుల కష్టం వల్లే మేం ఇప్పుడు కనపడుతున్నాం. క్రికెట్ ఆడాలనే నా నిర్ణయాన్ని ఆమోదించడానికి మా నాన్నకు కొంత సమయం పట్టింది. మా కుటుంబం ఎప్పుడూ తోడుగా నిలిచింది. ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం ప్రారంభించాక ఐదేళ్లకు భారత జట్టులో స్థానం లభించింది. అంతకుముందు నేను ఖోఖో ఆడేదాన్ని" అని ఆమె వివరించారు.

ట్రోఫీ అందుకున్నప్పుడు ఆనందబాష్పాలు

దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఆడేటప్పుడు భారత మహిళా జట్టు ఎలాంటి ఒత్తిడికీ గురికాలేదని, చాలా ఆహ్లాదకర వాతావరణంలోనే ఆడామని శ్రీచరణి తెలిపారు. "అయితే ప్రపంచకప్‌లో చాలా సమస్యలు ఎదుర్కొన్నాం. కొన్ని మ్యాచులు వరుసగా ఓడిపోయాం. తర్వాత నిలబడ్డాం. ఫైనల్‌లో గెలిచాం. వరల్డ్ కప్‌ను చేతుల్లోకి తీసుకొన్నప్పుడు ఆనందబాష్పాలు వచ్చాయి. మా టీం సభ్యులందరిదీ అదే పరిస్థితి. ఫైనల్‌లో ఆడటం మరిచిపోలేని అనుభూతి. ఆంధ్ర ప్రజలు, క్రికెట్ అభిమానుల మద్దతు, ప్రార్థనలు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. భారత క్రికెట్ జట్టును విశ్వవిజేతగా నిలిపాయి" అని శ్రీచరణి తెలిపారు.

మోదీ, చంద్రబాబు ఎంతో స్ఫూర్తి నింపారు

ప్రధాని మోదీని కలవడం ద్వారా భారత మహిళా జట్టు ఎంతో స్ఫూర్తి పొందిందని శ్రీచరణి తెలిపారు. "ఇది ప్రారంభం మాత్రమే. ఇంకా చాలా భవిష్యత్తు ఉంది. ఇప్పుడే విశ్రాంతి వద్దు అని ప్రధాని మాలో ప్రేరణ నింపారు. 'ఇక్కడితో ఆగొద్దు. సాధించాల్సింది చాలా ఉంది. నువ్వు చాలా చేయగలవు' అని చంద్రబాబు స్ఫూర్తినిచ్చారు. వీళ్లందరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా" అని ఆమె వెల్లడించారు.



శ్రీచరణిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

సుదీర్ఘకాలం ఆడి దేశానికి పేరు తీసుకురావాలి

మహిళా క్రికెటర్ శ్రీచరణితో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటే ఆకాశమే హద్దుగా ఎదగొచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళా క్రికెటర్ శ్రీచరణి ఎదుగుదల రాష్ట్రానికి గర్వకారణమని కితాబిచ్చారు. సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడి దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఉండవల్లి నివాసానికి వచ్చిన శ్రీచరణితో సీఎం దాదాపు 20 నిమిషాలు మాట్లాడారు. ఆమె కుటుంబ నేపథ్యం, క్రికెట్‌పై ఆసక్తికి కారణాలు, వైఎస్సార్ కడప జిల్లాలోని ఆర్టీపీపీలో సదుపాయాలు, కోచ్ నేపథ్యం, అంతర్జాతీయ స్థాయికి ఎదగడంలో సహకరించిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'క్రికెట్ గ్లామరస్ క్రీడ. సీఎంగా క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలనూ ప్రోత్సహించా. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు, ఉద్యోగాలు ఇవ్వడం నేనే ప్రారంభించాను. కరణం మల్లీశ్వరి, గోపీచంద్, సింధులనూ ఇలాగే ప్రోత్సహించాను. హెల్దీ, హ్యాపీ సొసైటీ ఉండాలంటే ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలి" అని చంద్రబాబు ఆమెతో పేర్కొన్నారు.

రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు.. 86 వేల మందికి ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

క్లస్టర్లు.. 15 పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి

క్లస్టర్ విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. 'రాష్ట్రాన్ని 15 పారిశ్రామిక జోన్లుగా ఏర్పాటుచేసి పారిశ్రామికాభివృద్ధిపై దృష్టిపెట్టాలి. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తాయి. కేంద్రం నుంచి అందే ప్రోత్సాహకాలు కొంత ఆలస్యమైనా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన వాటిని వెంటనే ఇచ్చి పెట్టుబడులు చేజారకుండా చూడాలి. పారిశ్రామిక అవసరాల కోసం ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలి. ఎవరైనా ప్రైవేట్ వ్యక్తులు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇచ్చేందుకు ముందుకొస్తే ప్రోత్సహించాలి' అని నిర్దేశించారు.

ఎస్ఐపీబీలో ఆమోదించిన పెట్టుబడుల వివరాలు

సంస్థ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ లి.	44,000	3,000
ఇండిచిప్ సెమీ కండక్టర్స్ లిమిటెడ్	22,976	1,241
సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్	8,570	1,000
నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్	7,972	2,700
విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్	2,200	30,000
కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రై.లి.	2,172	9,681
ఎస్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్ మెటీరియల్ ప్రై.లి.	2,081	600
ఎస్ఏఈఎల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్	1,728	860
వాల్టన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్	1,682	415
సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లి.	1,247	1,100
డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్	1,234	1,454
క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్	1,154	1,500
సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్	1,090	1,250
వాసంగ్ ఎంటర్‌ప్రైజెస్	898	17,645
ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్	700	1,000
ఎస్‌సీబీసీ వెంచర్స్ ఎల్ఎల్‌పీ	550	1,130
భారత్ డైనమిక్స్	489	500
బిర్లా లిమిటెడ్	240	588
రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్	202	436
మైరా బే వ్యూ రిసార్ట్స్	157	980
ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్	150	2,000
ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లి.	119	2,000
క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్	115	2,000
మథర్సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్	110	700
విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్ ప్రై.లి.	51	750
శ్రీవేద ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్	12	1,500

జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించండి

(మొదటి పేజీ తరువాయి)

షెల్టర్లకు తరలించి వాటికి ఆహారం, నీరు, అవసరమైన వైద్యం అందేలా చూడాలని, రహదారులపై హెల్ప్‌లైన్ నంబర్లు ప్రదర్శించాలని తెలిపింది.

కాలవ్యవధి నిర్ణయం

- వీధికుక్కలు సంచరించే సంస్థల ప్రాంగణాలను గుర్తించేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ధర్మాసనం రెండు వారాల గడువు విధించింది. ఆ సమయంలోగా మున్సిపాలిటీలు తదితర స్థానిక సంస్థల ద్వారా ఆ పనిని పూర్తి చేయాలని పేర్కొంది.
- వీధికుక్కలు తమ ప్రాంగణాల్లోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు ఆయా సంస్థల పాలనాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రాంగణాల చుట్టూ ప్రహరీలు, కంచెలు, గేట్ల నిర్మాణం వంటి పనులను 8వారాల్లో పూర్తి చేయాలి. అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు వీటి అమలుపై అఫిడవిట్లు దాఖలు చేయాలి.
- తమ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా, వీధికుక్కలు చొరబడకుండా చూసేందుకు ప్రతి సంస్థా ఒక నోడల్ అధికారిని నియమించాలి. ఆ అధికారి వివరాలను, స్థానిక సంస్థ(మున్సిపాల్టీ/పంచాయతీ) పేరును ఆయా ప్రాంగణాల ప్రవేశం వద్ద శాశ్వతంగా ప్రదర్శించాలి.
- మూడు నెలలకోసారి ఆ ప్రాంగణాలను పరిశీలించి వీధి శునకాలు రావడంలేదని నిర్ధారించుకోవాలి.
- ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులన్నీ యాంటీ రేబిస్ వ్యాక్సిన్లను నిల్వ ఉంచుకోవాలి. ● అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు తమ పరిధిలోకి వచ్చే జాతీయ, రాష్ట్ర రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేస్ పైకి వచ్చే వీధి కుక్కలను తొలగించాలి.

గత ఆదేశాలకు భిన్నంగా...: రేబిస్ లక్షణాలు/ విపరీత ప్రవర్తన కలిగినవి మినహా షెల్టర్లకు తరలించిన మిగిలిన శునకాల విషయంలో గతంలో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా సవరించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలిపెట్టాలని గతంలో పేర్కొనగా... ఇప్పుడు వాటిని వెనక్కి తీసుకురాకుండా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. వీధి కుక్కలకు ఆహారం అందించేందుకు స్థానిక సంస్థలు ప్రత్యేకంగా ఫీడింగ్ స్పేస్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

వీధికుక్కల దాడులతో దేశానికి అప్రతిష్ఠ

బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరించాలంటూ ఆదేశాలు వెలువరించే సమయంలో సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. శునకాల దాడుల వల్ల అంతర్జాతీయంగా మన దేశానికి అప్రతిష్ఠ కలుగుతోందని పేర్కొంది. ఇటీవల బెంగళూరులో ఉదయపు నడకలో ఉన్న విదేశీయుడిని కుక్క కరిసిన ఘటనను ప్రస్తావించింది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా నగరాలు, పట్టణాల్లోనూ శునకాల బెడద ఎక్కువగా ఉందని తెలిపింది. రేబిస్ వ్యాధిగ్రస్థుల మరణాలు అధికమవుతున్నాయని అభిప్రాయపడింది. చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్రంగా గాయపడిన ఘటనలనూ ఉదహరించింది. పాఠశాలలు, ఆసుపత్రుల ప్రాంగణాల్లో కుక్కకాట్లు వ్యవస్థాపరమైన వైఫల్యమేనని పేర్కొంది. పౌరుల రక్షణ కోసం గట్టి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పేర్కొంది.

సరిపడా నిధులున్నా.. పనుల్లో జాప్యమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

'అడవితల్లి బాట'లో ప్రారంభించామని అన్నారు. పనులను వేగంగా చేయాలని, అటవీశాఖ అభ్యంతరాలు లేదా ఇతర సమస్యలు ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో 'పల్లె పండగ 2.0', 'అడవితల్లి బాట' పనుల పురోగతి, జలజీవన్ మిషన్, స్వామిత్వ పథకాలపై శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ తాగునీటి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు.

క్షేత్రస్థాయికి వెళ్లాలి

- అడవితల్లి బాట పనుల పరిశీలనకు అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లాలి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు సమీక్షలు తరచూ నిర్వహించి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలి.
- సాస్కీ నిధులతో త్వరలో 'పల్లె పండగ 2.0' కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. ఆర్థికశాఖతో సమన్వయం చేసుకుని నిధులు త్వరగా విడుదలయ్యేలా కృషి చేయాలి. 4,007 కి.మీ. మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు చేపట్టేలా ఏర్పాట్లు చేయాలి.
- జలజీవన్ మిషన్‌లో చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. ఈ నెల 17 తరువాత క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల్లో పురోగతి, అందుబాటులో ఉన్న నీటి సరఫరా వ్యవస్థను పరిశీలిస్తా' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

కోటి మందికి స్వామిత్వ ప్రాపర్టీ కార్డులు

- 'స్వామిత్వ పథకం కింద వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ప్రాపర్టీ కార్డులు అందజేయాలి. డిసెంబరు నుంచి మూడో విడత సర్వే ప్రారంభించి పూర్తి చేయాలి. గ్రామ సర్వేయర్లను సర్వే విభాగం పంచాయతీరాజ్ శాఖకు కేటాయించాలి. సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటాను.
- వైకాపా ప్రభుత్వ హయాంలో పాసు పుస్తకాలపై అప్పటి సీఎం ఫొటో ముద్రించిన కారణంగా ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మన ప్రభుత్వంలో అలాంటి తప్పులకు తావుండదు. రీసర్వే తర్వాత ఎవరి ఆస్తులపై వారికి రాజముద్రతో ప్రాపర్టీ కార్డులు ఇస్తాం. స్థలాలు అమ్ముకోడానికి, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం కార్డులు వినియోగించుకోవచ్చు
- గ్రామీణ రహదారుల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా 'జియో రూరల్ రోడ్ మేనేజ్‌మెంట్ సిస్టం' అభివృద్ధి చేస్తున్నాం. అడవితల్లి బాట కార్యక్రమాన్ని సిస్టంకు అనుసంధానించి ప్రయోగాత్మకంగా అమలు చేయాలి' అని పవన్‌కల్యాణ్ ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సర్వే విభాగం కార్యదర్శి ఆర్.కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాలలూ.. బడి భోజనం బాగుందా?

చేతులు, పళ్లాలు శుభ్రం చేసుకుని భోజనానికి వరుసలో నిల్చొన్నారు విద్యార్థులు. అప్పుడే ఇద్దరు వ్యక్తులు వచ్చి మధ్యలో చేరారు. వీరెవరని వెనక్కి తిరిగేసరికి పెద్ద మనుషుల్లా కనిపించారు. కాసేపటికి జిల్లా ఉన్నతాధికారులని తెలుసుకున్న ఆ బాలలు ఆశ్చర్యపోయారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి, డీఈవో మాణిక్యం నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పటికే మధ్యాహ్న భోజనాలు ప్రారంభం కావడంతో విద్యార్థులతో కలిసి ప్లేట్లు పట్టుకుని వరుసలో నిల్చొన్నారు. పిల్లలతో మాట్లాడి మెనూ అమలు, తరగతులు, సౌకర్యాలపై ఆరా తీశారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

వందేమాతరం.. దేశానికి స్ఫూర్తినిచ్చే మహామంత్రం



వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు



దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని మోదీ



జాతీయ జెండాలు చేతపట్టి విద్యార్థినుల ఉత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగంలో ప్రధాని.. కాంగ్రెస్‌పై పరోక్షంగా ధ్వజమెత్తారు. 1875లో బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయంలోని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించారని, దీంతోనే దేశ విభజనకు బీజాలు పడ్డాయని వ్యాఖ్యలు చేశారు. "దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల గొంతుక వందేమాతరం. ప్రతి భారతీయుడి భావోద్వేగాలను ప్రతిబింబించిన గీతం. దురదృష్టవశాత్తూ 1937లో ఆత్మ నుంచి ఒక భాగాన్ని వేరు చేసినట్లు, ఈ గేయంలోని ముఖ్యమైన చరణాలను తొలగించారు. వందేమాతరాన్ని ముక్కలు చేశారు. ఈ విభజనతో దేశ విభజనకూ బీజాలు పడ్డాయి. ఈ గేయానికి ఎందుకు అన్యాయం జరిగిందో యువతరం తెలుసుకోవాలి. ఆ విభజనవాద మనస్తత్వంతో ఇప్పటికీ దేశానికి ముప్పు పొంచి ఉంది" అని పేర్కొన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'వందేమాతరం' దేశ ప్రజల భావోద్వేగ చైతన్యానికి, సమైక్యతకు ప్రతీకగా నిలుస్తూనే ఉందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో వందేమాతర గేయం కీలక పాత్ర పోషించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

కాంగ్రెస్, భాజపా మధ్య మాటల యుద్ధం

ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. రవీంద్రనాథ్ ఠాగూర్ సూచనల మేరకే 1937లో వందేమాతరం గేయంలోని తొలి రెండు చరణాలను అప్పటి కాంగ్రెస్ ఎంపిక చేసిందని గుర్తుచేసింది. నోబెల్ అవార్డు గ్రహీత అయిన ఠాగూర్‌ను ప్రధాని విభజనవాదిగా పేర్కొనడం సిగ్గుచేటని విమర్శించింది. మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. "1937లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి ముందు ఈ అంశంపై నెహ్రూకు ఠాగూర్ లేఖ రాశారు. ఆరు చరణాల్లో తొలి రెండు చరణాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు అప్పటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసింది" అని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. దేశ సామూహిక ఆత్మను మేల్కొల్పిన వందేమాతరం గేయానికి పతాకధారిగా కాంగ్రెస్ పనిచేసిందని, ఇందుకు గర్వంగా ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. జాతీయవాదులమని చెప్పుకొనే ఆరెస్సెస్, భాజపా వారు తమ శాఖల్లో, కార్యాలయాల్లో గానీ.. ఎన్నడూ వందేమాతరం, 'జన గణ మన' పాడలేదని ఆరోపించింది. అంతకుముందు కాంగ్రెస్‌పై భాజపా ధ్వజమెత్తింది. 1937లో వందేమాతరం గేయాన్ని కుదించి, నాడు నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ మతపరమైన ఎజెండాను అమలు చేసిందని పేర్కొంది. గేయాన్ని మతంతో ముడిపెట్టి కాంగ్రెస్ చారిత్రక పాపం చేసిందని విమర్శించింది. దుర్గామాతను ప్రస్తుతిస్తూ రాసిన చరణాలను తీసివేయడాన్ని తప్పుబట్టింది.

గూగుల్ మ్యాప్స్ నుంచి ఆర్టీసీ టికెట్ బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)

రైళ్లలో ప్రయాణించడానికి ఎంత సమయం పడుతుందనే వివరాలు జనరల్ ట్రాన్సిట్ స్పీడ్ స్పెసిఫికేషన్ (జీటీఎస్ఎఫ్) ద్వారా కనిపిస్తాయి.

■ అందులో బస్ సింబల్ ఉన్నచోట క్లిక్ చేస్తే విజయవాడ నుంచి విశాఖపట్నానికి ఎన్ని ఆర్టీసీ బస్సులున్నాయి, అవి ఏ సమయాల్లో బయలుదేరతాయి? ఎన్ని గంటల్లో చేరుకుంటాయనే వివరాలు వస్తాయి.

■ దానిమీద క్లిక్ చేస్తే నేరుగా ఆర్టీసీ వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తుంది. అందులో టికెట్ బుక్ చేసుకొని, ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే సరిపోతుంది.

ట్రయల్ విజయవంతం: ఆర్టీసీ అధికారులు, గూగుల్ ప్రతినిధులతో చర్చించి ప్రయోగాత్మకంగా విజయవాడ- హైదరాబాద్ మార్గంలో దీనిని అమలు చేశారు. ■ కొద్ది రోజులపాటు దీనిని పరిశీలించగా విజయవంతంగా బుకింగ్స్ జరిగాయి. ఇదంతా మూడు నెలల కిందట పూర్తయింది. ■ దీంతో ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయమున్న ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్ సర్వీసులు ఏయే రూట్లలో తిరుగుతాయో వాటి వివరాలను గూగుల్‌కు అందజేశారు. గూగుల్ ఆయా రూట్లలో బస్టాప్‌ల వారీగా లాటిట్యూడ్, లాంగిట్యూడ్ వంటివన్నీ ఆడిట్ టెస్ట్ జరిపి, మూడు రోజుల కిందట ఆమోదం తెలిపింది. ■ వారంలో అన్ని రూట్లలో గూగుల్ మ్యాప్స్ ద్వారా బస్ టికెట్ల బుకింగ్‌కు అవకాశం కల్పించనున్నారు.

రాష్ట్రంలోని రెన్యూ ఎనర్జీ ప్రాజెక్టుకు రూ.2,900 కోట్ల రుణం

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఒక భారీ స్థాయి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు ఏర్పాటుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి దాదాపు రూ.2,900 కోట్ల రుణాన్ని పొందనున్నట్లు రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ పేర్కొంది. మరో రూ.1300 కోట్ల మొత్తాన్ని ఇతర రుణదాతల నుంచి ఏడీబీనే అందిస్తుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏడీబీ వైస్ ప్రెసిడెంట్ (మార్కెట్ సొల్యూషన్స్) భార్గవ్ దాస్‌గుప్తా, రెన్యూ ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా సమక్షంలో రుణ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. 837 ఎండబ్ల్యూపీ పవన, సౌర సామర్థ్యం, 415 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థ (బీఈఎస్ఎస్)ను ఈ ప్రాజెక్టులో భాగంగా కంపెనీ నిర్మిస్తుంది.

పరకామణి చోరీ కేసులో కదులుతున్న డొంక

ఈనాడు డిజిటల్– తిరుపతి, న్యూస్‌టుడే– తిరుపతి (నేరవిభాగం): వైకాపా హయాంలో తిరుమల పరకామణిలో చోరీకి సంబంధించిన కేసు డొంక కదులుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులను తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో సీఐడీ అధికారులు ఐదు గంటలపాటు విచారించి, వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. రవికుమార్, ఆయన సతీమణి, కుమార్తెలను వేర్వేరు గదుల్లో ఉంచి ప్రశ్నించారు. రవికుమార్ తితిదేకి బదలాయించిన ఆస్తుల స్టాంప్ డ్యూటీకి దాదాపు రూ.42 లక్షలు ఖర్చయినట్లు అంచనా. దీన్ని ఎవరు చెల్లించారు, నెలకు రూ.45 వేల జీతం వచ్చే మీరు తితిదేకు రూ.14 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఎలా బదలాయించారు? విదేశీ కరెన్సీని ఇక్కడి కరెన్సీలోకి ఎలా మార్చారు, పరకామణిలో ఏయే రోజుల్లో ఎంతెంత నగదు, ఆభరణాలు తస్కరించారు, లోక్‌అదాలత్‌లో రాజీ చేయించేందుకు ప్రేరేపించిన వ్యక్తులెవరు వంటి అంశాలపై రవికుమార్ నుంచి సమాచారం రాబట్టినట్లు సమాచారం. నిందితుడి నుంచి అదనంగా డబ్బు వసూలు, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల వివరాలపైనా ఆరా తీసినట్లు తెలిసింది. ఇంతకాలం ఎక్కడున్నారు, ఎవరైనా భయపెట్టారా అనే కోణంలోనూ సమాచారం రాబట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. వివిధ ప్రాంతాల్లో ఆస్తులున్నట్లు గుర్తించిన అధికారులు ఆ దిశగా ప్రశ్నలు సంధించారు. నిందితుడు కొన్నింటికి తెలియదు, గుర్తులేదు అని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. అంతకుముందు తితిదేలోని పలువురు పోలీసులు, విజిలెన్స్ అధికారులనూ విచారించారు.

రహస్యంగా హాజరు: సీఐడీ ఇచ్చిన నోటీసులతో రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం 9గంటల ప్రాంతంలో రహస్యంగా విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వారి విచారణ కొనసాగింది. అనంతరం ఎవరూ గుర్తుపట్టకుండా ముసుగులేసి వారిని పద్మావతి అతిథిగృహం వెనుక భాగంలోని శ్వేతా భవనం నుంచి పంపించినట్లు తెలిసింది.

ముగ్గురు పోలీసు అధికారులపై చర్యలు: పరకామణిలో చోరీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, లోక్‌అదాలత్‌లో రాజీ చేసిన వ్యవహారంలో ముగ్గురు పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఒంగోలు పీటీసీలో పనిచేస్తున్న సీఐ జగన్‌మోహన్‌రెడ్డి, తిరుపతి సీఐడీలో సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్, తిరుమల టూటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై లక్ష్మీరెడ్డిలను ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు.

ఇక పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానమే!

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందికరమని భావించారు. ఉన్నత స్థాయిలోనూ ఇక నుంచి పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానంగానే పరిగణించాలన్న ఆదేశాలు కిందిస్థాయి అధికారులకు అందాయి. దీంతో డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీ నియామకం కోసం గతంలో గుంటూరు జలవనరుల శాఖ ఎస్ఈ పిలిచిన టెండర్లను తాజాగా రద్దు చేశారు.

రూ.58 వేల కోట్ల అంచనా వ్యయం..

- పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.58 వేల కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.
- మొదట్లో భావించినట్లు 3 సెగ్మెంట్లలోనే పనులు చేస్తారు.
- మూడో సెగ్మెంట్లో గతంలో అనుకున్నట్లు బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల వరకు కాకుండా బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్ జలాశయం వరకే పరిమితమవుతారు. ఇందుకు రూ.9,000 కోట్లు ఖర్చవుతుందని లెక్క వేశారు. అంటే.. గతంలో కన్నా సుమారు రూ.25 వేల కోట్ల ఖర్చు తగ్గుతుందని భావిస్తున్నారు.
- నీటిని కూడా మరీ ఎత్తుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదు. +250 మీటర్ల వరకు ఎత్తిపోస్తే సరిపోతుంది.
- తొలి, రెండో సెగ్మెంట్లల్లో పెద్ద మార్పులు ఏమీ ఉండవు.
- తొలి సెగ్మెంట్(పోలవరం-ప్రకాశం బ్యారేజి)కు రూ.13 వేల కోట్ల ఖర్చవుతుందని అంచనా.
- రెండో సెగ్మెంట్(ప్రకాశం బ్యారేజి - బొల్లాపల్లి)లో బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మించి అక్కడికి నీళ్లు పంపిస్తారు. ఈ విభాగంలో రూ.36 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది.

ఈనాడు

అసమానతల కొలిమిలో జనభారతం


పట్నాలోని ఒక మురికివాడలో ఓ నిరుపేద గర్భిణి ఎనిమిదో నెలలో తీవ్ర అస్వస్థతకు గురైంది. దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్తే ఆపరేషన్ చేశారు. అప్పటికే బలహీన కవలల్లో ఒకరు చనిపోయారు. మిగిలిన బిడ్డనైనా దక్కించుకోవాలని ఉన్నదంతా ఊడ్చి ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. బిల్లు కట్టడానికి సరిపడా సొమ్ము లేదని ఆ వైద్యశాల వారు బయటికి గెంటేయడంతో ఆ తల్లికి కడుపుకోత తప్పలేదు. తెలుగు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాణాపాయంతో ఉన్న రోగులను డోలీలు, మంచాలపై మోసుకెళ్లే ఉదంతాలూ తరచూ వార్తలకెక్కుతుంటాయి. కుటుంబ పరిస్థితులు సహకరించక చదువుకు దూరమై బాలకార్మికులుగా మగ్గిపోతున్న వారి విషాదగాథలూ వెలుగుచూస్తుంటాయి. ఆర్థిక అసమానతల దుష్ఫలితాలకు ప్రబల సాక్ష్యాలు ఇవన్నీ! ప్రస్తుతం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా వెలుగులీనుతోంది. కానీ, ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం- జనాభాలో ఒక్కశాతానికి సమానమైన కుబేరుల దగ్గర దేశ సంపదలో 40శాతం పోగుపడింది. దిగువ స్థాయిలోని 50శాతం ప్రజల చేతుల్లో మూడు శాతమే ఉంది! ఈ వైరుధ్యాలను మరింత దట్టించేస్తూ 2000-2023 మధ్యకాలంలో భారతీయ శతకోటీశ్వరుల ఆస్తులు 62శాతం పెరిగినట్లు జీ20 నివేదిక తాజాగా వెల్లడించింది. అభివృద్ధి ఫలాల పంపిణీలో అసమానతలు, తరిగిపోతున్న ఆదాయాలు పేదలూ దిగువ మధ్యతరగతి వర్గాల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి!

పాతికేళ్ల కిందట ఇండియాలో బిలియనీర్లు తొమ్మిది మందే. హురున్ ఇండియా ఇటీవలి జాబితా ప్రకారం ఆ సంఖ్య ప్రస్తుతం 350కి పైబడింది. వీరందరి సంపద విలువ మన జీడీపీలో దాదాపు సగానికి సమానం! సింహభాగం సంపద కొందరి చేతుల్లో ఉండటం, జనాభాలో అత్యధికులు ఈసురోమంటూ బతుకులీడ్చుతుండటం... రోజులు ఇలా దొర్లిపోతూ ఉంటే నిజమైన ప్రగతి ఎప్పటికి సాధ్యం? తలసరి ఆదాయాల పరంగా ప్రపంచ దేశాల్లో భారతావని 141వ స్థానంలో నిలుస్తోంది. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం, సొంతిల్లు లేని వారి సంఖ్య పన్నెండు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది. భరించలేని అద్దెలకు తోడు పెరుగుతున్న ఇంటి ఖర్చులకు తగినట్లుగా రాబడులు లేక ఎన్నో కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. శ్రమకు తగిన ప్రతిఫలం లభించని దుస్థితి రైతాంగాన్ని ఆత్మహత్యల వైపు నెడుతోంది. ఉపాధి కల్పనకు ఊతమివ్వని అభివృద్ధి విధానాలు, నైపుణ్యాలు నేర్పని నాసిరకం చదువులతో యువభారతం నీరసించిపోతోంది. ఈ దయనీయ పరిస్థితుల మూలంగానే ఈ ఏడాది మానవాభివృద్ధి సూచీలో 193 దేశాల సరసన ఇండియా 130వ స్థానానికి పరిమితమైంది!

ఆర్థిక అసమానతలు ప్రజాస్వామ్యానికీ ముప్పుగా మారుతున్నాయని జీ20 నివేదిక ఆవేదన వ్యక్తం చేసింది. అవి ప్రజ్వరిల్లుతున్న చోట ఎన్నికల్లో బలవంతులదే పైచేయి అయ్యి, అంతిమంగా వ్యవస్థల వైఫల్యానికి, పౌరహక్కుల అణచివేతకు, నియంతృత్వానికి దారితీస్తుందని హెచ్చరించింది. గిరాకీకి గండికొట్టే అసమానతలు ఆర్థిక కార్యకలాపాలను కుంగదీస్తున్నాయని, పేదరిక నిర్మూలన ప్రయత్నాలను నీరుగారుస్తున్నాయని జీ20 నివేదిక విశ్లేషించింది. ఈ దురదృష్టకర వాతావరణం సమసిపోయి జనభారతం సమష్టిగా పురోగమించాలంటే- విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాల వ్యయం పెరగాలి. జీవన ప్రమాణాల్లో మెరుగుదలనే అభివృద్ధికి నిర్వచనంగా భావించాలి. అన్నదాతలకు తగిన మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు ఉపాధి వేటలో విజయం సాధించగలిగేలా యువతకు మేలిమి నైపుణ్యాలు మప్పాలి!

లాభాల కన్నా నిజాయతీ, మాటల కన్నా చేతలు, వ్యక్తిగత మేలు కన్నా సామాజిక ప్రయోజనం... ఎల్లప్పుడూ మిన్న. వాటినే మన ఆదర్శాలుగా మలచుకోవాలి.

– జమ్నాలాల్ బజాజ్



పరశురాముడు

పూర్వం కొంతమంది మహర్షులకు ముక్కుమీదే కోపం ఉండేది. విశ్వామిత్రుడు, దూర్వాసుడు, పరశురాముడు... వీరంతా ఆ కోవకు చెందినవారే. అందుకే దేవతలు సైతం వారితో జాగ్రత్తగా ఉండేవారని చెబుతాయి పురాణాలు.

ముఖ్యంగా పరశురాముడి గురించి చెప్పాల్సివస్తే.. ఆయన జమదగ్ని, రేణుకల చిన్న కుమారుడు. శివుడి దగ్గర అస్త్రశస్త్ర విద్యలు అభ్యసించి అజేయుడిగా నిలిచాడు. ఎంతటి పరాక్రమవంతుడో అంతటి కోపిష్ఠి. ఆయన ఆయుధం గండ్రగొడ్డలి (అందుకే పరశురాముడన్న పేరు వచ్చింది). దీన్ని శివుడి నుంచి పొందాడు. ప్రభువుల అహంకారం, నిరంకుశత్వం, దౌర్జన్యాలను నిలువరించడానికి పరశురాముడు ఆయుధం చేపట్టి యోధుడిగా మారతాడు. కార్తవీర్యార్జునుడి కుమారులు జమదగ్ని తల నరికి మాహిష్మతి రాజ్యానికి పట్టుకుపోతారు. దాంతో పరశురాముడు తీవ్ర మనోవేదనకు గురవుతాడు. ఆ బాధ కోపంగా, ప్రతీకారంగా మారుతుంది. నేరుగా వెళ్లి కార్తవీర్యార్జునుడి కొడుకులను సంహరించి తండ్రి తల తీసుకొచ్చి మొండేనికి అతికించి జీవం పోస్తాడు. పాలకులందరినీ తెగనరికి వారి రక్తాన్ని తెచ్చి శ్యమంతక పంచకమనే ఐదు సరస్సుల్లో నింపుతాడు. తల్లిదండ్రులకు తర్పణం అర్పిస్తాడు. ధర్మం నాలుగు పాదాల మీద నడవాలన్నదే ఆయన లక్ష్యం. ఎవరైతే దారి తప్పి, అన్యాయానికి ఒడిగడతారో వారిని శిక్షించాలని స్పందించడం ఆయన నైజం. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఆరవది పరశురామావతారం. పాలకుల్లో దుష్టులైనవారిని శిక్షించి, వారి అవినీతి అక్రమాలను అంతమొందించేందుకే విష్ణుమూర్తి ఈ అవతారం ఎత్తాడన్నది పురాణాల సారాంశం.



అంతర్వాణి

పరశురాముణ్ని భార్గవరాముడని పిలుస్తారు. ఏతావాతా ఆయన ఆగ్రహం బహుముఖంగా ఉండేదన్నది నిర్వివాదాంశం. అంతటి కోపం ఉన్నప్పటికీ తండ్రి మాట జవదాటని పుత్రుడిగా చరిత్రలో నిలిచాడు. ఒకానొక సందర్భంలో జమదగ్ని భార్య రేణుకపై ఆగ్రహోదగ్రుడై ఆమెను సంహరించాలని తన కొడుకులను ఆదేశిస్తాడు. మిగిలిన వారు నిరాకరించడంతో ఆ కార్యాన్ని చిన్న కొడుకు పరశురాముడికి అప్పజెబుతాడు. ఆయన తల్లిని, సోదరులను సంహరిస్తాడు. దానికి సంతోషించిన తండ్రి ఏదైనా వరం కోరుకొమ్మనగా... తల్లి, సోదరులను తిరిగి బతికించమని అడిగి, సాధిస్తాడు. మహాభారతంలోనూ పరశురాముడి కోపాన్ని కర్ణుడు చవిచూస్తాడు. తాను బ్రాహ్మణుడినని అబద్ధమాడి కర్ణుడు విద్యలను అభ్యసిస్తాడు. తరవాత ఆ విషయం తెలుసుకున్న పరశురాముడు ఆగ్రహంతో ఊగిపోయి... యుద్ధ సమయంలో తాను నేర్పిన ఏ విద్యా గుర్తుకురాదని కర్ణుణ్ని శపిస్తాడు. శివుడి దర్శనానికి వెళ్లిన సందర్భంలో వినాయకుడు అడ్డుకోవడంతో ఆగ్రహించిన పరశురాముడు కోపంతో తన పరశువును విసిరేస్తాడు. దాంతో గణేశుడి దంతం విరుగుతుంది. కోపం మనిషి ప్రథమ శత్రువైనప్పటికీ.. కొన్ని సందర్భాల్లో మంచికే ఉపయోగించవచ్చని పరశురాముడి కథ చెబుతుంది.

– వెన్నా ప్రగడ శర్మ

మన పత్తికి పూర్వవైభవం...

ఆధునిక సాగుతోనే సాధ్యం!



ప్రాచీన గ్రీకు, రోమన్ సామ్రాజ్యాల వారు... తరవాత ఆంగ్ల, ఫ్రెంచి, పోర్చుగీస్ వర్తకులు నూలు వస్త్రాల కోసం భారతదేశానికి వచ్చేవారు. వాటికి బంగారంలో చెల్లింపులు జరిపేవారు. ఆ విధంగా భారత ఆర్థిక వ్యవస్థకు పత్తి సాగు, నూలు తయారీ ప్రధాన దన్నుగా నిలిచేవి. ఆ ప్రభావం ఇప్పుడు లేదు సరికదా, దశాబ్దకాలంగా దేశంలో పత్తి ఉత్పత్తి తగ్గిపోతోంది. అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? దీన్ని ఎలా అధిగమించగలం?

ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న పత్తిలో 25శాతం భారత్ నుంచే వస్తోంది. 1980 దశకం నుంచి దేశంలో దీని సాగు విస్తీర్ణం, దిగుబడి పెరుగుతూ వచ్చి 2016-17లో హెక్టారుకు 512 కిలోల పత్తి లభించింది. ఆ తరవాత నుంచి తెగుళ్లు, వాతావరణ మార్పులు, కొత్త వంగడాలు లభ్యం కాకపోవడం వంటి కారణాలతో దిగుబడి తగ్గిపోతోంది. 2011-12లో 352 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి కాగా, ఇప్పుడది 320-325 లక్షల బేళ్ల మధ్యే తచ్చాడుతోంది. కొత్త సాంకేతికతలు, వంగడాలు, సానుకూల వాతావరణ పరిస్థితుల మూలంగా ఇప్పుడు భారత్ కంటే బ్రెజిల్, అమెరికాల్లోనే పత్తి ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. భారత్‌లో అత్యధికంగా గుజరాత్‌లో సాగవుతోంది. 2023-24లో అక్కడ 90.57లక్షల బేళ్ల దిగుబడి సాధించగా, తదుపరి స్థానాలను మహారాష్ట్ర, తెలంగాణ ఆక్రమించాయి. అయితే దిగుబడుల విషయంలో రాష్ట్రాల మధ్య చాలా తేడా ఉంటోంది. 2022-23లో పంజాబ్‌లో హెక్టారుకు 500 కిలోల దిగుబడి వస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 2023-24లో వచ్చింది కేవలం 297 కిలోలే! లాభదాయకం కాకపోవడం, విదేశాల నుంచి పోటీ పెరగడంతో పత్తి సాగులో భారత్ వెనకబడిపోతోంది. తెలంగాణ, మహారాష్ట్ర పత్తి రైతులు పప్పు గింజలు, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలకు మళ్లుతున్నారు.



వాతావరణ మార్పుల ప్రభావం

బీటీ కాటన్ వంగడాలను తట్టుకోగల బోల్‌వార్మ్ తెగులు మళ్లీ విజృంభించడం పత్తి దిగుబడిని కుంగదీస్తోంది. 2014లో మహారాష్ట్రలో తలెత్తిన ఈ తెగులు 2017లో తెలంగాణకు, 2021లో పంజాబ్, హరియాణాలకు పాకింది. బోల్‌వార్మ్ పత్తి కాయలను, నూలును దెబ్బతీసి పంటను తెగనమ్ముకోవాల్సిన దుస్థితిని తెచ్చిపెట్టింది. భారతీయ పత్తికి విదేశీ మార్కెట్‌నూ దెబ్బతీసింది. 2002లో రంగ ప్రవేశం చేసిన బీటీ కాటన్ తెగుళ్లను నిరోధించి, భారత్‌లో రికార్డు దిగుబడులను అందించింది. 2006 నాటి బోల్‌గార్డ్-2 తరవాత కొత్త జన్యుమార్పిడి(జీఎం) పత్తి వంగడాలేవీ రాలేదు. పర్యావరణ ఉద్యమకారుల ఆందోళనతో ప్రభుత్వం కూడా కొత్త జీఎం పంటలను నిరుత్సాహపరచే నిబంధనలు తీసుకొచ్చింది. ఇంతలో కొత్తరకం తెగుళ్లు వచ్చి హైబ్రిడ్ పత్తి వంగడాలను నిర్వీర్యం చేశాయి. ఫలితంగా 2013-14లో హెక్టారుకు 566 కిలోలుగా ఉన్న పత్తి దిగుబడి 2023-24కల్లా 436 కిలోలకు పడిపోయింది. కొత్త బీఆర్‌ఎల్-1, బీఆర్‌ఎల్-2 వంగడాలపై పరీక్షలు చేయడానికి మరికొన్నేళ్లు పడుతుంది.

వానలు క్రమం తప్పడం, వర్ష రుతువు త్వరగా ముగియడం, అనావృష్టి పరిస్థితులు వెరసి పత్తి దిగుబడిని తెగ్గోశాయి. గుజరాత్, మహారాష్ట్రలలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణలో పత్తి కాయ ఏర్పడే దశలో వర్షాభావం పంటను దెబ్బతీసింది. ఇక్కడ పత్తి సాగయ్యే విస్తీర్ణంలో 38శాతానికే సాగునీటి సదుపాయం ఉంది. మార్కెట్లో అనిశ్చిత పరిస్థితులకు తోడు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, కూలి ఖర్చులు పెరగడం వంటివీ పత్తి సాగును వెనక్కి లాగుతున్నాయి. సరైన సేకరణ యంత్రాంగం లేక రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కన్నా తక్కువకు పంట అమ్ముకోవాల్సి వస్తోంది. 2019-20లో పొడుగు పింజ పత్తి ఎంఎస్‌పీ రూ.5,255 కాగా, 2023-24లో అది రూ.7,020కి పెరిగింది. అయితే, ద్రవ్యోల్బణం వల్ల ఎంఎస్‌పీ వాస్తవ విలువ తగ్గిపోయింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు కొంతమంది పెద్ద రైతులకే లభిస్తోంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం ప్రయోజనాలూ పూర్తిస్థాయిలో దక్కడం లేదు.


ఒకప్పుడు పత్తి ఎగుమతుల్లో భారత్‌దే అగ్రస్థానం. 2021-22లో 42.25లక్షల బేళ్లను ఎగుమతి చేసిన ఇండియా 2023-24లో 28.36 లక్షల బేళ్లనే విదేశాలకు పంపగలిగింది. ఇదే కాలంలో పత్తి దిగుమతులు 15.20 లక్షల బేళ్లకు చేరాయి. నిరుడు పత్తి ఎగుమతులు 17లక్షల బేళ్లకు పరిమితమై, దిగుమతులు 30లక్షల బేళ్లకు పెరిగాయి. దేశీయంగా పత్తి సాగు, నూలు నాణ్యత తగ్గడంవల్ల ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మరోవైపు వియత్నాం, బంగ్లాదేశ్‌లు పత్తి సాగు, ఎగుమతుల్లో భారత్‌ను మించిపోతున్నాయి. జాతీయ జౌళి విధానమేదీ లేకపోవడంతో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. కేంద్రం డిజిటల్ సేద్యానికి ప్రాధాన్యమిస్తున్నా- పత్తి సాగులో డ్రోన్లు, ఏఐ ఆధారిత తెగుళ్ల నివారణ, బిందు సేద్యం వంటివి ఊపందుకోలేదు. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరముంది.

పరిశోధన సంస్థల సహకారం

పత్తి సాగులో అత్యాధునిక వంగడాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. కొన్ని ప్రైవేటు బయోటెక్ సంస్థలు అభివృద్ధి చేసిన జన్యుమార్పిడి వంగడాలను ప్రోత్సహిస్తే మళ్లీ హెక్టారుకు 500 కిలోలకు పైగా దిగుబడి సాధించే వీలుంది. పంట మార్పిడి, తెగుళ్లను ముందే పసిగట్టడానికి ఏఐ వినియోగం, ఫెరోమోన్ ట్రాప్స్ వంటి పద్ధతులను అనుసరించాలి. వ్యవసాయ పరిశోధన సంస్థల సహకారంతో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు అధునాతన పత్తి సాగును ప్రోత్సహించాలి. వస్త్ర మిల్లుల కోసం రైతులు కాంట్రాక్టు పద్ధతిలో పత్తిని సాగు చేయాలి. ధర విషయంలో వారికి భరోసా కల్పించాలి. పునరుత్పాదక ఇంధన వనరులతో నడిచే జౌళి క్లస్టర్లను ఏర్పాటు చేయాలి. శీఘ్ర ఆధునికీకరణ, కొత్త వంగడాలతో ఉత్పత్తి, ప్రభుత్వపరమైన జాప్యాల నివారణ, సంస్థాగత సంస్కరణలతోనే భారత్ మళ్లీ పత్తి ఎగుమతుల్లో అగ్రస్థానానికి చేరుకోగలదు.



డాక్టర్ పి.వి.సత్యనారాయణ
డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్
ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ, లాం, గుంటూరు



నీవైన కలలతో...

మనిషిని బతికించేది ఏంటి? రేపటి మీద ఆశలు, కలలు! ప్రతి ఒక్కరికీ కొన్ని కలలుంటాయి. అవి ఎప్పటికైనా నెరవేరకపోతాయా అనే ఆశతో రోజులు వెళ్లదీస్తుంటారు. కానీ, ఉరుకుల పరుగుల జీవితంలో, మధ్యతరగతి సంసారాల్లో ఎంతమందికి ఆ అవకాశం దొరుకుతోంది? పనులన్నీ పక్కన పెట్టి ఒక వారం పాటు ఇష్టమైన ప్రదేశాలు తిరిగి రావాలని ఉంటుంది. సెలవు దొరకదు. తీరా రిటైరయ్యే సమయానికి ఓపిక ఉండదు. డబ్బూ ఉంటుందన్న నమ్మకం లేదు. నచ్చిన బైకో, కారో కొనుక్కోవాలని ఉంటుంది. మంచి రెస్టారెంటుకు వెళ్లి ఇష్టమైన తిండి తినాలనిపిస్తుంది. కానీ, పిల్లల భవిష్యత్తు గుర్తుకొచ్చి వెనక్కి తగ్గాల్సి వస్తుంది. ఇక ఆడవారి ఆకాంక్షలకైతే ఈ పితృస్వామ్య సమాజం కనీస గౌరవమూ ఇవ్వదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆశల వెంట ఊసులను పరిగెత్తిస్తుంది 'ఫిషర్ ఉమన్ అండ్ టుక్‌టుక్' యానిమేషన్ షార్ట్ ఫిల్మ్.

సముద్రం ఒడ్డున ఒక మధ్యవయసు మహిళ గుడిసెలో ఒంటరిగా నివసిస్తుంటుంది. పొద్దున్నే బుట్ట నిండా చేపలు తీసుకుని పక్కనున్న టౌనుకెళ్లడం.. వాటిని అమ్మి సాయంత్రానికి ఇంటికి చేరడం... ఇదే ఆమె దినచర్య. నిస్సారంగా సాగిపోతున్న జీవితంలో ఏనాటికైనా రంగు రంగుల ఆటో ఒకటి కొనుక్కోవాలని ఆమె కోరిక. దాని గురించి ఎప్పుడూ కలలు కంటూ, కొద్దికొద్దిగా డబ్బు దాచుకుంటూ ఉంటుంది. ఇలా రోజులు దొర్లిపోతుంటే.. ఒకరోజు ఆమెకు చేప కడుపులో పెద్ద ముత్యం దొరుకుతుంది. దాన్ని అమ్మేసి ఆటో కొనుక్కుంటుంది. అందులో చేపలు పెట్టుకుని టౌన్‌కు వెళ్తుంటుంది. తన గానుగెద్దు జీవితంపై ఒక ఫైన్ మార్నింగ్ ఆమెకు చిరాకు పుడుతుంది. చేపల బుట్ట విసిరికొట్టి ఆటోలో నచ్చిన ప్రదేశాలన్నీ తిరుగుతుంది. తిరుగు ప్రయాణంలో యాక్సిడెంట్ అయ్యి రెండు కళ్లూ కోల్పోతుంది. జీవితం మళ్లీ వ్యథాభరితం! కానీ, దాచుకున్న డబ్బుతో ఆటోను బాగు చేయించుకుంటుంది. కళ్లు కనిపించకపోయినా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆటో నడుపుతూ అనంత లోకాలకు వెళ్లిపోతుంది. ఇదీ కథ.

ఇందులో పాత్రలు తల మెడ మొత్తం ఏకం అయిపోయినట్లు కనిపిస్తూ నేటి కాలపు నిస్సార జీవితాలకు ప్రతిబింబాలా అన్నట్లు ఉంటాయి. షార్ట్ ఫిల్మ్‌లో ప్రకృతి మొత్తం ముదురు వర్ణాలతో చాలా అందంగా కనిపిస్తుంది. రొటీన్ జీవితంలో దానిపై శ్రద్ధపెట్టని తీరును ఇది తెలియజేస్తుంది. నా అన్నవాళ్లకోసం కష్టపడటంలో ఆనందం ఉంది. కానీ, మరీ భారీవి కాకపోయినా మన పరిధిలో చిన్న కోరికలైనా నెరవేర్చుకోకపోతే జీవితానికి అర్థమేముంది? అందుకోసం వచ్చే జన్మదాకా ఆగాలా? అదంటూ ఒకటి ఉంటుందా? ఒకవేళ ఉన్నా ఇప్పటికన్నా మెరుగ్గా ఉంటుందా? ఏ ఆశలూ తీరకుండా జీవితం గానుగెద్దులా మిగిలితే.. అంత్యకాలంలో అసలు నేనెందుకు పుట్టాను, ఎందుకు చస్తున్నాను అన్న సందేహాలు మనసును మెలిపెట్టవా? ఈ ప్రశ్నలన్నీ రేపుతూ.. చనిపోయేలోగా నీ స్థాయిలో నీవైన కొన్ని మధుర జ్ఞాపకాలు మిగుల్చుకో అని గుర్తుచేస్తుందీ లఘుచిత్రం!

– వెంకీ

విదేశీ కటకటాల్లో...

ఇతర దేశాలకు వలసవెళ్తున్న భారతీయులు అక్కడి చట్టాలపై అవగాహన లేక, ఇతర నేరాల్లో చిక్కుకుని జైలు పాలవుతున్నారు. అలాంటి వారిలో పలువురికి శిక్షలు పడుతుంటే, మరెందరో విచారణ ఖైదీలుగా కారాగారాల్లో రోజులు వెళ్లదీస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి విదేశాల్లోని జైళ్లలో భారతీయులు 10,152 మంది ఉన్నారు. గల్ఫ్ దేశాల్లోని జైళ్లలోనే ఎక్కువమంది మగ్గుతున్నారు. ఆయా దేశాల్లోని కారాగారాల్లో భారతీయ ఖైదీల సంఖ్య...

సౌదీ అరేబియా	2,633
యూఏఈ	2,518
నేపాల్	1317
ఖతార్	611
కువైట్	387
మలేసియా	338
యూకే	288
పాకిస్థాన్	266
బహ్రెయిన్	181
చైనా	173
అమెరికా	169
ఇటలీ	168
ఒమన్	148

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)


నిన్న శోధన... నేడు సృజన!

ప్రపంచాన్ని నేడు కృత్రిమ మేధ(ఏఐ) కొత్త దిశలో నడిపిస్తోంది. మనం నేర్చుకునే విధానం, మాట్లాడే తీరు, సమాచారాన్ని వెతికే పద్ధతి వంటివన్నీ ఏఐ ప్రభావంతో మారిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో బడా సాంకేతిక సంస్థలు తమ స్థానాన్ని కోల్పోకుండా మార్కెట్లో నిలబడేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే, సృజనకారులకు విస్తృత అవకాశాలు కల్పించడంపై అవి దృష్టి సారించాల్సి ఉంది.

కృత్రిమ మేధ రాకతో సామాజిక మాధ్యమాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ ధాటికి బడా టెక్ సంస్థలకు సెగలు తప్పలేదు. ఇలాంటి పరిస్థితులను ఊహించే గూగుల్ యూట్యూబ్‌ను, మెటా వాట్సప్‌ను, మైక్రోసాఫ్ట్ లింక్డిన్‌ను స్వాధీనం చేసుకున్నాయి. తద్వారా నేడు అవి మార్కెట్లో బలంగా నిలబడ్డాయి. ఏఐ ఆధారిత చాట్ జీపీటీ, జెమినీ వంటి మోడళ్ల వల్ల గూగుల్ సెర్చ్ వినియోగం తగ్గినా, యూట్యూబ్ మాత్రం మరింతగా బలపడింది. ఫేస్‌బుక్ వాడకం తగ్గినా... ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ మెటాకు కొత్త ఊపునిచ్చాయి. లింక్డిన్ మైక్రోసాఫ్ట్‌కి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక స్థానం తీసుకొచ్చింది. ఈ టెక్ సంస్థలు కొత్త వేదికలను సృష్టించకపోయినా, సమయానికి సరైన వేదికలను స్వాధీనం చేసుకోవడం వాటి విజయానికి కారణమైంది.

ఆదుకుంటున్న 'సమాచార చక్రం'...

చెప్పాలంటే, 2006లో యూట్యూబ్‌ను కొనుగోలు చేసిన గూగుల్ భవిష్యత్తు నేడు ప్రధానంగా ఆ వీడియో కంటెంట్ వేదికపైనే ఆధారపడి ఉంది. కొవిడ్-19 ఉద్ధృతి సమయంలో మన ఇళ్లలోకి వచ్చి విద్య, వినోదం, ఉపాధి అన్నీ అందించిన వేదికగా యూట్యూబ్ నిలిచింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, వ్యాపారులు అందరూ తమ అనుభవాలను పంచుకోవడానికి దాన్ని బాగా ఉపయోగించుకున్నారు. అనేక మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ఆ వేదికపై తమ వృత్తి ఉపాధులను పెంచుకున్నారు. అదే సమయంలో వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లను కూడా దాదాపు స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాడటం ఎక్కువైంది. కుటుంబాల నుంచి కార్యాలయాల దాకా సంభాషణలు, వ్యాపార లావాదేవీలు వాట్సప్ ద్వారా జరగడం ఎక్కువైంది. ఇన్‌స్టాగ్రామ్ చిన్న వీడియోలతో యువతను ఆకర్షించి కొత్త మార్కెట్‌ను తెరిచింది. ఈ రెండు వేదికలు కలిసి ఆధునిక కంటెంట్ ఆర్థిక వ్యవస్థకు పునాది వేశాయి. ఇప్పుడు ఏఐ ఈ రంగాన్ని సరికొత్తగా మార్చేస్తోంది.






చాట్ జీపీటీ వంటి మోడళ్ల వల్ల ఇంటర్నెట్‌లో ఇప్పుడు సమాచార శోధన తక్కువ అవుతుంటే, మరోవైపు ఏఐ సాయంతో సృష్టించే వీడియోలు, కథలు, పాఠాలు పెరుగుతున్నాయి. పరిశోధకులు, రచయితలు, ఉపాధ్యాయులు ఏఐతో కంటెంట్ సృష్టించి వాటిని తిరిగి యూట్యూబ్, లింక్డిన్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌లలో పంచుకుంటున్నారు. అంటే ఏఐ ఒకవైపు వెతుక్కోవడాన్ని తగ్గిస్తూనే, మరోవైపు సమాచార సృష్టిని పెంచుతోంది. ఏఐ కంటెంట్ సృష్టిస్తుంది, సామాజిక మాధ్యమాలు వాటిని పంపిణీ చేస్తాయి, వినియోగదారులు వాటిపై స్పందిస్తారు. ఈ 'సమాచార చక్రం' ఎప్పటికప్పుడు తిరుగుతూ కొత్త రూపాలను సృష్టిస్తూ ఉంటుంది కాబట్టి, పెద్ద టెక్ కంపెనీలకు ఏఐ వల్ల ఎలాంటి ప్రమాదమూ లేదు. ఉన్నదల్లా అవకాశాలే. ఎందుకంటే కంటెంట్ ఎక్కడ సృష్టించినా అది తిరిగి ఆయా సంస్థల నియంత్రణలోని వేదికలకే చేరుతోంది.

ప్రాంతీయ భాషల్లో యాప్‌లు...

ప్రపంచవ్యాప్తంగా కొద్ది సంస్థల చేతుల్లోనే సామాజిక మాధ్యమాల ద్వారా సమాచార పంపిణీ కేంద్రీకృతమై ఉందన్నది నిజం. ప్రధానంగా యూట్యూబ్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డిన్ వంటి వేదికలు అందుకు మూల స్తంభాలుగా నిలుస్తున్నాయి. ఆధునిక సాంకేతికతల పుణ్యమాని మనం ఏం చూస్తాం, ఎలా ఆలోచిస్తాం అన్నది కూడా ఈ వేదికలపైనే ఆధారపడి ఉంటోంది. ఇదో కొత్తరకం ఆధిపత్యం. 2000 దశకంలో సెర్చ్ ఇంజిన్లు వెబ్‌పై ఆధిపత్యం చూపినట్లే, ఇప్పుడు ఈ వేదికలు మన దృష్టిని నియంత్రిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మరిన్ని కొత్త వేదికల ఆవిష్కరణ జరగాల్సి ఉంది. భారత్ లాంటి దేశంలో ప్రాంతీయ భాషల ఆధారంగా యాప్‌లు, స్థానిక కంటెంట్‌ను సృష్టించే వేదికలు రావాలి. సృజనాత్మకతను కనబరిచే వారికి తగిన ఆదాయం, గౌరవం లభించేలా వాటిని అభివృద్ధి చేయాలి. కృత్రిమ మేధ ప్రపంచాన్ని శరవేగంగా మారుస్తున్న క్రమంలో బడా సాంకేతిక సంస్థలు తమ మనుగడ కోసం తాపత్రయపడటంతో సరిపెట్టకుండా, సృజనకారులకు విస్తృతస్థాయిలో అవకాశాలు కల్పించే వేదికలుగా మారాలి. అప్పుడే అవి మరెంతో కాలం మనుగడ సాగించగలుగుతాయి.



డాక్టర్ మైలవరం చంద్రశేఖర్
సహాయ ఆచార్యులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్

మాట వినకపోతే..!

ఒక అడవిలో ఓ కోతుల గుంపు నివసించేది. దానికి లీడర్ కపినాథుడు. అందులో కేసరి, తిమ్మన అనే రెండు కోతులు కూడా ఉండేవి. ఆ అడవికి దగ్గర్లోనే ఒక గుడి ఉండేది. అక్కడికి చాలామంది భక్తులు వస్తుండేవారు. ఆ భక్తులు వేసిన అరటిపండ్లు, కొబ్బరితో కేసరి, తిమ్మన కడుపు నింపుకొనేవి. ఒకరోజు ఓ వ్యక్తి బుట్టనిండా అరటిపండ్లు తీసుకొచ్చి ఎక్కువ కోతులు ఉన్న దగ్గర పెట్టాడు. అవన్నీ సంతోషంగా తీసుకుని తినసాగాయి. మరుసటిరోజూ అతను అలాగే చేశాడు. ఆ విషయం కపినాథుడికి తెలిసింది. వెంటనే కోతులతో సమావేశం ఏర్పాటు చేసి.. 'మనం స్వేచ్ఛా జీవులం. మనకు నచ్చిన ఆహారం తింటాం.. నచ్చిన చోటుకు వెళ్తాం. అయితే, ఈ మధ్య ఎవరో అరటిపండ్లు పంచుతున్నారని తెలిసింది. దానికి కచ్చితంగా ఏదో ఒక కారణం ఉండే



ఉంటుంది. ఇలా ఆహారం మన దగ్గరికే ఉచితంగా వచ్చిందంటే దాని గురించి ఆలోచించాల్సిందే! మీరంతా జాగ్రత్తగా ఉండండి' అని హెచ్చరించింది. ఆ తరవాత రోజు కూడా అరటిపండ్ల బుట్ట పెట్టాడా వ్యక్తి. కపినాథుడి మాటలు గుర్తుపెట్టుకుని చాలా కోతులు ఆ బుట్ట దగ్గరికి వెళ్లలేదు. కానీ నోటిదాకా వచ్చిన ఆహారాన్ని పోగొట్టుకోవడం ఎందుకని... కేసరి, తిమ్మన మాత్రం తినేశాయి. అలా రోజూ ఆ రెండూ ఆ వ్యక్తి తెచ్చిన అరటిపండ్లు తినసాగాయి. మెల్లగా వాటిని మచ్చిక చేసుకున్న ఆ వ్యక్తి.. వెంటపెట్టుకుని తీసుకెళ్లాడు. కొబ్బరికాయలు తెంపడం, విన్యాసాలు చేయడం.. ఇలా రకరకాల విభాగాల్లో వాటికి శిక్షణ ఇచ్చాడు. పాపం ఎంత పని చేసినా సరిగ్గా తిండి కూడా పెట్టేవాడు కాదు. ఆ పనులు చేయలేక చాలా నీరసించిపోయేవి. దాంతో అవి.. 'మన నాయకుడు చెప్పిన మాటలు అప్పుడే విని ఉంటే ఈరోజు ఈ కష్టం తప్పేది. అనవసరంగా ఇబ్బంది పడుతున్నాం' అనుకుని బాధపడ్డాయి.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు

ఓహో! బుజ్జీ!!

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో మన శరీరానికి సంబంధించిన మరో పదం దాగి ఉంది. అవేంటో కనిపెట్టండి.

1. HAIRCUT
2. EYEBALL
3. SHAKEHAND
4. NAILPOLISH
5. FINGERPRINT

జవాబు: 1.HAIR 2.EYE 3.HAND 4.NAIL 5.FINGER

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం



శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ప్రవేశ పాసులు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం వద్ద పంపిణీ చేస్తారు.** ఇవి పరిమిత సంఖ్యలో ఉంటాయి. చిన్న పిల్లలకు అనుమతి లేదు. నేల పై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

-విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

పరిమిత సంఖ్యతో ప్రవేశ పాసుల పంపిణీ

సమయం:
ఈ రోజు (శనివారం)
సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ETV ఆంధ్రప్రదేశ్ | ETV తెలంగాణ | ETV Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 8న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.



జయహో...



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం.. మహిళా క్రికెటర్ శ్రీచరణికి శుక్రవారం గన్నవరం విమానాశ్రయంలో అభిమానులు, ప్రజాప్రతినిధులు అపూర్వ స్వాగతం పలికారు.

మాయా జూదం.. జోగి పాపం!

✦ ప్రధాన అనుచరుల కనుసన్నల్లో నిర్వహణ ✦ ఒకేచోట కాకుండా.. రోజుకోచోట కేంద్రాలు

ఈనాడు, అమరావతి



'నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జోగి రమేష్.. ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో.. పెడనలో జూద శిబిరాలు పెద్దఎత్తున నడిచాయి. రోజుకోచోట శిబిరాలు ఏర్పాటు చేస్తూ.. అక్కడికి పక్కా ప్రణాళికతో జూదరులను తీసుకొచ్చేవాళ్లు. జూదం అంటే పెడన అన్నట్లుగా మార్చేశారు. విజయవాడ, మచిలీపట్నంతోపాటు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, హైదరాబాద్ నుంచి కూడా ఇక్కడికి నిత్యం జూదరులు తరలివచ్చేవాళ్లు.'

'జూద శిబిరాల్లో నిత్యం కనీసం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకూ లావాదేవీలు జరిగేవి. ఈ శిబిరాల ద్వారా వచ్చే ఆదాయంలో.. జోగి రమేష్ ప్రతి నెలా రూ.5 లక్షల కమీషన్ తీసుకునేవారనే ఆరోపణలున్నాయి. పెడనకు చెందిన జోగి అనుచరుడైన ఓ వైకాపా నేత, ఆయన సోదరుడి కనుసన్నల్లో వీటిని నిర్వహించేవారు. ప్రధాన నాయకుడి అండతో.. పోలీసులు, ఇతర అధికారులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూసేవాళ్లు కాదు. వారికీ మామూళ్లు రంచనుగా అందడంతో పూర్తి సహకారం అందించేవారు.'

పెడన నియోజకవర్గంలోని.. బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల్లోని రహస్య స్థావరాల్లో జూద శిబిరాలను ఎక్కువగా నిర్వహించేవారు. ఒక్కో మండలంలో మళ్లీ అక్కడి స్థానిక వైకాపా నాయకుల కనుసన్నల్లో ఏర్పాట్లు చేసేవాళ్లు. వారంలో రెండేసి రోజులు ఒక్కో ప్రాంతంలో శిబిరాలు ఉండేవి. ఇక్కడ అత్యంత సురక్షితంగా జూదం ఆడుకోవచ్చనీ, ఎలాంటి పోలీసు దాడులు, ఇతర సమస్యలు ఉండవని.. జూదరులకు చెప్పి మరీ రప్పించేవాళ్లు. ఒకవేళ ఎప్పుడైనా పోలీసులు ఇటువైపు వస్తే.. వెంటనే సమాచారం ఇచ్చేందుకు.. శిబిరానికి చుట్టుపక్కల ఉండే దారులు అన్నింటిలోనూ కనీసం 2-3 కిమీ దూరంలో వేగులు ఉండేవాళ్లు.

24 గంటలూ నిరంతర శిబిరాలు..

పెడన మండలం నందిగామ శివార్లలో అత్యధికంగా జూద శిబిరాలు నడిపేవాళ్లు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరంగా ఈ శిబిరం కొనసాగేది. చుట్టుపక్కల మూడు జిల్లాల నుంచి జూదరులు ఇక్కడికి వచ్చి ఆడేవాళ్లు.

★ గూడూరు మండలం కోకనారాయణపాలెం లోనూ జోరుగా జూద శిబిరాలు నడిపారు. ఈ శిబిరాల్లో ఆడేవాళ్ల నుంచి ప్రత్యేక ఛార్జీలను సైతం వసూలు చేసేవాళ్లు. అదేమంటే.. పోలీసులు, నేతలకు భారీగా ఇవ్వాలని చెప్పేవారు. గూడూరు పరిధిలోని కంచాకోడూరు, కంకటావ, రాయవరం, నాగులేరు కాలువగట్ల వెంట ఉండే మామిడి తోటల్లో.. 24 గంటలూ నిరంతరం ఈ శిబిరాలు సాగేవి. ★ జూదమే కాదు.. ఖరీదైన మద్యం, భోజనాలు కూడా అందుబాటులో ఉంచేవాళ్లు. వచ్చేవాళ్లు పూర్తిగా ఇక్కడే రెండు మూడు రోజులు ఉండి ఆడుకుని వెళ్లేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ కల్పించేవాళ్లు.

రిజిస్ట్రేషన్ల అవకతవకలపై ప్రాథమిక నివేదిక

ఈనాడు - అమరావతి: ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులు సాగిన తనిఖీల్లో వెలుగుచూసిన అవకతవకలపై అవినీతి నిరోధక శాఖ ప్రాథమిక నివేదికను కేంద్ర కార్యాలయానికి పంపించింది. గత మూడు రోజుల్లో జరిగిన రిజిస్ట్రేషన్లపై దృష్టి సారించి, వాటిలో కొన్నింటిని సీజ్ చేసింది. వీటిని లోతుగా పరిశీలిస్తున్నారు. అవతల పార్టీలను పిలిపించి క్షుణ్ణంగా విచారించనున్నారు. రిజిస్ట్రేషన్ కోసం సిబ్బంది డబ్బులు తీసుకున్నారా? అని ప్రశ్నించనున్నారు. ఉద్యోగుల బ్యాంకు ఖాతాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే వారి యూపీఐ ఖాతాలు తనిఖీ చేశారు. కొన్ని డాక్యుమెంట్లను పరిశీలించగా స్టాంప్ డ్యూటీ తగ్గించి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లపైనా దృష్టి పెట్టారు. వీటిని ఎవరు చేశారు? ఇక్కడే ఎందుకు చేశారు? అనే కోణంలోనూ విచారిస్తున్నారు. అన్నీ కొలిక్కి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి నివేదికను అనిశా డీజీకి త్వరలో పంపించే అవకాశం ఉంది.

నేడు, రేపు విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట: రెండో శనివారం, ఆదివారం సెలవులైనా జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని విద్యుత్తు సంస్థ ఎస్ఈ యు.హనుమయ్య తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు ఈ అవకాశం వినియోగించుకుని ఈ రెండు రోజుల్లో తమ బిల్లులు చెల్లించాలని కోరారు.




సెల్ఫీ తీసుకున్న నిధి అగర్వాల్, ఈషా రెబ్బా

అందాల తారల సందడి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: నగరంలో అందాల తారలు నిధి అగర్వాల్, ఈషా రెబ్బాలు శుక్రవారం సందడి చేశారు. గవర్నర్‌పేటలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వారిద్దరినీ చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. హీరోయిన్లతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. నిధి అగర్వాల్, ఈషా రెబ్బాలు నృత్యాలతో అలరించారు. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజాసాబ్ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు వస్తుందని నిధి అగర్వాల్ వెల్లడించారు. మరో మూడు చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయని, అవి త్వరలో విడుదల అవుతాయని వివరించారు.

ప్రమాదకర వంతెన.. అదుపు తప్పితే వేదన..



జి.కొండూరులో ప్రధాన రహదారిపై వంతెనకు ఇరువైపులా రక్షణ గ్రిల్స్ విరిగిపోయాయి. ఏడాదిగా ఇదే పరిస్థితి ఉంది. అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

ముడితే కాణిస్తారు..చెడితే తిప్పిస్తారు..

- ఉమ్మడి జిల్లాలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు
- శ్రుతిమించుతున్న మధ్యవర్తుల దందా



ఈనాడు, అమరావతి

☛ **ఇబ్రహీంపట్నం** సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం రాత్రి వరకు ఏసీబీ తనిఖీలు జరిగాయి. అధికారుల తనిఖీల్లో రూ.74వేల వరకు లెక్కల్లో చూపని సొమ్ము ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు అనధికారికంగా ఉన్నట్లు గుర్తించారు. ఇదే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసిన ఓ అధికారి అగ్రిగోల్డ్ భూముల విషయంలో భారీగా అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడి ఏసీబీ తనిఖీల్లో పట్టుబడ్డారు.

☛ **నందిగామ డివిజన్** పరిధిలోని ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌పైన 2శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తే కమీషన్ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు వసూలు చేస్తే సాయంత్రం అధికారులు, సిబ్బంది కలిసి వాటాలేసుకుంటున్నారు. 'ఓ ప్రజాప్రతినిధికి రూ.50లక్షలు లంచం ఇచ్చి పోస్టింగ్ తెచ్చుకున్నాను. వసూలు చేసుకోకపోతే ఆ డబ్బులు నాకెవరిస్తారు' అంటూ బాహాటంగానే చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా జరుగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది, మధ్యవర్తులు కుమ్మక్కయి నిబంధనలు తంగలో తొక్కుతున్నారు. వ్యవస్థలోని చిన్నచిన్న లోపాలను ఆసరాగా చేసుకుని భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే రిజిస్ట్రేషన్ శాఖ లోపభూయిష్టంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది. ఏసీబీ తనిఖీలతో అక్రమార్కుల భరతం పట్టేందుకు రంగం సిద్ధం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో తనిఖీలు చేయగా.. గురువారం కూడా కొనసాగించారు.

మధ్యవర్తులదే దందా..

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు అన్ని కార్యాలయాల్లోనూ మధ్యవర్తులు చేసిందే శాసనం. వారు చెబితేనే రిజిస్ట్రేషన్ అన్నట్లు ఉంది. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం చుట్టూ తిష్ఠ వేసి అన్నీ తామై చక్కబెడుతున్నారు. కొన్నిచోట్ల వారే కార్యాలయ సిబ్బందిగా చలామణి అవుతున్నారంటే.. వారికి ఏ స్థాయిలో అధికారులు అండ ఉందో తెలుస్తోంది. వీరి ప్రమేయం లేకుండా కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించడం దాదాపు అసాధ్యమే. వెళ్లినా అడ్డగోలు నిబంధనలు చెప్పి పని చేయకుండా తిప్పలు పెట్టేస్తారు. భూమిలో ఉన్న భవనాలు, ఇతర నిర్మాణాలు ఉన్నా లేనట్టే. చలానా తీసి కథ నడిపించేస్తున్నారు. నెలకు సగటున ఇలాంటి రిజిస్ట్రేషన్లు వెయ్యికి పైగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయంలో గండి పడుతోంది. ఒక్కో అక్రమ రిజిస్ట్రేషన్‌కు రిస్క్‌ను బట్టి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు తీసుకుంటున్నారు. అధికారులు సబ్ రిజిస్ట్రేషన్ సిబ్బంది ఎక్కడా కనిపించకుండా వీరే చక్కబెట్టేస్తారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో వృద్ధురాలు మృతి

వైద్యుల నిర్లక్ష్యమని బంధువుల ఆందోళన.. ఉద్రిక్తత


గాయపడిన సుభాష్‌చంద్రబోస్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: సూర్యారావుపేటలోని ఓ గుండె ఆసుపత్రిలో వైద్యం కోసం చేరిన వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయారంటూ బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఆసుపత్రి సిబ్బంది, మృతురాలి బంధువులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా కలిదిండి మండలం [illegible]కు చెందిన గౌరావ వైదేహి(65)కి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సూర్యారావుపేటలోని గుండె ఆసుపత్రిలో చేర్పారు. డయాలసిస్ చేయాలని చెప్పి వైద్యులు రూ.2 లక్షలు కట్టించుకున్నారని బంధువులు చెబుతున్నారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో వైదేహి అకస్మాత్తుగా మృతి చెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. [illegible] ఆసుపత్రి సిబ్బంది దాడి చేయడంతో తలకు గాయమైందని సూర్యారావుపేట సీఐ [illegible] ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత ఇరువర్గాల రాజీకి రావటంతో గొడవ సద్దుమణిగింది. మృతదేహాన్ని తీసుకుని బంధువులు వెళ్లిపోయారు.

రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు

ఈనాడు-అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న తలారి రంగయ్య అలియాస్ రాజు (ఏ14) ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం విజయవాడలోని 8వ ఏడీజే కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ నిమిత్తం 12వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. లేబుళ్లను డిజైన్ చేసి, ప్రింట్ చేయించాడని సిట్ అధికారులు రంగయ్యను నిందితుడిగా చేర్చారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా అజ్ఞాతంలో ఉన్న సంగతి తెలిసిందే.


జ్యోతి వెలిగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

విద్యారంగానికి కీలకంగా రాష్ట్రం

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : వివిధ జాతీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలు తమ బ్రాంచులను రాష్ట్రంలో నెలకొల్పడం వల్ల దేశానికి విద్యారంగంలో తలమానికంగా నిలిచామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇంజినీరింగ్, వైద్య విద్య ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇచ్చే అలెన్ కెరీర్ ఇనిస్టిట్యూట్‌ను శుక్రవారం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంజీరోడ్డులోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ప్రతిష్ఠాత్మకమైన సంస్థగా పేరుగాంచిన అలెన్ విద్యాసంస్థ బ్రాంచిని విజయవాడలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. అలెన్ ఉపాధ్యక్షుడు, జోనల్ హెడ్ మహేశ్ యాదవ్ మాట్లాడుతూ 1988లో నెలకొల్పిన అలెన్ విద్యాసంస్థ దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ బ్రాంచులు ఏర్పాటు చేసిందని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. సంస్థ ఏపీ, తెలంగాణ సమన్వయకర్త సీతారాం నండూరి మాట్లాడుతూ జేఈఈ, నీట్ ఒలింపియాడ్ తరగతులు ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతాయని, నవంబరు 22న అలెన్ షార్ప్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నియంత్రణ

విజయవాడ (పాయకాపురం), న్యూస్‌టుడే: క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పక స్క్రీనింగ్ పరీక్షలు వ్యాధి నియంత్రణకు దోహదపడతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ...జీవనశైలిలో మార్పులతో వ్యాధులు నానాటికి పెరుగుతున్నాయని వివరించారు. అవగాహన లేమితో క్యాన్సర్ తీవ్రత పెరిగే వరకు గుర్తించకపోవడం వల్ల వ్యాధి నియంత్రణ చేయలేని పరిస్థితికి చేరుతోందని వివరించారు. క్యాన్సర్ బారిన పడిన వారికి రేడియో కీమో చికిత్సలు చేయాల్సి రావడంతో వ్యాధిగ్రస్థులతోపాటు వారి కుటుంబాలు ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ...క్యాన్సర్ వ్యాధి బారిన పడిన రోగులు సంఖ్య నానాటికి పెరుగుతన్న తరుణంలో ప్రజలలో అవగాహన కల్పించడమే ప్రధానమని తెలిపారు. గతంలో 50 నుంచి 60 సంవత్సరాలు పైబడిన వారిలో క్యాన్సర్ లక్షణాలు బయటపడేవని, ప్రస్తుతం పరిస్థితి మారిందన్నారు. విపరీతమైన శారీరక ఒత్తిడితోపాటు ఆహారపు అలవాట్లు క్యాన్సర్ వ్యాధికి కారణమవుతున్నాయని తెలిపారు. క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంపై అవగాహన కల్పించే గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌సీడీ అధికారి కె.శ్యామల, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ జి.సురేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని, ఎన్‌సీడీ నోడల్ అధికారి మాధవి, డీపీఎంవో పి.నవీన్, వైద్యాధికారులు స్నేహస మీరా, హఫీసా పాల్గొన్నారు.


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న వీరపాండ్యన్, జి.లక్ష్మీశ, ఎం.సుహాసిని తదితరులు

బలహీనవర్గాలకు చేయూతనివ్వండి



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: ప్రాధాన్య రంగాలతోపాటు బలహీన వర్గాల ఆర్థిక సాధికారితకు బ్యాంకులు చేయూతనివ్వాలని, వివిధ పథకాలు, కార్యక్రమాల కింద సంస్థాగత రుణ పద్ధతుల్లో వేగం పెంచాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపులు కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తలసరి ఆదాయంతోపాటు జిల్లా స్థూల దేశీయోత్పత్తిలో 18.5 శాతం వార్షిక అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. జిల్లాలో స్మార్ట్ అగ్రికల్చర్‌తోపాటు పాడి, ఉద్యాన, ఎంఎస్ఎంఈ రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టామని తెలిపారు. తొలివిడతగా 289 వ్యవసాయ డ్రోన్లు అందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ఇందుకు సహకరించాలని కోరారు. జిల్లాలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లకు, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. విజయవాడ మధ్య నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ....పీఎం సూర్యఘర్ దరఖాస్తులపై దృష్టి సారించాలని కోరారు. అధికారులు, బ్యాంకర్లతో కలిసి మీడబ్బు-మీ హక్కు నినాదంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీ-డీఎల్ఆర్ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.ప్రియాంక, ఆర్‌బీఐ అధికారి నవీన్, నాబార్డు డీడీఎం పృథ్వీ, ఆర్ సేటి డైరెక్టర్ అమరేశ్వర్‌రెడ్డి, ఎస్‌బీఐ రీజనల్ హెడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం స్ఫూర్తి చాటుదాం : మాధవ్


భూమిపూజ చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు

కరెన్సీనగర్ : విజయవాడ జయప్రకాష్ నగర్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యాలయం, విద్యార్థి వికాస సమితి కార్యాలయం నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రి భూపతి రాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేసే పనులకు అర్థం లేదని, ఆయన చేష్టలు పిల్ల చేష్టలుగా కనబడుతున్నాయని చెప్పారు. 1875వ సంవత్సరంలో వందేమాతరం గీతం బంకింగ్ చంద్ర చటర్జీ రచించారని, ప్రస్తుతం 150వ ఏడాదిలో ప్రవేశించామని పీవీఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో వందేమాతరం స్ఫూర్తి నింపాలన్నారు. భూమిపూజ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, ఏబీవీపీ అఖిల భారత సంఘటన్ ఆశిష్ చౌహాన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 193 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ఆర్థిక ప్రయోజనాల కోసమే సాయం చేశా!

- ☛ కస్టడీలో వెల్లడించిన నిందితుడు రవి
- ☛ కుట్ర వివరాలు రాబడుతున్న పోలీసులు
- ☛ నకిలీ మద్యం కేసులో ఏడుగురిని విచారించిన సిట్

ఈనాడు - అమరావతి



ఆర్థిక ప్రయోజనాలను ఆశించే తాను నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో జనార్దనరావు, జగన్మోహన్‌రావులకు సాయం చేసినట్లు నిందితుడు రవి విచారణలో వెల్లడించాడు. తనకు ఇద్దరితో పదేళ్ల నుంచి పరిచయం ఉందనీ, ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు రుణం ఇప్పించి సాయం చేశారని చెప్పాడు. ఐదు రోజుల కస్టడీలో భాగంగా సిట్, ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని విజయవాడలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో విచారించారు. రవితో పాటు మిగిలిన నిందితులు బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, రమేష్ బాబు, అల్లాబక్ష్‌లను కస్టడీకి తీసుకున్నారు. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న రవిని అదుపులోకి తీసుకుని.. అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి శుక్రవారం విజయవాడ తీసుకొచ్చారు. మిగిలిన వారిని విజయవాడ జైలు నుంచి తీసుకుని ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించారు. అనంతరం వీరిని ఎక్సైజ్ స్టేషన్‌లో వేర్వేరుగా విచారించారు.

డిస్టిలరీ ఏర్పాటులో తోడ్పాటు కోసం ఆఫ్రికాకు...

జగ్గయ్యపేటలో తనకు గతంలో పేపర్ మిల్లు ఉందనీ, నష్టాల కారణంగా జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పాడు. 2023లో జనార్దనరావుతో కలసి తాను గోవా వెళ్లానని విచారణలో అంగీకరించాడు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ యూనిట్ల ఏర్పాట్లలో కీలకంగా వ్యవహరించానని చెప్పాడు. జనార్దనరావుతోపాటు అంగోలా ఎందుకు వెళ్లావని పోలీసులు ప్రశ్నించగా.. డిస్టిలరీ ఏర్పాటు చేసేందుకు పరిశీలన కోసమే సెప్టెంబరు 25న వెళ్లినట్లు జవాబిచ్చాడు. ములకలచెరువు వ్యవహారం బయటకు రాగానే.. జనార్దనరావు సూచనల మేరకు తాను అతని కంటే ముందే ఇండియాకు వచ్చినట్లు ఇంటరాగేషన్‌లో వివరించాడు. సీసాలకు అంటించే లేబుళ్లను హైదరాబాద్‌లో డిజైన్ చేయించడంలో తిరుమలశెట్టి శ్రీనివాసరావు సాయం తీసుకున్నామన్నాడు. లావాదేవీల వివరాలను నిందితుడి ముందుంచి.. వివరాలను రాబట్టారు. లేబుళ్ల తయారీ చేసిన వారికి చెల్లించినట్లు చెప్పాడు.

వచ్చిన సొమ్ములో వాటాలు..

తాము ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీలో భాగంగా సీసాల్లోకి మద్యాన్ని నింపామని ఒడిశా కార్మికులు బాదల్ దాస్, ప్రదీప్ దాస్‌లు వెల్లడించారు. తమను జనార్దనరావు రెండు చోట్ల ఉపయోగించుకున్నాడని చెప్పారు. విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో మేనేజ్‌మెంట్ బాధ్యతలను పర్యవేక్షించిన కల్యాణ్.. నకిలీ మద్యం సీసాలను విక్రయించాడు. నకిలీ మద్యం సీసాలను ఎవరు సరఫరా చేశారని పోలీసులు ప్రశ్నించగా.. ఏఎన్ఆర్ బార్ నుంచి జగన్మోహన్‌రావు.. ఆటోల్లో పంపేవాడని వివరించాడు. నకిలీ సరకు అమ్మగా.. వచ్చిన సొమ్ములో వాటా పంచుకునే వారమన్నారు.

ఇళయరాజా మ్యూజికల్ నైట్‌కు పటిష్ఠ భద్రత


అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో 8న నిర్వహిస్తున్న ఇళయరాజా మ్యూజికల్ నైట్ కార్యక్రమం పురస్కరించుకొని శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రత, పటిష్ఠ బందోబస్తు పరిశీలించి భద్రతాపరంగా లోపం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ పరంగా సామాన్యులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తూర్పు డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు: 9063144762

? జి.కొండూరు గ్రామ శివారులో వివేకానంద పాఠశాల సమీపంలో మురుగుకాలువ నిరంతరం ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపైకి చేరడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. - **లోకేష్ గ్రామస్థుడు.** ✓ సమస్య తెలిసింది. పారిశుద్ధ్య సిబ్బందితో మురుగుకాలువ నీరు రహదారిపైకి రాకుండా చర్యలు చేపడతాం. - **బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, జి.కొండూరు ★ పట్టణంలోని 2వ వార్డులో గల డ్రైనేజీలో మట్టి పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికులు వెంకటేశ్వరావు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని 4వ వార్డులోని కాలువల్లో మురుగు పారక దోమల బెడద ఎక్కువైందని స్థానికుడు రహీం చేసిన ఫిర్యాదుపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

ఖోఖోలో ప్రతిభ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన అండర్17 ఖోఖో పోటీల్లో మండలంలోని నరసాపురం డా అంబేడ్కర్ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎస్ సుకన్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్యామల తెలిపారు. శుక్రవారం విద్యార్థినిని అభినందించారు.

జూదశిబిరంపై దాడి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నాగులూరు గ్రామంలో మామిడి తోటలో జరుగుతున్న జూద శిబిరంపై గురువారం రాత్రి దాడి చేసినట్లు పోలీస్ సిబ్బంది తెలిపారు. ఈ దాడిలో 10మందిని పట్టుకొని వారి వద్ద రూ.3,35,530లు, నాలుగు కార్లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రైనీ ఎస్సై ఎం.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి

జి.కొండూరు: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల తహసీల్దార్ చల్లా వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సొసైటీ ఆవరణలో మండల ఏవో సూరిబాబుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేసే సిబ్బందికి శుక్రవారం శిక్షణ కల్పించారు. ప్రమాణాలు పాటిస్తూ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు, సాంకేతిక సిబ్బంది, వీఆర్వోలు, వీఏవోలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్.జి.రంగా సేవలు మరువలేనివి

గొల్లపూడి: స్వాతంత్ర్య సమరయోధునిగా, జాతీయవాదిగా, రైతు నాయకుడిగా ఎన్.జి. రంగా విశిష్ట సేవలు అందించారని మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఎన్.జి.రంగా జయంతిని పురస్కరించుకుని గొల్లపూడిలోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఉద్యమాలు చేశారని, దేశ వ్యవసాయ రైతాంగాన్ని చైతన్య పరిచారని కొనియాడారు. ★ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నాయకులు ఎన్.జి.రంగా విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

క్యాన్సర్‌పై అవగాహన ప్రదర్శన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన పీహెచ్‌సీ నుంచి కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్.కీర్తి క్యాన్సర్ పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్యాంసుందరరావు, సూపర్‌వైజర్ రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చిత్తులాట

వందలాది మంది పోగై జూద శిబిరాల నిర్వహణ

మైలవరం, న్యూస్‌టుడే

అది అటవీ ప్రాంతం.. ద్విచక్ర వాహనాలు మినహా రవాణా సౌకర్యం సరిగా లేని భూభాగం. పైగా మైలవరం, నూజివీడు నియోజకవర్గాల మధ్యనున్న ఏరియా. పోలీసులు కార్తిక పౌర్ణమి బందోబస్తులో ఉన్నారనుకున్నారేమో.. ఈ క్రమంలో ఓ ప్రాంతాన్ని ఎంచుకున్న జూద నిర్వాహకులు, చరవాణుల ద్వారా జూదగాళ్లకు సమాచారమిస్తున్నారు. గంట వ్యవధిలో వందలాది మంది పోగవుతూ పొద్దుపోయే వరకు చిత్తులాట సాగిస్తున్నారు. ఇదంతా పోలీసులకు తెలిసిపోయింది.. గుట్టుచప్పుడు కాకుండా మెరుపుదాడి చేశారు. కొందరు పరారవగా, చిక్కిన 9 మందిని, 49 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మైలవరం తరలించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల సరిహద్దున గల పోలవరంనగర్ అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు.


గురువారం పోలవరంనగర్‌లో పోలీసులకు దొరికిన జూదరులు

ప్రజాప్రతినిధుల పేర్లు చెబుతూ..

కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలతో నియంత్రించినా జూదశిబిరాలు ఒకింత తిరిగి పురుడు పోసుకుంటోంది. జూదశిబిరాల నిర్వహణలో ఆరితేరిన వ్యక్తులు, సరిహద్దులను ఎంచుకుని చెలరేగిపోతున్నారు. సాగనంతసేపు దర్జాగా, ఎవరైనా దాడికి వస్తే.. మాకు వాళ్లు.. వీళ్లు తెలుసంటూ.. పక్క ప్రాంత ప్రజాప్రతినిధుల పేర్లతో బుకాయిస్తున్నారు. గురువారం మైలవరం మండలంలో ఇదే జరిగింది. మండలంలోని పోలవరంనగర్, ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని సుంకొల్లు మధ్య ఉన్న ప్రాంతంలో శిబిరంపై మైలవరం పోలీసులు దాడి చేయగా, పెద్ద ఎత్తున వాహనాలు పట్టుబడ్డాయి. అయితే నిర్వాహకులు నూజివీడు మండలానికి చెందిన వ్యక్తులు కావడంతో, శిబిర ప్రాంతం మా పరిధిలోనే, మీరెవరంటూ పోలీసులను బుకాయించారు. ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల పేర్లను ఉటంకించారని వినికిడి. వారి బెదిరింపులను పట్టించుకోని పోలీసులు దొరికినవారిని పట్టుకొచ్చి మైలవరంలో కేసు నమోదు చేశారు. అదే రోజు రెడ్డిగూడెం మండలం నాగులూరులో పోలీసులు నిర్వహించిన దాడిలో 'అంతకుమించి' చందంగా దాదాపు రూ.3 లక్షలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రవేశానికి రూ.500..

ప్రత్యేక జూదశిబిరాల్లో ప్రవేశానికి, ప్రవేశ రుసుం ఒక్కొక్కరికి రూ.500లుగా నిర్ణయిస్తున్నారు. నిత్యం 80 నుంచి 100 వరకు ఆటకు వస్తున్నారని సమాచారం. ఇదే తరహాలో సరిహద్దులను ఎంపిక చేసుకుని, అవసరాన్ని బట్టి ప్రాంతాలను మారుస్తున్నారు. ఉదయం నుంచి చిత్తులాటగా, మధ్యాహ్నం తర్వాత జూదంగా సాగుతూ.. వందల మంది బలవుతున్నారు.

అనుమతులు లేవు

జూద నిర్వాహకులు పోలీసుల నుంచి ఎటువంటి అనుమతులు ఉండవు. ఇటువంటి ప్రవర్తనాన్ని నమ్మి వెళ్తే చట్టపరంగా శిక్ష తప్పదు. జూదశిబిరాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాం. - కె.సుధాకర్, మైలవరం ఎస్సై

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని చంద్రాల, గణపవరం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 8న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గణపవరం, కీర్తిరాయుని గూడెం, చంద్రాల, టి.గన్నవరం, ఎదురుబీడెం, కనిమెర్ల, పోరాటనగర్ గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సూరాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రెండు గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎస్ ప్రాంతం, దింటబడి పోలు ప్రాంతం, వక్రలతలాలి ప్రాంతం, దత్త కళ్యాణమండపం రోడ్డు, అయ్యప్పస్వామి గుడి ప్రాంతం, మరకాడ చర్చి ప్రాంతం, గంగానమ్మ ఆలయం ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 9:30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ


అనిల్

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం ఠాణా నూతన ఎస్సైగా నియమితులైన గుడివాడ అనిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ నేర విభాగం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆనికకు స్వాగతం పలికారు.

ఎ.కొండూరు: ఎ.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్సైగా నియమితులైన జి.మహాలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నున్న క్రైం ఎస్సైగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.


మహాలక్ష్మి

కిడ్నీ వ్యాధి బాధితులకు ఆరోగ్య పరీక్షలు


ఎ.కొండూరు పీహెచ్‌సీలో కిడ్నీ వ్యాధిపై పరీక్షలు చేస్తున్న డాక్టర్ సరిత

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కలెక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాలతో శుక్రవారం ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూత్రపిండాల వ్యాధి బాధితులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఓ కార్పొరేట్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ సరిత పాల్గొని మండలంలోని పలు తండాలకు చెందిన 50 మందికి కిడ్నీ వ్యాధికి సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీలో నిర్ధారణ పరీక్షలకు సిఫార్సు చేశారు. ఎ.కొండూరు, తిరువూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో కూడా వ్యాధి బాధితులు ఉన్నట్లు గుర్తించారు. శిబిరంలో పాల్గొన్న వారికి తెదేపా నాయకుడు జి. కృష్ణారెడ్డి భోజన సదుపాయం కల్పించారు.

ఇకపై ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్


దివ్యాంగురాలి సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు తిరువూరు నియోజకవర్గంలో ఇకపై ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం తిరువూరులో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ దృష్టికి వచ్చిన పలు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే, అధికారులకు 244 వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అనేక రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి అభ్యర్థనలు చేశారన్నారు. గృహ, రహదారుల నిర్మాణాలు, తాగునీరు, శ్మశానవాటికలు సదుపాయం కల్పించాలని ప్రజలు కోరారన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఆయా శాఖలకు పంపించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను కోరతానన్నారు. ఇకపై ఒక్కో శుక్రవారం ఒక్కో మండలంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే వారం గంపలగూడెంలో ఉంటుందన్నారు. పురపాలిక ఛైర్‌పర్సన్ కె.నిర్మల, కమిషనర్ కె.మనోజ, తహసీల్దార్లు రాజకుమారి, లక్ష్మీకల్యాణి, నాగమణి, ఎంపీడీవో రవిబాబు, చిన్నరాట్నాలు .

త్వరితగతిన ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాదర్బార్‌లో 190 అర్జీలు


పింఛను రావడంలేదని చెప్పిన మహిళ వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే: 'సార్ మాకు ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నాం. స్థలమిస్తే ఇల్లు కట్టుకుంటాం..' కొండూరు మహిళల వినతి. 'ఎప్పటి నుంచో నివాసం ఉంటున్నా స్థలానికి పట్టా ఇవ్వడంలేదండీ..' మరో బాధితుడి ఫిర్యాదు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నిర్వహించిన ప్రజాదర్బార్ ఇలాంటి ఫిర్యాదులకు వేదికగా నిలిచింది. ఉదయం 10 గంటల తర్వాత ఆయనే స్వయంగా అర్జీల స్వీకరణ ప్రారంభించగా 190 దరఖాస్తులు వచ్చాయి. అందులో సుమారు 50 మంది వరకు ఇళ్ల స్థలాల కోసం విజ్ఞప్తి చేయగా, కొండూరు పొలాలకు దారులు, పట్టాల కోసం వినతులు అందించారు. పింఛన్ల కోసం ఫిర్యాదు చేసిన వారి వివరాలపై ఆరా తీసి సమగ్రపరిశీలన చేయాలని, త్వరితగతిన సమస్య తీర్చేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నివేశన స్థలాల పంపిణీ త్వరలో ప్రారంభించే అవకాశం ఉందని, ఆ సమయంలో అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. నిధుల విడుదలతో ముడిపడిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఎంపీడీవో అనురాధ, సీఐ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపిక


బాలికలతో వ్యాయామోపాధ్యాయులు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు తిరువూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు బాలికలు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు గుడివాడ సుకన్య, బొలగాని జయలక్ష్మి శుక్రవారం తెలిపారు. కృష్ణా జిల్లా గూడూరు ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో బేస్‌బాల్‌లో అండర్-14లో ఇ.గాయత్రి, జి.గౌతమి, అండర్-17లో ఎం.చరిష్మా, జి.గీతాభవిష్య, సాఫ్ట్‌బాల్‌లో అండర్-14లో కె.లాస్య, అండర్-17లో ఎం. మయూరి సత్తాచాటారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. హెచ్ఎం పీఎన్ఎస్.రాజు, ఉపాధ్యాయులు సిబ్బంది బాలికలను అభినందించారు.

'పెట్టుబడులు అడ్డుకునేందుకు జగన్ కుట్రలు'

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో కుట్ర రాజకీయాలను జగన్ నడిపిస్తున్నారని విమర్శించారు. దేశ, విదేశాల నుంచి పెట్టుబడిదారులు ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆసక్తి కనబరుస్తుంటే, జగన్ మాత్రం ద్వేషపూరిత వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైకాపా ఐదేళ్ల కాలంలో అవినీతి, మత్తుపదార్థాలు, నాసిరకం మద్యం విచ్చలవిడిగా తయారు చేసి రూ.వేల కోట్లు దోచుకున్నారని పేర్కొన్నారు.

తొలగిస్తే విద్యార్థులను కాపాడినట్లే


రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ప్రహరీ పక్కన ప్రమాదకరంగా ఎండిన చెట్టు కొమ్మలు

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల దగ్గర ఎండిన చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. ప్రహరీ పక్కన ఉన్న ఈ కొమ్మలు తారురోడ్డువైపు వాలి ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే విజయవాడ వయా రెడ్డిగూడెం విస్సన్నపేట ఆర్అండ్‌బీ మార్గంలో పొరపాటున పడితే ప్రమాదాలు తప్పవని వాహన చోదకులు వాపోతున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు తిరుగుతూ ఉంటారని త్వరితగతిన తొలగించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

గుంతలు.. తప్పని పాట్లు



మండలంలోని నరసాపురం నుంచి చిన్నంపేట వెళ్లే రహదారిపై గోతులు ఏర్పడి ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు వాపోతున్నారు. రాత్రుళ్లు గుంతలు కనిపించకపోవడంతో పలు ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వాటి నుంచి దోమలు వృద్ధి చెంది అల్లాడిస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి మరమ్మతులు చేపట్టి సమస్య తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

గుంపులుగా తిరిగేస్తాం.. కరిచేస్తాం


కొటికలపూడిలో ఓ వీధిలో ఇలా

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కల సంతతి రోజురోజుకు పెరుగుతోంది. చిన్నారులు, మహిళలు, వృద్ధులపై ఎగబడి కరుస్తున్నాయి. కుక్కకాట్లతో సగటున గ్రామానికి ఐదు మంది చొప్పున ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొటికలపూడిలో వీధి కుక్కల దాడితో మూడు లేగదూడలు మృతిచెందాయి. మూలపాడు పశువైద్యశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించి కుక్కకాట్లకు గురైన పశువులకు యాంటీ రేబీస్ టీకాలు వేశారంటే సమస్య తీవ్రత తెలుస్తోంది. వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

బాగుచేస్తే మీరు.. అవస్థలు తీరు..



ఆత్కూరు గ్రామ శివారు సావరాల చెరువుకు చేరుకునే డొంక రోడ్డు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో దర్శనమిస్తోంది. ప్రధాన రహదారి నుంచి కిలోమీటర్ మేర ఉన్న డొంకరోడ్డుపై నిత్యం రైతులు, కూలీలు తమ పొలాలకు వ్యవసాయ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పోయి విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు జంగిల్ క్లియరెన్స్ చేపట్టి గ్రావెల్‌తో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, జి.కొండూరు**

ధ్రువపత్రాల అందజేత


విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు

మైలవరం, న్యూస్‌టుడే: లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన భూసార పరీక్షలపై కార్యశాల శుక్రవారం ముగిసింది. పరీక్షలకు సంబంధించి ఏరీస్ ఆగ్రో సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయా అంశాలపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇల్లా రవి, రసాయనశాస్త్ర, బోటనీ విభాగాధిపతులు ఫణికుమార్, రాముడు, అధ్యాపకులు ఏరీస్ సంస్థ ఆర్ఎం అశోక్, ఆర్అండ్‌డీ రాధిక తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెరుగుదల


నవధాన్యాల కిట్లతో రైతులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లను ఏవో డి.శ్రీనివాసరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరికోతల తర్వాత నవధాన్యాలు చల్లడం వల్ల భూమిలో జీవం ఉంటుందన్నారు. ఎకరానికి 12 కేజీల నవధాన్యాలు రబీలో వేసుకొని 45 రోజులు తర్వాత పశువులకు మేతగా వాడుకోవచ్చని, అనంతరం భూమిలో దున్నేయవచ్చని సూచించారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది భూపతి, మహేష్‌రెడ్డి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్లు లేనివారిని గుర్తించి.. నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీవో టి. కె.వి.రమణ తెలిపారు. శుక్రవారం రెడ్డిగూడెం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చెత్త సేకరణకు పంచాయతీ సిబ్బంది వస్తున్నారా లేదా.. అని ఆరాతీశారు. వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ మాట్లాడుతూ..సంఘాలు సమావేశాలు నిర్వహించి ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను సభ్యులకు తెలియజేయాలని, నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం నాగబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శిరీష, కార్యదర్శి ఎన్. సీతామహాలక్ష్మి, కోశాధికారి ఎన్.సుజాత, ఎంఎస్ ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మీ, సీసీలు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వివాహిత బలవన్మరణానికి చరవాణియే కారణమా..? అవును అంటున్నాయి వెలుగులోకి వచ్చిన సంఘటనలు. ఇందుకు సంబంధించి సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నానికి చెందిన ఎం.జ్యోతి(36)కి అదే గ్రామానికి చెందిన సాయికుమార్‌తో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ఇతను పురపాలిక పారిశుద్ధ్య వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. చరవాణి విషయంలో కొంతకాలంగా భార్యాభర్తలకు చిన్నపాటి వివాదాలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే శుక్రవారం ఇద్దరు పిల్లలను గుంటుపల్లిలోని బంధువుల ఇంట్లో జ్యోతి వెళ్లిపోయింది. అనంతరం రాయనపాడు ఖాళీ ప్లాట్లలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకొన్న పోలీసులు కేసు నమోదు చేసి పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: వచ్చే మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షల దృష్ట్యా విస్సన్నపేట మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాలను జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకులు ఎస్ రాంబాబు, ఏఎస్‌వో శంకర్, మండల విద్యాశాఖాధికారి ఈ సుధాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్‌లకు సూచించారు. కార్యక్రమంలో అధికారులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భావనమ్మకు బోనాల సమర్పణ


బోనాలతో మహిళలు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్ సమీపంలో ఉన్న భావనమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శాలివాహన బజార్‌కు చెందిన మహిళలు పసుపు, కుంకుమ, సారెను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అంకసేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న తెదేపా నాయకులు

చింతలనర్వ(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని చింతలనర్వకు చెందిన మోదుగు శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబానికి శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం ఎమ్మెల్యే పంపించిన నగదును స్థానిక తెదేపా నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి 'వందేమాతరం'


గంపలగూడెం: తోటమూలలో

న్యూస్‌టుడే, బృందం: వందేమాతరం గేయానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉద్యోగులు సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. గంపలగూడెం మండలం తోటమూలలో గీతాంజలి విద్యార్థులు 150 మీటర్ల పొడవైన త్రివర్ణ పతాకంతో ప్రదర్శన చేశారు. ✦ మైలవరంలోని ర.భ. కార్యాలయంలో ఉద్యోగులు, ఎల్బీఆర్‌సీఈ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గీతాలాపన చేశారు. ✦ ఎన్టీటీపీఎస్‌లో ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు వందేమాతరం గీతం ఏర్పడడానికి కారణాలు, రచించిన విధానం, ఈ గీతాన్ని ఆలపించిన మహనీయుల గురించి వివరించారు.


విస్సన్నపేట: గౌరంపాలెం చిన్నారుల ప్రదర్శన


కొండపల్లి బాలికల పాఠశాలలో ప్రతిజ్ఞ


మూలపాడు పాఠశాలలో భారతదేశం ఆకారం


తిరువూరు: గేయం ఆలపిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

విస్సన్నపేట: భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఎ.డి మోహన్, డి.ఐ.ఓ.ఎస్ సారంగపాణి సర్వేయర్లకు, సిబ్బందికి సూచించారు. తాతకుంట్లలో జరుగుతున్న భూముల సర్వేను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యాలయంలో కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసిన రికార్డులను తనిఖీ చేశారు.

వార్డు సచివాలయం సేవలపై శిక్షణ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు, సీఎస్ఈ అభ్యసిస్తున్న ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం స్థానిక 8వ వార్డు సచివాలయంలో ఆన్‌జాబ్ కోసం ప్రత్యేక శిక్షణ తరగతి నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: తిరువూరు మండల శాఖ యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై ఎన్నికల్లో పాల్గొన్నారు.

నిందితుల ఆస్తులు జప్తు చేయాలి

గంపలగూడెం, తిరువూరు: కల్తీ మద్యం కేసులో సూత్రదారి మాజీ మంత్రి జోగి రమేష్‌తో పాటు నిందితులుగా ఉన్న ఆయన బినామీలను జైలుకు పంపించడంతో పాటు వారి ఆస్తులను కూడా జప్తు చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరువూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం తయారీని ఎన్డీయే పాలనలో కూడా అమలు చేసి అబాసుపాలు చేయడానికి కుట్రపన్నారని ఆరోపించారు.

ఏపీఐఐసీ బోర్డుకు 15 మంది నామినీ డైరెక్టర్ల నియామకం

ఈనాడు, అమరావతి: ఏపీఐఐసీ బోర్డులో నామినీ డైరెక్టర్లుగా 15 మందికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నియామక తేదీ నుంచి రెండేళ్ల పాటు వారు పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ వీసీఎండీని ఆదేశించింది.

డైరెక్టర్ పేరు	నియోజకవర్గం
భాస్కరరెడ్డి	రాయచోటి
రామకృష్ణ	మడకశిర
లక్ష్మీప్రసాద్	అనంతపురం
చంద్రశేఖర్	భీమవరం
జగదీష్‌గుప్తా	కర్నూలు
పెద్దిరాజు	రంపచోడవరం
గోపాలరావు	పాలకొల్లు
ప్రేమ్‌కుమార్	కుప్పం
మాధవి	ఆత్మకూరు
చిరంజీవి	మంగళగిరి
రాజేష్	అవనిగడ్డ
నారాయణస్వామి మహేష్	మదనపల్లె
ప్రసాదరెడ్డి	బద్వేలు
సంతోష్‌కుమార్	పాణ్యం
సత్యనారాయణ	రాజమహేంద్రవరం గ్రామీణ

వైకాపా ఫేక్ ప్రచారాలను తిప్పికొట్టండి

● కళ్యాణదుర్గం కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అనంతపురం: కూటమి ప్రభుత్వం 16 నెలల్లో చేసిన మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. 'వైకాపా ఫేక్ ప్రచారాలను నమ్ముకుని రాజకీయం చేస్తోంది. చేసింది చెప్పుకోలేకపోవడమే తెదేపా బలహీనత. వైకాపా నాయకులు చేయనిదాన్ని కూడా బలంగా చెబుతున్నారు' అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "అనంతపురం జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కియా మోటార్స్ తీసుకొచ్చినా ప్రజలకు చెప్పుకోలేకపోవడంతో 2019లో ఓడిపోయాం. అధికారంలో ఉన్నప్పుడు ఒత్తిడి ఉంటుంది. పార్టీ శాశ్వతం అన్న విషయాన్ని కార్యకర్తలు మరువద్దు' ' అని లోకేశ్ సూచించారు. ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందించారు. కాశీబుగ్గ ఘటనపైనా వైకాపా శవరాజకీయాలు చేసిందని మండిపడ్డారు. క్రికెటర్ శ్రీచరణిని మూణ్నెల్ల క్రితం విశాఖలో కలిసి బాగా ఆడాలని ప్రోత్సహించానని, ప్రపంచకప్ గెలిచాక రివార్డు ఇవ్వాలని అనుకునేలోపే వైపాకా నాయకులు కులం ప్రస్తావన తెచ్చారని అన్నారు. భవిష్యత్తులోనూ కూటమి పార్టీలు మూడూ కలిసే ఉంటాయని స్పష్టం చేశారు.




కళ్యాణదుర్గంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, గుంటూరు మేయర్ రవీంద్రబాబు, మంత్రి టీజీ భరత్ ★ హాజరైన తెదేపా శ్రేణులు

మద్యం నిందితులకు 21 వరకు రిమాండ్ పొడిగింపు

● ఉత్తర్వులు ఇచ్చిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. శుక్రవారంతో రిమాండ్ గడువు ముగియనుండటంతో వారిని న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం.. నిందితులకు ఈ నెల 21 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ సందర్భంగా దర్యాప్తు అధికారి శ్రీహరిని కేసు పురోగతి గురించి న్యాయాధికారి పలు ప్రశ్నలు అడిగారు. చెన్నైలోని భూములను గుర్తించారా? వెంకటేశ్ నాయుడు సెల్‌ఫోన్‌లో డేటా ఏమైంది? దర్యాప్తులో పురోగతి ఏమైనా ఉందా? అని అడిగారు. కొన్నింటిని స్వాధీనం చేసుకుంటున్నామని దర్యాప్తు అధికారి బదులిచ్చారు. డేటా వివరాలు ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి రావాల్సి ఉందన్నారు. ఈ కేసులో అరెస్టైన 12 మంది నిందితుల్లో ఐదుగురికి న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. వారిలో గోవిందప్ప బాలాజీ కోర్టుకు రాలేదు. హాజరు నుంచి మినహాయింపు కోసం గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు. విజయవాడ, గుంటూరు కారాగారాల్లో ఉన్న మిగిలిన నిందితులను బందోబస్తు మధ్య కోర్టుకు తీసుకొచ్చారు. రిమాండ్ విధించిన అనంతరం తిరిగి వీరిని కారాగారాలకు తరలించారు.

◆ తాను ఎస్పీవై డిస్టిలరీస్ నుంచి ఎప్పుడో బయటకు వచ్చేశానని, ఆ కంపెనీతో తనకు సంబంధం లేదని నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. దీనిపై ప్రత్యేక పిటిషన్ దాఖలు చేసుకోవాలని సజ్జలకు న్యాయాధికారి సూచించారు.

◆ తనను చూసేందుకు వచ్చిన కుటుంబసభ్యులతో వైకాపా నేత, నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోర్టు బయట మాట్లాడారు. భోజనం తర్వాత తిరిగి జైలుకు వెళ్లేటప్పుడు తల్లికి సాష్టాంగ నమస్కారం చేశారు.

◆ వెంకటేశ్ నాయుడు, బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై ప్రాసిక్యూషన్ కౌంటర్లు దాఖలు చేసేందుకు వీలుగా ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారు. బెయిల్ షరతులను సడలించాలని నిందితుడు బాలాజీ గోవిందప్ప పిటిషన్ వేశారు. ఇది 21వ తేదీకి వాయిదా పడింది. సిట్ అధికారులు తన కుటుంబసభ్యులను వేధిస్తున్నారని పైలా దిలీప్ పిటిషన్, హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో సీజ్ చేసిన రూ.11 కోట్లకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజ్ ఇవ్వాలని రాజ్ కెసిరెడ్డి పిటిషన్లపై విచారణ ఈ నెల 21కి వాయిదా పడింది.



కోర్టు వద్ద చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్ కెసిరెడ్డి

వివేకా హత్యోదంతంలో..

తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు

ఈనాడు, కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో న్యాయం కోసం పోరాడుతున్న ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డితో పాటు అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పై తప్పుడు కేసు నమోదుచేసిన ఇద్దరిపై పులివెందుల పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదుచేశారు. ప్రస్తుతం రాజుపాళెం ఏఎస్సైగా ఉన్న రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డిపై ఈ మేరకు కేసు నమోదైంది. వైకాపా హయాంలో సునీత తదితరులపై తప్పుడు కేసులు నమోదు చేయడంపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్రంగా ఆక్షేపిస్తూ ఆ కేసులను క్వాష్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో అప్పట్లో తప్పుడు కేసులు పెట్టిన వారిపై విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను ఆదేశించింది. 8 నెలల పాటు దర్యాప్తు చేసి, మొత్తం 22 మంది సాక్షులు, అనుమానితులు, పోలీసు అధికారులను డీఎస్పీ బృందం విచారించింది. వైఎస్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి ఆ సమయంలో విధులకు గైర్హాజరై, పోలీసు అధికారులను తన ఇంటికి పిలిపించుకుని తప్పుడు కేసులు నమోదు చేసేలా వ్యవహరించారు. అప్పటి ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డిని (ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు) కూడా రంగంలోకి దింపారని పోలీసులు గుర్తించారు. ఈ విషయమై పులివెందుల కోర్టులో క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత వీరిద్దరిపై కేసు నమోదుచేశారు.

దిల్లీ చేరిన సైబర్ నేరాల బాధితులు

● అందులో తెలుగు రాష్ట్రాల వారు 23 మంది

ఈనాడు, దిల్లీ: మయన్మార్, థాయ్‌లాండ్, కాంబోడియాల్లో అంతర్జాతీయ సైబర్ నేరాల నెట్‌వర్క్ ఉచ్చులో చిక్కుకున్న 270 మంది భారతీయులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రత్యేక విమానంలో మయన్మార్ నుంచి దిల్లీకి తీసుకొచ్చింది. ఇందులో తెలంగాణ వారు 12 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 11 మంది ఉన్నారు. వీరిని గ్రేటర్ నోయిడాలో ఐటీబీపీ అధికారులు రెండు తెలుగు రాష్ట్రాల రెసిడెంట్ కమిషనర్లకు అప్పగించారు. అనంతరం 23 మంది యువకులను దిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌లకు తీసుకొచ్చారు. తర్వాత స్వరాష్ట్రాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. బాధితుల్లో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, కడపకు చెందినవారు ఉన్నారు. అధిక జీతంతో కూడిన ఉద్యోగాల ఆశచూపి మయన్మార్‌కు పిలిపించుకున్న నెట్‌వర్క్.. తీరా అక్కడికెళ్లాక బందీలుగా ఉంచి చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ కార్యకలాపాల్లో పాల్గొనేలా వారిని బలవంతపెట్టినట్లు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఇలాంటి వారు ఇంకా చాలా మంది ఉన్నారని, వారిని కూడా రక్షించడానికి కేంద్ర విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రత్యేక రైళ్లలో బెర్తులు బుక్ చేసుకోవాలి: ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: జోన్ పరిధి నుంచి రాకపోకలు సాగించే 31 ప్రత్యేక రైళ్లలో బెర్తులు ఖాళీగా ఉన్నాయని, రిజర్వేషన్ అవసరమైన ప్రయాణికులు ఆ రైళ్లలో టికెట్లు బుక్ చేసుకోవాలని ద.మ.రైల్వే సూచించింది. ప్రయాణ తేదీలు రైళ్లను బట్టి నవంబరు 8 నుంచి 13 వరకు ఉన్నాయి. చర్లపల్లి నుంచి విశాఖపట్నం, ధర్మవరం, నర్సాపూర్, తిరుపతి, కాకినాడ, దానాపూర్, సికింద్రాబాద్ నుంచి అనకాపల్లి, మహబూబ్‌నగర్ నుంచి రాజ్‌కోట్, లింగంపల్లి నుంచి కాకినాడ, కాచిగూడ నుంచి తిరుపతి, తిరుపతి నుంచి చర్లపల్లి, నర్సాపూర్ తదితర రూట్లలో ఈ రైళ్లు ఉన్నాయి. వీటితో పాటు స్లీపర్ బోగీల్లోనూ బెర్తులు ఖాళీగా ఉన్నాయని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సోషలిజానికి పెరుగుతున్న ఆకర్షణ

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న రాఘవులు. వేదికపై డీవీ కృష్ణ, కల్యాణ్, బాబూరావు, కాశీనాథ్, శ్రీదేవి, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు

విజయవాడ (రామవరప్పాడు కూడలి), న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా సోషలిజంపై ఆకర్షణ పెరుగుతోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు నిర్వహించారు. అనంతరం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 'సోషలిజం కొత్తతరం-సామ్రాజ్యవాద ప్రమాదం' అంశంపై జరిగిన సభలో రాఘవులు మాట్లాడారు. సోవియట్ యూనియన్ పతనాన్ని చూపించి పెట్టుబడిదారీ విధానం భరించాల్సిందేనని ప్రజలు భావించారని, ఇప్పుడు అదే ప్రపంచం సోషలిజం వైపు మళ్లుతోందని చెప్పారు. న్యూయార్క్‌లో సోషలిస్ట్ జోహ్రాన్ మమ్దానీ ట్రంప్‌ను వ్యతిరేకించి గెలవడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోషలిజంలో ఇల్లు, తిండి, ఉపాధి, జీవనభృతి, సాంఘిక భద్రత అన్నీ హక్కులుగా ఉంటాయని, స్త్రీలకు సమానత్వం, రక్షణ ఉంటుందన్నారు. మన దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక అదానీ, అంబానీ ఆస్తులు వందల రెట్లు పెరిగాయని, కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ శ్రమకు తగిన వేతనం, ఉపాధి, జీవన భద్రత సోషలిజం వల్లే సాధ్యమన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, నాయకులు కె.శ్రీదేవి, ఎస్‌కే హుస్సేన్, శ్రీనివాసరావు, పీవీ ఆంజనేయులు, కె.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కార్యకర్తలు

కమ్యూనిస్టులు పునరేకీకరణ కావాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఈనాడు, అమరావతి: మహా విప్లవం స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులంతా పునరేకీకరణ కావాలని, కలిసికట్టుగా ఒక నూతన శక్తిని కూడగట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ఆకాంక్షించారు. విజయవాడ దాసరిభవన్‌లో శుక్రవారం అక్టోబరు విప్లవ వార్షికోత్సవం నిర్వహించారు. "1917లో అక్టోబరు మహా విప్లవం జరిగి నవంబరు 7న రష్యాలో మొదటిసారి శ్రామిక రాజ్యం ఏర్పాటైంది. అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్‌గా కమ్యూనిస్టు మూలాలున్న డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించారు. నేపాల్‌లో ఉమ్మడిగా తొమ్మిది కమ్యూనిస్టు పార్టీల ఐక్యతతో ముందుకు సాగడం శుభపరిణామం. కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాలని మన దేశంలోనూ కోట్ల మంది కష్టజీవులు, వామపక్ష పార్టీలు కోరుకుంటున్నాయి. దేశంలో వందేళ్ల చరిత్ర ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉంది. డిసెంబరు 26న ఖమ్మంలో వందల మందితో ర్యాలీ నిర్వహిస్తున్నాం. శత వార్షికోత్సవాలు మనందరం నిర్వహించాలి. ఎర్రజెండా పార్టీలన్నీ ఒకే వేదికపైకి రావాలి. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ప్రధానంగా లేకపోవడానికి, అధికారం రాకపోవడానికి పార్టీల చీలికే కారణం. మావోయిస్టులతో చర్చలు చేపట్టేందుకు కేంద్రం ముందుకు రావాలి" అని రామకృష్ణ సూచించారు.

'వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములుకండి'




వందేమాతరం గీతాలాపన చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, పొడపాటి తేజస్వి, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని, అదే స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతికశాఖ, జిల్లా యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ముందుగా భరతమాత చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించారు. గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేయించారు. ప్రధాన మంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వందేమాతరం గేయ ఔన్నత్యాన్ని నేటి యువత తెలుసుకుని, దేశభక్తి, జాతీయ భావం పెంచుకోవాలన్నారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కులమతాలకు అతీతంగా దేశ ప్రజల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందన్నారు. రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ.. మహోన్నత గేయ విశిష్టతను విస్తృతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదం.. కుంకుమ పంపిణీకి ఆమోదం



మాట్లాడుతున్న రాధాకృష్ణ, పక్కన ఈవో శీనానాయక్, పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ అన్నారు. దుర్గగుడి సమావేశ మందిరంలో పాలక మండలి తొలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 24 అంశాలను ప్రతిపాదించగా.. రెండింటిని సభ్యులు తిరస్కరించారు. మూడింటిని వాయిదా వేశారు. 19 అంశాలను ఆమోదించారు. ఛైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం పోరంకి నుంచి దుర్గగుడికి దేవస్థానం బస్సులు నడపాలని తీర్మానించామన్నారు. దేవస్థానానికి బస్సులు సమకూర్చేందుకు దాతలు ఆసక్తి చూపుతున్నారన్నారు. అమ్మవారి దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడికి ప్రసాదం, కుంకుమ పంపిణీ చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. దుర్గమ్మ, మల్లేశ్వరస్వామి ఆలయాల గోపురాలను స్వర్ణమయం చేసేందుకు అవసరమైన బంగారాన్ని దాతల నుంచి సేకరిస్తామని చెప్పారు. ఈవో శీనానాయక్ మాట్లాడుతూ భవానీ దీక్షల విరమణకు అవసరమైన పక్కా ప్రణాళికను ముందుగానే సిద్ధం చేస్తున్నామన్నారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు శ్రీనివాసరావు, ధర్మారావు, పద్మావతి ఠాకూర్, రమాదేవి, సరోజినీదేవి, సరిత, ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్‌బాబు పాల్గొన్నారు.

తీర్మానాలివే.. సమావేశంలో ఆమోదించిన అంశాల్లో ప్రధానమైనవి ఇవే.. ✦ భవానీ దీక్షల విరమణకు తాత్కాలిక షామియానాల ఏర్పాట్లకు రూ.21 లక్షలు, వేకువజామున రోజూ 2వేల మంది భక్తులకు అల్పాహార పంపిణీ, భక్తులను చేరవేసేందుకు రూ.9.60 లక్షలతో ట్రాన్స్‌పోర్టు వాహనాలు నడపడం, గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు 10 లక్షల వాటర్ బాటిళ్లు, 7 లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిణీ, భక్తుల భద్రతకు రూ.5లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు, ఘాట్ల వద్ద విద్యుద్దీకరణ ఏర్పాట్లకు సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.7 లక్షలతో మైక్ ప్రచారం, అన్ని చోట్ల తాత్కాలిక షామియానాల ఏర్పాటుకు రూ.1.15 కోట్లు వెచ్చించేందుకు పాలకమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాత్కాలిక హోమ గుండాల ఏర్పాటుకు రూ.10 లక్షలకు ఆమోదం తెలిపారు.

నవ్యావిష్కరణలు ప్రోత్సహిస్తాం

పాయకాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో నవ్యావిష్కరణలు, స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(విజయవాడ) ప్రముఖ విద్యాసంస్థలు, కళాశాలలతో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌టీఐహెచ్ విజయవాడ స్పోక్, వివిధ కళాశాలల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఆంధ్రా లయోలా, ధనేకుల, ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలతో ఆర్‌టీఐహెచ్ తాజాగా ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు ఆమె వివరించారు.

'విజయ డెయిరీ విజయపథం ఘనత మండవదే..'

చిట్టినగర్, న్యూస్‌టుడే: కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య మృతి ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమకు తీరని లోటని ఆ సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. చిట్టినగర్ సమీపంలోని విజయ డెయిరీ ప్రాంగణంలో జానకిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఏపీలో పాడి పరిశ్రమ అభివృద్ధికి మండవ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సంక్షోభ సమయంలో ఆయన చూపిన నాయకత్వ స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. సుదీర్ఘ కాలం ఛైర్మన్‌గా డెయిరీని విజయపథంలో నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, అధికారులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



జానకిరామయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డెయిరీ ఛైర్మన్ ఆంజనేయులు, ఎండీ ఈశ్వరబాబు, సిబ్బంది

అలరించిన కథాపాత్రలు



బాలలు బ్రహ్మలై.. సృజనశీలురై..


ఉత్సాహంగా బాలోత్సవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



కార్యక్రమాలు తిలకిస్తున్న విద్యార్థులు



గుంటూరు సాంస్కృతికం, పెదకాకాని, న్యూస్‌టుడే: అక్కడ బాలలు కళాస్రష్టలుగా అవతరించారు. సృజన రసధునులను రవళించారు. పసి బుగ్గల చిన్నారులు.. చిట్టి చిట్టి చేతులతో జీవం పోసిన వర్ణచిత్రాలు, గానం చేసిన గీతాలు, పలికిన పలుకులు, రవళించిన అందెల మోతలు.. అన్నీ రంగరించి ఒక అద్భుత కళాలోకం ఆవిష్కృతమైన ఉత్సవమది. ప్రపంచ బాలల పండగ పేరున వీవీఐటీయూ ఆధ్వర్యంలో బాలోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. మొత్తం 23 అంశాల్లో పోటీలు జరిగాయి. తొలిరోజున 11 వేల మంది వచ్చారు. ప్రాంగణం ఎటు చూసినా కళాసరస్వతి సిరిమువ్వల చిరునవ్వులు వెల్లివిరుస్తున్నట్లు పలు రకాల పోటీలకు వేషధారణలతో వచ్చిన బాలలు కనువిందు చేశారు.

అమరావతికి అద్దం పడుతూ..

ప్రాంగణంలోకి అడుగుపెడుతూనే అమరావతి ప్రత్యేకతలు కళ్లెదుట నిలిచాయి. ధ్యాన బుద్ధ విగ్రహం పసుపు, ఎరుపు వన్నెల పుష్పాలంకరణ మధ్య.. కొండపల్లి ఎడ్లబండి సరసన చూడముచ్చటగా కనిపిస్తూ.. నవ్యాంధ్ర రాజధాని అమరావతి విశిష్టతలకు అద్దం పడుతోంది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిన్న కుటీరం సెల్ఫీ పాయింట్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

నింగి కెగిరిన రంగుల బుడగలు.. బాలోత్సవ్ పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొన్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రంగుల బుడగలను ఎగురవేసి ప్రారంభించారు. పోటీకొచ్చిన బాలల కేరింతల నడుమ బాలోత్సవ్ విజయ సూచికగా నింగికెగిరాయి. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, ఏపీఎస్ఆర్‌టీ అధ్యక్షుడు డాక్టర్ వేమూరి రవికుమార్, వీవీఐటీ విశ్వవిద్యాలయ ఛాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య రాంబాబు కొడాలి, మల్లికార్జునరెడ్డి, కె.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై పిల్లల కోసం సులభ శైలిలో రూపొందించిన మహాభారతం పుస్తకాన్ని బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు.



చిత్రానికి రంగులద్దుతూ

మరిన్ని చిత్రాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు



విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం విజయవాడ మీదుగా 60 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మచిలీపట్నం-కొల్లాం-మచిలీపట్నం(వయా గూడూరు, రేణిగుంట): రైలు నెంబరు 07101/07102 మచిలీపట్నం, కొల్లాం ప్రత్యేక రైలు ఈనెల 14, 21, 28, డిసెంబరు 26, జనవరి 2 తేదీల్లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొల్లాం చేసుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 16, 23, 30, డిసెంబరు 28, జనవరి 4 తేదీల్లో ఆదివారం తెల్లవారుజామున 2.30కి కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. ఈ రైలు గుడివాడ, విజయవాడ స్టేషన్లలో ఆగుతుంది.

మచిలీపట్నం-కొల్లాం(వయా గుంటూరు, నంద్యాల, రేణిగుంట): రైలు నంబరు 07103/07104 మచిలీపట్నం, కొల్లాం ప్రత్యేక రైలు డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16 తేదీల్లో ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు డిసెంబరు 7, 14, 21, జనవరి 11, 18 తేదీల్లో ఆదివారం తెల్లవారుజామున 2.30కు కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30కి మచిలీపట్నం చేరుతుంది. ఈ రైలు పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ, విజయవాడ స్టేషన్లలో ఆగుతుంది.

కొల్లాం- నర్సాపూర్-కొల్లాం(వయా గూడూరు, రేణిగుంట): రైలు నంబరు 07105/07106 కొల్లాం, నర్సాపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 16, 23, 30, డిసెంబరు 7, 14, 21, 28, జనవరి 4, 11, 18 తేదీల్లో నర్సాపూర్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో మంగళవారం తెల్లవారుజామున 2.30కి కొల్లాంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపూర్ చేరుతుంది. ఈ రైలు గుడివాడ, విజయవాడ స్టేషన్లలో ఆగుతుంది.



తిరిగిస్తూ... మార్పు తెస్తూ!

వసుంధర

vasundhara@eenadu.in

ఎంత గొప్ప ఆలోచనైనా, ఆశయమైనా ప్రోత్సాహం లేకపోతే ఆచరణలోకి తీసుకురావడం కష్టం. అది వాళ్లకూ అనుభవమే. వృత్తి ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో ప్రోత్సాహం లేక, అవకాశాలు రాక ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. వాటిని అధిగమించి కెరియర్‌లో విజయం సాధించారు. తర్వాత తరాలకు తమలాంటి కష్టాలు ఉండకూడదనుకున్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యం, వైద్యం, ఆరోగ్యం... ఇలా అన్నింటా మార్పును ఆశించారు. దానికోసం తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇస్తున్నారు. ఈ ఏడాది ఎడెల్‌గివ్-హురున్ ఇండియా ఫిలాంత్రపీ జాబితాలో నిలిచిన తొలి పదిమంది ఉదారవాద మహిళలు..!


1 రోహిణీ నీలేకణి
రూ.204 కోట్లు
ఏక్‌స్టెప్ ఫౌండేషన్, రోహిణీనీలేకణి ఫిలాంత్రపీస్


2 కిరణ్ మజుందార్ షా
రూ.83 కోట్లు
మజుందార్ షా ఫిలాంత్రపీ


3 బీనా షా
రూ.69 కోట్లు
హరీష్ అండ్ బీనా షా ఫౌండేషన్


4 అను ఆగా
రూ.56 కోట్లు
థర్మాక్స్ ఫౌండేషన్


5 షీలా కొచౌసెఫ్
రూ.54 కోట్లు
కె.చిట్టిలపిల్లి ఫౌండేషన్


6 లీనా గాంధీ తివారీ
రూ.36 కోట్లు
యూఎస్‌వీ ప్రైవేట్ లిమిటెడ్


7 కుమారి శిబులాల్
రూ.33 కోట్లు
శిబులాల్ ఫ్యామిలీ, ఫిలాంత్రపిక్ ఇనిషియేటివ్స్


8 అర్చనా చంద్ర
రూ.24 కోట్లు
ఏ.టీ.ఈ చంద్ర ఫౌండేషన్


9 ఇనా అశ్విన్ దాని
రూ.21 కోట్లు
దాని ఫౌండేషన్


10 షబానా ఫైజల్
రూ.20 కోట్లు
ఫైజల్ అండ్ షబానా ఫౌండేషన్

ఆదాయంలో సగం – రోహిణీ నీలేకణి

నా మధ్యతరగతి నేపథ్యమే దాతృత్వం వైపు నడిపింది. నా ఆదాయంలో సగం దానానికే కేటాయిస్తున్నా.

గత అయిదేళ్లుగా హురున్ ఫిలాంత్రపీ జాబితాలో చోటు దక్కించుకుంటున్నారు రోహిణి. స్వస్థలం ముంబయి. ఫ్రెంచ్ లిటరేచర్ నుంచి డిగ్రీ పట్టాపొందారు. దేశంలోని ప్రముఖ వార్తాపత్రికల్లో పనిచేశారు. భర్త నందన్ నీలేకణి ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు. ఆ సంస్థ విజయం సాధించాక ఆదాయం పెరిగింది. దాన్ని ఇతరులతో పంచుకోవాలనుకున్నారు. అర్ఘ్యం, ఏక్‌స్టెప్, ప్రథమ్ బుక్స్ వంటి స్వచ్ఛంద సంస్థలను స్థాపించారు. తాగునీరు, పిల్లలకు బహుభాషల్లో మంచి సాహిత్యం అందించడం, పారిశుద్ధ్యం వంటి వాటిపై పనిచేస్తాయివి. పర్యావరణ పరిరక్షణకోసం 'అట్రీ'తోనూ, పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వంతోనూ కలిసి పనిచేశారు. ఇవేకాదు, సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహిస్తూనే సహజ వనరులు, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి కావాల్సిన సాయాన్నీ అందిస్తున్నారు 66ఏళ్ల రోహిణి.

యువ నాయకత్వం కోసం – బీనా షా

వివిధ రంగాల్లో సమర్థులైన, సాహసికులైన నాయకుల్ని తయారుచేస్తున్నాం. అన్ని వర్గాలకూ అవకాశాలు, ప్రతి నిర్ణయం ఉండే సమాజాన్ని నిర్మించడమే మా లక్ష్యం.

భర్త హరీష్ షా 'సెగ్నెట్ ఎగ్జిమ్ యంత్ర' సంస్థను స్థాపించి... ఫార్మా రంగానికి ముడి సరకు అందించేవారు. ఆ కంపెనీని వేరే సంస్థ కొనుగోలు చేసింది. ప్రస్తుతం 'సెగ్నెట్ క్యాపిటల్'ను నడుపుతున్నారు. భర్తతో కలిసి 'హరీష్ అండ్ బీనా షా ఫౌండేషన్' ద్వారా 2010 నుంచి అనేక దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు బీనా. గత ఆర్థిక సంవత్సరంలో వీళ్లు రూ.138 కోట్లు విరాళం ఇచ్చారు. బీనా నాయకత్వంలో ఈ ఫౌండేషన్ కళలు, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, జీవనోపాధి... విభాగాల్లో విరాళాలు, గ్రాంట్లు అందిస్తోంది. అశోకా యూనివర్సిటీకి అత్యధిక మొత్తంలో విరాళం వీరి నుంచే అందింది. ఇండియా లీడర్స్ ఫర్ సోషల్ సెక్టార్ సంస్థతో కలిసి ఎన్జీఓల విభాగంలో నాయకత్వ శిక్షణ కార్యక్రమాన్నీ చేపడుతోంది.

మహిళలకు అండగా... – షీలా కొచౌసెఫ్

సమాజానికి తిరిగి ఇవ్వడం బాధ్యతగా భావిస్తా. ప్రతి మహిళకూ తనదైన ప్రతిభ ఉంటుంది. దాన్ని సానపెట్టి జీవితంలో నిలవాలి. ఉద్యోగం లేదా వ్యాపార జీవితంలో అడుగు పెట్టి ఆర్థిక స్వేచ్ఛను సాధించాలి.

భర్త కొచౌసెఫ్ చిట్టిలపిల్లి వి-గార్డ్ గ్రూప్ వ్యవస్థాపకులు. షీలా కూడా 40 ఏళ్ల వయసులో వ్యాపారంలోకి అడుగుపెట్టి విజయం సాధించారు. కొచ్చి కేంద్రంగా ఈమె స్థాపించిన వి-స్టార్ సంస్థ వస్త్ర తయారీ రంగంలో ఉంది. టర్నోవర్ రూ.100 కోట్ల పైనే. ఈ కుటుంబానికి చెందిన చిట్టిలపిల్లి ఫౌండేషన్ ద్వారా ప్రధానంగా సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యసేవల విభాగంలో సేవలు అందిస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రత్యేకించి మహిళల స్వావలంబనకు నిధులు అందిస్తున్నారు. గత అయిదేళ్లలో చిట్టిలపిల్లి ఫౌండేషన్ ద్వారా రూ.181 కోట్లు విరాళాలు అందించారు.

అమ్మాయిల చదువుతోనే... – కుమారి శిబులాల్

ఆడపిల్ల చదువు కుటుంబాన్ని పేదరికం నుంచి బయటకు పడేయగలదు. విద్య మాత్రమే సమాజంలో హోదాను, మనలో నైతికతనూ పెంచుతుంది.

కేరళలోని రామమంగళం గ్రామంలోని రైతు కుటుంబంలో పుట్టి పెరిగారు శిబులాల్. 'అమ్మానాన్నలు చదువుకోలేదు. విద్య మాత్రమే మన జీవితాల్లో మార్పు తీసుకొస్తుందని చెప్పేవారు. అందుకే మమ్మల్ని చదువుకోమని ప్రోత్సహించేవారు. అదే మమ్మల్ని ఈ స్థాయిలో నిలబెట్టింది. నా భర్త ఎస్‌డీ శిబులాల్ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు. మా ఇద్దరి ఆలోచనలు ఒకటి కావడంతో 1999లో 'శిబులాల్ ఫ్యామిలీ ఫిలాంత్రపిక్ ఇనిషియేటివ్స్' (ఎస్ఎఫ్‌పీఐ)ని స్థాపించాం'. గ్రామీణ ప్రాంతాల్లో వెనకబడిన పేద పిల్లల... విద్య, భారతీయ సంస్కృతి సంప్రదాయ కళలపై మక్కువున్న వారిని ప్రోత్సహిస్తుంది ఫౌండేషన్. 30లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా చదువును అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. గత అయిదేళ్లలో రూ.215 కోట్లు విరాళంగా అందించారామె.

గర్భిణులకు యోగా... – ఇనా అశ్విన్ దాని

సమాజానికి తిరిగివ్వాలనే ఆలోచనతోనే ఇవన్నీ చేస్తున్నా. ఈ పని మాత్రమే నాకు సంతృప్తినిస్తుంది.

సాంకేతిక పరిజ్ఞానం, నాయకత్వం... కార్పొరేట్ కంపెనీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయంటారు ఇనా. అదే ఆమెను నాలుగు దశాబ్దాలుగా పెయింట్ రంగంలో ఉన్నతస్థానంలో నిలబెట్టాయి. ప్రస్తుతం దాని కార్ప్ లిమిటెడ్‌లో వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశారీమె. యోగా శిక్షకురాలు కూడా. 'హోమ్ విల్లా యోగా' చారిటబుల్ ట్రస్టును స్థాపించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గర్భిణులకు తన ఫౌండేషన్ ద్వారా ప్రినేటల్ యోగా నేర్పిస్తున్నారు. ఏషియన్ పెయింట్స్ మాజీ ఎండీ అశ్విన్ సూర్యకాంత్ దానిని వివాహం చేసుకున్నాక ఆ సంస్థకు నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గానూ పనిచేశారు. 'దాని ఫౌండేషన్'తో సామాజిక అభివృద్ధి, ఫిజికల్ ఫిట్‌నెస్, విద్య, సాధికారత వంటి వాటిల్లో సేవలందిస్తున్నారు. గత ఐదేళ్లలో రూ.141కోట్ల విరాళాలు అందించారు. సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణకి ఫిట్‌నెస్ థెరపీలు అందించేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారీమె.

పరిశోధనలకు ప్రోత్సాహం – కిరణ్ మజుందార్ షా

విద్యా సంస్థలు, ప్రభుత్వ, సామాజిక విభాగాల్లో అన్ని వర్గాల ప్రజలూ ఉండాలన్నది మా లక్ష్యం. వీరి పరిశోధనలు, ఆలోచనలు ప్రపంచాన్ని మార్చుతాయనేది మా నమ్మకం.

వైద్యురాలు అవ్వాలనుకున్నారు. కానీ, ప్రతికూల పరిస్థితులవల్ల సాధ్యం కాలేదు. తండ్రి ప్రోత్సాహంతో బ్రూవరీస్ అంశంలో పీజీ చేశారు. ఆపై బెంగళూరు కేంద్రంగా రూ.10వేల పెట్టుబడితో ఎంజైమ్‌లు తయారుచేసే బయో టెక్నాలజీ సంస్థను పెట్టారు. ఆ ప్రయాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొని వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించారు. రూ.83కోట్లు విరాళాల్ని ఇచ్చారు కిరణ్. 'మజుందార్ షా ఫిలాంత్రపీ' ద్వారా వీటిని అందిస్తున్నారు. ప్రధానంగా ఆరోగ్యసేవల విస్తృతి, విద్య, వైద్య రంగాల్లో పరిశోధనలపైన దృష్టిపెట్టారు కిరణ్. వీటితోపాటు సామాజిక సంస్థలు, కళలు, సంప్రదాయం, వారసత్వ విభాగాల పరిరక్షణ కోసం కృషిచేస్తున్నారు. గత ఐదేళ్లలో రూ.310 కోట్లను దాతృత్వ కార్యక్రమాలకు కేటాయించారు.

ఇష్టం లేకున్నా బాధ్యతలు... – అను ఆగా

చుట్టూ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నప్పుడు మేం మాత్రం విలాసంగా ఎలా ఉండగలం. అందుకే లాభాల్లో సగం సమాజానికే ఇస్తున్నాం!

భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నారు అను. పరామర్శించడానికి వచ్చారనుకున్న బోర్డు సభ్యులు... కంపెనీ పరిస్థితుల్ని వివరించడం మొదలుపెట్టారు. అప్పటికి ఆమెకు వ్యాపారంలో ఓనమాలే రావు. ముంబయిలో పుట్టి పెరిగారీమె. చదువు, పెళ్లి, కుటుంబ బాధ్యతలు... ఇవే ఆమె ప్రపంచం. ఒక్కసారిగా అన్నీ తలకిందులయ్యాయి. భర్త ఆశయాల్ని గౌరవించి, ఇష్టం లేకున్నా ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్నారు అను. సంస్థాగత మార్పుల మీద దృష్టి పెట్టారు. సంవత్సరంలోనే కంపెనీని లాభాల బాట పట్టించారు. సంపాదన, లాభాల మీదే దృష్టి పెట్టలేదు. 'కార్పొరేట్ సామాజిక బాధ్యత' అంశాన్ని ఎవరూ పట్టించుకోని సమయంలో దానికి నిధులు వెచ్చించారు. తక్కువ ఆదాయంతో చదువుకు దూరమవుతున్న వాళ్లని గుర్తించి చదివించడం మొదలుపెట్టారు. ఆకాంక్ష, టీచర్ ఫర్ ఇండియా సంస్థలతో ప్రాథమిక విద్య అందేలా కృషి చేస్తున్నారు. గత ఐదేళ్లలో రూ.203 కోట్లు వెచ్చించారీమె.

ఉద్యోగినిగా మొదలై... – లీనా గాంధీ తివారీ

మా నానమ్మ సుశీల దేశంలోని మొదటితరం గైనకాలజిస్టుల్లో ఒకరు. పేదలకు వైద్య సేవలు అందించారు. ఆమె స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నా.

ముంబయిలోని వ్యాపారస్థుల కుటుంబంలో పుట్టిపెరిగారు లీనా. తాత విఠల్ బాలకృష్ణ తివారీ. 1961లో యూఎస్‌వీ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించారు. డయాబెటీస్, హృద్యోగనివారణ మందుల తయారీకి ప్రసిద్ధి ఈ కంపెనీ. తాతయ్యను చూసే వ్యాపారం మీద ఆసక్తి పెంచుకున్నారు లీనా. స్థానికంగా బీకామ్, బోస్టన్ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్‌బీఏ పూర్తిచేసి, ఓ సాధారణ ఉద్యోగినిగా చేరి, ఉన్నత స్థానాల్ని అధిరోహించారు. కంపెనీ సేవల్ని విస్తరించారు. చిరుఉద్యోగినిగా ఉన్నప్పట్నుంచే సామాజిక సేవకు కొంత మొత్తాన్ని ఇచ్చేవారట. 'సుశీలా గాంధీ సెంటర్ ఫర్ అండర్ ప్రివిలైజ్డ్ విమెన్' అనే సంస్థను స్థాపించి మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు లీనా. గత ఐదేళ్లలో సామాజికాభివృద్ధికి రూ.138కోట్లు కేటాయించారీమె.

పిల్లల సేవ కోసం... – అర్చనా చంద్ర

మాకున్న డబ్బు, సమయంతో సమాజంలో కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించే అవకాశం లభిస్తోంది. ఇంతకంటే సంతృప్తినిచ్చేది జీవితంలో ఇంకేమీ ఉండదు.

'బాగా చదవాలి. మంచి ఉద్యోగం సంపాదించాలి' ముంబయిలో పుట్టి పెరిగిన అర్చనకు ఇవే లక్ష్యాలు. అయితే ఇదంతా 'జై వకీల్ ఫౌండేషన్'ను సందర్శించకముందు. మానసిక సంతులత దెబ్బతిని, వాళ్లేం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితుల్లో ఉండే పిల్లలకు ఆసరా ఆ సంస్థ. ఓ రోజు వృత్తిలో భాగంగా అక్కడకు వెళ్లారు అర్చన. ఆ తర్వాత 'నా గమ్యం ఉద్యోగం కాదని అర్థమైంది. అభంశుభం తెలియని ఆ పిల్లలకు సహాయపడాలనుకున్నా. అందుకు మావారు అమిత్ చంద్ర సహకారమూ తోడైంది' అనే అర్చన... 'ఏటీఈ చంద్ర ఫౌండేషన్'ను నెలకొల్పి నిర్వహిస్తున్నారు. గ్రామీణ, వెనకబడిన ప్రాంతాల్లో ఉండే సమస్యల్ని పరిష్కరించడానికీ తనవంతు సహాయం చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో నీటి వనరుల సంరక్షణకి రూ.78కోట్లు ఖర్చుచేశారీమె.

ప్రభుత్వ స్కూళ్లలో... – షబానా ఫైజల్

సమాజ నిర్మాణంలో భాగమయ్యే ముందు మీ కుటుంబ విలువల్నీ ఆసక్తుల్నీ దృష్టిలో పెట్టుకోండి. ఆపై మనసుకి నచ్చినది ఎంచుకోండి.

మంగళూరులోని వ్యాపార కుటుంబంలో పుట్టి పెరిగిన షబానా సైకాలజీలో డిగ్రీ చేసి, దుబాయ్‌లో ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా చేశారు. స్టీల్‌మిల్స్‌లో కెరియర్ ప్రారంభించారు. పెళ్లయ్యాక భర్త ఫైజల్ ఇ.కొట్టికోల్లన్‌తో కలిసి ఎమిరేట్స్ టెక్నో కాస్టింగ్ నిర్వహణలో చేరారు. అక్కడ మానవ వనరులు, అడ్మినిస్ట్రేటివ్ ఆపరేషన్స్ నిర్వహణతో కంపెనీ విజయంలో కీలకంగా మారారు. కుటుంబసంస్థ కేఈఎఫ్ హోల్డింగ్స్ వైస్‌ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. 'గివింగ్ టు క్రియేట్ ఇంపాక్ట్'ను అందిపుచ్చుకుని 2007లో భర్తతో కలిసి 'ఫైజల్ అండ్ షబానా ఫౌండేషన్' స్థాపించారు. అప్పటినుంచి విద్య, యువత అభివృద్ధి, ఆరోగ్యం, కళలకోసం విభిన్న సేవా కార్యక్రమాల్ని చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలమీద ప్రత్యేక దృష్టి పెట్టిన ఈమె ఈ ఏడాదిలో రూ.20 కోట్లు విరాళం ఇచ్చారు.

అంతరిక్షంలోకి తెలుగమ్మాయి!


కైవల్య

ఫిజిక్స్ అంటే ప్రాణం ఆ అమ్మాయికి. దాంతో మానవాళికి సాయపడేలా ఎన్నో పరిష్కారాలు కనుక్కోవాలి. అంతరిక్షం లోతులు తెలుసుకోవాలని ఆశపడింది. ఈ క్రమంలో ఆస్ట్రాయిడ్‌లను కనుక్కుంది. నాసాను ఆకర్షించింది. తాజాగా అంతరిక్షంలోకి అడుగుపెట్టే అవకాశాన్నీ అందుకుంది 17 ఏళ్ల కుంచల కైవల్య రెడ్డి.

కైవల్య రెడ్డిది బాపట్ల జిల్లాలోని బేతపూడి. నాన్న శ్రీనివాసరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి, అమ్మ విజయలక్ష్మి మనోజ్ఞ ట్రస్ట్ నిర్వహిస్తున్నారు. తండ్రికి కైవల్యని ఐఏఎస్ చేయాలని కోరిక. కానీ ఆమె మనసు పడింది మాత్రం అంతరిక్షమ్మీద. చిన్నప్పుడే ఎన్‌సైక్లోపీడియాలో స్పేస్ సంబంధిత చిత్రాలను చూస్తూ గడిపేది. ఓసారి తన నోట్ బుక్ మీద కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ తమ వ్యోమగాముల బృందాలతో ఉన్న ఫొటోలను చూసి వాళ్ల గురించి తెలుసుకుంది. ఆసక్తి కలిగి... అప్పట్నుంచీ అంతరిక్షానికి సంబంధించిన అంశాలను తెలుసుకోవడం, వీడియోలను చూడటం వ్యాపకంగా మార్చుకుంది. అయిదో తరగతిలో స్పేస్ మీద తను వేసిన చిత్రాలతో న్యూదిల్లీలోని స్పేస్ స్పోర్ట్ ఇండియా ఫౌండేషన్ కిడ్స్ టీమ్‌కి ఎంపికైంది. అక్కడ స్పేస్ గురించి తెలుసుకోవడమే కాదు, పిల్లలకు శాటిలైట్ క్రాఫ్ట్ తయారీ, పప్పెట్ థియరీ వీడియోలతో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తరగతులూ చెప్పింది కైవల్య.

గ్రహశకలాలను కనిపెట్టి...

ఎనిమిదో తరగతిలో ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ కొలాబరేషన్ నిర్వహించే ఆస్ట్రాయిడ్ సెర్చ్ క్యాంపెయిన్‌లో పాల్గొని 2020 సీఎం 24 గ్రహశకలాన్నీ పదో తరగతిలో 2021 సీఎం37 పేరిట మరోదాన్నీ కనుక్కుంది. 2021లో జర్మనీ నిర్వహించిన ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ పోటీల్లో పాల్గొని సిల్వర్ ఆనర్ అందుకుంది. నాసా నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌కి ఎంపికై వ్యోమగాములకు ఇచ్చే 10రోజుల ప్రాథమిక శిక్షణలో పాల్గొంది. దేశం నుంచి ఆ అవకాశం అందుకున్న పిన్న వయస్కురాలు కైవల్య. ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ నుంచీ సిల్వర్ ఆనర్ అందుకుంది. నాసా 'వన్ డే సైంటిస్ట్'లో నేషనల్ ఫైనలిస్ట్. తాజాగా ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చేపట్టే వ్యోమగామి శిక్షణకూ ఎంపికైంది. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది దరఖాస్తు చేయగా వడపోతల అనంతరం 150 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. వారిలో కైవల్య కూడా ఉంది. 2026 నుంచి 2029 వరకు జీరో గ్రావిటీ, స్కూబా డైవింగ్, హైకింగ్ ఇలా... మానసికంగా, భౌతికంగా అభ్యర్థులను సిద్ధం చేసేలా ఈ శిక్షణ ఉంటుంది.

వాళ్లే స్ఫూర్తి

శిక్షణ పూర్తయ్యాక అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం దక్కుతుంది. 300 కి.మీ. పరిధిలో భూమిని రెండుసార్లు చుట్టొచ్చే ఐదు గం. మిషన్‌లో భాగమవుతుంది. కైవల్య కరాటే, ఈత, పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్... ఇలా ఇంకెన్నో అంశాల్లోనూ రాణిస్తోంది. పీరియాడిక్ టేబుల్‌ని 1:38 నిమిషాల్లో పూర్తిచేసి రికార్డు సృష్టించింది. ఈతలో జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా ఎన్నో గుర్తింపులూ అందుకుంది. ప్రస్తుతం జర్మనీలో ఆస్ట్రోఫిజిక్స్‌లో బ్యాచిలర్స్ చేయడానికి సిద్ధమవుతోంది. 'ఫిజిక్స్ అంటేనే లాజిక్. దాన్ని తెలుసుకునే కొద్దీ ఆసక్తిగా తోస్తుంది. ఫిజిక్స్‌లో ఏ అంశం తీసుకున్నా న్యూటన్ కనిపిస్తాడు. డావెన్సీ అయితే పది ఆర్ట్స్‌లో రాణించారు. నాకు వీళ్లే స్ఫూర్తి. అందుకే భిన్న అంశాలను ప్రయత్నిస్తూనే ఫిజిక్స్‌నీ ఇష్టంగా తెలుసుకుంటున్నా. వ్యోమగామి శిక్షణ తీసుకుంటూనే చదువునీ పూర్తిచేస్తా'నసే కైవల్యకి ఫిజిక్స్‌లో నోబెల్ సాధించాలని కల అట.

– **జుజ్జవరపు రమేష్**, నిడదవోలు

ఫ్రిజ్‌లో పెడితే పాడవుతాయి!



మార్కెట్ నుంచి కూరగాయలు తేవడం ఆలస్యం... శుభ్రంగా కడిగి, ఆరాక ప్లాస్టిక్ కవర్లు లేదా బ్యాగుల్లో సర్దుతాం. బద్ధకస్తులయితే అందుబాటులోని కవరులో పెట్టేసి ఫ్రిజ్‌లోకి తోసేసి హమ్మయ్య అనుకుంటారు. కానీ వాటిల్లోని తేమ పోవడం లేదా ఎక్కువవడంతో అవి మూడో రోజుకే తాజాదనాన్ని కోల్పోతాయి. ఆకుకూరలైతే మచ్చలొచ్చి పాడవుతాయి. ఎందుకంటే ఫ్రిజ్‌లోని చల్లని, పొడిగాలి వాటిల్లోని తేమను పీల్చేస్తుంది. ప్లాస్టిక్ కవర్లో పెట్టడంతో శీతలీకరణ జరిగి వాటిల్లోని తేమ బయటకు వస్తుంది. దాంతో ఫంగస్ చేరి, ఆకులమీద మచ్చలు ఏర్పడతాయి. అందుకే జపనీయులు ప్లాస్టిక్, అల్యూమినియం ఫాయిల్స్ లాంటివేమీ వాడకుండా సంప్రదాయ విధానాన్నే పాటిస్తారట. అదేమిటంటే...

- శుభ్రమైన కాటన్ వస్త్రం లేదా కాస్త తడి ఉన్న పేపర్ టవల్‌లో చుట్టి గాలిచొరని కంటైనర్ లేదా లాక్ చేసుకోగలిగే బ్యాగ్‌లో ఉంచి ఫ్రిజ్‌లో పెడతారట. దాంతో వాటిల్లోని తేమ అలాగే ఉంటుంది. ఎండిపోవడం లేదా కుళ్లిపోవడం రెండూ జరగవు. సహజ రుచి, వాసన పోవు.
- నిజానికి అన్ని రకాల పండ్లనీ కూరగాయల్నీ ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం లేదు. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, గుమ్మడి, వెల్లుల్లి... వంటివి చల్లగానూ కొద్దిపాటి వెలుతురు ఉండే ప్రదేశంలో గది ఉష్ణోగ్రత దగ్గరే ఉంచాలి. సిట్రస్, ఆపిల్స్, పియర్స్, అప్రికాట్స్, మామిడి, టొమాటో వంటివీ గది ఉష్ణోగ్రత దగ్గరే నిల్వచేయొచ్చు. పూర్తిగా పండిపోయి త్వరగా అన్నీ వాడలేం అనుకున్నప్పుడే ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఆపిల్స్, అవకాడో... వంటి పండ్ల పక్కనే ఆకుకూరల్ని ఉంచితే... వాటి నుంచి విడుదలయ్యే ఇథిలీన్‌తో త్వరగా పాడైపోతాయి.
- బ్రొకలీ, క్యాబేజీ, వంకాయ, బీన్స్, స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, ద్రాక్ష... వంటి వాటికే ఫ్రిజ్ ఎక్కువ అవసరం. కాబట్టి ఫ్రిజ్ ఉంది కదాని అన్నీ తోసేయకుండా ఈ జాగ్రత్తలు పాటించండి!

'బ్లూ-ఐడ్ గర్ల్'గానే ఉండాలి!



'బ్లూ ఐడ్ గర్ల్... అంటే నీలిరంగు కళ్లు ఉన్న అమ్మాయిగా ఉండాలా? అనుకునేరు. ఇదో ఇంగ్లిష్ జాతీయం. స్కూల్లో టీచర్‌కి ఓ ఇష్టమైన విద్యార్థిని ఉంటుంది కదా! ఉపాధ్యాయులు లేనప్పుడు తరగతిని నియంత్రించాలన్నా, ఏదన్నా చదివి వినిపించాలన్నా, అందరి హోంవర్క్‌లూ సేకరించాలన్నా... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ టీచర్ తర్వాత ఆ అధికారమంతా తనదే అన్నట్లుగా ఉంటుందా విద్యార్థిని. చురుకుగా వ్యవహరించి అన్నీ చేస్తుంది కాబట్టే ఆమె అంటే టీచరుకి అంత ఇష్టం. అలానే ఆఫీస్‌లోనూ యజమానికి ఇష్టమైన ఉద్యోగిని ఉంటుంది. వీరందరినీ 'బ్లూ ఐడ్ గర్ల్' అనే పిలుస్తారు. ఇలా ఉండటానికి వీళ్లు పడే శ్రమ అంతాఇంతా కాదు. వేళకాని వేళల్లోనూ కార్యాలయ పనులకు అందుబాటులో ఉంటారు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా దానికి పరిష్కారం చూపిస్తుంటారు. ప్రతి పనినీ చొరవ తీసుకుని పూర్తిచేస్తుంటారు. యజమాని లేనప్పుడు పని భారమంతా తలకెత్తుకుంటారు. దీనివల్ల ఏం లాభం అంటారా? పరిచయాలు పెరుగుతాయి. బాస్‌ని దగ్గర్నుంచి గమనించే అవకాశం ఉంటుంది. వాళ్ల నైపుణ్యాల్నీ అందిపుచ్చుకోగలుగుతారు. పదోన్నతులు, కొత్తప్రాజెక్టులు అన్నింట్లోనూ వీరికి మొదటి అవకాశం ఉంటుంది. ప్రతిఒక్కరూ ఇలా ఫేవరేట్ ఉద్యోగిగా ఉండేందుకు ప్రయత్నిస్తారు. అయితే హద్దులు దాటకుండా, వ్యక్తిగత పెరుగుదల కోసం మిగతా వారిని వెనకకి నెట్టకుండా పనిచేసేవరకూ ఏ సమస్య ఉండదు. అలాకాకుండా ఒక్కరి దృష్టిలో మంచిగా ఉండాలని... తోటి ఉద్యోగులతో గిల్లికజ్జాలు పెట్టుకుంటే మనశ్శాంతి ఉండదు. అతి ఏదైనా అనర్థమే అని గమనించుకోవాలి. ఇంతకీ మీరు ఈ కోవకు చెందిన వారేనా... సరిచూసుకోండి మరి.

మొదటిదంటే ఎందుకంత ఇష్టం?

'మొదటి పుస్తకం... స్నేహితులతో ఫస్ట్ ట్రిప్... మొదటి జీతం'... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ ఎన్ని వస్తాయో తెరమీదకి. ఎందుకంటే అమ్మాయిలకి మొదలు ఏదైనా ప్రత్యేకమే. అందుకే అవి శాశ్వతంగా గుర్తుండిపోవాలి అనుకుంటారు. వాటిని ఫొటోలు, వీడియోలుగా దాచిపెట్టుకుంటారు. ఎప్పుడు ఆ విషయం వచ్చినా కంఠోపాఠంగా చెబుతూనే ఉంటారు. ఆ రోజుల్లో... అంటూ మొదలైన వారి సంభాషణలో ఎన్ని భావోద్వేగాలు ఉంటాయో. అయితే, ఈ జ్ఞాపకాలు గుర్తుండిపోవడానికి కారణం మాత్రం డోపమైనేనట. కొత్తగా ఏదైనా ప్రయత్నించినప్పుడు, అనుభూతి చెందినప్పుడు దీని స్థాయిలు రెట్టింపవుతాయట. అందుకే మెదడులో అవి నిక్షిప్తమవుతాయట. అలానే కొత్త మార్గాలు ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ప్రారంభమవుతాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి మెట్టు మెట్టు ఎక్కుతూ... గమ్యం చేరుకున్న తీరు ఎప్పటికీ మన మెదడులో, మనసులో పదిలమే. ఎంతైనా తొలినాళ్లలో తీసుకున్న ఈ నిర్ణయాలే మలి వయసుకు జ్ఞాపకాలు కదా. కాబట్టే వాటిని అంత సులువుగా మరచిపోలేం. అన్నట్టు అబ్బాయిలతో పోలిస్తే... అమ్మాయిల్లోనే ఈ జ్ఞాపకాలు ఎక్కువట. మన మెదడులో 'ఎమోషనల్ మెమరీ' ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. అందుకే ఏ విషయాన్ని అయినా మనం రోజు, సమయం, నిమిషాలతో సహా పక్కాగా చెప్పేస్తాం. ఇంకొంతమంది అయితే వేసుకున్న దుస్తులు, వాటి రంగు, చుట్టూ ఉన్న పరిస్థితులు కూడా చెప్పేయగలరట.



శవ ఉదరకర్షణాసనం

చేసే విధానం: యోగా మ్యాట్‌పైన శవాసనంలో పడుకుని, చేతుల్ని శరీరానికి దగ్గరగా ఉంచండి. కాళ్లను కలిపి ఉంచాలి. ఆపై నెమ్మదిగా కుడి కాలిని వెనకకు మడిచి ఎడమ మోకాలి అవతల పక్కన కుడి పాదాన్ని ఉంచండి. ఇప్పుడు ఎడమచేతి సాయంతో కుడి మోకాలిని ఎడమవైపునకు సున్నితంగా వంచండి. కుడి చేతిని భుజానికి సమాంతరంగా చాచి ఉంచండి. తర్వాత తలను తిప్పి కుడి చేతి వైపుగా చూడండి. ఇలా సాధారణ శ్వాసలతో సుమారు 10-15 సెకన్లు ఉండండి. తర్వాత నిదానంగా కాళ్లను చాచి, యథాస్థితికి వచ్చి విశ్రాంతి పొందండి.



జాగ్రత్తలు: రుతుక్రమ సమయంలో చేయరాదు. ఉదర హెర్నియా, పైల్స్, స్లిప్‌డిస్క్ ఉన్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: నడుము నొప్పికి మంచి ఉపశమనం ఇస్తుంది. ఉదర భాగంలోని అవయవాలకు మసాజ్ అవ్వడంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శారీరక, మానసిక ప్రశాంతతను ఇస్తుంది. **ఆహారం:** నడుము ఆరోగ్యానికి కాల్షియం, విటమిన్ డి, మెగ్నీషియం, లభించే ఆహారాలు పుష్కలంగా తీసుకోవాలి. పాలకూర, బచ్చలి కూర, కరివేపాకు, పెసలు, సోయాబీన్స్, శనగలు, అరటిపండ్లు, డ్రైఫ్రూట్స్... ఆహారంలో భాగమవ్వాలి.

- **శిరీష**, యోగ గురు

అవమానించిన చోటే.. సంపూర్ణ ఆలాపన

- వందేమాతర గేయానికి ఇదే నిజమైన గౌరవమన్న భాజపా నేతలు
- కాకినాడలో ఘనంగా 150 ఏళ్ల వేడుకలు





విజయవాడ గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూలు విద్యార్థులు 100 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు.★ వందేమాతరం ఆలపిస్తున్న భాజపా జాతీయ నేత రాధామోహన్‌దాస్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఒకనాడు వందేమాతరాన్ని అవమానించిన కాకినాడలో నేడు ఆ గేయాన్ని పూర్తిగా ఆలపించడం ఎంతో ఆనందంగా ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్ అన్నారు. 'వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను శుక్రవారం రాత్రి కాకినాడలోని గాంధీనగర్ పార్కులో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నేతలు మాట్లాడుతూ.. 'స్వాతంత్ర్యానికి పూర్వం కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభ(1923)లో వందేమాతర గేయాన్ని ఆలపించకుండా నాటి కాంగ్రెస్ నాయకులు అవమానించారు. అప్పట్లో కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన ఉన్న మౌలానా మహమ్మద్ అలీ.. వందేమాతరం ఆలపిస్తుండగా అభ్యంతరం వ్యక్తంచేసి, వెళ్లిపోయారు. అలాంటి చోట మళ్లీ వందల మందితో కలిసి పూర్తి గేయాన్ని ఆలపించడం మనసును పులకింపజేస్తోంది. అదే స్థలంలో ఈ వేడుక నిర్వహించడం అభినందనీయమ'న్నారు. నిజమైన వేడుకలు కాకినాడలోనే జరిగాయని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం గాంధీనగర్ పార్కు ఎదురుగా మౌలానా మహమ్మద్ అలీ రోడ్డును 'వందేమాతరం మార్గ్'గా మారుస్తూ అతిథులు బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రావ్యంగా.. భవ్యంగా 'వందేమాతరం'



'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం 3,000 మందికి పైగా విద్యార్థులతో.. రాష్ట్రంలోనే ఎక్కువ మంది పిల్లలు చదువుతున్న బడిగా గుర్తింపు పొందిన విశాఖలోని చంద్రంపాలెం పాఠశాలలో వందేమాతరం గేయాలాపన ఆకట్టుకుంది. – ఈనాడు, విశాఖపట్నం

'వందేమాతరం' జాతి ఐక్యతకు ప్రతీక

- ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహిద్దాం..
- సీఎం చంద్రబాబు పిలుపు

ఈనాడు, అమరావతి: దేశభక్తి, ఐక్యత, త్యాగం, ధైర్యానికి వందేమాతర గేయం ప్రతీకగా నిలిచిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. 'వందేమాతరం 150 ఏళ్ల సంబరాల' సందర్భంగా 'ఎక్స్' వేదికగా శుక్రవారం ఆయన స్పందించారు. 'వందేమాతరం.. తరతరాలనూ ప్రేరేపించింది. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఈ గేయం ఎన్నో ఉద్యమాలకు నాంది పలికింది. ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఆ స్వరాలు ప్రతి భారతీయుడి హృదయంలో గర్వాన్ని నింపుతాయి. ఇది పాట కాదు. పాఠశాల నుంచి సమావేశం వరకూ ప్రతి ప్రాంగణంలో ప్రతిధ్వనిస్తూ దేశభక్తిని నింపే నినాదం" అని వీడియోలో చంద్రబాబు కొనియాడారు. శుక్రవారం నుంచి ఏడాది పాటు దీన్ని ఉత్సవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ రాబోయే రోజుల్లో దేశభక్తితో దేశాన్ని ప్రపంచంలో నం-1 మార్చాలని కోరారు.

అమరావతిలో రూ.99.62 కోట్లతో క్వాంటమ్ కంప్యుటేషన్ సెంటర్

సీఆర్డీఏ సమావేశంలో ఆమోదముద్ర

ఈనాడు, అమరావతి: రాజధానిలో అమరావతి క్వాంటమ్ కంప్యుటేషన్ సెంటర్ (ఏక్యూసీసీ) భవనాన్ని రూ.99.62 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. పన్నులు, ఇతర వ్యయాలు కలిపి అది రూ.125 కోట్లకు చేరుతుందని అంచనా. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశంలో దీనికి ఆమోదముద్ర వేశారు. అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ క్యాంపస్ నిర్మాణానికి ప్రభుత్వం 50 ఎకరాల భూమి కేటాయించింది. దానిలో 2 ఎకరాల్లో ఏక్యూసీసీ భవనాన్ని నిర్మిస్తారు. దీని నిర్మాణ బాధ్యతలను సీఆర్డీఏకు అప్పగించారు. ఆ భవనం నిర్మిత ప్రాంతం 45 వేల చ.అడుగులు. ఎన్‌బీసీ, బీఐఎస్, గృహ/ఐజీబీసీ ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తారు. క్వాంటమ్ కంప్యూటర్లను నియంత్రిత వాతావరణంలో ఉంచాలి. భవన నిర్మాణానికి అయ్యే వ్యయంలో 70 శాతం నియంత్రిత వాతావరణానికి అవసరమైన ప్రత్యేక సదుపాయాలు, సేవల కోసమే వెచ్చిస్తున్నారు. భవన నిర్మాణానికి నిధులను ఐటీశాఖ ద్వారా ప్రభుత్వం సమకూరుస్తుంది.

మరో రూ.9 వేల కోట్ల రుణం

అమరావతి నిర్మాణానికి మరో రూ.9 వేల కోట్ల రుణం మంజూరైంది. నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ) రూ.7,500 కోట్లు, ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీపీఎఫ్‌సీఎల్) రూ.1,500 కోట్లు రుణం మంజూరు చేశాయి. రూ.7,500 కోట్ల రుణం మంజూరుకు సంబంధించిన పత్రాలను ఎన్ఏబీఎఫ్ఐడీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ శామ్యూల్ జోసెఫ్, రుణాలు, ప్రాజెక్ట్ ఫైనాన్స్ విభాగం ఉపాధ్యక్షుడు కె.దినేశ్ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ సమక్షంలో సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబుకు అందజేశారు. ఎన్ఏబీఎఫ్ఐడీ సమకూర్చిన రుణాన్ని 20 ఏళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. మొదటి ఐదేళ్లు (మూడేళ్ల నిర్మాణ సమయం, రెండేళ్ల మారటోరియం) ఎలాంటి చెల్లింపులు చేయనక్కర్లేదు. ఆ తర్వాత నుంచి చెల్లింపులు మొదలు పెట్టి, పదిహేనేళ్లలో పూర్తిగా చెల్లించాలి. ఈ రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది. ఏపీపీఎఫ్‌సీఎల్ సమకూర్చిన రూ.1,500 కోట్ల రుణానికి 9.15 శాతం చొప్పున వార్షిక వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పదేళ్లలో రుణాన్ని పూర్తిగా తిరిగి చెల్లించాలి. రుణం మొత్తానికి 1.25 రెట్లు విలువైన స్థలాలను ఏపీపీఎఫ్‌సీఎల్‌కు సీఆర్డీఏ తనఖా పెడుతుంది.

రాకియా కోర్టు ధిక్కరణ పిటిషన్ కొట్టివేత

- కోర్టులో నమోదు చేసిన ప్రకటన హామీ కాదు
- తీర్పు వెలువరించిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: వాన్‌పిక్‌పై రస్ అల్ ఖైమా (రాక్) కోర్టు ఉత్తర్వు వ్యవహారంలో హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన హామీని ఉల్లంఘించారంటూ ఐక్యెస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ తదితరులపై రాకియా (రస్ అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ) దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా న్యాయవాదులు ఇచ్చిన ప్రకటనను కోర్టు రికార్డు చేసిందని, ఇలా నమోదు చేసిన ప్రకటన హామీ పరిధిలోకి రాదని పేర్కొంది. ఇది కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ పరిధిలోకి రాదంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఇక్కడ లేవనెత్తిన అన్ని అంశాలనూ వాణిజ్య కోర్టులోనే వెల్లడించాలని సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తీర్పు వెలువరించారు. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో వాన్‌పిక్ ప్రాజెక్ట్స్‌కు సంబంధించి సుమారు రూ.600 కోట్లు చెల్లించాలంటూ రాక్ కోర్టు ఇచ్చిన తీర్పు అమలు కోసం రాకియా.. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించింది. విచారణ సందర్భంగా ఆస్తులను అన్యాక్రాంతం చేయబోమంటూ ఇచ్చిన హామీని ఉల్లంఘించారంటూ ఐక్యెస్‌తోపాటు నిమ్మగడ్డ ప్రసాద్ తదితరులపై రాకియా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. రాకియా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోర్టుకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఇతర షేర్లతో వియాట్రిస్ సంస్థ మ్యాట్రిక్స్ ఫార్మా కంపెనీని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. వ్యాజ్యాలకు సంబంధించి రాకియా రాక్ కోర్టు నుంచి ఏకపక్షంగా ఉత్తర్వులు పొందిందని, ఆ పిటిషన్ విచారణార్హం కాదని నిమ్మగడ్డ తరఫు న్యాయవాది వాదించారు. రాకియా పెట్టుబడి పెట్టిందని, పెట్టుబడి అప్పు కాదని అన్నారు. ఒకసారి ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టినప్పుడు లాభనష్టాలను భరించాలే తప్ప వాపసు ఇవ్వాలని అడగలేరని వాదనలు వినిపించారు. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డామన్నది అవాస్తవమన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.



ఒంగోలు అంజయ్యరోడ్డులో మొక్క నాటుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు

గంటలోనే.. 5 వేల మొక్కలు

- 'గ్రీన్ ఒంగోలు'లో భాగంగా నాటిన నగరపాలక సంస్థ

ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, ఒంగోలు: పచ్చదనాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గంట వ్యవధిలోనే ఐదు వేల మొక్కలు నాటారు. శుక్రవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయకుమార్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా మొక్కలు నాటారు. 'గ్రీన్ ఒంగోలు'లో భాగంగా నగరంలోని ప్రధాన మార్గాల్లో విద్యార్థులు వారికి కేటాయించిన మొక్కల వద్దకు చేరుకొని అన్నిచోట్లా ఒకేసారి నాటారు. నాటిన మొక్కల పరిరక్షణ బాధ్యతను ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అప్పగించనున్నారు. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేసి, దానిపై నాటిన విద్యార్థి పేరు, మొక్క శాస్త్రీయనామం రాశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాలకు చెందినవారు పాల్గొన్నారు.

తుపాను సాయం అందక పడిగాపులు



గురువారం అర్ధరాత్రి మహిళల నిరీక్షణ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చేస్తున్న నిత్యావసర సరకుల పంపిణీలో జాప్యంతో లబ్ధిదారులు నానాయాతన పడుతున్నారు. తగినన్ని ఈ-పోస్ యంత్రాలు లేకపోవడం, సర్వర్ మొరాయించడంతో రేషన్ దుకాణాల వద్ద రాత్రీపగలూ నిరీక్షించాల్సి వస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బ్రహ్మసమేథ్యం పంచాయతీ పరిధిలోని బలుసుతిప్ప గ్రామంలో ఉన్న 2 రేషన్ దుకాణాల్లో ఐదారు రోజులుగా ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, 5 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండేవారు కూడా సహాయం పొందడానికి సొంతూరికి వచ్చారు. కానీ అక్కడ రెండే ఈ-పోస్ యంత్రాలు ఉండటం, సర్వర్ సరిగా పని చేయకపోవడంతో ఎక్కువ మందికి పంపిణీ చేయలేకపోతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా రాత్రిపూట దుకాణాల వద్దే ఉండిపోతున్నారు. పంపిణీకి శుక్రవారం చివరి రోజని ప్రచారం జరగడంతో ఉదయం నుంచే వందల మంది దుకాణాల వద్ద గుమిగూడారు. దీంతో ఒకరిద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. తహసీల్దార్ రవికిరణ్, ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, ఇతర అధికారులు అక్కడికి చేరుకొని మరో 4 ఈ-పోస్ యంత్రాలను తీసుకొచ్చి పంపిణీ సజావుగా జరిగేలా చూశారు. గ్రామంలో మొత్తం 2,200 కార్డులు ఉండగా శుక్రవారం సాయంత్రం నాటికి 1,300 మందికి సరకులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మిగిలిన వారికి కూడా అందజేస్తామన్నారు.

వైకాపా ప్రధాన కార్యదర్శికి నోటీసులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వైకాపా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరికి శుక్రవారం కర్నూలు పోలీసులు నోటీసులు అందజేశారు. కర్నూలు శివారులోని చెట్లమల్లాపురం వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో 27 మందిపై కర్నూలు తాలూకా స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు నిందితులను విచారించిన పోలీసులు.. తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉండే శ్రీహరి పాత్ర ఉన్నట్లు తేలడంతో అతని పేరును కూడా చేర్చి విచారణకు రావాలని నోటీసు జారీ చేశారు.

ఎన్జీరంగా స్ఫూర్తితో రైతుకు సేవలు

- రైతు గౌరవమే దేశ గౌరవమని చాటిన మహనీయుడు
- ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, మంత్రి అచ్చెన్నాయుడు, రైతు కుంచాల రామకృష్ణ, ఆచార్య ఎన్జీ రంగా ట్రస్టీ రామినేని కిషోర్‌బాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: 'అనుక్షణం రైతు సంక్షేమానికి, దేశ సౌభాగ్యానికి పాటుపడిన ఆచార్య ఎన్జీ రంగా స్ఫూర్తిప్రదాత. దేశంలో రైతుల కోసం పోరాడిన వారిలో అగ్రగణ్యుడు. గ్రామసభలు పెట్టి ప్రజల్లో చైతన్యం తెచ్చారు. రైతు గౌరవం- దేశ గౌరవం, రైతు అభివృద్ధి- దేశ అభివృద్ధి అని నినదించారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం రైతులకు సేవలందిస్తోందన్నారు. శుక్రవారం గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఆయన 125వ జయంతి ఉత్సవాలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన రోజే ఎన్జీ రంగా 125వ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉంది. ఆర్థిక శాస్త్రంలో నైపుణ్యం సాధించిన ఆయన గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు పాత్ర పోషించారు. 33 ఏళ్ల వయసులో ఆంధ్ర రైతు ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. నిడుబ్రోలులో రైతులకు శిక్షణ పాఠశాల నెలకొల్పారు. 1964లో 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో పోరాడి రైతు భూమిని కట్టడి చేసే చట్టాన్ని ఆపారు. రంగా పార్లమెంట్‌లో ఉన్నంతకాలం రైతులు సుభిక్షంగా ఉంటారని అప్పటి ప్రధాని నెహ్రూ చెప్పడం ఆయన గొప్పతనానికి నిదర్శనం. 50 ఏళ్ల పాటు ఎంపీగా కొనసాగి గిన్నిస్ రికార్డుకు ఎక్కారు. తెనాలి, చిత్తూరు, శ్రీకాకుళం, గుంటూరు.. ఇలా ఎక్కడి నుంచి, ఏ పార్టీ తరఫున పోటీ చేసినా గెలవడం అసాధారణం' అని చంద్రబాబు కొనియాడారు.

ఎన్జీ రంగాతో ప్రత్యేక అనుబంధం

'నేను ముఖ్యమంత్రి కాగానే హైదరాబాద్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఎన్జీ రంగా పేరు పెట్టాను. రాష్ట్ర విభజన తర్వాత యూనివర్సిటీ పేరు మార్చితే.. నవ్యాంధ్రలో వ్యవసాయ వర్సిటీకి ఆయన పేరు పెట్టాం. నేను గ్రామీణాభివృద్ధిపై పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు రంగా రచనలు, అధ్యయనాలే స్ఫూర్తి నింపాయి. రంగా దత్తపుత్రుడు నాగేశ్వరరావు అప్పట్లో నాకు సహచర మంత్రిగా ఉన్నారు' అంటూ ఆయనతో తన అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. దేశం కోసం పిల్లలు వద్దనుకున్న రంగా దంపతులు ఆదర్శనీయులన్నారు.

ఆహారపు అలవాట్లకు అనుగుణంగా సాగు

'రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ఖర్చులు తగ్గించుకుని, దిగుబడి పెంచుకోవాలి. తద్వారా ఆదాయం పెరగాలి. ఈ మేరకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలి. 2014-19 మధ్య జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 16.6 శాతానికి పెరిగితే వైకాపా పాలనలో 10 శాతానికి పడిపోయింది. మేం గతేడాది 15.45 శాతానికి పెంచాం. వైకాపా ప్రభుత్వంలా కాకుండా ధాన్యం రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్నాం. సకాలంలో పంటల బీమా ప్రీమియం చెల్లిస్తున్నాం. కౌలు రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుతో నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారు. సామర్థ్యం మేరకు సాగు చేయాలి. కౌలురైతులకూ పెట్టుబడి రాయితీ ఇస్తాం. అన్నిరకాలుగా అండగా ఉంటాం. ప్రపంచమంతా ఆహారపు అలవాట్లు మారి అన్నం తినేవారు తగ్గిపోతున్నారు. ఇందుకు అనుగుణంగా సాగులో మార్పులకు సిద్ధమవ్వాలి. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్, పంజాబ్ దేశానికి అన్నపూర్ణగా ఉన్నాయి. పంజాబ్‌లో పురుగుమందుల వాడకం పెరగడంతో క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం పంజాబ్ నుంచి దిల్లీకి రోజూ రెండు రైళ్లలో వెళుతున్నారు. ఇలాంటివి నివారించాలంటే ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించాలి. ప్రత్యామ్నాయంగా పదేళ్ల కిందటే ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాను. ఇప్పుడు దానికి సాంకేతికతను జోడించి, అభివృద్ధి చేస్తాం' అని చెప్పారు. 'ఆధునిక రాజ్యాంగ సంస్థలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు వ్యవసాయ రంగంలో కృషి చేసిన రైతు కుంచాల రామకృష్ణ, శాస్త్రవేత్త కుర్రా శ్రీనివాసబాబులను సన్మానించారు. ఎన్జీ రంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, నసీర్ అహ్మద్, మాధవి, రామాంజనేయులు, ఎన్జీరంగా కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వైకాపా ఆదేశాల మేరకే అసభ్య పోస్టులు పెట్టా

- విచారణలో అంగీకరించిన భాస్కరరెడ్డి!
- అరెస్టు సమయంలో కానిస్టేబుల్‌పై అతని సోదరుడి దాడి
- ఇద్దరికీ రిమాండ్ విధించిన కోర్టు



కోర్టు వద్ద భాస్కరరెడ్డి

ఈనాడు– అమరావతి, ఈనాడు డిజిటల్– మచిలీపట్నం– న్యూస్‌టుడే, పెనమలూరు: విదేశాల్లో ఉండి సామాజిక మాధ్యమాల్లో తెదేపా, జనసేన నేతలు, మహిళలపై అసభ్యకరంగా, అత్యంత నీచంగా పోస్టులు పెడుతున్న వైకాపా సానుభూతిపరుడు, ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి భాస్కరరెడ్డిని పెనమలూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. భాస్కరరెడ్డి అరెస్టు సమయంలో పోలీసులపై దాడి చేసిన అతని అన్న ఓబుల్‌రెడ్డిని కూడా అరెస్టు చేశారు. ఇద్దరినీ శుక్రవారం వేర్వేరుగా కోర్టుల్లో హాజరుపరచగా న్యాయాధికారులు రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం గ్రామానికి చెందిన భాస్కరరెడ్డి లండన్‌లో ఉంటూ మూడేళ్లుగా సామాజిక మాధ్యమాల్లో అత్యంత నీచమైన పోస్టులు పెడుతున్నాడు. వాటిలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, వారి కుటుంబసభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడు. వైకాపా కార్యాలయం ఆదేశాల మేరకే తాను సామాజిక మాధ్యమాల్లో ఈ పోస్టులు పెడుతున్నట్టు పోలీసుల విచారణలో భాస్కరరెడ్డి వెల్లడించినట్టు సమాచారం.

తండ్రి మరణించడంతో వచ్చి.. చిక్కాడు: నిందితుడి కుటుంబం 30 ఏళ్ల కిందట నెల్లూరు జిల్లా అనాసాగరం మండలం వెంగంపల్లి నుంచి చోడవరానికి వలస వచ్చింది. పదేళ్ల కిందట భాస్కరరెడ్డి చదువు కోసం లండన్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. తండ్రి మరణించడంతో లండన్ నుంచి సొంతూరికి వచ్చాడు. అతణ్ని గుర్తించిన తెదేపా కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భాస్కరరెడ్డికి అనారోగ్యంతో విజయవాడ పోరంకిలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స కోసం గురువారం వచ్చాడు. పోలీసులు అతణ్ని అరెస్టు చేసి, రెండో ఏసీఎంఎం కోర్టు న్యాయాధికారి రాధిక ఎదుట హాజరుపరిచారు. తనను పోలీసు విచారణలో కొట్టారంటూ నిందితుడు కోర్టులో చెప్పాడు. దీంతో సీఐ, ఎస్సైలు వివరణ ఇవ్వాలని, నిందితుణ్ని రిమాండ్‌కు తరలించేటప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి నివేదిక సమర్పించాలని న్యాయాధికారి ఆదేశించారు. నిందితుడికి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు. అతని అన్న ఓబుల్‌రెడ్డిని అవనిగడ్డ జైలుకు తరలించారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడంటూ నగరానికి చెందిన సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో భాస్కరరెడ్డిపై విజయవాడలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. నిందితుడిపై లండన్‌లోనూ కేసు ఉన్నట్లు సమాచారం.

ఉత్సాహంగా రెవెన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు





పురుషుల కబడ్డీ మ్యాచ్‌లో కర్నూలు జట్టు ఆటగాడిని గాల్లోకి ఎగిరి అవుట్ చేసేందుకు యత్నిస్తున్న శ్రీకాకుళం జిల్లా ఆటగాడు ★ 100 మీటర్ల పరుగు పందెంలో రెవెన్యూ మహిళా ఉద్యోగులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక సంబరాలు శుక్రవారం అనంతపురం ఆర్డీటీ మైదానంలో ప్రారంభమయ్యాయి. అన్ని జిల్లాల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా క్రీడాకారులు కవాతు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఓ.ఆనంద్, శ్యాంప్రసాద్ హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 27 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. నిరంతరం విధుల్లో తలమునకలయ్యే రెవెన్యూ ఉద్యోగులకు క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా ఉత్తేజాన్ని పెంపొందిస్తాయని జయలక్ష్మి పేర్కొన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్నేహపూర్వక వాతావరణంలో ఈ పోటీలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని తెలిపారు.

తొలిరోజు పోటీల్లో..: తొలిరోజు టేబుల్ టెన్నిస్ పోటీల్లో అనంతపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. కబడ్డీ పోటీల్లో నంద్యాల జట్టు చిత్తూరుపై, పశ్చిమ గోదావరి జట్టు గుంటూరు జట్టుపై గెలిచాయి. అనంతపురం, విశాఖ, అన్నమయ్య జిల్లా జట్లు కూడా విజయం సాధించాయి. త్రోబాల్ పోటీల్లో వైఎస్సార్ కడప, నంద్యాల, చిత్తూరు, విశాఖ జట్లు గెలుపొందాయి. చెస్, టెన్నికాయిట్, క్యారమ్స్ పోటీల్లో కోస్తా జిల్లాల జట్లు ముందంజలో ఉన్నాయి.

పోలవరం అథారిటీ కార్యాలయమూ అమరావతికే

ఈనాడు,అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించనున్నారు. ఈ మేరకు అథారిటీ ప్రతిపాదనను రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు ఆహ్వానించారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖతో చర్చించి, ఓ నిర్ణయానికి వచ్చి కార్యాలయాన్ని తరలించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. గతంలో ప్రాజెక్టు అథారిటీ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం తరలించాలనే ప్రతిపాదన ఉంది. ఇప్పటికే పోలవరం అథారిటీ చీఫ్ ఇంజినీర్ (పీఅండ్‌డీ), ఆయన సిబ్బందిని రాజమహేంద్రవరం తరలించారు. ఇతర పాలనా పరమైన వ్యవస్థలతో కూడిన అథారిటీ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి తరలిస్తామంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అథారిటీ సీఈవో, కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది, ఈ సంస్థ కార్యకలాపాలను అమరావతి నుంచి చేపట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం సీఈవో అతుల్ జైన్ అధ్యక్షతన పోలవరం ప్రాజెక్టు అథారిటీ 17వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, పునరావాసం, భూసేకరణతో పాటు అథారిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఏపీ నుంచి జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, పునరావాస కమిషనర్ ప్రశాంతి హాజరయ్యారు.

కేంద్ర సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇటీవల ఏ ప్రాజెక్టుకూ ఇవ్వని రీతిలో కేంద్రం పోలవరానికి అడ్వాన్సుగా నిధులు ఇస్తోందని, విదేశీ నిపుణుల బృందం సహాయ సహకారాలు అందిస్తోందని అథారిటీ సీఈవో అతుల్ జైన్ పేర్కొన్నారు. పనులు వేగంగా పూర్తిచేసి కేంద్ర సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జలవనరుల శాఖ సీఈ నరసింహమూర్తి మాట్లాడుతూ.. సాంకేతిక సహకారంతో పాటు కేంద్ర ఆర్థిక సాయం వల్ల పనులు వేగంగా చేస్తున్నామని, సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు.

- పోలవరం ప్రాజెక్టు అథారిటీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదరాల్సి ఉంది. కేంద్ర ప్రతిపాదిత ఒప్పందంలో పోలవరం సీఈ తొలిదశ నిధుల మంజూరు అంశమూ చేర్చారని, అది ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలోనే కొలిక్కి వస్తుందని రాష్ట్ర అధికారులు చెప్పారు
- పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అథారిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. అడ్వాన్సు నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరింది. పునరావాసం, భూసేకరణ పురోగతిని అధికారులు వివరించారు. నవంబరు నెలాఖరుకు పునరావాస కాలనీల టెండర్లు పూర్తి చేసి పనులు అప్పగిస్తామని వెల్లడించారు. పోలవరం పనుల నిలుపుదల ఉత్తర్వులను పూర్తిగా ఎత్తివేయాలని ఏపీ కోరింది.

పోలవరం- బనకచర్ల అనుసంధానంపై...

పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టేందుకు వీల్లేదని తెలంగాణ జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ప్రస్తావించారు. ఆ ప్రాజెక్టు చేపట్టే పక్షంలో పోలవరం డీపీఆర్‌ను కొత్తగా రూపొందించి మళ్లీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.



పెళ్లి వేడుకలో బహుమతిగా మొక్కలు అందుకున్న మహిళలు

జాం జామ్మని పెళ్లి కానుక!

తాళ్లూరు, న్యూస్‌టుడే: పెళ్లికి వచ్చిన బంధుమిత్రులకు జామ మొక్కలు పంపిణీ చేసి ప్రత్యేకత చాటుకున్నారు ప్రకాశం జిల్లా తాళ్లూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భూమా శ్రీనివాసులు. తమ కుమారుడు బాలాజీ వివాహ వేడుకను శుక్రవారం తాళ్లూరులోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. దీనికి హాజరైన బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి వినూత్నంగా ఒక్కొక్కరికీ ఒక్కో జామ మొక్కను అందజేశారు. ఇందుకోసం నర్సరీ నుంచి 700 వరకు తైవాన్ జామ మొక్కలు తెప్పించారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్క నాటి, సంరక్షించాలని ఉపాధ్యాయుడు వారికి సూచించారు.

పడ్డపుడల్లా కొనొచ్చు

• నాణ్యమైన షేర్లనే పరిశీలించాలి • వచ్చే 12–15 నెలల్లో మార్కెట్లకు మోస్తరు లాభాలే

ఈనాడు ఇంటర్వ్యూ కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రిసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్

ఈనాడు వాణిజ్య విభాగం



తెల్లవారితే ట్రంప్ ఏం అంటారో తెలియదు. టారిఫ్, వీసాలు, యుద్ధాల పేరిట ఏం చెబుతారో అంతకంటే తెలియదు. గత కొన్ని నెలలుగా మదుపర్లను పాలుపోని అంశమేదైనా ఉందంటే ఇదే. ప్రస్తుతానికి కొంత అనిశ్చితులు తగ్గినా ఎప్పుడు ఏమవుతుందో తెలియదు. ఈ పరిస్థితుల్లో స్టాక్ మార్కెట్ ఎటు వెళుతుంది, మదుపర్లు ఏం చేయాలి. ఎటువంటి వ్యూహం పాటించాలన్నదానిపై కోటక్ సెక్యూరిటీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఈక్విటీ రిసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ 'ఈనాడు'కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో విశ్లేషించారు. ఆ వివరాలు మీకోసం..

? వచ్చే ఏడాది కాలంలో స్టాక్ మార్కెట్లపై మీ అంచనాలేమిటి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ల స్థిరమైన ఆదాయాలే కనిపిస్తాయని మా అంచనా. 2026-27లో 17.6% వృద్ధి, 2027-28లో 14.9% వృద్ధి కనిపించొచ్చు. దేశీయంగా చూస్తే స్థూల ఆర్థిక అంశాలన్నీ బలంగా ఉండడం వల్ల మార్కెట్లలో సానుకూలతలే కనిపిస్తున్నాయి. అయితే అన్ని రంగాలు, అన్ని షేర్ల ధరలూ అధిక విలువలు చేరుకున్నాయి. మరో పక్క, అంతర్జాతీయ అనిశ్చితులూ ఉన్నాయి. అందువల్ల వచ్చే 12-15 నెలల్లో మార్కెట్ మోస్తరు ప్రతిఫలాలనే ఇవ్వవచ్చు.

? మార్కెట్ పనితీరుపై ఏ రంగాలు ప్రభావం చూపొచ్చు.

వాహన, డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్స్, ఐటీ సేవలు, లోహ-గనుల రంగం, చమురు-గ్యాస్, వినిమయ ఇంధన రంగాలు మార్కెట్లను నడిపించొచ్చు. ఇక చాలా వరకు ఆర్థిక కంపెనీలు రుణాల పంపిణీలో ఒక అంకె/ రెండంకెల వృద్ధిని కనబరుస్తున్నాయి. నిధుల వ్యయాలు తగ్గడం ఇందుకు కారణం. ప్రాథమిక లోహ కంపెనీలకు బలమైన త్రైమాసికం కలిసిరావొచ్చు. 2025-26 రెండో త్రైమాసికంలో కమొడిటీ ధరలు అధికంగా ఉండడం ఇందుకు నేపథ్యం.

? భారత కంపెనీలు, స్టాక్ మార్కెట్లపై జీఎస్టీ, టారిఫ్, వాణిజ్య అనిశ్చితులు ఎటువంటి ప్రభావం చూపనున్నాయి.

జీఎస్టీ సవరణల వల్ల వినియోగదారుల ఆధారిత షేర్లన్నీ 'రీరేట్' అయ్యాయి. దీని వల్ల ఆగస్టు నుంచి చూస్తే మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్ల పైనే పెరిగింది. మరో వైపు జీఎస్టీ రేట్ల కోత వల్ల కంపెనీల అమ్మకాల్లో మెరుగుదలలైతే కనిపించొచ్చు కానీ, లాభదాయకతలో భారీగా పెరుగుదలను చెప్పలేం.

? ప్రస్తుత పరిస్థితుల్లో మదుపర్లు ఏం చేయాలి.

నాణ్యమైన యాజమాన్యం, బ్యాలెన్స్ షీట్లు, కార్పొరేట్ పాలన ఉన్న కంపెనీల షేర్లను పరిశీలించాలి. ఆయా కంపెనీల షేర్లు పడ్డపుడల్లా కొనుగోళ్లు(బై ఆన్ డిప్స్) చేయడం మంచిది.

? సమీప భవిష్యత్‌లో ఏ అసెట్ క్లాస్ లేదా ఇన్వెస్ట్‌మెంట్ ఆకర్షణీయ ఫలితాలను ఇవ్వగలదని భావిస్తున్నారు.

సంవత్ 2081(2024 దీపావళి నుంచి 2025 దీపావళి వరకు)లో భారత మార్కెట్లు స్తబ్దుగానే కదలాడాయి. పలు అంతర్జాతీయ సూచీలతో పోల్చితే తక్కువ పనితీరును ప్రదర్శించాయి. అయితే గత కొన్ని త్రైమాసికాలుగా ఆర్‌బీఐ, ప్రభుత్వం పలు వృద్ధి ఉద్దీపన చర్యలను చేపడుతూ వచ్చాయి. ఇపుడు వాటి ఫలితాలు రానున్నాయి. అసెట్ క్లాస్‌లలో ఈక్విటీనే ఇక్కడి నుంచి రాణించగలదని భావిస్తున్నాం.

సాయి లైఫ్ సైన్సెస్ లాభాలు రెట్టింపు

ఈనాడు, హైదరాబాద్: సాయి లైఫ్‌సైన్సెస్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి రూ.537 కోట్ల ఆదాయం, రూ.84 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.396 కోట్లు, నికర లాభం రూ.42 కోట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయం 36%, నికరలాభం 100% పెరిగాయి.

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి ఈ సంస్థ రూ.1034 కోట్ల ఆదాయం, రూ.144 కోట్ల నికరలాభం నమోదు చేసింది. సీఆర్ఓ, సీడీఎంఓ విభాగాల్లో అధిక ఆదాయాలు సాధించినట్లు కంపెనీ వివరించింది. ఎబిటా మిగులు ఎంతో అధికంగా 29 శాతం ఉన్నట్లు పేర్కొంది.



పిట్టీ ఇంజినీరింగ్ లాభం రూ.40 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: పిట్టీ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.499 కోట్ల ఆదాయంపై రూ.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.455.25 కోట్లు, నికర లాభం రూ.38.02 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 10 శాతం, నికర లాభంలో 5 శాతం వృద్ధి కనిపించింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో మొత్తం ఆదాయం రూ.963 కోట్లు, నికర లాభం రూ.63 కోట్లుగా ఉన్నాయి. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.850 కోట్లు, లాభం రూ.57.38 కోట్లుగా ఉన్నాయి.

విస్తరణ బాటలో కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్

కొంత కాలం తర్వాత స్టాక్ మార్కెట్లో నమోదు?



ఈనాడు, హైదరాబాద్: కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్ స్టాక్ బ్రోకింగ్, డిపాజిటరీ సేవలను బహుముఖంగా విస్తరించే యత్నాల్లో నిమగ్నమైంది. ఈ సంస్థ దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ప్రభుత్వ సెక్యూరిటీల క్రయవిక్రయాలను చేపట్టే ప్రైమరీ డీలర్‌గా ఏర్పాటైంది. తదుపరి ప్రైమరీ డీలర్ బాధ్యతలను మాతృ సంస్థ కెనరా బ్యాంక్ చేపట్టింది. దీంతో ఈక్విటీ బ్రోకింగ్ సేవలపై, కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ దృష్టి సారించింది.

ప్రస్తుతం ఈ సంస్థ ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో షేర్ల ట్రేడింగ్, ఎన్ఎస్‌డీఎల్ ద్వారా డిపాజిటరీ సేవలతో పాటు మ్యూచువల్ ఫండ్ల పంపిణీ, ఐపీఓ దరఖాస్తు సేవలను అందిస్తోంది. కానీ వినియోగదార్ల సంఖ్య ప్రస్తుత ప్రమాణాల ప్రకారం చూస్తే తక్కువగానే ఉంది. ఇదే సమయంలో ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మాతృ సంస్థ అయిన కెనరా బ్యాంక్‌కు 11 కోట్ల మందికి పైగా ఖాతాదార్లు ఉన్నారు. వీరిలో కొంత శాతాన్ని తమ ఖాతాదార్లుగా మార్చుకోగలిగితే.. అగ్రశ్రేణి బ్రోకింగ్, పంపిణీ సేవల సంస్థగా ఎదగొచ్చని కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ భావిస్తోంది. ఈ దిశగా సంస్థాగతంగా బలోపేతం కావాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనికి మాతృ సంస్థ అయిన కెనరా బ్యాంక్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల నియామకం: విస్తరణ అవసరాల కోసం రూ.200 కోట్ల మూలధనాన్ని సమీకరించాలని సంస్థ భావిస్తోంది. బోర్డును బలోపేతం చేయడానికి ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లను నియమించారు. కెనరా బ్యాంక్ నుంచి జీఎం స్థాయి అధికారి ఒకరిని కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్‌కు ఎండీగా నియమించారు. దేశవ్యాప్తంగా కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్ ట్రేడింగ్, మొబైల్ యాప్ ట్రేడింగ్ సదుపాయాలను విస్తరించాలని, ఎక్కువ మంది మదుపరులకు చేరువ కావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే 3 అనుబంధ సంస్థలు

కెనరా బ్యాంక్‌కు చెందిన 3 అనుబంధ కంపెనీలు ఇప్పటికే స్టాక్‌మార్కెట్లో నమోదయ్యాయి. సమీప భవిష్యత్తులో కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్‌ను కూడా స్టాక్‌మార్కెట్లో నమోదు చేయాలనే ఆలోచన సంస్థ యాజమాన్యానికి, కెనరా బ్యాంకుకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే స్టాక్‌మార్కెట్లో నమోదు ఇప్పుడే కాదని, ప్రస్తుతం తలపెట్టిన విస్తరణ కార్యక్రమాలు పూర్తయ్యాకే, ఆ దిశగా అడుగులు వేస్తామని కెనరా బ్యాంక్ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు. విస్తరణ వల్ల సంస్థకు ఉన్న వినియోగదార్ల సంఖ్య, లావాదేవీలు, ఆదాయాలు, లాభాలు పెరుగుతాయని, అప్పుడు సంస్థకు మార్కెట్లో అధిక విలువ లభిస్తుందని వివరించారు.

ప్రపంచ అగ్రగామి-10లో 3 భారతీయ బ్యాంకులు

● 2030కు చేరొచ్చు ● ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి

ముంబయి: 2030 నాటికి మార్కెట్ విలువ పరంగా ప్రపంచ అగ్రగామి-10 బ్యాంకుల్లో మన దేశం నుంచి ఒక ప్రభుత్వ రంగ, రెండు ప్రైవేట్ రంగ బ్యాంకులు ఉంటాయని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఎస్‌బీఐ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.8 లక్షల కోట్లు)కు చేరిందని, మరో రెండు భారత ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా ఇదే విలువలను కలిగి ఉన్నాయని అన్నారు. 2030కు అగ్రగామి-10 బ్యాంకుల్లో చేరాలని ఎస్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుందని శెట్టి పునరుద్ఘాటించారు. ఆస్తుల పరంగా చూస్తే.. ప్రపంచంలో 43వ అతిపెద్ద బ్యాంకుగా ఎస్‌బీఐ ఉంది. విలీనాల ద్వారా పరిమాణంలో పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో శెట్టి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రూ.25,000 కోట్ల మూలధన సమీకరణ పెద్దగా మార్పులు తీసుకురాకపోవచ్చని, ఎస్‌బీఐకు మూలధన ఇబ్బందులు లేకపోవడంతో పరిశ్రమకు ఇది సౌలభ్యంగా మారుతుందని అన్నారు.

దివీస్ లేబొరేటరీస్ ఆకర్షణీయ ఫలితాలు

త్రైమాసిక నికరలాభం రూ.689 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం రూ.2,860 కోట్ల ఆదాయం, రూ.689 కోట్ల నికర లాభం ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.2,444 కోట్లు, నికరలాభం రూ.510 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే నికరలాభం 35% వృద్ధి చెందింది. ఈ రెండో త్రైమాసికంలో విదేశీ మారక ద్రవ్య లబ్ధి రూ.63 కోట్లు ఉన్నట్లు దివీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలానికి ఈ సంస్థ రూ.5,389 కోట్ల ఆదాయం, రూ.1,234 కోట్ల నికర లాభం నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.4,640 కోట్లు, నికర లాభం రూ.940 కోట్లు మాత్రమే ఉన్నాయి.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయాల్లో 23.3% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: కిమ్స్ హాస్పిటల్స్ (కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం రూ.965 కోట్ల మొత్తం ఆదాయం, రూ.72 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.1.67 ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో మొత్తం ఆదాయం రూ.782 కోట్లు, నికరలాభం రూ.121 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే మొత్తం ఆదాయం 23.3 శాతం పెరిగింది. ఎబిటా మిగులు 28.5 శాతం నుంచి 21.6 శాతానికి తగ్గింది. ఈ ఏడాది సెప్టెంబరు చివరకు సంస్థ చేతిలో రూ.120 కోట్ల నగదు నిల్వ ఉంది. ఈ రెండో త్రైమాసికంలో తమ అన్ని వైద్య కేంద్రాల్లో రోగుల సంఖ్య అధికంగా నమోదైనట్లు సంస్థ సీఎండీ డాక్టర్ బి.భాస్కరరావు తెలిపారు. థానేలో కొత్తగా ప్రారంభించిన ఆస్పత్రిలో ఆరు నెలల్లోనే 1,000 సర్జరీలు నిర్వహించినట్లు వివరించారు. బెంగళూరులోని మహదేవపుర యూనిట్ కార్యకలాపాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు వీలుగా ఫలితాలు ఉంటాయనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

నవ లిమిటెడ్‌కు రూ.177.5 కోట్ల లాభం



ఈనాడు, హైదరాబాద్: నవ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం రూ.989.7 కోట్ల ఆదాయం, రూ.177.5 కోట్ల నికర లాభం ఆర్జించింది. వాటాదార్లకు కంపెనీ యాజమాన్యం 300 శాతం (రూ.3) మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కంపెనీ సొంత అవసరాల కోసం ఒడిశాలో ఉన్న 60 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం (క్యాప్టివ్ పవర్ ప్లాంట్), ఈ నెల 1వ తేదీ నుంచి స్వతంత్ర విద్యుత్తు కేంద్రం (ఐపీపీ) గా మారినట్లు, దీనివల్ల ఆదాయం పెరిగే అవకాశం ఏర్పడినట్లు కంపెనీ వివరించింది. జాంబియాలో కంపెనీకి చెందిన అనుబంధ సంస్థ, ఎంఈఎల్ (మాంబా ఎనర్జీ లిమిటెడ్) నుంచి ఈ రెండో త్రైమాసికంలో 30 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.260 కోట్లు) లభించినట్లు పేర్కొంది. దీంతో పెండింగ్ బకాయిలు 55.5 మిలియన్ డాలర్లకు తగ్గిపోయాయి. జాంబియాలో చేపట్టిన అవకాడో ప్లాంటేషన్ నుంచి ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఆదాయాలు కనిపిస్తాయని కంపెనీ తెలియజేసింది.

కోడి గుడ్లు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	585
వరంగల్	587
విజయవాడ	600
తూ/ప గోదావరి	600
విశాఖపట్నం	585
చిత్తూరు	613

2025-26లో వృద్ధి 6.8 శాతంపైనే

ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్



దిల్లీ: దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.8 శాతాన్ని మించే వీలుందని ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ తెలిపారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేటు తగ్గింపు, ఆదాయ పన్ను రాయితీలు వినియోగాన్ని ప్రోత్సహించి, వృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సర్వేలో 6.3-6.8 శాతం వృద్ధిని అంచనా వేశామని, ఇప్పుడు 6.8 శాతానికి మించి సాధించగలమనే విశ్వాసం వచ్చిందన్నారు. రెండో త్రైమాసిక గణాంకాలు వచ్చిన తర్వాత 7 శాతానికి దగ్గరగా వెళ్లే అవకాశమూ ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించింది. వ్యవసాయం, వాణిజ్యం, ఆతిథ్యం, ఆర్థిక సేవలు, స్థిరాస్తి రంగాలు బలంగా ఉన్నాయని నాగేశ్వరన్ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చిలో 8.4 శాతం వృద్ధి నమోదయిందనీ, అదే సమయంలో చైనాలో 5.2 శాతం వృద్ధి ఉన్నట్లు తెలిపారు. దీంతో భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందన్నారు. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) త్వరలో పూర్తయితే, వృద్ధి అంచనాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

113 జెట్ ఇంజిన్ల కొనుగోలుకు జీఈతో హెచ్‌ఏఎల్ ఒప్పందం

దిల్లీ: దేశీయంగా రూపొందించిన తేలికపాటి యుద్ధవిమానం 'తేజస్' కోసం 113 జెట్ ఇంజిన్ల కొనుగోలుకు అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్‌తో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) శుక్రవారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని విలువ రూ.8,870 కోట్లు. దీనికింద ఎఫ్404-జీఈ-ఐఎన్20 శ్రేణి ఇంజిన్లను భారత్‌కు జీఈ అందిస్తుంది. 2027 నుంచి వీటి సరఫరా మొదలై 2032 కల్లా పూర్తవుతుంది. తేజస్ మార్క్-1ఏ జెట్‌లకు వీటిని అమరుస్తారు. సుంకాల వివాదం నేపథ్యంలో భారత్-అమెరికా సంబంధాలు క్షీణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఒప్పందానికి ప్రాధాన్యం ఏర్పడింది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)


కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
హిందాల్కో	4,741.00	3,909.00	66,058.00	58,203.00
టొరెంట్ ఫార్మా	591.00	453.00	3302.00	2889.00
ష్నైడర్ ఎలక్ట్రిక్	52.32	54.27	654.58	608.64
బామర్ లారీ అండ్ కంపెనీ	48.48	49.69	647.48	648.66
త్రివేణి ఇంజినీరింగ్	21.38	(22.42)	2014.46	1748.33
అరవింద్ లిమిటెడ్	106.74	62.77	2,371.14	2,188.31
కల్యాణ్ జువెలర్స్	260.51	130.32	7907.44	6,091.47
ఆస్టర్ డీఎమ్ హెల్త్‌కేర్	110.00	97.00	1197.00	1086.00
ట్రెంట్	373.42	335.06	4,817.68	4,156.67
బిర్లా కార్పొరేషన్	90.00	(25.19)	2,233.00	1,970.00
పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ [1]	7,834.39	7,214.90	28,901.22	25,754.73
పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ [2]	805.75	847.62	----	-----
బేయర్ క్రాప్‌సైన్స్ [3]	152.70	136.30	1,567.20	1,761.30
కేపీఐ గ్రీన్ ఎనర్జీ [4]	116.60	69.80	641.10	361.40
నాల్కో	1,429.94	1,045.97	4,292.34	4,001.48

1) రూ.3.65; 2) రూ.7; 3) రూ.90; 4) రూ.0.25 మధ్యంతర డివిడెండు

భారత్ 30 లక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే..

● మరిన్ని సంస్కరణలు కావాలి

● ప్రపంచ బ్యాంక్ నివేదిక



దిల్లీ: 2047 నాటికి భారత్ 30 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.2,640 లక్షల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఆర్థిక రంగంలో మరిన్ని సంస్కరణలు అవసరమని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో పేర్కొంది. ప్రైవేట్ రంగంలో మూలధన సమీకరణను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. భారత 'ప్రపంచ స్థాయి' డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యక్రమాలతో పురుషులు, మహిళలకు విస్తృత స్థాయిలో ఆర్థిక సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రపంచ బ్యాంక్ ఫైనాన్షియల్ సెక్టర్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎస్ఏ) నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా మహిళల్లో ఖాతాల వినియోగాన్ని మరింత పెంచేందుకు, వ్యక్తులు, ఎంఎస్ఎంఈలకు విస్తృత స్థాయిలో ఆర్థిక ఉత్పత్తులను అందించేందుకు కొన్ని సూచనలు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ సంయుక్త కార్యక్రమం అయిన ఫైనాన్షియల్ సెక్టర్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎస్ఏపీ), మన దేశ ఆర్థిక రంగంపై సమగ్రమైన, లోతైన విశ్లేషణ చేసింది. 2010 సెప్టెంబరు నుంచి ముఖ్యమైన ఆర్థిక రంగాలతో కొన్ని దేశాల్లో దీన్ని తప్పనిసరి చేశారు. ప్రస్తుతం భారత్ సహా 32 దేశాల్లో ఈ కార్యక్రమం ప్రతి అయిదేళ్లకు తప్పనిసరిగా మారింది. మరో 15 దేశాల్లో ప్రతి 10 ఏళ్లకు దీన్ని నిర్వహిస్తారు.

✦ ఎఫ్ఎస్ఏపీలో భాగంగా ఐఎంఎఫ్ ఫైనాన్షియల్ సిస్టమ్ స్టెబిలిటీ అసెస్‌మెంట్ (ఎఫ్ఎస్ఎస్ఏ) నివేదికను, ప్రపంచ బ్యాంకు తమ ఫైనాన్షియల్ సెక్టర్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎస్ఏ) నివేదికను విడుదల చేస్తాయి. భారత్‌లో చివరిసారిగా 2017లో ఎఫ్ఎస్ఏపీని నిర్వహించారు. 2017లో ఎఫ్ఎస్ఎస్ఏ నివేదికను ఐఎంఎఫ్ ప్రచురించింది. 2017 డిసెంబరులో ఎఫ్ఎస్ఏ నివేదికను ప్రపంచ బ్యాంక్ విడుదల చేసింది. ఐఎంఎఫ్- ప్రపంచ బ్యాంక్ బృందం చేపట్టిన ఆర్థిక రంగ మదింపును భారత్ స్వాగతిస్తుందని ఆర్థిక శాఖ ప్రకటనలో పేర్కొంది.

✦ 2017లో చివరి ఎఫ్ఎస్ఏపీ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలంగా, వైవిధ్యంగా, మరింత విస్తృతంగా మారిందని ప్రపంచ బ్యాంక్ ఇటీవలి ఎఫ్ఎస్ఏ నివేదికలో పేర్కొంది. 2010లో కొన్ని ఇబ్బందులు, అనంతరం కొవిడ్ సంక్షోభం నుంచి భారత్ కోలుకోవడానికి ఆర్థిక రంగ సంస్కరణలు దోహదపడ్డాయని తెలిపింది.

✦ భారత క్యాపిటల్ మార్కెట్లు గత ఎఫ్ఎస్ఏపీ తర్వాత జీడీపీలో 144% నుంచి 175 శాతానికి పెరిగాయి. ఇందుకు బలమైన మార్కెట్ మౌలిక సదుపాయాలు, విభిన్నమైన పెట్టుబడిదారులు కారణమని నివేదిక వెల్లడించింది.

గెయిల్ సీఎండీగా దీపక్ గుప్తా

పీఈఎస్‌బీ సిఫారసు



ఈనాడు, దిల్లీ: గెయిల్ తదుపరి సీఎండీగా దీపక్ గుప్తా పేరు ఖరారైంది. ప్రభుత్వ రంగ సంస్థల నియామక బోర్డు (పీఈఎస్‌బీ) ఆయన పేరును కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ పదవి కోసం మొత్తం 12 మంది పోటీపడగా, ప్రస్తుతం అదే సంస్థలో ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న దీపక్ పేరును పీఈఎస్‌బీ ఖరారు చేసింది. దిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్(ప్రస్తుత డీటీయూ)లో మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన దీపక్‌కు చమురు-గ్యాస్ రంగంలో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం గెయిల్ సీఎండీగా ఉన్న సందీప్ కుమార్ గుప్తా 2026 ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేసిన అనంతరం ఆ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు.

జులై నుంచి డిజిటల్ మోసాలు పెరుగుతున్నాయ్: ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నరు



టి.రవిశంకర్

ముంబయి: ఈ ఏడాది జులై నుంచి డిజిటల్ మోసాల సంఘటనలు పెరిగాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నరు టి.రవిశంకర్ తెలిపారు. జులై ముందు వరకు డిజిటల్ మోసాలు తగ్గుతూ వచ్చాయని ఆ తర్వాత నుంచి ఎందుకు పెరుగుతున్నాయో తెలుసుకునే పనిలో ఆర్‌బీఐ ఉన్నట్లు ఇక్కడ జరిగిన ఎస్‌బీఐ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలిపారు. అయితే డిజిటల్ మోసాలు ఎంత మేర పెరిగాయనే వివరాలను ఆయన వెల్లడించలేదు. 2024-25 వార్షిక నివేదిక ప్రకారం.. డిజిటల్ మోసాల సంఖ్య 23,953కు తగ్గింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 36,000గా ఉంది. డిజిటల్ చెల్లింపుల విభాగంలో అత్యధికంగా మోసాలు జరుగుతున్నాయి. డిజిటల్ మోసాల సంఖ్యలో ప్రైవేట్ రంగ బ్యాంకులకు సంబంధించినవే ఎక్కువ ఉండగా.. విలువపరంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచే అధికంగా నమోదవుతున్నాయి.

బజాజ్ ఆటో లాభంలో 53% వృద్ధి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బజాజ్ ఆటో ఏకీకృత నికర లాభం రూ.2,122 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలోని రూ.1,385 కోట్ల లాభంతో పోలిస్తే 53% వృద్ధి కనిపించింది. ఎగుమతి మార్కెట్లలో బలమైన అమ్మకాలు ఇందుకు దోహదం చేశాయి. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం సైతం రూ.13,247 కోట్ల నుంచి రూ.15,735 కోట్లకు చేరుకుంది. కంపెనీ అమ్మకాలు 6% వృద్ధితో 12,21,504 యూనిట్ల నుంచి 12,94,120 యూనిట్లకు చేరాయి.

కేటీఎమ్‌లో ఉద్యోగ కోతలు: కేటీఎమ్ ఏజీలో మెజారిటీ వాటాను తీసుకోబోతున్న బజాజ్ ఆటో పలు అవకాశాలను పరిశీలిస్తోంది. భారత్‌కు ఎక్కువ ఉత్పత్తిని తరలించడంతో పాటు, వ్యయాల కోతల్లో భాగంగా ఉద్యోగులను తొలగించే అంశాన్నీ పరిగణనలోకి తీసుకుంటోంది.

స్ట్రింగ్ మెటావర్స్ ఆదాయం రూ.233 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్ట్రింగ్ మెటావర్స్ రూ.233.27 కోట్ల ఆదాయాన్నీ, రూ.21.64 కోట్ల నికర లాభాన్నీ ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.87.89 కోట్లు, నికర లాభం రూ.6.75 కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో రూ.432.34 కోట్ల ఆదాయాన్నీ, రూ.39.93 కోట్ల నికర లాభాన్నీ నమోదు చేసింది.

సూచీలకు కొనసాగిన నష్టాలు

సెన్సెక్స్ ▼ 95 **83216** | నిఫ్టీ ▼ 17 **25492**

● విదేశీ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావం

● తోడైన ఎఫ్ఐఐల అమ్మకాలు

ఎఫ్ఐఐల కొనుగోళ్లు.. రూ.4581.34 కోట్లు

డీఐఐల కొనుగోళ్లు.. రూ.6674.77 కోట్లు



వరుసగా మూడో ట్రేడింగ్ రోజూ స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడం ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) అమ్మకాలు కొనసాగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు తగ్గి రూ.88.65 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.93% పెరిగి 63.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.48,000 కోట్లు పెరిగి రూ.466.31 లక్షల కోట్లకు (5.26 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

భారీ నష్టాల నుంచి కోలుకొని..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ క్రితం ముగింపు (83,311.01)తో పోలిస్తే 161 పాయింట్ల నష్టంతో 83,150.15 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత మరింతగా నష్టపోయి 82,670.95 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి చేరింది. అక్కడ నుంచి క్రమక్రమంగా కోలుకుంటూ నష్టాలను పరిమితం చేసుకుంటూ వచ్చింది. చివరకు 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 17.40 పాయింట్లు కోల్పోయి 25,492.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,318.45 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,551.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

సగం అటు.. సగం ఇటు: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగం లాభాల్లో.. సగం నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ 4.46% నష్టపోయింది. టెక్ మహీంద్రా 1.9%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.17%, ట్రెంట్ 1.15%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.92%, హిందుస్థాన్ యునిలీవర్ 0.89% మేర తగ్గాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్ 2.4%, టాటా స్టీల్ 2.37%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.03%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.96%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.69%, బెల్ 1.4% లాభపడ్డాయి.

✦ భారతీ ఎయిర్‌టెల్‌లో 0.8 శాతం వాటాను రూ.10,353 కోట్లకు విక్రయించినట్లు సింగ్‌టెల్ తెలిపింది. ఈ వాటా విక్రయ అనంతరం ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 27.5 శాతానికి తగ్గింది. ఈ వాటా విలువ సుమారు రూ.3.46 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా.

✦ క్యూఐపీ లేదా ఇతర అనుమతి ఉన్న మార్గాల ద్వారా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో రూ.10,000 కోట్లను సమీకరించేందుకు తమ బోర్డు ఆమోదం తెలిపిందని స్విగ్గీ వెల్లడించింది.

సంక్షిప్తంగా

✦ **టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా** తన తొలి పబ్లిక్ ఆఫర్‌కు రూ.378- 397ను ధరల శ్రేణిగా నిర్ణయించింది. ఇష్యూ నవంబరు 12న మొదలై 14న ముగియనుంది.

✦ గ్రో మాతృసంస్థ **బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్** ఐపీఓ చివరి రోజు ముగిసేనాటికి 17.60 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 9.43 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.


✦ **పైన్ ల్యాబ్స్** ఐపీఓకు మొదటి రోజు ట్రేడింగ్ ముగిసే నాటికి 13 శాతం స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 54 శాతం ఎక్కువగా బిడ్‌లు వచ్చాయి.

✦ ఒడిశాలోని సుందర్‌ఘర్ జిల్లాలో దర్లిపాలి సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 వద్ద 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎన్‌టీపీసీ నుంచి రూ.6,650 కోట్ల విలువైన కాంట్రాక్టు లభించిందని **భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)** తెలిపింది.

✦ అన్‌సెక్యూర్డ్ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్స్ జారీ ద్వారా రూ.1,500 కోట్లను సమీకరించినట్లు **ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ** తెలిపింది.

చాంపియన్

ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాలో ఓడించడం అంటే మాటలు కాదు.. కానీ టీ20ల్లో ఆ జట్టుపై టీమ్‌ఇండియాకు గొప్ప రికార్డే ఉంది. గత 17 ఏళ్లలో ఆస్ట్రేలియాలో ఒకసారి కూడా సిరీస్ కోల్పోలేదు. ఆ రికార్డును కొనసాగించింది. మరి సిరీస్ విజయంతో పర్యటనను ముగిస్తుందా? అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆఖరి టీ20కి వేళైంది!



బుమ్రా

సిరీస్ పట్టేస్తారా!

నేడే ఆస్ట్రేలియాతో భారత్ అయిదో టీ20

బ్రిస్బేన్

స్ఫూర్తిదాయక ఆటతో ఆస్ట్రేలియాతో అయిదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచిన భారత్ కీలక పోరుకు సిద్ధమైంది. శనివారం గబ్బాలో ఆఖరిదైన అయిదో టీ20లోనూ అదరగొట్టి సిరీస్ పట్టేయాలని సూర్య సేన ఉవ్విళ్లూరుతోంది. సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. మిగతా మూడులో భారత్ రెండు గెలిచిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుండడం ఇదే ఆఖరిసారి.

వాళ్లిద్దరూ ఆడాలి: బౌలింగ్‌లో సత్తా చాటుతున్నా.. బ్యాటింగ్‌లో ఎవరూ స్థిరంగా ఆడకపోవడమే ఈ సిరీస్‌లో భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నుంచి జట్టు పెద్ద స్కోర్లు ఆశిస్తోంది. సూర్య తరచూ విఫలం అవుతున్నాడు. ఈ సిరీస్‌లో ఒక్క అర్ధసెంచరీ కూడా చేయలేకపోయాడు. మరోవైపు నాలుగో టీ20లో శుభ్‌మన్ కాస్త మెరుగైన ప్రదర్శనే చేసినా.. గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 50 పరుగుల మైలురాయి అందుకోలేదు. కుదురుకున్నాక ఔట్ కావడం అతడికి బలహీనతగా మారింది. ఆఖరి పోరులోనైనా సూర్య, శుభ్‌మన్ గాడిలో పడాలని జట్టు ఆశిస్తోంది. ఆసియాకప్‌లో సత్తా చాటిన తిలక్ వర్మ ఈ సిరీస్‌లో విఫలమయ్యాడు. అతడు వరుసగా 0, 29, 5 పరుగులే చేశాడు. లోయర్‌ఆర్డర్‌లో వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ రాణిస్తుండడం భారత్‌కు శుభపరిణామం.

పేస్‌తో కొట్టాలి: నాలుగో టీ20లో ఆస్ట్రేలియాను స్పిన్‌తోనే కొట్టింది భారత్. ఈసారి బాధ్యత పేసర్లదే. పేస్‌కు అనుకూలమైన బ్రిస్బేన్ పిచ్‌పై బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ కీలకం కానున్నారు. అర్ష్‌దీప్ జోరు మీద ఉండడం సానుకూలాంశం. అతడు బుమ్రాతో కలిసి గబ్బాలో దూకుడు కొనసాగిస్తే ప్రత్యర్థి బ్యాటర్లకు ఆరంభంలోనే కళ్లెం వేయచ్చు. పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబె ప్రదర్శన జట్టుకు ముఖ్యమే. గత మ్యాచ్‌లో ఆడిన జట్టునే భారత్ కొనసాగించొచ్చు. ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తితో పాటు.. స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్, సుందర్ జట్టులో కొనసాగనున్నారు.

బ్యాటింగే ఆందోళనకరం: ఆస్ట్రేలియా సిరీస్‌ను కాపాడుకుంటుందా అన్నది ఆ జట్టు బ్యాటింగ్‌పైనే ఆధారపడివుంది. యాషెస్ సిరీస్ నేపథ్యంలో ట్రావిస్ హెడ్ జట్టును వీడటంతో కెప్టెన్ మిచెల్ మార్ష్, స్టాయినిస్, టిమ్ డేవిడ్‌పై భారం పెరిగింది. మాథ్యూ షార్ట్ పెద్దగా ఫామ్‌లో లేడు. గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన మ్యాక్స్‌వెల్ ఆకట్టుకోలేకపోయాడు. నాలుగో టీ20లో ప్రధాన బౌలర్ డ్వార్షుయిస్ ఒక్క వికెట్ కూడా తీయకపోవడం ఆసీస్‌కు ఆందోళన కలిగిస్తోంది. హేజిల్‌వుడ్ లేని ఆసీస్ బౌలింగ్ విభాగం మరీ ఎక్కువ ప్రభావవంతంగా కనిపించడం లేదు. ఫాస్ట్ బౌలర్ బియర్డ్‌మ్యాన్ ఆఖరి మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి.


సూర్య

పిచ్, వాతావరణం

గబ్బా పిచ్ సహజంగా పేసర్లకు అనుకూలంగా ఉంటుంది. మంచి స్వింగ్ లభిస్తుంది. కుదురుకుంటే పరుగులు కూడా స్వేచ్ఛగానే వస్తాయి. ఇటీవల బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌ల్లో ఈ పిచ్‌పై భారీ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రెండో అర్ధంలో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశాలున్నాయి.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, జితేశ్ శర్మ, శివమ్ దూబె, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా

ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), మాథ్యూ షార్ట్, ఇంగ్లిస్, టిమ్ డేవిడ్, మిచెల్ ఓవెన్/జోష్ ఫిలిప్, స్టాయినిస్, మ్యాక్స్‌వెల్, బార్ట్‌లెట్, డ్వార్షుయిస్, ఎలిస్, ఆడమ్ జంపా.

- టీ20ల్లో వంద వికెట్ల మైలురాయిని అందుకోవడానికి బుమ్రా ఒక వికెట్ దూరంలో ఉన్నాడు. చివరి టీ20లో ఆ వికెట్ తీస్తే.. అన్ని ఫార్మాట్లలో 100 వికెట్లు పడగొట్టిన తొలి భారత బౌలర్‌గా ఘనత సాధించనున్నాడు.
- చివరిగా భారత్‌తో 2018లో గబ్బాలో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఆసీస్ 4 పరుగుల తేడాతో గెలిచింది.


గుర్‌బక్ష్ సింగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న మన్‌సుఖ్ మాండవీయ. చిత్రంలో ఉదయనిధి స్టాలిన్

దిగ్గజాలు దిగివచ్చిన వేళ

భారత హాకీ వందేళ్ల వేడుక

దిల్లీ: భారత హాకీ ఘన కీర్తిలో భాగమైన దిగ్గజ ఆటగాళ్లు ఒకవైపు.. ప్రస్తుత జట్టును ముందుకు నడిపిస్తున్న యువతరం మరోవైపు.. ఈ కలయికతో శుక్రవారం దిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియం మెరిసిపోయింది. భారత హాకీ వందేళ్ల వేడుక వేదిక కళకళలాడింది. జట్టు చిరస్మరణీయ విజయాల్లో భాగమైన గుర్‌బక్ష్ సింగ్, అస్లామ్ హర్‌బీందర్ సింగ్, అజిత్‌పాల్ సింగ్, అశోక్ కుమార్, బీపీ గోవింద, జాఫర్ ఇక్బాల్, బ్రిగేడియర్ హర్‌చరణ్ సింగ్, వినీత్ కుమార్, మీర్ రంజన్ నేగి, రోమియో జేమ్స్, అసంత లక్రా, సుభద్ర ప్రదాన్ లాంటి ఒకప్పటి తరం ప్లేయర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు, తమిళనాడు డిప్యూటీ సీఎం తిరు ఉదయనిధి స్టాలిన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రీడాకారులను సన్మానించారు. "భారత హాకీలో ఎన్నో దశలు ఉన్నాయి. మన సత్తా ఏంటో ఒలింపిక్స్ హాకీలో ప్రదర్శన ద్వారా భారత్ ప్రపంచానికి తెలియజేసింది. ఇప్పుడు కూడా మన జట్టు ఒలింపిక్స్‌లో రాణిస్తోంది. మరో పతకం దిశగా పయనిస్తోంది" అని మన్‌సుఖ్ అన్నారు.

ఎగ్జిబిషన్ మ్యాచ్, ఫొటోల ప్రదర్శన: ఈ వందేళ్ల వేడుక ఆరంభానికి ముందు మాండవీయ సారథ్యంలోని క్రీడల మంత్రి ఎలెవన్‌తో దిలీప్ టిర్కీ కెప్టెన్సీలోని హాకీ ఇండియా ఎలెవన్ పోటీపడింది. 'వందేళ్ల భారత హాకీ' అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు. 1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి మొదలై భారత్ ఎలా ప్రభంజనంలా సాగిందో గుర్తుకు తెచ్చేలా అరుదైన ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూనియర్ ప్రపంచకప్‌నకు తమిళనాడు ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ సందర్భంగా ట్రోఫీని ప్రదర్శించారు. హాకీ వందేళ్ల పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో వెయ్యికి పైగా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లను హాకీ ఇండియా నిర్వహించనుంది.

ఆ స్ఫూర్తితో ప్రపంచకప్ గెలవాలి: గుర్‌బక్ష్

మహిళల వన్డే ప్రపంచకప్‌ను భారత్ చేజిక్కించుకున్న స్ఫూర్తితో భారత హాకీ జట్టు ప్రపంచకప్‌ను గెలవాలని మాజీ ఆటగాడు గుర్‌బక్ష్ సింగ్ అన్నారు. "భారత మహిళల జట్టు ప్రపంచకప్ విజయం దేశంలో అమ్మాయిల క్రికెట్‌కు ఎంతో ఊతాన్ని ఇస్తుంది. ఇదే స్ఫూర్తితో భారత హాకీ పురుషుల జట్టు 50 ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రపంచకప్‌ను గెలవాలని ఆశిస్తున్నా. కొన్నేళ్లుగా జట్టు కుదురుకుని ఒలింపిక్స్‌లో రాణించింది. ఇదే ఉత్సాహంతో ప్రపంచకప్‌నూ గెలవాలి" అని 88 ఏళ్ల గుర్‌బక్ష్ కోరారు. చివరిగా 1975 కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచింది.


అర్జున్ ఇరిగేశి

అర్జున విజయం

చెస్ ప్రపంచకప్

పంజిమ్ (గోవా): చెస్ ప్రపంచకప్‌లో అర్జున్ ఇరిగేశి జోరు కొనసాగిస్తున్నాడు. శుక్రవారం మూడో రౌండ్ తొలి గేమ్‌లో షంషుద్దీన్ వొకిదోవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. తర్వాతి గేమ్‌లో అతడు డ్రా చేసుకున్నా ముందంజ వేస్తాడు. పెంటేల హరికృష్ణ కూడా విజయాన్ని అందుకున్నాడు. మూడో రౌండ్ తొలి గేమ్‌లో అతడు డానియల్ (బెల్జియం)పై నెగ్గాడు. మరోవైపు ఫ్రెడరిక్ స్వాన్ (జర్మనీ)తో తొలి గేమ్‌ను ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ డ్రా చేసుకున్నాడు. ప్రజ్ఞానందకు కూడా డ్రానే ఎదురైంది. రాబర్ట్ (ఆర్మేనియా)తో అతడు పాయింట్ పంచుకున్నాడు. టిటాస్ (లాత్వియా)పై ప్రణవ్ నెగ్గగా.. విన్సెంట్ (జర్మనీ)తో ప్రణేశ్ డ్రా చేసుకున్నాడు. విదిత్ గుజరాతి, దీప్తాయన్ ఘోష్, ఎస్.నారాయణన్, కార్తీక్ వెంకట రామన్ గేమ్‌లు కూడా డ్రా అయ్యాయి.


శీతల్ దేవి

ఆ అమ్మాయికి పుట్టుకతోనే రెండు చేతులూ లేవు. అలాంటి అమ్మాయిని చూడగానే అందరికీ అయ్యో పాపం అనిపిస్తుంది. జాలి కలుగుతుంది. కానీ అదే అమ్మాయి తనకు చేతుల్లేవని కుంగిపోలేదు. కాళ్లతో చెట్లు ఎక్కింది. విల్లును పట్టి బాణాలు వదిలింది. ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. పారాలింపిక్ పతకం గెలిచింది. ఇప్పుడు ఏకంగా వైకల్యం లేని సాధారణ ఆర్చర్లతో పోటీ పడి అంతర్జాతీయ టోర్నీకి అర్హత సాధించింది. మరి ఆ అమ్మాయి వైకల్యాన్ని చూసి మనం జాలి పడాలా? లేక తన సంకల్పాన్ని చూసి స్ఫూర్తి పొందాలా?

శభాష్ శీతల్

ఈనాడు క్రీడావిభాగం

ఎప్పుడూ తుపాకులు.. బాంబుల మోతతో దద్దరిల్లే జమ్ము-కశ్మీర్‌లో పుట్టింది శీతల్. 2007 జనవరి 10న ఆమె పుట్టిన రోజు తల్లిదండ్రుల్లో రవ్వంత కూడా సంతోషం లేదు. తనను చూడగానే వాళ్ల ఊపిరి ఆగిపోయినంత పనైంది. కారణం.. తనకు రెండు చేతులూ లేవు. ఫొకోమెలియా అనే అరుదైన వ్యాధి కారణంగా వైకల్యంతో పుట్టింది శీతల్. పెరిగి పెద్దయ్యే కొద్దీ ఈ అమ్మాయి ఎలా బతకగలదు.. ఏం చేయగలదు.. తమ తర్వాత తనను ఎవరు చూసుకోగలరు అని దిగులు చెందారు తల్లిదండ్రులు. అయితే చేతులు లేకపోయినా కాళ్లతోనే అన్ని పనులూ చేసుకోవడం అలవాటు చేసుకుంది శీతల్. తమ ప్రాంతంలో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తూ కేవలం కాళ్ల సాయంతోనే చెట్లు ఎక్కడం మొదలుపెట్టింది. శీతల్ దేవి ప్రతిభ గురించి తెలిసి సైన్యాధికారులు ఆశ్చర్యపోయారు. తనకు ప్రోత్సాహం ఇవ్వాలనుకున్నారు. కృత్రిమ చేతులు పెట్టించి క్రీడల్లోకి తీసుకెళ్లాలనుకున్నారు. కానీ వైద్యులు శీతల్‌ను పరిశీలించి తనకు కృత్రిమ చేతులూ అమర్చలేమని తేల్చేశారు. అలా అని శీతల్ ఏమీ నిరాశ చెందలేదు. ఆటల్లోకి అడుగుపెట్టాలనుకుంది. కేవలం కాళ్లతో ఆడే ఫుట్‌బాల్ లాంటి ఆటను ఎంచుకుంటుందేమో అనుకుంటే.. ఆమె మాత్రం ఆర్చరీ వైపు అడుగులు వేసింది. 2012 పారాలింపిక్స్‌లో నోటితోనే బాణాలు సంధించి ఆర్చరీలో రజతం అందుకున్న షుజ్ మ్యాన్ ప్రదర్శనను టీవీలో చూసి తననే స్ఫూర్తిగా తీసుకుంది. చాలా వేగంగా విలువిద్యలో నైపుణ్యం సంపాదించిన శీతల్.. కాళ్లతో బాణం పట్టుకుని.. భుజం, మెడ సాయంతో గురి తప్పకుండా బాణాలు విసరడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. 2023లో శీతల్ ఆర్చరీలో అడుగుపెడితే.. ఏడాది తిరక్కముందే ఆమె ప్రపంచ పారా ఆర్చరీలో రజతం గెలవడం విశేషం. రెండు చేతులూ లేకుండా ప్రపంచ పారా ఆర్చరీలో పతకం గెలిచిన తొలి అమ్మాయి శీతలే కావడం విశేషం. ఆపై ఆమె ఆసియా పారా ఆర్చరీలో రెండు స్వర్ణాలు, ఓ రజతం గెలిచింది. చూస్తుండగానే ఆమె పారా ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ కూడా అయింది.

అక్కడే ప్రపంచానికి పరిచయం..: ప్రపంచ ఆర్చరీలో మెరిసినా.. ఆసియా టోర్నీలో అదరగొట్టినా రాని పేరు నిరుడు పారాలింపిక్స్‌తో వచ్చింది శీతల్‌కు. చిన్న చిన్న వైకల్యాలతో పారాలింపిక్స్ ఆడుతున్న అథ్లెట్లతో పోటీ పడుతూ.. రెండు చేతులూ లేకపోయినా అదిరే గురితో బాణాలు వేస్తున్న శీతల్‌ను చూసి క్రీడా ప్రపంచం ఆశ్చర్యపోయింది. వ్యక్తిగత విభాగంలో మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ త్రుటిలో పతకం కోల్పోయిన ఆమె.. రాకేశ్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్లో కాంస్యం అందుకుంది. పారిస్ క్రీడలకే శీతల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో ఇంకా గొప్ప ప్రదర్శన చేసింది శీతల్. ఒకే టోర్నీలో మూడు పతకాలు కొల్లగొట్టింది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన శీతల్.. టీమ్, మిక్స్‌డ్ ఈవెంట్లలో రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఇవన్నీ ఒకెత్తయితే.. ఇప్పుడు ఏ వైకల్యం లేని సాధారణ అథ్లెట్లతో పోటీ పడి ఆసియా ఆర్చరీ స్టేజ్-3 పోటీలకు అర్హత సాధించడం మరో ఎత్తు. జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో దేశవ్యాప్తంగా 60 మంది మహిళా ఆర్చర్లు పోటీ పడితే.. అందులో 59 మంది చేతులతో బాణాలు వేశారు. శీతల్ మాత్రం కాళ్లు, మెడ, భుజం సాయంతో బాణాలు విసిరి అంతమందిలో మూడో స్థానం సాధించింది. ఈ ప్రదర్శన ఎంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పాలా? "నేను ఆటలోకి వచ్చినపుడు ఏదో ఒక రోజు సాధారణ ఆర్చర్లతో కలిసి పోటీపడాలనుకున్నా. మొదట్లో ఇబ్బంది పడ్డా, ఎదురు దెబ్బలు తగిలినా తట్టుకున్నా. ఈ రోజు నా కలకు చేరువగా నిలిచా" అని ఈ ప్రదర్శన అనంతరం శీతల్ చెప్పింది. చిన్న చిన్న అడ్డంకులకే ఆగిపోయే వాళ్లందరికీ.. రెండు చేతుల్లేకపోయినా ఆర్చరీలో ఆమె సాధించిన నైపుణ్యం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

మెరిసిన పేసర్లు.. దక్షిణాఫ్రికా-ఎ 221 ఆలౌట్


ప్రసిధ్ కృష్ణ 3/35

బెంగళూరు: పేసర్లు సమష్టిగా సత్తాచాటడంతో దక్షిణాఫ్రికా-ఎతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టుపై ఇండియా-ఎ పట్టు సాధించింది. పేసర్లు మహ్మద్ సిరాజ్ (2/61), ఆకాశ్‌దీప్ (2/28), ప్రసిద్ధ్ కృష్ణ (3/35) అదరగొట్టడంతో తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా-ఎ 221 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మార్క్వెస్ ఎకర్‌మన్ (134; 118 బంతుల్లో 17×4, 5×6) ఒంటరి పోరాటం చేశాడు. 34 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-ఎ శుక్రవారం, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 78/3తో నిలిచింది. సాయి సుదర్శన్ (23; 38 బంతుల్లో 5×4), దేవ్‌దత్ పడిక్కల్ (24; 42 బంతుల్లో 3×4) మంచి ఆరంభాల్ని భారీస్కోర్లుగా మలచలేకపోయారు. మరో రెండు రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ఇండియా-ఎ 112 పరుగులు ఆధిక్యంలో ఉంది. కేఎల్ రాహుల్ (26 బ్యాటింగ్; 57 బంతుల్లో 3×4), కుల్‌దీప్ యాదవ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇండియా-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌటైంది.

10 జట్లతో.. మహిళల ప్రపంచకప్

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచకప్‌లో పోటీపడే జట్ల సంఖ్యను పెంచాలని ఐసీసీ నిర్ణయించింది. 2029లో 10 జట్ల మధ్య మెగా టోర్నీ జరగనుంది. ప్రస్తుతం ఎనిమిది జట్లు ఆడుతున్నాయి. "తాజాగా మహిళల ప్రపంచకప్‌నకు ఎంతో ఆదరణ లభించింది. దాదాపు 3 లక్షల మంది అభిమానులు స్టేడియాలకు వచ్చి మ్యాచ్‌లను వీక్షించారు. డిజిటల్ వేదికలో 500 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. అందుకే 2029 ప్రపంచకప్‌లో పది జట్లను ఆడించాలని నిర్ణయించాం" అని ఐసీసీ పేర్కొంది. దుబాయ్‌లో బోర్డు సమావేశంలో వివిధ అంశాలపై ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఆదాయంలో అసోసియేట్ దేశాలకు ఇచ్చే వాటాను 2026 ఏడాదికి 10 శాతం పెంచనున్నట్లు ఐసీసీ తెలిపింది. ఐసీసీ మహిళల క్రికెట్ కమిటీలో భారత దిగ్గజం మిథాలీరాజ్‌కు స్థానం దక్కింది. ఆమెతో పాటు ఆష్లీ డిసిల్వా, అమోల్ మజుందార్, బెన్ సాయెర్, చార్లోట్ ఎడ్వర్డ్స్, స్టెల్లా సియాలె ఈ కమిటీలో ఉన్నారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ మొహసిన్ నఖ్వీ ఆసియా కప్ విజేత టీమ్‌ఇండియాకు ట్రోఫీ అందకుండా చేయడాన్ని సమావేశం సందర్భంగా బీసీసీఐ లేవనెత్తింది. ఈ సమస్య పరిష్కారానికి ఐసీసీ ఓ కమిటీని నియమించినట్లు సమాచారం.

వచ్చే ఐపీఎల్‌లో ధోని ఆడతాడు: సీఎస్కే

దిల్లీ: మహేంద్ర సింగ్ ధోని వచ్చే ఐపీఎల్‌లో ఆడడం ఖాయమైంది. ఈ విషయాన్ని చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా వెల్లడించింది. "2026 ఐపీఎల్ సీజన్‌కు అందుబాటులో ఉంటున్నట్లు ధోని వెల్లడించాడు" అని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ చెప్పాడు. రాబోయే సీజన్లో ఆటగాళ్ల మార్పిడి, ఆటగాళ్లను దక్కించుకోవడం తదితర విషయాలను చర్చించడానికి వచ్చేవారం జరిగే సీఎస్కే సమావేశంలో ధోని పాల్గొంటున్నట్లు తెలిసింది. రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు గాయం కావడంతో గతేడాది ఐపీఎల్‌లో చెన్నైని ధోని నడిపించాడు.

స్మృతి, జెమీమా, రాధలకు తలో రూ.2.25 కోట్లు


స్మృతి మంధాన

ముంబయి: భారత మహిళా క్రికెటర్లు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రాధ యాదవ్‌లను మహారాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముగ్గురు క్రికెటర్లు ఒక్కొక్కరికి రూ.2.25 కోట్లు నగదు బహుమతితో సన్మానించారు. "స్మృతి, జెమీమా, రాధ.. మహారాష్ట్రను గర్వపడేలా చేశారు. మీ విజయం రాష్ట్రానికి ఎంతో ఆనందాన్ని అందించింది. సెమీఫైనల్లో జెమీమా సెంచరీ టోర్నీలో కీలక మలుపు. ఆ శతకం భారత్‌ను ఫైనల్‌కు చేర్చింది. ఒక కుటుంబంలా పోరాడటం జట్టు సమష్టి కృషికి నిదర్శనం" అని ఫడణవీస్ తెలిపారు. చీఫ్ కోచ్ అమోల్ మజుందార్‌కు రూ.22.5 లక్షలు అందజేశారు. బౌలింగ్ కోచ్ ఆవిష్కార్ సాల్వి, మాజీ దిగ్గజం డయానా ఎడుల్జీ, అనలిస్ట్ అనిరుద్ధ దేశ్‌పాండేతో సహా మిగతా సహాయక సిబ్బంది ఒక్కొక్కరికి రూ.11 లక్షలు చొప్పున బహుకరించారు. 1

ఆట వేగాన్ని తగ్గించండి..

హర్మన్‌కు సచిన్ సలహా


హర్మన్‌ప్రీత్ కౌర్

దిల్లీ: 'ఆట చాలా వేగంగా సాగుతున్నప్పుడు నెమ్మదించేలా చేయండి' ఇది భారత మహిళల జట్టుకు దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ ఇచ్చిన సలహా. దక్షిణాఫ్రికాతో ప్రపంచకప్ ఫైనల్ ముందు సచిన్ ఫోన్ చేసి విలువైన సలహాలు ఇచ్చారని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. "ఫైనల్‌కు ముందురోజు రాత్రి సచిన్ సర్ నుంచి కాల్ వచ్చింది. ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. జట్టును సమతూకంగా ఉంచుకోవాలని చెప్పారు. మ్యాచ్ వేగంగా సాగుతున్నప్పుడు ఆ వేగాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలని.. లేకపోతే అవకాశాలు చేజారుతాయని సలహా ఇచ్చారు" అని హర్మన్ గుర్తు చేసుకుంది. ఫైనల్ ముగిసి అయిదు రోజులైనా ఇంకా ఈ విజయం నమ్మశక్యంగా అనిపించట్లేదని ఆమె తెలిపింది. "మా జట్టు సభ్యులను ఒకరినొకరు చూసినప్పుడు 'మనం ప్రపంచ ఛాంపియన్లం' అనుకుంటున్నాం. ఆ అనుభూతి చాలా భిన్నంగా ఉంది. మా అమ్మా, నాన్నతో కలిసి ప్రపంచకప్ విజయాన్ని ఆనందించడం చాలా గొప్పగా అనిపించింది. కప్ నెగ్గాం అనే ఆలోచన ఇంకడానికి చాలా రోజులు పడుతుందేమో. అప్పుడు మేం సాధించింది ఎంత గొప్ప విజయమో అర్థం అవుతుంది" అని హర్మన్ చెప్పింది.

పాక్‌పై భారత్ విజయం


భారత బృందం

హాంకాంగ్: రాబిన్ ఉతప్ప (28; 11 బంతుల్లో 2×4, 3×6), భరత్ చిప్లి (24; 13 బంతుల్లో 2×4, 2×6) సత్తాచాటడంతో హాంకాంగ్ ఇంటర్నేషనల్ సిక్సెస్‌లో భారత్ మెరిసింది. శుక్రవారం పూల్-సి పోరులో భారత్ రెండు పరుగుల ఆధిక్యం (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి)తో పాక్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 6 ఓవర్లలో 4 వికెట్లకు 86 పరుగులు సాధించింది. కెప్టెన్ దినేశ్ కార్తీక్ (17 నాటౌట్; 6 బంతుల్లో 2×4, 1×6) రాణించాడు. అనంతరం వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి పాక్ 3 ఓవర్లలో ఒక వికెట్‌కు 41 పరుగులు సాధించింది. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 2 పరుగుల ఆధిక్యంతో భారత్ విజేతగా నిలిచింది.

జహనార ఆరోపణలపై బీసీబీ విచారణ

ఢాకా: 2022 వన్డే ప్రపంచకప్ సందర్భంగా మాజీ సెలెక్టర్ తనతో అనుచితంగా ప్రవర్తించాడంటూ పేసర్ జహనార ఆలం చేసిన ఆరోపణలపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విచారణ చేపట్టనుంది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. 15 పని దినాల్లో ఈ కమిటీ తన నివేదికను సమర్పించాలని బీసీబీ ఆదేశించింది. "కొందరు వ్యక్తులు దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు బంగ్లా జాతీయ మహిళా జట్టు మాజీ సభ్యురాలు మీడియాలో చేసిన ఆరోపణల్ని బీసీబీ గుర్తించింది. ఇది సున్నితమైన విషయం కాబట్టి ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని బీసీబీ నిర్ణయించింది" అని బీసీబీ పేర్కొంది.

ఫైనల్లో రిబకినా


రిబకినా

రియాద్: డబ్ల్యూటీఏ ఫైనల్ టెన్నిస్ టోర్నీలో రిబకినా (కజకిస్థాన్) టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆమె 4-6, 6-4, 6-3తో పెగులా (అమెరికా)ను ఓడించింది. తొలి సెట్లో రిబకినా తడబడింది. 25 అనవసర తప్పిదాలు చేసి సెట్‌ను ప్రత్యర్థికి అప్పగించింది. కానీ అక్కడ నుంచి రిబకినా పుంజుకుంది. దూకుడుగా ఆడి వరుసగా రెండు సెట్లు గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. సబలెంకా (బెలారస్)-అనిసిమోవా (అమెరికా) మధ్య సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో రిబకినా తలపడనుంది.

పెరటి కూరగాయలు విక్రయించిన అస్సాం విద్యార్థులు



అస్సాంలోని డిబ్రూగఢ్ ప్రభుత్వ పాఠశాల తరగతి గది పాఠాలను విద్యార్థులు ప్రత్యక్ష అనుభవంతో తెలుసుకోవాలని ఓ ప్రయోగం చేసింది. ఈ మేరకు నగరంలోని మధుపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు రహదారి పక్కన కూరగాయలు విక్రయించారు. స్వావలంబన, ఆచరణాత్మక జీవన నైపుణ్యాలను వారికి అలవర్చేందుకు విద్యాశాఖ అధికారులే ఈ ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద పెంచిన పొట్లకాయలు, ఆకుకూరలు, చామగడ్డలు, బొప్పాయి, నిమ్మకాయల వంటివి తెచ్చి స్థానికులకు విక్రయించడం విశేషం. కొంతమంది వీరి వద్ద ఉత్సాహంగా కూరగాయలు కొని చిన్నారులను ప్రోత్సహించారు. "విద్యార్థులకు పని, డబ్బు విలువ గురించి చెప్పాలనుకున్నాం. అలాగే స్థానిక మార్కెట్లపై అవగాహన కల్పించాలని భావించాం. ఈ ప్రయోగంతో వారిలో ఆత్మవిశ్వాసం, స్వావలంబన భావనలు పెరుగుతాయి" అని ఉపాధ్యాయులు తెలిపారు. మిగతా పాఠశాలల్లోనూ ఈ విధమైన ప్రయోగాలు చేయాలని అస్సాం విద్యాశాఖ యోచిస్తోంది.

మ్యాజిక్ బాక్స్‌తో చిన్నారులకు విద్యాబోధన



ఆసియాలో అత్యంత ధనిక నగరపాలక సంస్థగా గుర్తింపు పొందిన 'బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్' (బీఎంసీ) తన పరిధిలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు పలువిధాలుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా కేజీ నుంచి రెండో తరగతి వరకు విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన 'మ్యాజిక్ బాక్స్' మంచి ఫలితాలను ఇస్తోంది. 2020-21 నుంచి బీఎంసీ పరిధిలోని 11,500 పాఠశాలల్లో అమలుచేస్తున్న ఈ విద్యా విధానంతో ప్రస్తుతం 70 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లలు అక్షరాలను, సంఖ్యలను తేలికగా గుర్తుపట్టేందుకు వీలుగా ఎస్‌సీఈఆర్‌టీ సహకారంతో ఈ కొత్త విధానాన్ని రూపొందించారు. లేసింగ్ బోర్డులు, టచ్ కార్డులు, కౌంటింగ్ బెడ్స్, రంగు రంగుల ఐస్‌క్రీమ్ పుల్లల కిట్లు, ఫింగర్ పప్పెట్స్ వంటి వస్తువులతో చిన్నారులకు బోధిస్తారు. తద్వారా చదవడం, రాయడం తేలికవుతుందని.. భిన్న ఆకృతుల్లో ఉన్న బొమ్మలతో గణితాన్ని సులభంగా అర్థం చేసుకుంటారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

దొంగచాటు అణు కార్యకలాపాలు
పాక్‌కు అలవాటే: భారత్

దిల్లీ: పాకిస్థాన్ రహస్యంగా అణ్వాయుధాలను పరీక్షిస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఆ వ్యాఖ్యలను తాము గమనించామంది. అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కి.. దొంగచాటుగా అణు కార్యక్రమాలను నిర్వహించడంలో పాకిస్థాన్‌కు చరిత్ర ఉందని శుక్రవారం విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వ్యాఖ్యానించారు. 'అక్రమ రవాణా, ఎగుమతుల నియంత్రణ ఉల్లంఘనలు, రహస్య భాగస్వామ్యాలకు, అబ్దుల్ ఖదీర్ ఖాన్ నెట్‌వర్క్, దాని విస్తరణకు దశాబ్దాలుగా పాకిస్థాన్ కేంద్రంగా ఉంది" అని జయస్వాల్ పేర్కొన్నారు. ఈ అంశాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి భారత్ ఎల్లప్పుడూ తీసుకెళ్తూనే ఉంటుందన్నారు. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని గతవారం ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్న విషయం తెలిసిందే.



జీవనశైలి వ్యాధులు దూరం కావాలంటే..

మధుమేహం, స్థూలకాయంలాంటి జీవనశైలి జబ్బులు ఔషధాలతో మాత్రమే పూర్తిగా నయం కావు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటేనే ఫలితముంటుంది. ఆహారంలో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు, ఆరోగ్యకర కొవ్వులు సమృద్ధిగా ఉండే పదార్థాలు తీసుకోవాలి. వ్యాయామాల్లో భాగంగా బరువులు ఎత్తడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. రోజూ ఒకే సమయానికి నిద్రపోవాలి. ధ్యానం, యోగా లాంటి ప్రక్రియలతో ఒత్తిడిని తగ్గించుకోవాలి.

– శ్రేయా షా, న్యూట్రిషనిస్ట్

మధుమేహం ఉంటే
అమెరికా వీసా రాదు!

ఇంటర్నెట్ డెస్క్: వలసదారులపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కొత్త నిబంధన తీసుకొచ్చారు. మధుమేహం, స్థూలకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వీసాలను తిరస్కరించాలనే కొత్త నిబంధనలను రూపొందించారు. ఈ మేరకు అమెరికా ఎంబసీలు, కాన్సులర్ కార్యాలయాలకు అగ్రరాజ్య విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



సాధారణంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఆరోగ్య స్థితిని ఇమిగ్రేషన్ అధికారులు పరిశీలిస్తారు. క్షయ వంటి అంటువ్యాధులు ఉన్నాయో లేదో స్క్రీనింగ్ చేస్తారు. ఈ నిబంధనలను తాజాగా సవరించారు. మరిన్ని వ్యాధులను ఈ జాబితాలో చేరుస్తూ మార్గదర్శకాలు రూపొందించారు. అంటే.. ఇకపై వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారి వైద్య సమాచారం (మెడికల్ హిస్టరీ)పై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు. వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారా? వారిని అమెరికాలోకి అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడనుందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని వీసా జారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఇవీ మార్గదర్శకాలు..

"హృద్రోగ సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, జీవక్రియ, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని సంరక్షించాలంటే లక్షల డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒబెసిటీతో ఆస్తమా, స్లీప్ ఆప్నియా, హై బీపీ వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వ్యాధిగ్రస్తులకు సుదీర్ఘ వైద్య సంరక్షణ అవసరం. ఆర్థిక భారం కూడా ఎక్కువే. అందుకే వలసదారుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి వారు ప్రభుత్వ వనరులపై ఆధారపడతారో లేదో గుర్తించాలి. ఒకవేళ అలాంటి వారైతే అమెరికాలోకి ప్రవేశాన్ని తిరస్కరించాలి" అని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

కుటుంబసభ్యుల ఆరోగ్యంపైనా ఆరా!

వలసదారులు ప్రభుత్వ సాయం లేకుండా వైద్య చికిత్సలను సొంతంగా భరించగలరా లేదా? అన్నది నిర్ధారించుకోవాలని వీసా సిబ్బందిని విదేశాంగశాఖ అధికారులు ఆదేశించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిశీలించాలన్నారు. ఈ వార్తలపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించలేదు.

సైబర్ నేరగాళ్ల వలలో టీఎంసీ ఎంపీ

ఇంటర్నెట్ డెస్క్: సైబర్ నేరగాళ్లు ఏకంగా పార్లమెంటు సభ్యుడినే బోల్తా కొట్టించారు. నకిలీ కేవైసీతో ఆయన ఖాతా నుంచి రూ.56 లక్షలు కాజేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీకి కోల్‌కతాలోని ఎస్‌బీఐలో ఉన్న ఖాతా నుంచి ఈ డబ్బు కొల్లగొట్టారు.



కల్యాణ్ బెనర్జీ

బెనర్జీ ఖాతాకు సంబంధించిన కేవైసీని అప్‌డేట్ చేయడానికి మోసగాళ్లు నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించారు. ఖాతాలకు అనుసంధానం చేసి ఉన్న రిజిస్టర్డ్ మొబైల్ నంబరును మార్చారు. ఈ వివరాలన్నీ మారిన తర్వాత ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదుపాయం ద్వారా పలు మార్లు లావాదేవీలు నిర్వహించి మొత్తం రూ.56 లక్షలు అపహరించారు. ఈ డబ్బును వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసి, బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం. కొంత మొత్తాన్ని ఏటీఎంల ద్వారా విత్‌డ్రా చేసుకున్నారని తెలుస్తోంది. సైబర్ నేరగాళ్ల బారినపడిన ఎంపీ ఖాతా కొంతకాలంగా క్రియాశీలంగా లేదు. ఇటీవల లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఎంపీ బ్యాంకు అధికారులను అప్రమత్తం చేయడంతో వారు సైబర్ క్రైమ్ కింద ఫిర్యాదు చేశారు.



చైనా అమ్ములపొదిలోకి మూడో విమానవాహక నౌక

బీజింగ్: ఫుజియాన్ పేరుతో తన మూడో విమానవాహక నౌకను చైనా రాంఛనంగా నేవీలో చేర్చింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన ఈ విమానవాహక నౌకను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం హైనాన్ ప్రావిన్స్‌లోని సాన్యా రేవు వద్ద ప్రారంభించారు. శుక్రవారం దీన్ని చైనా అధికారిక మీడియా వెల్లడించింది. ఫుజియాన్‌లో విద్యుదయస్కాంత (ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్-ఈమాల్స్) వ్యవస్థను ఏర్పాటు చేశారు. విమాన వాహకనౌక డెక్ నుంచి యుద్ధవిమానాలను వేగంగా, సాఫీగా గగనంలోకి పంపడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇలాంటి వ్యవస్థ.. అమెరికాకు చెందిన యూఎస్‌ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో మాత్రమే ఉంది. ఫుజియాన్ బరువు 80వేల టన్నులు. పొడవు 316 మీటర్లు. దీనికి దాదాపు 50 విమానాలను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. ఫుజియాన్ అందుబాటులోకి రావడంతో విమాన వాహకనౌకలను భారతదేశ సమీపంలో చైనా మోహరించే అవకాశం కనిపిస్తోంది.

మహారాష్ట్రలో వివాదాస్పద భూ కేటాయింపు రద్దు
అజిత్ పవార్ ప్రకటన

ముంబయి: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌తో సంబంధం ఉన్న సంస్థకు రూ. 1800 కోట్ల విలువ చేసే భూమిని కేవలం రూ. 300 కోట్లకే కేటాయించిన ఉదంతం కొత్త మలుపు తిరిగింది. ఈ భూ కేటాయింపును రద్దు చేస్తున్నట్టు అజిత్ పవార్ ప్రకటించారు. ఈ వ్యవహారంపై విచారణ పారదర్శకంగా జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూకేటాయింపుపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నెల రోజుల్లో నివేదిక సమర్పిస్తుందన్నారు.

మోదీ గొప్ప వ్యక్తి..
త్వరలో భారత పర్యటనకు వెళ్తా: ట్రంప్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని స్వయంగా సంకేతం ఇచ్చిన ట్రంప్.. ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. శ్వేతసౌధంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మోదీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయి' అని తెలిపారు. 'రష్యా నుంచి చమురు కొనడం భారత్ చాలావరకు మానేసింది. మోదీ నాకు గొప్ప స్నేహితుడు. మా మధ్య చర్చలు జరుగుతున్నాయి. నేను అక్కడికి రావాలని ఆయన కోరుకుంటున్నారు. దాన్ని పరిశీలిస్తున్నాం. నేను వెళ్తాను. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి' అని ట్రంప్ ప్రశంసించారు. ఈ క్రమంలో వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించాలనే ఆలోచన ఏమైనా ఉందా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు.. 'అలా కావొచ్చు. అవును' అని బదులిచ్చారు. కాగా.. ట్రంప్ పర్యటనపై వైట్‌హౌస్ ఎలాంటి ప్రకటన చేయలేదు. త్వరలో ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాతో భారత్ క్వాడ్ సమావేశం నిర్వహించనుంది. సంబంధిత తేదీలను ఇంకా వెల్లడించలేదు.

ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయగలం

ఇంటర్నెట్‌డెస్క్: తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయచ్చని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అణు నిరాయుధీకరణ గొప్ప విషయమని, ఈ అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్‌తో చర్చించినట్లు వెల్లడించారు. మయామిలో జరిగిన అమెరికన్ బిజినెస్ ఫోరమ్‌లో ఈ మేరకు మాట్లాడారు. 'అణు నిరాయుధీకరణ అనేది గొప్ప విషయం. మా వద్ద ఉన్న అణ్వాయుధాలతో మేం ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయగలం. అయితే ఆ అవసరం లేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

దిల్లీ, ముంబయి విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్య

- ఆలస్యంగా నడిచిన విమానాలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు జైపుర్, లఖ్‌నవూ, వారణాసి, ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లోనూ శుక్రవారం ఇదే పరిస్థితి ఏర్పడింది. తొలుత దిల్లీ విమానాశ్రయంలో ఏర్పడిన ఈ సమస్య.. తర్వాత ఇతర ఎయిర్‌పోర్ట్‌లకు ఎదురవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దిల్లీలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తడంతో 800కుపైగా దేశీయ, అంతర్జాతీయ సర్వీసులపై ప్రభావం పడింది. ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్‌లైన్స్‌లకు చెందిన విమానాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఆటోమేటిక్ మెసేజ్ స్విచ్చింగ్ వ్యవస్థలో సమస్య ఎదురైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు విమాన ప్రయాణ సంకేతాలు వాటంతటవే అందడం లేదని పేర్కొన్నాయి. అయితే.. సమస్యను పరిష్కరించినట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) శుక్రవారం రాత్రి తెలిపింది. ఈ సాంకేతిక సమస్యకు సైబర్ దాడే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శంషాబాద్‌లోనూ అంతరాయం

శంషాబాద్, న్యూస్‌టుడే: దిల్లీ విమానాశ్రయం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌లో శుక్రవారం తెల్లవారుజామున తలెత్తిన భారీ సాంకేతిక లోపం కారణంగా హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి దిల్లీకి రాకపోకలు సాగించాల్సిన 70 విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. రెండు మూడు గంటలు ఆలస్యంగా విమానాలు నడిచాయి.

మాట కంటే నాకు పాటే తేలిక
ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా



మాట్లాడుతున్న ఇళయరాజా, పక్కన సుధాకర్, రవి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: 'మాట్లాడటం కంటే పాటలు పాడటమే నాకు తేలిక. నేను మాటల వాడిని కాదు.. పాటల వాడిని' అని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చమత్కరించారు. నిజజీవితంలో ఎదుర్కొన్న సంఘటనలు, సంఘర్షణల నుంచే తన స్వరాలు పుట్టాయని, వాటినే పాటలుగా మలిచానని పేర్కొన్నారు. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో తొలిసారిగా ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఈ నెల 8న ఇళయరాజా మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇళయరాజా.. ట్రెండ్ సెట్టర్స్ లైవ్ అధినేత సుధాకర్, పద్మనాభుని రవిలతో కలిసి విజయవాడలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. 'నేను స్వరపరిచిన గీతాలను వింటే తమ జీవితాల్లో జరిగిన అనేక సంఘటనలు గుర్తొస్తుంటాయని చాలామంది చెబుతుంటారు. ఆ పాటలతోనే వారి జీవితంలోని అనేక ఘటనలు ముడిపడి ఉంటాయని ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. నా జీవన గమనంలో కళ్ల ముందు కనిపించిన ప్రతి పరిణామాన్నీ ఒక స్వరంగా మార్చాను. ప్రస్తుతం ఉన్న సంగీత దర్శకుల్లో చాలామంది తాము ఇళయరాజా స్థాయికి వెళ్లాలనుకుంటున్నామని చెబుతున్నారంటే అది దేవుడు నాకిచ్చిన వరం' అని అన్నారు.

దర్శనం టికెట్లు ఇచ్చే కియోస్క్‌లు!
త్వరలో ప్రధాన, ముఖ్య ఆలయాల్లో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో వంద కియోస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు. టచ్ స్క్రీన్ ఉండే వీటి ద్వారా భక్తులు దర్శనం, వివిధ సేవల టికెట్లు నేరుగా పొందొచ్చు. వీటిలో ఎన్ని టికెట్లు కావాలో నమోదుచేసి, డిజిటల్ చెల్లింపు చేస్తే.. వెంటనే టికెట్లు జారీచేస్తుంది. ఉద్యోగులు అవసరం లేకుండానే నేరుగా టికెట్లు పొందేలా వీలుకల్పిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కరూర్ వైశ్యా బ్యాంకు 100 కియోస్క్‌లను ఉచితంగా సమకూర్చేందుకు ముందుకొచ్చింది. వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ కూడా ఆ బ్యాంకే చూసుకోనుంది.

● ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి దేవాలయాల్లో 8 చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. ● ముఖ్య ఆలయాల(అరసవిల్లి, విశాఖ కనకమహాలక్ష్మి, తలుపులమ్మ, వాడపల్లి, పెనుగంచిప్రోలు, మోపిదేవి, పెదకాకాని, పెంచలకోన, తలకోన, ఈరన్నస్వామి, మహానంది, బేతంచెర్ల మద్దిలేటి నరసింహస్వామి, కసాపురం ఆంజనేయస్వామి, కదిరి లక్ష్మీనరసింహస్వామి, బోయకొండ గంగమ్మ)ల్లో మూడేసి కియోస్క్‌లు ఏర్పాటు చేస్తారు. ● వీటి ద్వారా భక్తులు చేసిన డిజిటల్ చెల్లింపులు జమయ్యేందుకు ఆయా ఆలయాల పేరిట ఈవోలు కరూర్ వైశ్యా బ్యాంకులో ఖాతా తెరవాలని కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు.

మిషన్.. కళత్తూరు ఎస్సీ కాలనీ!

- చెరువు తెగి సర్వం కోల్పోయిన బాధితులకు సాంత్వన



వీధి శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఈనాడు– తిరుపతి, న్యూస్‌టుడే, కేవీబీపురం: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలోని రాయలచెరువుకు గండిపడి మూడు గంటల్లో ఐదు గ్రామాలు జలదిగ్బంధమైన నేపథ్యంలో.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో శుక్రవారం సహాయ చర్యలు తీవ్రం చేశారు. ఇళ్లు, వాహనాలు, పశువులు ఇలా సర్వం కోల్పోయిన కళత్తూరు ఎస్సీ కాలనీని సాధారణ స్థితికి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. గ్రామంలో 450 గృహాలు ఉండగా 600 మంది సిబ్బంది రంగంలోకి దిగారు. 5 అగ్నిమాపక శకటాలు రప్పించి, ప్రధాన వీధులను శుభ్రం చేయిస్తున్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలతో పాటు సమీప పంచాయతీల నుంచి 350 మంది పారిశుద్ధ్య సిబ్బందిని మోహరించారు. ఒక్కో ఇంటికి ఐదుగురు సిబ్బందిని కేటాయించి, అడుగున్నర మేర పేరుకుపోయిన బురదను తొలగిస్తున్నారు. గురువారమే పాతపాళ్యం, ఎస్సీకాలనీ, అరుంధతీవాడ, కళత్తూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం రాత్రి కళత్తూరు ఎస్సీకాలనీలో వీధి దీపాలను అందుబాటులోకి తెచ్చారు. ఇళ్లు ఇప్పటికీ తడిగా ఉన్నందున రెండురోజుల తర్వాత విద్యుత్తు ఇవ్వాలని ఎస్పీడీసీఎల్ అధికారులు నిర్ణయించారు. 50 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు, 100 వరకు విద్యుత్తు స్తంభాలు కొట్టుకుపోగా, 90 శాతం మేర పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. బాధితులకు పాఠశాలలో పునరావాసం, ఆహారం ఏర్పాటు చేశారు. ప్రతి కుటుంబానికి రూ.10వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించి, తక్షణ సాయంగా రూ.3వేలు అందించారు. మేకలు, గొర్రెలు కోల్పోతే.. ఒక్కో మూగజీవానికి రూ.7,500, ఆవుకు రూ.40 వేలు, గేదెలకు రూ.50 వేల చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చారు. స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకూ ప్రభుత్వం తరఫున చేయూతనందిస్తామని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వారి స్థితిగతులేమిటో చెప్పండి

- న్యాయవాదిని ఆదేశించిన హైకోర్టు
- తన కారు ఇచ్చి న్యాయవాదిని పిటిషనర్ల ఇంటికి పంపిన న్యాయమూర్తి

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఆమె మనవరాలు శ్యామల ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు నివేదించాలని న్యాయవాది రూపేష్‌ను హైకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ తన కారు, డ్రైవర్‌ను ఇచ్చి అప్పటికప్పుడే రాయపూడి గ్రామానికి రూపేష్‌ను పంపించారు. ఆ ఇద్దరి బాగోగులు చూసుకునేందుకు, వారికి రాయపూడి సమీపంలోనే పునరావాసం కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని సీఆర్‌డీఏ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. మానసిక వైద్యుడితో శ్యామల మానసిక స్థితిని అంచనా వేయించాలని కోరారు. వారిరువురి బాగోగులు ఇప్పటి వరకు చూసిన వెంకాయమ్మ ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో శేషగిరమ్మ, శ్యామల సంక్షేమం గురించి ఆలోచిస్తున్నామని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేశారు.

◆ నిరక్షరాస్యత కారణంగా తమ 5 సెంట్ల స్థలాన్ని పొరపాటున సీఆర్‌డీఏకు అప్పగించామని, దానిని తిరిగి అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన శేషగిరమ్మ, ఆమె కుమార్తె వెంకాయమ్మ, మనవరాలు శ్యామల హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. ఆ స్థలాన్ని తిరిగి ఇవ్వడం వీలుకాకుంటే తమకు కారుణ్య మరణాన్ని ప్రసాదించాలని పేర్కొన్నారు. హైకోర్టులో ఈ వ్యాజ్యం దాఖలు చేశాక వెంకాయమ్మ కన్నుమూశారు. శుక్రవారం జరిగిన విచారణలో సీఆర్‌డీఏ తరఫున న్యాయవాది ఎ.రామ్‌ధీరజ్ వాదనలు వినిపిస్తూ.. శేషగిరమ్మ, శ్యామలకు పునరావాసం కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల వివరాలను సమర్పించేందుకు సోమవారం వరకు సమయం కావాలని కోరారు.

మన్యానికి వచ్చాం.. మీ పంటలు మెచ్చాం
గుమ్మలక్ష్మీపురంలో విదేశీ బృందం పర్యటన

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ ప్రాంతంలో నాబార్డు సహకారంతో 'జట్టు' సంస్థ పర్యవేక్షణలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటల స్టాల్‌ను నాబార్డు రీజినల్ మేనేజర్ మహేష్ ప్రహాద్ సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం విదేశీ బృందం పరిశీలించింది. మలావీ దేశానికి చెందిన వ్యవసాయ, పరిశ్రమలు, పెట్టుబడుల కార్పొరేషన్ బృంద సభ్యులు పెంగవ, రాయఘడజమ్ము ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం, పశువులు, కోళ్లు, చేపల పెంపకంపై వివరాలు సేకరించారు. నాబార్డు ఏజీఎం దినేష్‌కుమార్ రెడ్డి, 'జట్టు' వ్యవస్థాపకుడు పారినాయుడు పాల్గొన్నారు.



చిరుధాన్యాల స్టాల్‌ను పరిశీలిస్తున్న విదేశీ బృంద సభ్యులు

తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్..
ఏపీలో రూ.5,642 కోట్ల పెట్టుబడులు
మంత్రి లోకేశ్ ప్రకటన

ఈనాడు, అమరావతి: తెలంగాణకు చెందిన ప్రీమియర్ ఎనర్జీస్ రూ.5,942 కోట్ల పెట్టుబడులతో 5 గిగావాట్ల సిలికాన్ ఇంగోట్, 4 గిగావాట్ల టాప్‌కాన్ సోలార్ సెల్ యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుందని మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'ఆ సంస్థ నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటు చేసే యూనిట్ ద్వారా సుమారు 3,500 మందికి ఉపాధి అవకాశాలు.. సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టం అభివృద్ధి చెందుతుంది. ఆ సంస్థకు 269 ఎకరాల భూములను ఏపీఐఐసీ ద్వారా రికార్డు సమయంలో అందించాం. 2024 అక్టోబరులో సంస్థతో సంప్రదింపులు ప్రారంభించాం. 2025 ఫిబ్రవరికి భూములు కేటాయించాం. ఆ ప్రాంతం పోర్టుకు సమీపంలో ఉండటంతో పాటు ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రోత్సాహకాల వల్ల ఈ యూనిట్ రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ప్లాంటు సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు విస్తరించాలన్న ప్రణాళిక ఉంది. దేశంలోనే రెండో అతి పెద్ద సోలార్ సెల్, మాడ్యూళ్ల తయారీ సంస్థ రాష్ట్రానికి రావడం గర్వంగా ఉంది. ఆ సంస్థకు ఏపీ స్వాగతం పలుకుతోంది. రాష్ట్రంలోని యువతకు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఉపాధి అవకాశాలను సంస్థ కల్పిస్తుంది' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు
రూ.10 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్‌కుమార్‌ను శుక్రవారం ఉదయం కర్నూలు మండలం ఉలిందకొండ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అక్టోబరు 24వ తేదీ తెల్లవారుజామున కర్నూలు నగర శివారులోని చెట్లమల్లాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రయాణికుడు నేలకుర్తి రమేశ్ ఫిర్యాదు మేరకు వీకావేరి బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, ట్రావెల్స్ యజమానిపై ఉలిందకొండ పోలీసుస్టేషన్‌లో బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యకు అప్పగించారు. అదే నెల 28న డ్రైవర్ లక్ష్మయ్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బస్సు యజమాని వినోద్‌కుమార్‌ను తాజాగా అరెస్టు చేసి ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి అనూష ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి అతడికి రూ.10 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు.

◆ కర్నూలు శివారులో ఇటీవల ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు అత్యవసర ద్వారానికి అడ్డుగా ఒక చోట స్లీపర్ బెర్త్ ఉన్నట్లు రవాణాశాఖ అధికారుల విచారణలో తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రమాద సమయంలో అందులోని ప్రయాణికులు తప్పించుకునేటప్పుడు ఇది కూడా ఓ అడ్డంకిగా మారి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

చోరీల్లో సెంచరీ చేశా.. నన్నేం చేయలేరు!

- వీడియోలో సవాలు విసిరిన నిందితుడు
- ఏకంగా ఆ ముఠానే పట్టుకున్న పోలీసులు



వీడియో రికార్డును నిందితుడికి చూపిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్. చిత్రంలో ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీలు కె.వి.వి.ఎన్. ప్రసాద్(నూజివీడు), శ్రావణ్‌కుమార్(ఏలూరు) తదితరులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: 'ఇప్పటి వరకు బండ్ల దొంగతనాల్లో సెంచరీ చేశా. గతంలో ఎన్నోసార్లు దొరికిపోయా. కొన్నాళ్లకే బయటకొచ్చేశా. పోలీసులు నన్నేమీ చేయలేరు' అంటూ ఓ దొంగ వీడియోలో సవాలు విసిరాడు. అది చూసిన పోలీసులు అతనితోపాటు ముఠా మొత్తాన్ని అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. నూజివీడు పరిసర ప్రాంతాల్లో కొన్నాళ్లుగా బైక్‌లు చోరీ అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే దులాయ్ గణేశ్ అలియాస్ నాగపవన్ ఇటీవల 'బైక్ చోరీల్లో సెంచరీ చేశా' అని ఓ వీడియో తీసుకొని, మిత్రులకు పంపాడు. అది సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులకు చేరింది. దీనిపై దృష్టిపెట్టిన పోలీసులు ఇటీవల ఐదుగురితో కూడిన దొంగల ముఠాను పట్టుకున్నారు. వారిని నూజివీడు రెల్లిపేటకు చెందిన దలాయ్ గణేశ్, గాంధీబొమ్మ కూడలికి చెందిన షేక్ మెహర్‌బాబా, ఎంఆర్ అప్పారావు కాలనీవాసులు షేక్ ఆసిఫుల్లా, చిత్తూరి అజయ్‌కుమార్, గొల్లపల్లికి చెందిన చౌటపల్లి సుభాష్‌గా గుర్తించారు. వారినుంచి 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వ్యసనాలకు అలవాటు పడి, డబ్బు కోసం చోరీలు చేస్తున్నారని తేలింది. పోలీసులకు సవాలు విసిరిన గణేశే ముఠాలోని ప్రధాన నిందితుడని గుర్తించి.. అతను చేసిన వీడియో రికార్డు ఆయనకే వినిపించారు. మద్యం మత్తులో అలా మాట్లాడానని, తప్పయిందని నిందితుడు తెలపడం కొసమెరుపు.

నేవీ గూఢచర్యం కేసులో మరో ఇద్దరికి జైలు శిక్ష

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: మన దేశ రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల పది నెలల కారాగార శిక్షతో పాటు చెరో రూ.ఐదు వేల జరిమానా చెల్లించాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో నిందితులు మరో ఏడాది అదనంగా జైలుశిక్షను అనుభవించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు దొరికిన నిందితులలో ఆరుగురికి శిక్ష పడినట్లయింది. ఎన్‌ఐఏ అధికారులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019 డిసెంబరులో విశాఖలోని నేవీ స్థావరాలకు చెందిన రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు సమాచారం అందటంతో ఎన్‌ఐఏ 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. విశాఖకు చెందిన కలవలపల్లి కొండబాబు, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అవినాశ్ సోమల్ నేవీ రహస్యాలను వాట్సప్, ఫేస్‌బుక్‌ల ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ వర్గాలకు అందించినట్లు గుర్తించింది. వీరిపై ఆరోపణలు రుజువు కావటంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ఇదే కేసులో గతంలో అబ్దుల్ రెహమాన్, హరూన్ లక్డావాలా, షైస్టా ఖైసర్, ఇమ్రాన్ గితేలీలకు జైలు శిక్ష పడింది.

మరోసారి బెంగళూరుకు జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ శుక్రవారం బెంగళూరుకు వెళ్లారు. సోమవారం సాయంత్రం బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చిన ఆయన.. మంగళవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. గురువారం వైకాపా విద్యార్థి విభాగం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం బెంగళూరుకు బయల్దేరి వెళ్లారు.

EENADU Vol: 52, Issue: 88 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao


GRAND WEDDINGS
Exclusive Wedding Collection
Celebrate your wedding shopping with RS Brothers
26850
₹19995
MEENA SAREES 3 CARD
WEDDING SPECIAL COLLECTION
₹30650
₹22995
MEENA SAREES 4 CARD
SILK SAREES
4150 ₹2995 VASTRAKALA PATTU SAREES
5350 ₹3995 PACIDI PATTU SAREES
5850 ₹4395 SWARNA PATTU SAREES
14850 ₹10995 KANCHI TRADITIONAL PATTU SAREES
21850 ₹15995 KANCHI CONTRAST PATTU SAREES
కంచి, ఉప్పాడ ,అరణి, ధర్మవరం, పట్టుచీరలు
కిడ్స్ వేర్ & మెన్స్ ఎత్నిక్ వేర్
Discover Fashion for Every Family Member!
R.S. Brothers
MEGA SHOPPING MALL
బీసెంట్ రోడ్ క్రాస్, ఏలూరు రోడ్ విజయవాడ
బందర్ రోడ్ విజయవాడ
1800 570 1000 Email : info@rsbrothers.net | Shop us @ www.rsbrothers.net Follow us on : RSBrothersIndia rsbrothersindia


సరికొత్త డిజైన్లలో
వివిధ వర్ణాల కంచి పట్టు చీరల
వెడ్డింగ్ కలెక్షన్
Wedding Mahotsav
The Celebrated Wedding Collection
పండుగలు లేదా మెహందీ, హల్దీ, పెళ్లి, రిసెప్షన్ వేడుక ఏదైనా మీరు నచ్చే ఏ రంగు అయినా మీరు మెచ్చే ఏ డిజైన్ అయినా...
అన్నీ కలిసి ఒకే చోట...
అదే సౌత్ ఇండియా షాపింగ్ మాల్
Wedding to Honeymoon
Get ₹49,999 worth voucher
For Every ₹20k Purchase in Pattu sarees, Mens Ethnic Wear & Gagra's and get a coupon.
CHANCE TO WIN HONEYMOON TRIP FOR 100 COUPLES 1st Nov - 15th Dec
SOUTH INDIA shopping mall
ఏలూరు రోడ్, బీసెంట్ రోడ్ క్రాస్, విజయవాడ - 2.
Shop Online 24x7 @ www.SISMO.in Follow us on: SouthIndiaShoppingMalls SouthIndiaShopping


THE BIGGEST JEWELLERY FEST
CMR JEWELLERY
For your golden moments !
మనోహరమైన ఆభరణాలపై సుమనోహరమైన డిస్కౌంట్
FLAT 50% V.A. తగ్గింపు
T&C APPLY
ఆఫర్ నవంబర్ 5 నుండి ప్రారంభం
SCAN TO LOCATE OUR NEAREST CMR STORE
100% B.I.S. Hallmark Jewellery
Customised Jewellery
Transparent Billing
Tested & Certified Diamonds
Guaranteed Repurchase
Best Flexi Purchase Plan
Sourced From Reputed Suppliers
Lifetime Maintenance
Guaranteed Value
Accurate seperation Of Stone Weight
STORES ACROSS ANDHRA PRADESH & TELANGANA
#YourFamilyJeweller
+91 63097 98686
M.G. ROAD, VIJAYAWADA 9133387115


ఈతరం

youthpage@eenadu.in

సముద్రానికి స్నేహితుడు

సరదాగా బీచ్‌కు వెళ్లామా.. ఏదైనా కొనుక్కుని తిన్నామా.. చెత్త అక్కడే పడేశామా.. మనలో చాలామంది చేసేది ఇది. కానీ ఇతను అలా కాదు. ఆ సముద్రతీరానికి ప్లాస్టిక్‌చెత్త వేసే సంకెళ్ల నుంచి విముక్తి ఇవ్వాలి అనుకున్నాడు. అప్పటినుంచి అదే పని మీద ఉన్నాడు. తన కృషిని ప్రధాని మోదీ మెచ్చుకునే స్థాయిలో పనిచేశాడు. కేరళకు చెందిన సుభాష్ చంద్రన్ ఈ స్ఫూర్తిదాయక ప్రయాణం తన మాటల్లోనే..

'2019లో నాటి ప్రభుత్వం విజయనగరం జిల్లాలో స్కూబా అకాడమీ ఏర్పాటుకు ఆలోచించింది. అప్పుడే మొదటిసారిగా విశాఖ వచ్చా. రెండు నెలలు గడిచాక ఆ ప్రాజెక్టు కొంత ఆలస్యమవ్వడంతో తిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నా. అప్పుడే కొందరు స్నేహితులు ఇక్కడే ఎందుకు స్కూబా డైవింగ్ నేర్పించకూడదన్నారు. కొంత అనాసక్తిగానే అంగీకరించా. దీనికోసం సంస్థను రిజిస్టర్ చేయించా. ఓరోజు రుషికొండ వద్ద సర్ఫింగ్ చేద్దామని మొదలుపెట్టాం. రెండు మీటర్లు ముందుకు వెళ్లామో లేదో భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కాళ్లకు తగిలాయి.



● నేను చాలా సముద్రాల్లో డైవింగ్ చేశా, ఇంత మొత్తంలో చెత్త పేరుకుపోవడం ఎక్కడా చూడలేదు. వెంటనే డైవింగ్ మాస్క్ తెచ్చుకొని 250 కేజీల ప్లాస్టిక్, వస్త్ర వ్యర్థాలను మరో స్నేహితుడితో కలిసి బయటకు తీశా. అదయ్యాక వంద మీటర్ల లోపల కింద చూస్తే చాలా చెత్త ఉంది. ఇక్కడే ఉండాలని అప్పుడే నిర్ణయించుకున్నా. ఇక అప్పటి నుంచి రోజూ రెండు గంటలు స్వచ్ఛ సముద్రం కార్యక్రమానికి శ్రీకారం చుట్టా. రోజుకు 600 నుంచి 1500 కేజీల చెత్త బయటకు తెస్తా. ఇలా ఇప్పటివరకు 2.50 లక్షల కేజీల చెత్త బయటకు తీశా. అయితే ఇదంతా నా ఒక్కడివల్లే కాలేదు.

వాలంటీర్లను తయారు చేసుకొని..



ఇప్పటివరకూ 26 వేల డైవ్స్ పూర్తిచేశా. 400 మందికి శిక్షణ ఇచ్చా. తరచూ బీచ్ శుభ్రత, అండర్ వాటర్ క్లీనింగ్ కోసం కార్యక్రమాలు నిర్వహిస్తుంటా. నేనే ఒక స్వచ్ఛంద సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నా. ప్రస్తుతం వందమంది వరకూ ఉన్నారు. స్కూబా డైవింగ్ మీద ఆసక్తి ఉన్న యువతకు మొదట పది రోజులపాటు శిక్షణ అందించి తర్వాత సముద్రంలోకి తీసుకువెళ్తా. వాళ్లతోనే వ్యర్థాలు తొలగింపజేసి, కోరల్స్ రీప్లాంట్ చేయిస్తాం. భవిష్యత్తులో ఈ చెత్తను రీసైక్లింగ్ చేయడానికి ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీంతో స్థానిక మత్స్యకారులకు ఉపాధి కల్పించొచ్చు.

కోరల్స్ కోసం..: మొదట్లో స్కూబాను కమర్షియల్ యాక్టివిటీగా నడిపా. ఇప్పుడు అలా చేయడం మానేశా. విశాఖ తీరంలో పగడపు దిబ్బలు ప్రమాదకర స్థితిలో తగ్గిపోవడాన్ని గమనించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నిర్ణయించుకున్నా. మా సంస్థను ఎన్జీవోగా రిజిస్టర్ చేయించా. వాస్తవానికి ఆక్సిజన్ అందించడంలో కోరల్స్ పాత్ర ముఖ్యమైనది. ఇవి కాలుష్య కారకాలతో నిండిపోవడంతో అవసరమైన ఆక్సిజన్‌ను విడుదల చేయలేకపోతున్నాయి. అదే జరిగితే జీవరాశుల మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అందుకే కోరల్స్ రీప్లాంటేషన్ ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టా. మొదట విశాఖలోని ఒక తీరంలో దీన్ని విజయవంతం చేసి మిగిలిన తీరాల్లో చేపడతా. ఇందుకోసం ఇప్పటికే సొంత డబ్బులు వాడి, బంగారం తాకట్టు పెట్టి మరీ పనిచేశా, విరాళాలు సేకరిస్తున్నా. ప్రభుత్వం ప్రోత్సహిస్తే త్వరితగతిన ముందుకు తీసుకువెళ్తా.

ఒకచోట విజయవంతం చేసి..

విశాఖలోని తిమ్మాపురం తీరం సీఆర్‌జెడ్ పరిధిలో ఉంది. మురుగుకాలువల నుంచి వచ్చే వ్యర్థాలతో చేపలు చనిపోతున్నాయి. దీంతో చేపలు తినే ఆల్గే పెరిగిపోవడంతో కోరల్స్ వృద్ధి తగ్గిపోతోంది. జీవీఎంసీ సహకారంతో ఇప్పటికే మురుగునీరు సముద్రంలో కలవకుండా చేశాం. చెత్త వేయకుండా బిన్లు, సూచికలు, కెమెరాలు ఏర్పాటుచేశాం. స్థానిక మత్స్యకారుల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. అనంతరం నీటి అడుగున 50 మీటర్లలో అండర్ వాటర్ నెట్ మెష్ ఏర్పాటుచేస్తాం. ఆ పరిధి లోపలున్న చెత్త క్లీన్ చేసి అక్కడ కోరల్స్ పెంచుతాం. సముద్రం లోపల మంచి కోరల్స్‌ను గుర్తించి కొన్ని ఇక్కడికి తీసుకొచ్చి డ్రిల్ చేసి రీప్లాంట్ చేస్తాం. అలా అన్ని తీరాలనూ కోరల్స్‌తో అభివృద్ధి చేస్తే సముద్ర జీవరాశి అద్భుతంగా పెరుగుతుంది. మానవాళికి ఉపయోగపడుతుంది.

– సురేశ్ రావివలస, విశాఖపట్నం

రంగుల లోకంలో విహరిద్దాం!

'నీకే రంగంటే ఇష్టం?'

ఎవరినైనా కొత్తగా పరిచయం చేసుకునేటప్పుడు అడిగే ప్రశ్న.

'ఆ డార్క్ గ్రీన్ కలర్ టాప్ ఏంటి అసలు.. ఎవ్వరైనా వేసుకుంటాడా?'

అదే వ్యక్తి కాస్త ఫ్రెండ్ అయ్యాక వచ్చే జడ్జిమెంట్ ఇది.

ఏం..

ఎప్పుడూ అఫీషియల్‌గా కనిపించే రంగులే వేసుకోవాలా?

మనసును హత్తుకునే రంగులకు ఫ్యాషన్‌లో చోటు లేదా?

ఉంది..

అదే డోపమీన్ డ్రెస్సింగ్!

డోపమీన్ డ్రెస్సింగ్ అంటే... మనల్ని సంతోషంగా ఉండేలా చేసి, ఉత్సాహం నింపే రంగుల దుస్తులు ధరించడం. ఆఫీస్ అవసరాల కోసం బిగుతైన దుస్తులు, బోరింగ్ పాటర్న్స్ వాడకుండా.. పూర్తిగా మనకు నచ్చినదేదో వేసుకోవడం. దుస్తులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేలా ఉండాలి అనే ఆలోచన నుంచి వచ్చిన ట్రెండ్ ఇది. ఇతరుల కోసం కాకుండా, మన కోసం మనం రెడీ అవ్వడం ఇందులో ప్రధానమైన అంశం.

ఎంచుకోవడం..

ఏ రంగు, లేదా డిజైన్‌లో దుస్తులు చూసినప్పుడు.. మనకు ఎగ్జైటింగ్‌గా అనిపిస్తుందో గమనించాలి. బాగా నచ్చిన ఫ్యాబ్రిక్, పాటర్న్ ఎంచుకోవాలి. వాటిని ఎదురుగా కనిపించే చోట చేతికి అందేలా సర్దుకోవాలి. అలా నచ్చిన రంగుతో ఔట్‌ఫిట్ తయారుచేసుకుని, వేసుకుని.. అది ధరించినప్పుడు మన కాన్ఫిడెన్స్, మూడ్ ఎలా ఉంటుందో గమనించాలి. నిజానికి దీనికి ఇలాగే చేయాలి అని ఎలాంటి నియమాలు లేవు. ఎవరికి నచ్చిన దారిలో వారు ఫాలో అయిపోవచ్చు. దీనికోసం కొత్తగా ఏం కొనాల్సిన అవసరం లేదు. ఉన్నవాటిలోనే బాగా నచ్చినవి వేసుకుంటే చాలు. ఏదైనా నచ్చిన యాక్సెసరీకి తగిన విధంగా దుస్తులు ధరించడం కూడా ఇందులో భాగమే! యూనివర్సిటీ ఆఫ్ హార్ట్‌ఫెడ్‌షా పరిశోధనల ప్రకారం.. యువత చీర్‌ఫుల్‌గా కనిపించే రంగులు, చక్కని ఫిట్టింగ్ ఉన్న దుస్తులు, సాఫ్ట్ ఫ్యాబ్రిక్స్ ధరించినప్పుడు చాలా సంతోషంగా ఫీల్ అవుతున్నారని తేలింది. మెదడు కాగ్నిటివ్ ప్రదర్శనను మనిషి వేసుకున్న దుస్తులు ప్రభావితం చేస్తున్నాయని ఇప్పటికే అనేక పరిశోధనల ఫలితాలు వెల్లడించాయి.

ఇదెలా పనిచేస్తుంది?

మనసుకు నచ్చిన రంగులు, సరదాగా అనిపించే దుస్తులు ధరించడం దీని వెనకున్న ముఖ్య ఉద్దేశం. ఇలాంటి ఆహ్లాదకరమైన పాటర్న్స్ వల్ల డోపమీన్ ట్రిగ్గర్ అవుతుందట. దాంతో మూడ్ తేలికపడి ఉల్లాసంగా ఉంటామట. ఫ్యాషన్ సైకాలజీ ప్రిన్సిపల్స్‌కి ఇది అనుబంధంగా పనిచేస్తుంది. దుస్తులు మన ఎమోషన్స్ బిహేవియర్‌ను ఎలా మారుస్తాయి అనే అంశం ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. సాధారణంగా రంగులు విభిన్నమైన ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యి ఉంటాయి. కంటికి తేలిగ్గా కనిపించే కలర్స్ మన మూడ్‌ను మెరుగ్గా చేస్తాయనేది కలర్ సైకాలజీలోని ఒక ముఖ్య విషయం. ఇవన్నీ కలిసి 'డోపమీన్ డ్రెస్సింగ్'గా పేరొందుతున్నాయి.



చూశారుగా.. మరి మీ ఫేవరెట్ కలర్ ఏంటో చూసి మనసుకు నచ్చిన డ్రెస్‌లో మెరిసిపోండి!

తెలుపు కాదు

స్టైల్ చిట్కా

చాలామంది అబ్బాయిలు షర్ట్ వేసుకునేటప్పుడు.. లోపల బనియన్ తెలుపు రంగుది వేసుకుంటారు. అండర్‌షర్ట్ అనగానే మనకు గుర్తొచ్చే రంగు వైట్. కానీ ఇలా వేసుకున్నప్పుడు.. లేత రంగు చొక్కాల్లోంచి ఈ బనియన్ కనిపించి లుక్ పాడు చేస్తూ ఉంటుంది.



అదే సెలబ్రిటీలు వేసుకునేటప్పుడు మాత్రం ఈ సమస్య ఉండదు, ఎందుకో తెలుసా? వారు బనియన్స్ తెలుపురంగువి వాడరు. స్కిన్, గ్రే కలర్స్ అండర్‌షర్ట్స్ ధరించడం వల్ల చొక్కా రంగు మాత్రమే చక్కగా కనిపిస్తుంది. మరి ఈసారి మీరూ ట్రై చేసేయండి.

నిద్ర విడాకులు

నిద్ర విడాకులు.. స్మార్ట్‌ఫోన్‌లో పడి నిద్రకు విడాకులు ఇచ్చేయడం తెలుసుకానీ... నిద్ర విడాకులు ఏంటనేగా మీ సందేహం! యువ దంపతుల మధ్య తాజాగా నడుస్తున్న ఓ ట్రెండ్ ఇది. దీన్నే స్లీప్ డివోర్స్ అంటున్నారు. ఈ పద్ధతిలో జంట నిజంగా విడాకులేం తీసుకోరు. కానీ నిద్రపోవాలి అంటే మాత్రం విడిగా పడుకుంటారు. ఇలా ఎందుకంటే...



స్లీప్ డివోర్స్ అంటే వినడానికి కొత్తగా ఉంది కదూ! రిలేషన్‌షిప్‌లో ఒకరినొకరు అర్థం చేసుకుని వారి నిద్రకు ప్రాధాన్యమిస్తూ.. ఇద్దరిలో ఏ ఒక్కరి నిద్రకు ఇబ్బంది కలిగినా వేరే గదిలో నిద్రపోవడాన్ని 'స్లీప్ డివోర్స్' అంటున్నారు. దీని ముఖ్య ఉద్దేశం ఒకరి వల్ల మరొకరి నిద్రకు భంగం వాటిల్లకుండా చూసుకోవడం మాత్రమే, ఇద్దరూ ప్రశాంతమైన నిద్రను పొందడం. ఇలా చేస్తున్నవారిలో ఎక్కువగా మిలీనియల్స్ ఉంటున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి.

నిజానికి ఇప్పుడు యువ జంటల ప్రాధాన్యాలు మారిపోతున్నాయి. ఒకరేమో గురక పెడుతుంటారు. మరొకరికి అది భరించడం కష్టం. ఒకరేమో తొమ్మిదింటికే ముసుగుతన్నేస్తారు. మరొకరికేమో మంచి సినిమా చూసి నిద్రపోవాలి అనిపిస్తుంది. ఒకరికేమో అప్పుడే షిఫ్ట్ పూర్తయ్యి అలసటగా ఉండి నిద్రపోవాలి అనిపిస్తుంది. మరొకరికి మాత్రం పని ఇంకా మొదలుకాక కాస్త ఖాళీ దొరుకుతుంది. ఒకరికి ఏసీ, ఫ్యాన్ రెండూ కావాలి.. మరొకరికి మాత్రం ఆ చలికి నిద్రపట్టదు. ఇలా దంపతుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో పద్ధతి. ఒకప్పుడైతే కాస్తో కూస్తో సర్దుకుపోయేవారు. కొన్నిసార్లు నిద్ర కూడా త్యాగం చేసేవారు. కానీ ఇప్పుడలా కాదు. హాయిగా నిద్రపోవడం కోసం తమ పాట్నర్‌కు తాత్కాలికంగా టాటా చెబుతున్నారు. 'నువ్వు నీ పని చూడు.. నేను పక్కగదిలో నిద్రపోతా' అనే డైలాగ్ చాలా మామూలైపోయింది.

2023లో 'అమెరికా అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్' వారు చేసిన అధ్యయనంలో నూటికి మూడోవంతు మంది 'స్లీప్ డివోర్స్' మంచి పద్ధతి అని అభిప్రాయపడ్డారు. ఒకరికోసం ఒకరు నిద్ర త్యాగం చేసి ఇబ్బంది పడే కంటే... ఒక్కరైనా హాయిగా నిద్రపోయి అవతలివారికి మిగతా పనుల్లో సాయం చేయడం దీని వెనకున్న ముఖ్య ఉద్దేశం.

మెరుగైన నిద్ర వల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. నిద్రలేమి కారణంగా వచ్చే కోపం, చిరాకు తగ్గుతాయి. దీనివల్ల రిలేషన్‌షిప్ కూడా సాఫీగా సాగిపోతుందని జంటలు భావిస్తున్నాయి. ఒక్కసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టాక.. విడిగా నిద్రించడం అంటే గొడవ జరిగితేనే అనేది పాతకాలం ఆలోచనగా మిగిలిపోతోంది. చక్కని నిద్రను ఆస్వాదిస్తూనే.. హాయిగా బంధాన్నీ కొనసాగిస్తున్నాయి యువ జంటలు!

జెన్‌జీ.. అర్థం చేసుకుంటే ఈజీ

జెన్‌జీ అనగానే అందరికీ రకరకాల అపోహలున్నాయి. మేమేపనీ సక్రమంగా చేయమనీ, దేనిమీదా శ్రద్ధ ఉండదని, బాధ్యతగా ఉండమని... ఇంటా బయటా మాపై వినిపించే ఫిర్యాదులు! మాదంతా డిజిటల్ ప్రపంచమని పెద్ద ఆరోపణ. కానీ, మమ్మల్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, మా ప్రపంచంలోకి రావాల్సిందే..



డిజిటల్ భాష: గూగుల్‌తో పెరిగి చాట్‌జీపీటీతో సావాసం చేస్తున్న జనరేషన్ మాది. మాతో డిజిటల్ భాషలోనే మాట్లాడండి. ఎంపథీతో ఉండండి. 'మా కాలంలో...' అంటూ ఎప్పుడో చింతకాయ పచ్చడి లాంటి పాతకాలం మాటలు వద్దు. ఉచితంగా జ్ఞానం పంచే ప్రయత్నాలు మాకు నచ్చవు.

మీమ్స్: జెన్‌జీకి హ్యూమర్ అంటే ఇష్టం. అలాగని మీమ్స్, సెటైర్లు, జోకులతోనే గడిపేస్తూ, జీవితాన్ని నవ్వులపాలు చేసుకుంటున్నారంటూ వ్యాఖ్యానాలు చేయొద్దు. బెదిరించడం కన్నా పాజిటివ్‌గా నచ్చచెప్పితే వింటాం. అందుకే, మాతోపాటు నవ్వండి.. లవ్వును పంచుతాం!

మోరల్ పోలీసింగ్: ఆలోచనల్లో, ఆచరణలో ప్రగతిశీలంగా ఉంటాం. 'ఇది మేమెక్కడా చూడలేదం'టూ చేతులూ మూతులూ తిప్పకండి. మోరల్ పోలీసింగ్ వద్దేవద్దు. జెన్‌జీలకంటూ వాల్యూ సిస్టం ఉంది. ఇంకా పాత ఛాందసాల్ని వదలం, వాటినే పట్టుకుని వేళ్లాడతాం, అక్కడే ఉంటాం అంటారా.. మీకో దండం.

బెంగ వద్దు: ప్రతిదీ మీకే తెలుసు, తెలిసిందంతా కరెక్టే అనేది మీ నమ్మకం. మేమేదో సమస్యల్లో పడతామని, వాటిని మీరే చక్కదిద్దాలని అనుకుంటారు. అలాంటి ఆలోచనలన్నీ వదిలేయండి. రేపటిపై మాకేమీ భయంలేదు. బ్రహ్మాండంగా బతికేస్తాం.

వేలెత్తి చూపొద్దు: ప్రతిదానికీ ఇదేం ట్రెండంటూ వేలెత్తి చూపొద్దు. ఇదేం జుట్టు, ఇవేం బట్టలు, ఇదేం మ్యూజిక్, ఇదేం తిండి, ఇదేం టేస్ట్ అంటూ పేర్లు పెట్టొద్దు. జెన్‌జీకి అనవసర విమర్శలంటే పడవు.

ఎగతాళి వద్దు: మీ కాలంలో ఇరవై ఎక్కాలూ కంఠతావచ్చనీ, మాకు తొమ్మిదో ఎక్కం కూడా రాదంటూ ఎగతాళి చేస్తుంటారు కదా! అత్యంత కష్టమైన పరీక్షలుగా అందరూ చెప్పే... జేఈఈ, సివిల్స్, క్యాట్, నీట్‌ల కుంభస్థలాలు కొడుతున్నది మేమేనన్న సంగతి మరవద్దు. ఎంఎన్‌సీలే మావెంట పడుతుంటాయి. ఇంకేం కావాలి!

మంత్రం: మా జీవితాల్ని మీ సొంత కోణంలో చూడటం సరికాదు. ఎవరి లైఫ్‌ని వాళ్ల పర్స్‌పెక్టివ్‌లోనే చూడాలి. అదే జెన్‌జీను గెలిచే మంత్రం!

– శ్రీనివాస్ దరెగోని

'ఫిజికల్ చీటింగ్ కంటే ఎమోషనల్ చీటింగ్ చాలా ఘోరమైనది'.. ఓ షోలో హీరోయిన్ జాన్వీకపూర్‌కి ఎదురైన ప్రశ్న. దీనికి తను చెప్పిన జవాబు బాగా వైరల్ కావడమే కాదు.. ఫ్యాన్స్‌కు తన మీదనున్న అభిమానాన్ని మరింత పెంచింది. తన సీనియర్లు అందరూ ఈ స్టేట్‌మెంట్‌కు 'అవును' అనే సమాధానం ఎంచుకోగా.. తను మాత్రం 'రెండూ తప్పే' అన్నవైపు నిలబడింది.

మీ అభిప్రాయంలో..

మరి మీరైతే ఎలాంటి సమాధానం ఎంచుకుంటారు?

1. ఎమోషనల్ చీటింగ్‌తో పోలిస్తే ఫిజికల్ చీటింగ్ తప్పేంకాదు.
2. ఫిజికల్ చీటింగ్‌తో పోలిస్తే ఎమోషనల్ చీటింగ్ తప్పు కాదు.
3. రెండూ ఇబ్బందికరమైనవి.

మీ సమాధానాన్ని మా మెయిల్ youthpage@eenadu.in కు పంపండి



వింటున్నావా?

సంహిత భలే చురుకైన అమ్మాయి. కాలేజీలో ఎప్పుడూ మంచి మార్కులే. యాక్టివిటీల్లోనూ చక్కగా పాల్గొంటుంది. కానీ ఒక్కటే సమస్య. తను గలగలా మాట్లాడేస్తుంది తప్ప ఎదుటివారు ఏం చెబుతున్నారో వినదు. అన్నీ బాగానే ఉన్నా ఈ విషయంలో మాత్రం తన చుట్టూ ఉన్నవారికి చాలా విసుగ్గా అనిపిస్తుంది.

వినకపోవడం కూడా ఇంత పెద్ద సమస్యా అంటారా?

సమస్యే మరి.

కాలేజ్, జాబ్, రిలేషన్‌షిప్.. ఎక్కడైనా 'యాక్టివ్ లిజనింగ్ స్కిల్స్' చాలా ముఖ్యం.

ఇవి లేక యూత్ చాలా చోట్ల ఇబ్బంది పడుతున్నారు.

అందుకే దీని గురించి మరికొంచెం తెలుసుకుందాం.

ఎదుటివారు మాట్లాడుతున్నప్పుడు పూర్తిగా దృష్టి పెట్టి వినడాన్ని 'యాక్టివ్ లిజనింగ్' అంటారు. అంటే ఆ విషయాలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి తప్ప.. తిరిగి సమాధానం ఇవ్వడం కోసం ఆలోచనలు ఎక్కడెక్కడో తిరగకూడదు. ఈ ప్రక్రియలో 70శాతం విని, 30శాతం తిరిగి సమాధానం ఇవ్వడానికి కేటాయించాలనేది లెక్క.

నిజానికి మాట్లాడేటప్పుడు కేవలం 25 శాతం మాత్రమే చెవుల ద్వారా వింటాం అంటారు సైకాలజిస్ట్ క్రాంతికార్. శారీరక భాష (బాడీ లాంగ్వేజ్) ద్వారా 50 శాతం, టోన్‌తో 18శాతం, పదాలతో 7 శాతం అర్థం చేసుకుంటూ వింటామట. అందుకే అవతలివారు మాట్లాడేటప్పుడు కేవలం పదాలనే కాకుండా.. మధ్యమధ్యలో వచ్చే మౌనాన్ని కూడా అర్థం చేసుకోవాలి. అప్పుడే మన కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడతాయి.



పెంచుకోవడం ఎలా?

1. వాళ్లు మాట్లాడుతున్నప్పుడు కళ్లలోకి చూడాలి. అప్పుడే శ్రద్ధగా వింటున్నామని అవతలి వారికి అర్థం అవుతుంది.
2. ఏ విషయం గురించి మాట్లాడుతున్నారో అందులో లీనమైపోవాలి. అలా కాలేకపోతే వారికి మాట్లాడటానికి ఆసక్తి ఉండదు. దీన్నే 'ఎంపథిక్ లిజనింగ్' అంటారు.
3. వ్యక్తి చెప్పే మాటలను, సమాచారాన్ని వింటున్నప్పుడే గ్రహించి అర్థం చేసుకోవాలి.
4. వారి గొంతును బట్టి భావోద్వేగాలను గుర్తించాలి. బాడీలాంగ్వేజ్‌ని గమనించాలి.
5. మధ్యమధ్యలో సమాధానంగా చిన్న పదాలతో 'అలాగా', 'ఓ', 'సరే', 'అవునా'... అంటూ స్పందించాలి.
6. విషయం అర్థం కాకపోతే తిరిగి అడగాలి.

తీర్పులొద్దు

వినేటప్పుడు విషయం మీద మాత్రమే శ్రద్ధపెట్టాలి. దాని ఆధారంగా చెబుతున్న వారిని జడ్జ్ చేయకూడదు. వారు ఏ ఉద్దేశంతో చెబుతున్నారో ఆలోచించకుండా మనసు నియంత్రణలో పెట్టుకుని వినాలి.

యాక్టివ్ లిజనింగ్ వల్ల కమ్యూనికేషన్ పెరుగుతుంది, సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఏ రిలేషన్‌షిప్‌లోనైనా అవతలి వ్యక్తిపై నమ్మకం పెరుగుతుంది. ఆఫీస్‌లో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. కెరియర్‌లోనూ, లైఫ్‌లోనూ ఎదుగుతాం. అందుకే స్పందించే ముందు పూర్తిగా విందాం!

కొంటె కొటేషన్




1. బొమ్మల మీద వెళ్తారా, ఓర్నీ.. భలే గమ్మత్తుగా ఉంది మీ జర్నీ!
– బేనిషా, కొత్తూరు

2. అవి ఆట బైకులు బాబు ఇక చాలించండి మీ డాబు
– అన్నాజీరావ్, పొందూరు

3. పిల్లల బండిపై సరదాలు బాగుండవు పోలీస్ బాబాయిలు
– చెల్లూరి రత్నకుమార్, రాజమండ్రి

4. బుల్లి బైక్ మీద ఖాకీ రైడ్ అందరూ ఇవ్వండి సైడ్
– మైత్రి బాలాజీ, జుక్కల్




ఈ ఫొటోకి సరదా వ్యాఖ్య రాసి పంపండి. బాగున్నవి ప్రచురిస్తాం.

మై డియర్ టెడ్డీ.. ఇక సెలవు!

మనసులో మాట

ప్రేమ కొంతకాలం వరకే బాగుంటుందని.. నాకు అనుభవంతో అర్థమైంది. నా పేరు రాఘవ్, డిగ్రీ చదువుతున్నా. అలా అలా సాగిపోతున్న జీవితంలోకి తను వచ్చింది. పేరు తపన, చలాకీ పిల్ల. తన అందానికీ, చక్కని మాటలకు పడిపోయా. నెమ్మదిగా ప్రేమించడం మొదలుపెట్టా. ఓ మంచిరోజు చూసి తనకు ఆ మాట చెప్పేశా కూడా. నా అదృష్టం.. తనూ ఓకే అంది! ఇక అప్పటినుంచి గాల్లో తేలిపోయినట్టు ఉండేది. మా ప్రేమవిషయం కాలేజీలో ఎవరికీ తెలియకుండా రహస్యంగా ఉంచాం. గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం. తనను ముద్దుగా టెడ్డీ అనేవాడ్ని. చిన్నచిన్న కోపతాపాలు వచ్చినా సంతోషంగానే ఉన్నాం. కానీ మా మధ్యలోకి మరోవ్యక్తి రావడంతో కథ తారుమారైంది.



మా క్లాస్‌మేట్ ఒకడు నా టెడ్డీ గురించి నాతోనే నీచంగా మాట్లాడాడు. మాది రహస్య ప్రేమ కాబట్టి నేను ఏమీ అనలేకపోయా. తర్వాత వాడు ఆమెతో మాట్లాడటం మొదలుపెట్టాడు. వెంటనే పరోక్షంగా ప్రపోజ్ చేశాడు. నా టెడ్డీ.. మొదట వారించింది. ఆ తర్వాత వాడు బ్రదర్‌గా అయినా మాట్లాడమని బ్రతిమాలే సరికి సరేనంది. కానీ వాడి ఉద్దేశం ఏంటో నాకు తెలుసు. ఎన్నిసార్లు తనతో ఆ విషయం చెప్పి, వాడితో కమ్యూనికేషన్ కట్ చేసుకోమని చెప్పినా వినలేదు. 'నంబర్ బ్లాక్ చేశా' అంటూనే నాకు తెలియకుండా మాట్లాడేది, విషయాలు పంచుకునేది. చివరికి నన్నో అనుమానపక్షిలా చూడటం మొదలుపెట్టింది. 'నీ ప్రేమ నాకొద్దు' అనేసి వెళ్లిపోయింది! ఎంత చెప్పినా అర్థం చేసుకోలేదు, తనను ఇబ్బంది పెట్టలేక మౌనంగా ఉండిపోయా. నా టెడ్డీ ఎక్కడున్నా సంతోషంగా ఉంటే చాలనుకున్నా.

తను ప్రేమించిన అమ్మాయి స్వేచ్ఛను హరించాలని ఏ అబ్బాయీ అనుకోడు. కొందరు వ్యక్తులు నమ్మదగిన వారు కాదని ముందే తెలిసి హెచ్చరిస్తాడు అంతే. దాన్ని అమ్మాయిలు తప్పుగా అర్థం చేసుకుంటే ప్రాణంగా ప్రేమించిన వ్యక్తిని కోల్పోతారు. అచ్చం నా తపనలాగే..!

– రాఘవ్ (పేర్లు మార్చాం)

ఈనాడు సినిమా


రామ్‌చరణ్

చికిరి సింగారం పెద్ది పరవశం

నువ్వు నడిచిన చోటంతా పొర్లు దండాలు... అంటూ చికిరి అందానికి పరవశించి ఆమె వెనకే పడ్డాడు పెద్ది. మరి ఆమె బదులేమిటో తెరపై చూసి తెలుసుకోవల్సిందే. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. శుక్రవారం ఈ సినిమాలోని తొలి పాటని విడుదల చేశారు. చికిరి చికిరి... అంటూ సాగే ఈ పాటని ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం సమకూర్చారు. జానీ నృత్య దర్శకత్వంలో రామ్‌చరణ్, జాన్వీ కపూర్‌పై చిత్రీకరించిన ఈ పాటలోని స్టెప్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జానపద పాటల్లోని హుషారు, ఆధునిక సంగీతం మేళవింపుతో ఈ పాటని స్వరపరిచారు రెహమాన్. పర్వత శ్రేణుల మధ్య చిత్రీకరించిన ఈ పాటలో రామ్‌చరణ్ నృత్యాలు ఎంతగా ఆకట్టుకుంటాయో, జాన్వీ అందం కూడా అంతే ప్రభావం చూపించింది. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ తదితరులు నటించారు. ఛాయాగ్రహణం: ఆర్.రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్ల, కూర్పు: నవీన్ నూలి.

హర హర మహాదేవ


బాలకృష్ణ

భక్తి గర్జనకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చింది 'అఖండ 2: తాండవం' బృందం. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఈ నెల 14న టైటిల్ గీతాన్ని విడుదల చేయనున్నారు. భక్తి భావనని కలిగించే కీర్తనలతో సాగే ఈ పాట ప్రోమోని శుక్రవారం విడుదల చేసింది చిత్రబృందం. అందులో బాలకృష్ణ ఒక చేత్తో డమరుకం, మరొక చేత్తో త్రిశూలం చేతపట్టి చేసిన సందడి ఆసక్తిని పెంచుతోంది. విజయవంతమైన 'అఖండ' చిత్రానికి కొనసాగింపుగా బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతున్న చిత్రమే 'అఖండ 2: తాండవం'. సంయుక్త కథానాయిక. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. తమన్ స్వరాలు సమకూర్చున్నారు.

'ఇఫీ'లో 'సంక్రాంతికి వస్తున్నాం'



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఇండియన్ పనోరమ విభాగంలో అధికారికంగా ఎంపికైంది. ఇదే విభాగంలో దక్షిణాది నుంచి మోహన్‌లాల్ నటించిన 'తుడరుమ్'కు కూడా అవకాశం దక్కింది. దీంతో పాటు ఉత్తమ పరిచయ దర్శకుడు విభాగంలో తెలుగు దర్శకుడు యదు వంశీ నామినేట్ అయ్యారు. 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రానికి గానూ ఆయనకు ఈ నామినేషన్ దక్కింది. ఈ నెల 20 నుంచి మొదలు కానున్న ఈ వేడుక గోవా వేదికగా జరగనుంది.

వచ్చాడు... కుంభ


పృథ్వీరాజ్ సుకుమారన్

'ఈ నక్షత్రాల వేట ఎంత సేపు... కుంభస్థలాన్ని బద్దలు కొడదాం పద' అనేది 'అతడు' సినిమాలోని ఓ సంభాషణ. దర్శకుడు రాజమౌళి తన కొత్త సినిమాలో కూడా కుంభస్థలాన్ని బద్దలు కొట్టాలనే లక్ష్యాన్ని కథానాయకుడు మహేశ్‌కు నిర్దేశించినట్టు తెలుస్తోంది. ఎందుకంటే ఈ సినిమాలో ప్రతినాయకుడి పేరే కుంభ. ప్రతినాయకుడి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టడమే కథానాయకుడి పని. మరి ఈ సినిమాలో హైటెక్‌గా కనిపిస్తున్న కుంభ సామ్రాజ్యం ఎలాంటిదో, అతన్ని మహేశ్ ఎలా ఢీ కొట్టాడో తెలియాలంటే సినిమా విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. 'గ్లోబ్ ట్రాటర్' అనే వర్కింగ్ టైటిల్‌తో మహేశ్‌బాబు - రాజమౌళి కలయికలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రియాంక చోప్రా కథానాయిక. కె.ఎల్. నారాయణ నిర్మాత. వరుసగా వచ్చిన 'బాహుబలి' సినిమాలతో పాటు 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. మలయాళ స్టార్ కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాజమౌళి ఎక్స్ ద్వారా స్పందించారు. సినిమా విశేషాల్ని పంచుకోవడంతోపాటు, లుక్‌ని విడుదల చేశారు. "ముగ్గురు ప్రధాన పాత్రధారులతో ప్రస్తుతం పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం. అయినా సరే, మరోవైపు ఫిల్మ్‌సిటీలో జరగనున్న వేడుక కోసం ఏర్పాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంతకుముందు ఎప్పుడూ లేని రీతిలో ఈసారి వేడుకని నిర్వహిస్తాం. నవంబరు 15న ఆ వేడుకని అందరూ ఆస్వాదించే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా. ఆ వేడుకకి ముందు ఈ వారమంతా మరిన్ని ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడిస్తాం" అంటూ రాజమౌళి ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. అనంతరం పృథ్వీరాజ్ సుకుమారన్ పోషిస్తున్న కుంభ పాత్ర లుక్‌ని విడుదల చేశారు. "పృథ్వీతో తొలి షాట్ చిత్రీకరించడం పూర్తయిన వెంటనే నేను తన దగ్గరకు వెళ్లి నాకు తెలిసిన అత్యుత్తమ నటుల్లో మీరు ఒకరని చెప్పా. క్రూరమైన, శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్ర కుంభకు ప్రాణం పోసిన విధానం, ఎంతో సృజనాత్మకంగా, సంతృప్తికరంగా ఉంది. పృథ్వీకి కృతజ్ఞతలు" అంటూ వ్యాఖ్యానించారు రాజమౌళి. ఇందులో సాహసికుడిగా కనిపించనున్నారు మహేశ్‌బాబు. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగే వేడుకలో ఈ సినిమా పేరుని ప్రకటించడంతోపాటు, ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

కమల్‌హాసన్ కథానాయకుడిగా...


కమల్‌హాసన్

తన సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై వరుసగా సినిమాల్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్. రజనీకాంత్ - సుందర్.సి కలయికలో ఇటీవలే ఓ సినిమాని అధికారికంగా ప్రకటించారు కమల్. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్‌లను దర్శకులుగా పరిచయం చేస్తూ మరో సినిమాని నిర్మిస్తున్నట్టు శుక్రవారం ప్రకటనని విడుదల చేశారు కమల్‌హాసన్. ఇందులో ఆయనే కథానాయకుడిగా నటించనున్నారు. అన్బరివ్ ద్వయం ఇదివరకు కమల్‌హాసన్ 'విక్రమ్' సినిమాకి స్టంట్ కొరియోగ్రఫీ చేశారు. అందులో పోరాట ఘట్టాలకి మంచి పేరొచ్చింది. కమల్‌హాసన్ సినిమాతోనే వాళ్లు దర్శకులుగా కొత్త ప్రయాణం మొదలు పెట్టబోతున్నారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాని ఆర్.మహేంద్రన్‌తో కలిసి కమల్ నిర్మించనున్నారు. సునీల్ కేఎస్ ఛాయాగ్రాహకుడు. జేక్స్ బిజోయ్ సంగీతం సమకూర్చనున్నారు.

ఆలస్యమైన రాయల్‌గా వస్తాడు


మోహన్‌లాల్

ఆలస్యమైనా రాజు రాయల్‌గా ఎంట్రీ ఇవ్వాలంటే సన్నాహాలు ఘనంగా ఉండాల్సిందే అంటున్నారు మోహన్‌లాల్. మరి ఇంతకీ ఆయన రాయల్‌గా తెరపైకి ఎప్పుడు అడుగు పెట్టబోతున్నారో తెలియాలంటే 'వృషభ' సినిమా గురించి తెలుసుకోవాల్సిందే. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నంద కిశోర్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఈ నెల రావాల్సిన ఈ చిత్రం.. కొన్ని కారణాల వల్ల డిసెంబరు 25న రాబోతున్నట్లు ఇన్‌స్టా వేదికగా ప్రకటించింది చిత్రబృందం. మోహన్‌లాల్ ఈ ఫాంటసీ డ్రామాలో రెండు భిన్న కోణాల్లో కనిపించనున్నారు.

ఓం వీర నాగ...


విరాట్ కర్ణ

పద్మనాభస్వామి... పూరి జగన్నాథ్ ఆలయాలకు చెందిన నిధుల స్ఫూర్తితో రూపొందిస్తున్న చిత్రమే 'నాగబంధం' అంటున్నారు అభిషేక్ నామా. ఆయన దర్శకత్వంలో విరాట్ కర్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమిది. నభా నటేశ్ కథానాయిక. ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్న 'ఓం వీర నాగ...' గీతాన్ని ప్రస్తుతం హైదరాబాద్‌లో తీర్చిదిద్దిన శివాలయం సెట్ నేపథ్యంలో చిత్రీకరిస్తున్నారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. "తెలుగుతో పాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం. త్వరలోనే ప్రచార కార్యక్రమాల్ని ఆరంభిస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి.

మణిరత్నం ప్రేమకథలో..!


విజయ్ సేతుపతి

మనసుల్ని హత్తుకునే ప్రేమకథలకు పెట్టింది పేరు ప్రముఖ దర్శకుడు మణిరత్నం. ఇప్పుడాయన దర్శకత్వంలో మరో లవ్‌స్టోరీ తెరపైకి రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో మణిరత్నం చేతులు కలిపినట్లు సమాచారం. ఇందులో కథానాయికగా అందాల తార రుక్మిణీ వసంత్ కనిపించనుందట. "2018లో వచ్చిన 'చెక్క చివందా వానం' తర్వాత విజయ్, మణిరత్నం కాంబోలో రాబోతున్న సినిమా ఇది. తొలిసారి యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో అదరగొట్టిన వీరిద్దరు ఇప్పుడు రొమాంటిక్ డ్రామాతో అలరించాలని నిర్ణయించుకున్నారు. లోతైన భావోద్వేగాలు, అనుబంధాలతో తీర్చిదిద్దుతున్న ఈ ప్రేమకథలో విజయ్ సరసన రుక్మిణిని ఎంపిక చేసే పనిలో ఉంది చిత్రబృందం" అని మణిరత్నం సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి చాన్నాళ్లకు మరో ప్రేమకథతో రాబోతున్న మణిరత్నం తన మ్యాజిక్‌ను మళ్లీ రీక్రియేట్ చేస్తారో లేదో తెలుసుకోవాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.


రుక్మిణీ వసంత్

మా ఇద్దరి మాటల్ని నిజం చేసింది 'ది గర్ల్‌ఫ్రెండ్'

"ఈ సినిమా చిత్రీకరణలో ఉన్నప్పుడు 'అమ్మాయిలందరికీ నేను ఇస్తున్న ఓ కౌగిలింత ఈ సినిమా' అని చెప్పేవారు కథానాయిక రష్మిక. ఈ సినిమా చూశాక అబ్బాయిలు మరింత మంచి స్నేహితులు, భర్తలు కావాలని కోరుకునేవాణ్ని. విడుదల తర్వాత మా ఇద్దరి మాటలూ నిజమయ్యాయి. ఇదే విషయం రష్మికతో చెబితే ఎంతో భావోద్వేగానికి గురైంది" అన్నారు రాహుల్ రవీంద్రన్. ఆయన దర్శకత్వంలో రష్మిక కథానాయికగా తెరకెక్కిన చిత్రమే 'ది గర్ల్‌ఫ్రెండ్'. దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్ర పోషించారు. అల్లు అరవింద్ సమర్పకులు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి సంయుక్తంగా నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి లభిస్తున్న స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ "మహిళలు ఈ సినిమాని చూసి భావోద్వేగానికి గురవుతున్నార"న్నారు.


దీక్షిత్, అల్లు అరవింద్, రాహుల్ రవీంద్రన్, ధీరజ్

ప్రేమ కన్నా పవిత్రమైన బంధం


'కుంకీ 2'

"నిన్ను పెంచింది నేనే.. నీకు ఏ పేరు పెట్టాలి. 'నీలా'.. నచ్చిందా నీకు. నా పేరు భూమి".. అంటూ ఓ యువకుడు ఏనుగుతో మాట్లాడుతున్న మాటలు ఇవి. ఇందతా 'కుంకీ 2' సినిమా గురించే. ప్రముఖ దర్శకుడు ప్రభు సోలమన్ దర్శకత్వంలో తమిళ నటుడు మతి నటిస్తున్న చిత్రమిది. తాజాగా 'అడవి మళ్లీ పిలుస్తుంది' అనే ట్యాగ్‌తో ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో నీలా అనే ఏనుగుకు, భూమి అనే యువకుడికి మధ్య ఉన్న స్నేహాన్ని, ఏనుగును పట్టుకోవడానికి అటవీ అధికారులు చేసే ప్రయత్నాలను చూపిస్తూ ఆద్యంతం ఆసక్తిగా సాగుతుందీ ట్రైలర్. 'ఇది మానవ ప్రేమ కాదు.. దానికంటే పవిత్రమైనది' లాంటి సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ నెల 14న విడుదల కానుందీ చిత్రం.

సత్య చిత్రం ప్రారంభం


సత్య

హాస్యనటుడు సత్య ప్రధాన పాత్రధారిగా... 'మత్తువదలరా' సినిమాల ఫేం రితేశ్ రానా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. రియా సింఘా కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో... క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. వెన్నెల కిశోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రతిభ కలిగిన నటీనటులు, సాంకేతిక బృందం కలిసి చేస్తున్న చిత్రమిదని, మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేయనున్నట్టు నిర్మాణ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం, కూర్పు: కార్తీక శ్రీనివాస్, కథ, స్క్రీన్‌ప్లే: రితేశ్ రానా, జయేంద్ర ఎరోలా, ప్రొడక్షన్ డిజైన్: నార్ని శ్రీనివాస్.

ఓ జంట అందమైన ప్రయాణం


దీప్సిక

దీప్సిక, సూర్య వశిష్ఠ ప్రధాన పాత్రధారులుగా... విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రమణి కళ్యాణం'. సినీ ప్రముఖులు కిరణ్ అబ్బవరం, వశిష్ఠ, విజయ్ ఆంటోనీ, జి.వి.ప్రకాశ్‌కుమార్, సామ్ సీఎస్, రంజిత్ జయకోడి సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం 'రమణి కళ్యాణం' టైటిల్ లుక్‌ని విడుదల చేశారు. 'ఒక జంట అందమైన ప్రయాణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నామ'ని సినీ వర్గాలు చెప్పాయి.

ట్రావెల్ ఏజెంట్ కాదు.. స్పై ఏజెంట్

గూఢచారిగా దేశం కోసం సాహసాలు చేసే ఫ్యామిలీ మ్యాన్.. ఇప్పుడు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారి పోలీసుల చేతికి చిక్కకుండా పారిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. మరి ఆయన పరారీలో ఉండటానికి కారణమేంటి? అనేది తెలుసుకోవాలంటే 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3' చూడాల్సిందే. బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయీ ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ ఇది. రాజ్ అండ్ డీకే రూపొందించారు. ఈ నెల 21న రాబోతుందీ సిరీస్. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాల ద్వారా ట్రైలర్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్. ఇందులో మరోసారి స్పై ఏజెంట్ శ్రీకాంత్ తివారీ పాత్రలో అదరగొట్టనున్నారు మనోజ్. 'నేను ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తాను.. సర్కస్‌లో కాదు', 'ట్రావెల్ ఏజెంట్ కాదు బేటా.. స్పై ఏజెంట్' లాంటి నవ్వులు పూయించే సంభాషణలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌లో రాబోతున్న మూడో భాగమిది. ప్రియమణి, జైదీప్ అహ్లావత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.


'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3'

మగబిడ్డకు జన్మనిచ్చిన కత్రినా

బాలీవుడ్ స్టార్‌కపుల్ విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ తల్లిదండ్రులయ్యారు. శుక్రవారం కత్రినా పండంటి మగబిడ్డకు జన్మించింది. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టిందీ జంట. "ఎంతో ఆనందంగా ఉంది. మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు జన్మించాడు. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి" అంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం తర్వాత పెద్దల సమక్షంలో 2021లో వీరిద్దరు ఏడడుగులు వేసిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే 'ఛావా'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న విక్కీ కౌశల్ ప్రస్తుతం 'లవ్ అండ్ వార్'తో బిజీగా ఉన్నారు.


విక్కీ కౌశల్, కత్రినా కైఫ్

40 ఏళ్లు స్వీయ నిర్బంధంలో బతికిన భగ్న ప్రేమిక

"మానా తేరీ నజర్ మే తేరా ప్యార్ హమ్ నహీ.. కైసే కహే కే తేరే తలబ్‌గార్ హమ్ నహీ!" (నువ్వు నన్ను ప్రేమించడం లేదని అంగీకరిస్తాను. కానీ, నిన్ను తలచుకోవడం లేదని నేనెలా చెప్పగలను!).. 'ఆహిస్తా ఆహిస్తా' (1981) చిత్రం కోసం సులక్షణా పండిట్ పాడిన పాట ఇది. గురువారం రాత్రి ముంబయిలో గుండెపోటుతో మృతిచెందిన ఈ మధుర గాయని, నటి జీవితమూ ఈ పాటలాగే సాగింది. హిందుస్థానీ శాస్త్రీయ సంగీత దిగ్గజం 'పద్మవిభూషణ్' పండిట్ జస్రాజ్ మేనకోడలు ఈమె. షారుక్‌ఖాన్‌కు 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే', 'కుచ్‌కుచ్ హోతాహై', 'కభీ ఖుషీ కభీ గమ్' లాంటి మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన బాలీవుడ్ సంగీత దర్శక ద్వయం జతిన్ - లలిత్ ఈమె సోదరులే. 1954లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లో సంగీత విద్వాంసుల కుటుంబంలో పుట్టిన సులక్షణ బాల్యం నుంచే మంచి గాయనిగా పేరు తెచ్చుకున్నారు. పదమూడేళ్ల వయసులో 'తఖ్‌దీర్' (1967) చిత్రం కోసం లతా మంగేష్కర్‌తో కలిసి ఆమె పాడిన 'సాత్ సమందర్ పార్ సే.. పప్పా జల్దీ ఆజానా' పాట చాలా పెద్ద హిట్ అయింది. ఆ తర్వాత 'సంకల్ప్' (1975) చిత్రంలోని 'తూహీ సాగర్ హై' పాటకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకొన్న సులక్షణ హిందీ, బెంగాలీ సహా ఆరు భాషల్లో కొన్ని వందల పాటలు పాడారు. అలనాటి గాయక దిగ్గజాలు మహమ్మద్ రఫీ, కిశోర్‌కుమార్‌లతో కలిసి దేశ, విదేశాల్లో పలు కచేరీలు చేశారు. 1986లో లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాలు ఆమె గానంతో పరవశించింది. ఏడుగురు సంతానమున్న ఇంటి పెద్దకుమార్తెగా సంసార భారం మోసిన ఆమె తన తోబుట్టువుల ఎదుగుదలలో అండగా నిలిచారు.


సంజీవ్‌కుమార్‌తో సులక్షణా పండిట్

'ఉల్‌ఝున్'తో చిక్కుముడిలో జీవితం

గాయనిగా సాఫీగా సాగుతున్న సులక్షణ జీవితం ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు హేమంత్‌కుమార్ సలహాతో నటిగా మారి పెద్దమలుపు తిరిగింది. 1975లో వచ్చిన క్రైం థ్రిల్లర్ 'ఉల్‌ఝున్ (చిక్కుముడి)'తో ఆమె కథానాయికగా తెరపైకి అడుగుపెట్టారు. తొలి చిత్రమే ఆమె జీవిత గమనాన్ని నిర్దేశించింది. ఈ చిత్ర కథానాయకుడు సంజీవ్‌కుమార్‌ను సులక్షణ ప్రాణప్రదంగా ప్రేమించారు. ఆ సమయంలో 'డ్రీమ్‌గర్ల్' హేమామాలినితో వన్‌సైడ్ ప్రేమలో ఉన్న సంజీవ్ ఈమె ప్రేమను తిరస్కరించి స్నేహితుడిగా కొనసాగారు. పైగా ఆయన తన ప్రేమ కష్టాలు సులక్షణతో చెప్పుకొని సాంత్వన పొందేవారు. ఏనాటికైనా 'ప్రేమించాను' అని ఒక్కమాట అనకపోతాడా అని ఆమె ఏళ్లతరబడి ఎదురుచూసింది. హేమామాలినికి ధర్మేంద్రతో వివాహమైన తర్వాత తాగుడుకు బానిసైన సంజీవ్ ఆరోగ్యం పాడుచేసుకొని అమెరికా వెళ్లి గుండెకు శస్త్రచికిత్స చేయించుకొని వచ్చారు. ఆ తర్వాత కూడా అతడి నుంచి సానుకూల స్పందన లేదు. చివరకు 47 ఏళ్ల వయసులో 1985లో సంజీవ్ కన్నుమూశారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సులక్షణ తన కెరీర్‌ను అర్ధంతరంగా వదిలేసి పూర్తిగా ఇంటికే పరిమితం అయ్యారు. అందగత్తె అయిన ఆమె అప్పటికే రాజేశ్‌ఖన్నా, జితేంద్ర, శశికపూర్ లాంటి స్టార్స్ సరసన దాదాపు 30 చిత్రాల్లో నటించారు. అవకాశాలు తలుపు తట్టి వస్తున్న దశలో చేజేతులా కాదనుకున్నారు.

అమ్మలా మారిన చెల్లెలు

సులక్షణ చివరి రోజులు ఆమె చెల్లెలైన విజేతా పండిట్ ఇంట్లో గడిచాయి. విజేతా కూడా కథానాయికే. 1981లో వచ్చిన సూపర్‌హిట్ చిత్రం 'లవ్‌స్టోరీ'తో ఈమె, కుమార్‌గౌరవ్ చిత్రరంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన విజేతా తన సోదరిని అమ్మలా చూసుకొంది. బయటి ప్రపంచంతో పని లేకుండా, కనీసం ఫోను కూడా వాడకుండా సులక్షణ చాలా ఏళ్లు ఓ యోగినిలా ఒకే గదిలో గడిపారు. మధ్యలో ఆమె మరో చెల్లెలైన సంధ్య హత్యకు గురైనా విజేత ఆ విషయం అక్కకు తెలియకుండా జాగ్రత్తపడింది. సంధ్య నన్ను చూడటానికి ఎందుకు రావడం లేదని అడిగినపుడల్లా.. ఇండోర్‌లో హాయిగా ఉందిలే అని ఏదో ఒకటి చెప్పేది. యాదృచ్ఛికం ఏమిటంటే.. అవివాహితులుగా మిగిలిపోయిన భగ్న ప్రేమికులు సంజీవ్‌కుమార్, సులక్షణా పండిట్ ఇద్దరూ నవంబరు 6వ తేదీనే ఈ లోకం విడిచి వెళ్లిపోయారు.

– జి.ఎస్.జమీర్ హుసేన్

వ్యాపారం పేరుతో వచ్చి..

సంపదనంతా దోచేసి!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

ఐరోపా వర్తకుల రాక

పోర్చుగీసు



పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా భారతదేశానికి నూతన సముద్ర మార్గాన్ని కనిపెట్టి 1498 మే 17న కాలికట్‌కు చేరుకున్నాడు. ఇది భారతదేశ చరిత్రలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో అత్యంత కీలక పరిణామం. వాస్కోడిగామా రాకను కాలికట్ పాలకుడు జామొరిన్ స్వాగతించాడు. భారతదేశానికి వచ్చిన తొలి ఐరోపా దేశంగా పోర్చుగీసును పేర్కొంటారు. క్రీ.శ.1500లో ఎస్టాడో డ ఇండియా (Estado da India) అనే పోర్చుగీసు కంపెనీని భారతదేశంలో వ్యాపారం చేయడానికి స్థాపించారు.

✦ పోర్చుగీసు కంపెనీ భారతదేశంలో అనేక వ్యాపార స్థావరాలను నెలకొల్పింది. అందులో ముఖ్యమైనవి:

✦ కేరళ తీరంలో కాలికట్ (భారతదేశంలో తొలి పోర్చుగీసు స్థావరం. 1500లో స్థాపించారు), క్యాననూర్, క్రాంగనూర్, కొచ్చిన్. కొంకణ్ తీరంలో గోవా. మహారాష్ట్ర తీరంలో బొంబాయి, సాల్‌సెట్టి, బేస్సిన్. గుజరాత్ తీరంలో సూరత్, భావనగర్, డామన్, డయ్యూ. బెంగాల్ తీరంలో హుగ్లీ, చిట్టగాంగ్, సత్ గావ్. తమిళనాడు తీరంలో శాంథోమ్ (మద్రాసు).

✦ 1504లో పోర్చుగీసువారు భారతదేశంలో గవర్నర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఫ్రాన్సిస్కో డి ఆల్మీడా (1504–1509): ఇతడు తొలి పోర్చుగీసు గవర్నర్. వ్యాపార అభివృద్ధి కోసం నీలి నీటి విధానాన్ని అవలంబించాడు. ఇది సముద్ర వ్యాపారానికి అత్యంత ప్రాధాన్యం కల్పించే విధానం. ఇతడు గుజరాత్, ఈజిప్ట్, టర్కీ సుల్తానులతో యుద్ధాలు చేశాడు.

అల్బుకర్క్ (1509–15): ఇతడు పోర్చుగీసు రెండో గవర్నర్, అందరికంటే గొప్పవాడు. 1510లో బీజాపూర్ సుల్తాన్ నుంచి గోవాను జయించి, 1511లో శ్రీకృష్ణదేవరాయలితో మైత్రి సంధి చేసుకున్నాడు.

పోర్చుగీసు ఆధిపత్యం అంతం

1500 నుంచి 1600 సంవత్సరాల వరకు పోప్ ఆదేశాలతో పోర్చుగీసు వర్తకులు భారతదేశ వ్యాపారంపై గుత్తాధిపత్యం చెలాయించారు. 17వ శతాబ్దం ప్రారంభం నుంచి ఇతర ఐరోపా వర్తకుల నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొన్నారు. భారతదేశ పాలకులతో, ఇతర ఐరోపా వర్తక సంఘాలతో నిరంతర యుద్ధాలు చేసిన పోర్చుగీసువారు తమ స్థావరాలను, ఆధిపత్యాన్ని కోల్పోయారు.

ముఖ్య సంఘటనలు: 1631లో మొగల్ చక్రవర్తి షాజహాన్ పోర్చుగీసు వారిని బెంగాల్ నుంచి తరిమివేసి వారి స్థావరాలను స్వాధీనం చేసుకున్నాడు. 1661లో పోర్చుగీసువారు బొంబాయిని బ్రిటిష్ రాజు ఛార్లెస్-IIకు వరకట్నంగా ఇచ్చారు.

▮ 1739లో మరాఠా పీష్వా బాజీరావు-I పోర్చుగీసు వారిని ఓడించి మహారాష్ట్ర తీరంలోని సాల్‌సెట్టి, బేస్సిన్‌ను ఆక్రమించాడు. 17వ శతాబ్దంలో ఆంగ్లేయులు అనేక నౌకా యుద్ధాల్లో పోర్చుగీసు వారిని ఓడించి, వారి స్థావరాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాతి కాలంలో పోర్చుగీసు వారు గోవా, డయ్యూ, డామన్ మినహా అన్ని స్థావరాలను కోల్పోయారు. ఈ మూడు స్థావరాలను 1961లో భారత ప్రభుత్వం 'ఆపరేషన్ విజయ్' అనే పేరుతో సైనిక చర్యను చేపట్టి పోర్చుగీసు వారిని గోవా, డయ్యూ, డామన్‌ల నుంచి తరిమివేసి భారత్‌లో విలీనం చేసింది.

తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను క్రీ.శ.1453లో ఆక్రమించడంతో తూర్పు, పశ్చిమ దేశాల మధ్య ఉన్న ఏకైక భూమార్గం మూసుకుపోయింది. వ్యాపార మార్గానికి అనువైన మార్గం నుంచి వ్యాపార కార్యక్రమాలు నిలిచిపోవడంతో మరో మార్గం వెతకాల్సిన పరిస్థితి తలెత్తింది. పోర్చుగల్ రాజు హెన్రీ సాయంతో బర్తలోమ్యూడియాస్ అనే నావికుడు తుపానుల అగ్రం/కేప్ ఆఫ్ స్ట్రోమ్స్ కనుక్కున్నాడు. ఇదే తర్వాతి కాలంలో కేప్ ఆఫ్ గుడ్‌హోప్‌గా మారింది. ఇతడి తర్వాత వాస్కోడిగామా సముద్రయానం ద్వారా భారతదేశానికి వర్తకానికి వచ్చాడు.

డచ్

హాలెండ్ లేదా నెదర్లాండ్స్ దేశస్థులను డచ్ అంటారు. 1596లో లించెస్టన్ అనే డచ్ యాత్రికుడు భారతదేశంతో సహా తూర్పు దేశాలను సందర్శించి తన అనుభవాలను ప్రచురించడంతో ఐరోపాలో తూర్పు దేశాల వ్యాపార సామర్థ్యం గురించి తెలిసింది. దీంతో నెదర్లాండ్స్ వ్యాపారస్తులు 1602లో డచ్ యునైటెడ్ ఈస్ట్ ఇండియా కంపెనీ (VOC)ని స్థాపించారు. డచ్ పార్లమెంట్ ఈ ప్రైవేట్ కంపెనీకి వ్యాపార అనుమతులు జారీ చేయడంతో డచ్ తొలి స్థావరాలు ఇండోనేసియాలో ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత వీరు భారతదేశంపై దృష్టిసారించారు.

డచ్ స్థావరాలు

ఆంధ్ర తీరంలోని స్థావరాలు: మచిలీపట్నం భారతదేశంలో డచ్ తొలి స్థావరం. దీన్ని 1605లో వండే హాగెన్ (Vande Haghen) ఏర్పాటు చేశారు. భీమిలీపట్నం, నిజాంపట్నం ఇతర స్థావరాలు.

తమిళ తీరం: పులికాట్‌లో వాన్ రీడ్ వ్యాపార స్థావరాన్ని ఏర్పాటు చేశాడు. దేవనాంపట్నం, నాగపట్టణం ఇతర స్థావరాలు. పులికాట్‌లో ఫోర్ట్ గెల్‌డ్రియా, దేవనాంపట్నంలో ఫోర్ట్ డేవిడ్‌ను నిర్మించారు.

బెంగాల్ తీరం: హుగ్లీ, చిన్సుర. వీరు చిన్సురలో ఫోర్ట్ గుస్తావస్‌ను నిర్మించారు.

ఒరిస్సా తీరంలోని స్థావరం: బాలసోర్

కొంకణ్ తీరంలో స్థావరం: గోవా సమీపంలోని వెంగుర్ల. 1690లో డచ్ ప్రధాన స్థావరాన్ని పులికాట్ నుంచి నాగపట్నానికి మార్చారు. 1759లో బెంగాల్‌లో జరిగిన బిదేర యుద్ధంలో ఆంగ్లేయుల చేతిలో ఓడి డచ్ వర్తకులు శాశ్వతంగా భారతదేశాన్ని వీడి వెళ్లిపోయారు.

డానిష్ /డేన్స్

డెన్మార్క్ దేశ పౌరులను డేన్స్ అంటారు. 1616లో డానిష్ ఈస్టిండియా కంపెనీని స్థాపించి, తమిళనాడులోని ట్రాంకుబర్‌లో తొలి స్థావరాన్ని ఏర్పాటు చేశారు. వీరు మచిలీపట్నం (ఆంధ్ర), బాలసోర్, పిప్లి (ఒరిస్సా), అండమాన్, నికోబార్ దీవుల్లో వ్యాపార స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. బెంగాల్‌లోని సెరంపూర్ వీరి ప్రధాన స్థావరం. 1845 నాటికి వీరు తమ స్థావరాలను ఆంగ్లేయులకు విక్రయించి భారతదేశాన్ని వదిలి వెళ్లిపోయారు.

ఫ్రెంచ్


భారతదేశానికి వర్తకం నిమిత్తం వచ్చిన ఐరోపా వారిలో ఫ్రెంచ్‌వారు చివరివారు. 1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని స్థాపించారు. వీరి తొలి స్థావరం సూరత్. దీన్ని 1668లో ఫ్రాంకోయిస్ కారన్ స్థాపించాడు.

ఇతర స్థావరాలు: తమిళనాడు తీరంలో కరైకల్, కేరళ తీరంలో మాహె, ఆంధ్రా తీరంలో మచిలీపట్నం, యానాం. మచిలీపట్నం స్థావరాన్ని మారాకార అనే ఫ్రెంచ్ అధికారి స్థాపించాడు.

❖ బెంగాల్ తీరంలో చంద్రనాగూరును 1690లో మొగల్ గవర్నర్ షయిస్తాఖాన్ నుంచి పొందారు.

❖ 1673-74లో ఫ్రెంచ్ అధికారి ఫ్రాంకోయిస్ మార్టిన్ స్థానిక పాలకుడైన షేర్‌ఖాన్ లోడీ నుంచి కొంత ప్రాంతాన్ని పొంది, పాండిచ్చేరి నగరాన్ని నిర్మించాడు. ఇది ఫ్రెంచ్‌వారి ప్రధాన స్థావరం.

ఆంగ్లేయులు



ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ అసలు పేరు 'ది గవర్నర్ అండ్ కంపెనీ ఆఫ్ మర్చెంట్స్ ఆఫ్ లండన్ ట్రేడింగ్ టు ద ఈస్ట్ ఇండియా'. దీన్నే జాన్ కంపెనీ అని కూడా పిలుస్తారు. ఈ కంపెనీకి 1600 డిసెంబరు 31న ఇంగ్లండ్ రాణి ఎలిజబెత్-I నుంచి 15 ఏళ్ల వ్యాపార అనుమతులతో పాటు తూర్పు దేశాల వ్యాపారాలపై గుత్తాధిపత్య అధికారాలు లభించాయి.

✦ 1608లో ఇంగ్లండ్ రాజు జేమ్స్-I ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ గుత్తాధిపత్య అధికారాలను అపరిమిత కాలానికి మార్చారు. ఫలితంగా భారత వ్యాపారంపై ఈ కంపెనీ గుత్తాధిపత్య అధికారాలు 1813 వరకు కొనసాగాయి.

వర్తక స్థావరాలు

భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ మూడు ప్రధాన స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. స్థానిక పాలకుల నుంచి స్థలాలను సేకరించి మహానగరాలను నిర్మించి, వాటిని ప్రధాన స్థావరాలుగా మార్చుకున్నారు.

☛ 1608లో ఆంగ్లేయులు సూరత్‌లో మొగల్ చక్రవర్తి జహంగీర్ అనుమతితో తొలి స్థావరాన్ని ఏర్పాటు చేశారు.

☛ 1611లో తూర్పు తీరంలో తొలి వర్తక స్థావరం మచిలీపట్నంలో ఏర్పాటైంది. 1611లో గ్లోబ్ అనే నౌకలో కెప్టెన్ హిప్పస్ నాయకత్వంలో మచిలీపట్నం చేరుకుని ఆనాటి గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్ షా అనుమతితో వ్యాపార స్థావరాన్ని ఏర్పాటు చేశారు.

☛ 1651లో బెంగాల్‌లో హుగ్లీ వద్ద వ్యాపార స్థావరాన్ని ఏర్పాటు చేశారు. ఇది బెంగాల్‌లో ఆంగ్లేయుల తొలి స్థావరం.

☛ 1639లో ఫ్రాన్సిస్ డే అనే అధికారి దామెర్ల వెంకటాద్రి నాయుడు నుంచి మద్రాసు ప్రాంతాన్ని పొందాడు. ఇక్కడ ఫ్రాన్సిస్ డే మహానగరాన్ని నిర్మించి, నాయుడి తండ్రి చెన్నప్ప పేరుతో చెన్నపట్టణం అనే పేరు పెట్టారు.

☛ 1661లో పోర్చుగీసువారు బొంబాయి ప్రాంతాన్ని బ్రిటిష్ రాజు చార్లెస్-IIకు వరకట్నంగా ఇచ్చారు. 1668లో బ్రిటిష్ రాజు ఈ ప్రాంతాన్ని ఈస్టిండియా కంపెనీ అధికారి జెరాల్డ్ అంగీర్‌కు ఇచ్చారు. అతడు బొంబాయి నగరాన్ని నిర్మించి, గవర్నర్‌గా నియమితుడయ్యాడు.



రచయిత
డాక్టర్ ఎం. రవి కుమార్
విషయ నిపుణులు

Word of the Day

824 ***Listless***

Telugu meaning: అలసిన, ఆసక్తిలేని

English meaning: Listless (లిస్ట్‌లెస్) is an adjective that describes someone lacking energy, enthusiasm, or interest in anything.

Synonyms: Lethargic, Indifferent

Antonyms: Energetic, Enthusiastic

Usage: **1.** After the exhausting exam week, students felt listless and unmotivated to do anything.

2. She gave a listless nod, showing no interest in the ongoing conversation.

కరెంట్ అఫైర్స్



2025లో దాతృత్వ కార్యక్రమాలకు అత్యధిక మొత్తం అందించిన వారి జాబితాలో శివ్ నాడార్ కుటుంబం అగ్రస్థానంలో నిలిచినట్లు ఎడెల్‌గివ్ హురున్ ఇండియా ఫిలాంత్రఫి జాబితా-2025 వెల్లడించింది. 2024తో పోలిస్తే 26 శాతం అధికంగా ఆయన కుటుంబం 2025లో రూ.2,708 కోట్లు దానం చేసినట్లు తెలిపింది. అంటే ఆయన రోజుకు రూ.7.4 కోట్లు సమాజానికి తిరిగి ఇచ్చారు. గత అయిదేళ్లలో మన దేశంలో అత్యంత దానశీలిగా శివ్ నాడర్ నిలవడం ఇది నాలుగోసారి.



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ '2025 వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డును అందుకున్నారు. బోస్టన్ గ్లోబల్ ఫోరం (బీజీఎఫ్), ఏఐ వరల్డ్ సొసైటీ (ఏఐడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో అమెరికాలోని బోస్టన్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. భారత్‌తో పాటు ప్రపంచంలో శాంతి పరిరక్షణ, నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికిగాను ఈ పురస్కారంతో గౌరవించారు.



దుర్భర దారిద్ర్యాన్ని (కడు పేదరికాన్ని) జయించిన తొలి రాష్ట్రంగా కేరళ చరిత్ర సృష్టించింది. కేరళ రాష్ట్రంలోని వామపక్ష కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం 2021లో దుర్భర దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాన్ని (ఈపీఈపీ) ప్రకటించింది. నవంబరు 1న, ఆ రాష్ట్ర 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాము ఆ లక్ష్యాన్ని 100శాతం సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. దుర్భర దారిద్ర్యం నుంచి 64వేల కుటుంబాలకు విముక్తి కల్పించినట్లు తెలిపింది. కనీస అవసరాలైన ఆహారం, ఇల్లు, ఆరోగ్యం, ఉపాధి మార్గాలను వారందరికీ సమకూర్చినట్లు వెల్లడించింది.

అమెరికా ఎన్నికల్లో న్యూయార్క్ నగరంతోపాటు పలుచోట్ల భారత సంతతి నేతలు విజయం సాధించి చరిత్ర సృష్టించారు. భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ (34) న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా.. భారత్‌లో జన్మించి అమెరికాలో స్థిరపడ్డ గజాలా హష్మీ విజయం సాధించారు. సిన్సినాటి మేయర్‌గా భారత సంతతికి చెందిన ఆఫ్తాబ్ పురేవాల్ రెండోసారి ఎన్నికయ్యారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

విలియం రాంట్‌జెన్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన జర్మనీకి చెందిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త. ఆధునిక భౌతికశాస్త్ర అభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమైన వ్యక్తుల్లో రాంట్‌జెన్ ఒకరు. వైద్యరంగంలో రేడియోగ్రఫీ, రేడియోథెరపీకి ఉపయోగించే ఎక్స్-కిరణాలను ఈయన కనుక్కున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా లగేజ్‌ను స్కాన్ చేయడంలోనూ ఈ కిరణాలను వినియోగిస్తారు. ఈ ఆవిష్కరణ వైద్యశాస్త్రంలో నూతన ఒరవడికి కారణమైంది. శరీర అవయవాలు, కణజాలాలు, ఎముకలు, రక్తనాళాల చిత్రాలను తీసే వీలు కలిగింది. ఈ ఆవిష్కరణకు గానూ ఆయన ఫిజిక్స్‌లో మొదటి నోబెల్ పురస్కారాన్ని గెలుచుకున్నారు. రాంట్‌జెన్ నవంబరు 8న ఎక్స్-కిరణాలను గుర్తించారు. అందుకే ఏటా ఆ తేదీన '**వరల్డ్ రేడియాలజీ డే**'గా నిర్వహిస్తారు.



బాల్యం – వృత్తి జీవితం

రాంట్‌జెన్ 1845, మార్చి 27న జర్మనీలోని లెన్నెప్‌లో జన్మించారు. ఆయనకు మూడేళ్లున్నప్పుడు కుటుంబం నెదర్లాండ్స్‌లోని అపెల్‌డోర్న్‌కు వలస వెళ్లింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్టినస్ హెర్మాన్ వాన్ డోర్న్ అనే బోర్డింగ్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు.

❖ 1865లో స్విట్జర్లాండ్ వెళ్లి జ్యూరిచ్‌లోని ఫెడరల్ పాలిటెక్నిక్ స్కూల్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిగా చేరారు. అక్కడ ప్రముఖ భౌతిక, గణిత శాస్త్రవేత్త రుడాల్ఫ్ జూలియస్ క్లాసియస్ ఉపన్యాసాలకు హాజరయ్యారు. వాటి ప్రభావంతో రాంట్‌జెన్ రేడియో ఫిజిక్స్ రంగంలో పరిశోధనలు చేయడం ప్రారంభించారు. కాథోడ్ కిరణాలు, విద్యుదయస్కాంతత్వం, వాయువుల లక్షణాలపై ఆయన ప్రయోగాలు నిర్వహించారు.

పురస్కారాలు – గౌరవాలు

1896లో రాయల్ సొసైటీ అందించే రమ్‌ఫోర్డ్ మెడల్ పొందారు. అదే ఏడాది రోమ్‌లోని అకాడెమియా నాజియోనేల్ డెల్లే సైన్స్ నుంచి మాట్టేయుసి పతకాన్ని పొందారు.


▮ 1897లో ఫ్రాంక్లిన్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎలియట్ క్రెసన్ మెడల్ అందుకున్నారు. అదే ఏడాది అమెరికన్ ఫిలసాఫికల్ సొసైటీకి అంతర్జాతీయ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

▮ 1900లో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి బర్నార్డ్ పతకం పొందారు.

రాంట్‌జెన్ ఎక్స్ కిరణాలను ఏ సందర్భంలో కనుక్కున్నారు? ఆయనకు ఏ సంవత్సరంలో నోబెల్ బహుమతి లభించింది? తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉపరితల రసాయనశాస్త్రం



ఉపరితలాలు లేదా అంతర్ తలాల వద్ద జరిగే దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే 'ఉపరితల రసాయనశాస్త్రం' (Surface Chemistry). ఒక పదార్థం వేరొక ద్రవం లేదా ఘనపదార్థం అంతర్భాగాల్లోకి చొచ్చుకుపోకుండా ఉపరితలంపైనే ఉండటాన్ని 'అధిశోషణం' అంటారు. వాయువుల్లో భౌతిక, రసాయనిక అధిశోషణం జరుగుతుంది. వీటి తీవ్రతను ప్రభావితం చేసే అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలి.

వాయువుల అధిశోషణ తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు

- అధిశోషకం ఉపరితల వైశాల్యం
- అధిశోషితం (వాయు) స్వభావం
- వాయువు పీడనం, ఉష్ణోగ్రత

అధిశోషణం అనువర్తనాలు

- వాయు ముసుగు
- తేమను నియంత్రించడం
- జడవాయువుల మిశ్రమాన్ని వేరుచేయడం
- అధిక శూన్యస్థితిని ఏర్పర్చడం
- వ్యాధులను నయం చేసే ప్రక్రియ

అధిశోషణ క్రమం, ఫ్రాయిండ్లిష్ అధిశోషణ సమోష్ణరేఖ, ఫ్రాయిండ్లిష్ సమీకరణం, ద్రావణాల నుంచి అధిశోషణం - ఇమిడి ఉన్న సూత్రాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఎయిమ్స్, దిల్లీలో ఉద్యోగాలు

దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ నర్సు, టెక్నీషియన్, క్లినికల్ రిసెర్చ్ ఆఫీసర్ మొదలైన ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 20. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 17 నవంబరు 2025.

నర్స్ పోస్టులు

హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, బిహార్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో నర్స్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 19. అర్హులైన అభ్యర్థులు 2025, నవంబరు 14న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (నవంబరు 8) చివరి తేదీ

▮ ప్రకాశం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో 16 పోస్టులు. టెన్త్, బీఎస్‌డబ్ల్యూ, ఎంఎస్‌డబ్ల్యూ, డిప్లొమా, బీకాం, బీఎడ్, బీఎస్సీ, ఎంబీబీఎస్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

▮ ఎస్‌వీఎన్‌ఐటీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులు.

▮ ఎన్‌ఈఈపీసీఎల్‌లో 98 అప్రెంటిస్ పోస్టులు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్‌లో ఉత్తీర్ణులు అర్హులు.

▮ ఏపీఎస్‌ఆర్‌టీసీలో 277 అప్రెంటిస్ పోస్టులు. పదోతరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులు అర్హులు.

▮ ఆర్ఎస్ఎస్‌లో 20 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Mathematics

Discount

1. The marked price of an air conditioner is Rs.1,600. A shopkeeper offers a discount of 10% on the marked price but still gains a profit of 20%. Find the cost price of the air conditioner (to the nearest rupee).
A) Rs.1,150 B) Rs.1,200
C) Rs.1,180 D) Rs.1,210

2. What is the difference between a single discount of 30% on Rs.800 and two successive discounts of 18% and 15% on the same amount (correct to two places of decimals)?
A) Rs.5.20 B) Rs.3.80
C) Rs.7.60 D) Rs.2.40

3. A shopkeeper announces a 25% discount on the marked price of a jacket. Later, during a clearance sale, he offers an additional 10% discount on the already discounted price. What is the equivalent single discount percentage on the jacket?
A) 32.5% B) 33.5%
C) 34.25% D) 35%

4. The marked price of a microwave oven is Rs.6,000 and the shopkeeper allows a discount of 10% on it. If his profit is 20%, then what is the cost price of the oven?
A) Rs.4,500 B) Rs.4,800
C) Rs.4,900 D) Rs.5,000

5. The marked price of a refrigerator is Rs.12,500, and the shopkeeper allows a discount of 8% on it. What is the selling price of the refrigerator?
A) Rs.11,250 B) Rs.11,400
C) Rs.11,500 D) Rs.11,600

6. A gold bracelet marked at Rs.18,000 is sold with two successive discounts of 12% and 8%. An additional 5% discount is offered for online payment. What will be the selling price of the bracelet on online payment? (Approx)
A) Rs.13,884 B) Rs.14,200
C) Rs.14,580 D) Rs.15,000

7. An article is sold at two successive discounts of 25% and 15%. The selling price of the article after the second discount is Rs.2,550. If it is sold only at a single discount of 25%, what will be its selling price?
A) Rs.2,800 B) Rs.3,000
C) Rs.3,400 D) Rs.3,200

8. A dealer offers three different discount schemes on an electronic gadget. Which of the following schemes provides the maximum overall discount percentage?
I. Two successive discounts of 12% each.
II. Successive discounts of 18% and 6%.
III. A single discount of 20%.
A) Only discount scheme I
B) Only discount scheme II
C) Only discount scheme III
D) All provide equal discount

9. In a store, a discount of 8% is offered on all items. If the total payable amount after this discount exceeds Rs.3,000, an additional discount of 12% is applied. Determine the final amount (in Rs.) payable by a customer who buys 8 products, each priced at Rs.450. (Approx)
A) Rs.2,915 B) Rs.2,960
C) Rs.2,980 D) Rs.3,200

10. A merchant marks his goods 30% above the cost price and then allows a 15% discount on the marked price to his customers. What is his profit percentage?
A) 9.5% B) 10.5%
C) 11.5% D) 12.5%

11. Amrita visited an electronics shop and bought a refrigerator. She received a 15% discount on it. She would have saved Rs.1,800 more if she had received a 20% discount instead. What was the marked price of the refrigerator?
A) Rs.30,000 B) Rs.32,000
C) Rs.36,000 D) Rs.40,000

12. A shopkeeper makes a 20% profit even after allowing a 20% discount on the marked price of an item. What will be his profit percentage if he allows a 30% discount instead? (Round off your answer to the nearest whole number.)
A) 5% B) 8% C) 10% D) 12%

13. An electronic item is sold at a discount of 15%, and an additional 25% discount is offered on cash payment. If Rohan bought the item by paying Rs.2,550 in cash, what was the marked price of the item?
A) Rs.3,600 B) Rs.3,800
C) Rs.4,000 D) Rs.4,200

14. A store offers a 12% discount on the price of a refrigerator for online payment. An additional 8% discount is given to customers who pay using a digital wallet. If the price of the refrigerator is Rs.50,000, how much will a customer pay (in Rs.) if he pays online using a digital wallet?
A) Rs.38,720
B) Rs.39,560
C) Rs.40,480
D) Rs.41,200

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

ప్రతికూల ఆలోచనలను వదిలించుకోవాలంటే..! స్టడీ స్కిల్స్



ప్రతి ఒక్కరికీ ప్రతికూల ఆలోచనలు ఎప్పుడో ఒకసారి వస్తూనే ఉంటాయి. కానీ కొంతమంది నిరంతరం ఆలోచిస్తూ కుంగుబాటు తరహా కొత్త సమస్యలను కొని తెచ్చుకుంటారు. నెగెటివ్ ఆలోచనలు ఉంటే చదువుపై ఆసక్తి తగ్గిపోతుంది. అందుకే అలాంటి ఆలోచన లను, కలిగే బాధను నమ్మకస్థులైన స్నేహితులు, కుటుంబీకులతో పంచుకుంటే మనసు కుదుటపడుతుంది. నవ్వడం, మెదడుకు పనిపెట్టే పజిల్స్ చేయడం లాంటివి సానుకూల ఆలోచనలకు దోహదపడతాయి. ఆ విధమైన ప్రతికూల ఆలోచనల నుంచి ఎలా గట్టెక్కాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



✿ 2025, సెప్టెంబరు 11, 12 తేదీల్లో ఏ నగరంలో జరిగిన 4వ కోస్ట్‌గార్డ్ గ్లోబల్ సదస్సులో భారత్ పాల్గొంది? జ: రోమ్ (ఈ సదస్సులో పాల్గొన్న భారత్ 2027లో 5వ కోస్ట్ గార్డ్ గ్లోబల్ సమ్మిట్ (సీజీజీఎస్)ను చెన్నైలో నిర్వహించేందుకు బిడ్‌ను గెలుచుకుంది.)

✿ ఏ సందర్భాన్ని పురస్కరించుకుని భారత్‌లో ఏటా సెప్టెంబరు 11న దిగ్విజయ్ దివస్‌ను నిర్వహిస్తారు? జ: 1893, సెప్టెంబరు 11న చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో స్వామి వివేకానంద చేసిన ప్రసిద్ధ ప్రసంగం గుర్తుగా.

✿ అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ) ఏ మూడు నగరాల్లో నూతన ప్రాంతీయ కార్యాలయాలను ఇటీవల ప్రారంభించింది?

మరింత సమాచారం

జ: పట్నా, దెహ్రాదూన్, రాయ్‌పుర్ (వీటితో కలిపి ఏపీఈడీఏ ప్రాంతీయ కార్యాలయాల సంఖ్య 19కు చేరింది.)

సంఖ్యల సారాన్ని ప్రదర్శించే పటాలు!

దేశ జీడీపీలో వివిధ రంగాల వాటాలు, కంపెనీలో నెలవారీ ఉత్పత్తుల వివరాలు, తరగతిలో విద్యార్థుల హాజరుకు, మార్కులకు మధ్య పోలికలు తదితరాలను చూడగానే తెలుసుకోవడానికి కమ్మీరేఖా చిత్రాలు లేదా బార్ గ్రాఫ్‌లు ఉపయోగపడతాయి. దత్తాంశంలోని అంశాలను కమ్మీలు లేదా దీర్ఘచతురస్రాల రూపంలో ప్రదర్శిస్తూ గీసిన చిత్రాలను కమ్మీరేఖా చిత్రాలు అంటారు. అవి అడ్డంగా లేదా నిలువుగా ఉంటాయి. ఆ చిత్రం పొడవు లేదా ఎత్తు అది సూచించే విలువకు అనులోమానుపాతంలో ఉంటుంది. డేటాను వేగంగా చదవడం, పోల్చడం, విశ్లేషించడం మొదలైన సామర్థ్యాలను అభ్యర్థుల్లో అంచనా వేయడానికి ఈ అధ్యాయం నుంచి రీజనింగ్‌లో భాగంగా పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతుంటారు. వాటికి త్వరగా, కచ్చితత్వంతో సమాధానాలను గుర్తించాలంటే చిత్రాలను అంటే అక్షాలు, స్కేలు, శీర్షికలను చదవడం నేర్చుకోవాలి. శాతాలు, నిష్పత్తులు, సగటులను లెక్కించడం, గరిష్ఠ, కనిష్ఠ విలువల మధ్య తేడాలను కనుక్కోవడం ప్రాక్టీస్ చేయాలి.

కమ్మీరేఖా చిత్రాలు


(దత్తాంశ విశ్లేషణ)

సాధారణంగా కమ్మీరేఖా చిత్రాలు దీర్ఘచతురస్రాలను కలిగి ఉంటాయి. వీటినే 'హిస్టోగ్రామ్స్' అంటారు. కమ్మీరేఖా చిత్రాల్లో కమ్మీల వెడల్పు.. తరగతి అంతరాన్ని; ఎత్తు.. పౌనఃపున్యాన్ని సూచిస్తాయి. అంటే ఈ రేఖాచిత్రాల పరిమాణం అనేది తరగతి అంతరం, పౌనఃపున్యంపై ఆధారపడి ఉంటుంది.



మాదిరి ప్రశ్నలు

I. (1 - 2): ఒక కంపెనీ ఎనిమిదేళ్లలో ఉత్పత్తి చేసిన వస్తువుల సంఖ్యను వేలల్లో ఇవ్వడమైంది. సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానాన్ని గుర్తించండి.



1. 2007తో పోలిస్తే 2008లో కంపెనీ ఉత్పత్తి ఎంత శాతం తగ్గింది?

1) 28% 2) 25% 3) 30% 4) 20%

వివరణ: 2007లో ఉత్పత్తి = 60

2008లో ఉత్పత్తి = 45



తగ్గుదల శాతం $= \frac{\text{తగ్గుదల}}{\text{నిజవిలువ}} \times 100$


$= \frac{60-45}{60} \times 100 = \frac{15}{60} \times 100 = 25\%$ **జ: 2**

2. 2006, 2007 సంవత్సరాల్లో జరిగిన సగటు ఉత్పత్తి కింది ఏ రెండు ఏళ్ల సగటు ఉత్పత్తికి సమానం?

1) 2010, 2011 2) 2009, 2010
3) 2008, 2010 4) 2005, 2011

వివరణ: 2006లో ఉత్పత్తి = 40

2007లో ఉత్పత్తి = 60



సగటు ఉత్పత్తి $= \frac{40+60}{2} = 50$ (వేలు)

ఆప్షన్స్ ఆధారంగా..

2010, 2011ల సగటు $= \frac{50+75}{2} = \frac{125}{2} = 62.5$


2009, 2010ల సగటు $= \frac{65+60}{2} = \frac{125}{2} = 62.5$

2008, 2010ల సగటు $= \frac{45+50}{2} = \frac{95}{2} = 47.5$

2005, 2011ల సగటు $= \frac{25+75}{2} = \frac{100}{2}$

$= 50$ (వేలు) **జ: 4**

II. (3 - 4): A, B, C, D, E అనే ఐదు పాఠశాలల్లో స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరై, అర్హత సాధించిన విద్యార్థుల వివరాలు కింది కమ్మీరేఖా చిత్రంలో ఇచ్చారు. సమాచారం ఆధారంగా ప్రశ్నలకు సమాధానం గుర్తించండి.



3. అన్ని పాఠశాలల్లో పరీక్షకు హాజరై, అర్హత సాధించిన విద్యార్థుల సగటులో తేడా ఎంత?

1) 950 2) 1020 3) 990 4) 980

వివరణ: హాజరైన విద్యార్థుల సగటు

$= \frac{3000+2250+3250+2500+3000}{5}$

$= \frac{14000}{5} = 2800$



అర్హత సాధించిన వారి సగటు

$= \frac{1750+1250+2250+2000+2000}{5}$

$= \frac{9250}{5} = 1850$ తేడా $= 2800 - 1850 = 950$ **జ: 1**

4. పాఠశాల C, Dలలో స్కాలర్‌షిప్ పరీక్షకు అర్హత సాధించిన సగటు విద్యార్థులు, అదే పాఠశాలల్లో పరీక్షకు హజరైన మొత్తం సగటు విద్యార్థుల్లో ఎంత శాతం?

1) 59. 26% 2) 73.91% 3) 65.43% 4) ఏదీకాదు

వివరణ: C, D పాఠశాలల నుంచి అర్హత సాధించిన సగటు విద్యార్థులు $= \frac{2250+2000}{2} = \frac{4250}{2} = 2125$


C, D పాఠశాలల నుంచి హజరైన సగటు విద్యార్థులు

$= \frac{3250+2500}{2} = \frac{5750}{2} = 2875$


కావాల్సిన శాతం $= \frac{2125}{2875} \times 100 = \frac{85}{115} \times 100$

$= \frac{1700}{23}\% = 73.91\%$ **జ: 2**

III. (5 - 6): A, B, C, D, E, F అనే 6 పాఠశాలల్లో 6000 మంది విద్యార్థుల సంఖ్యను శాతాల్లో ఇచ్చారు. ఆ పాఠశాలల్లో ఉన్న బాలుర సంఖ్యను కమ్మీరేఖా చిత్రం తెలియజేస్తుంది.







5. పాఠశాల Cలో ఉన్న బాలురు, పాఠశాల Bలో ఉన్న బాలికలు, పాఠశాల Eలో ఉన్న విద్యార్థులకు మధ్య నిష్పత్తి ఎంత?

1) 45 : 7 : 97 2) 43 : 9 : 97
3) 45 : 7 : 87 4) 43 : 9 : 87

వివరణ: పాఠశాల Cలోఉన్న విద్యార్థులు



$= \frac{26}{100} \times 6000 = 1560$

పాఠశాల Cలో ఉన్న బాలురు = 900

పాఠశాల Bలో ఉన్న విద్యార్థులు $= \frac{9}{100} \times 6000 = 540$

Bలో ఉన్న బాలికలు = 540 − 400 = 140

పాఠశాల E లో ఉన్న విద్యార్థులు $= \frac{29}{100} \times 6000 = 1740$

కావాల్సిన నిష్పత్తి = 900 : 140 : 1740

= 90 : 14 : 174 = 45 : 7 : 87 **జ: 3**

6. కింది ఏ పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య పాఠశాల E లో ఉన్న బాలికల సంఖ్యకు సమానం?

1) A 2) B 3) C 4) D

వివరణ: Eలో ఉన్న విద్యార్థులు $= \frac{29}{100} \times 6000$

= 1740

Eలో ఉన్న బాలికలు



= 1740 − 1200 = 540

పాఠశాల Aలో ఉన్న విద్యార్థులు $= \frac{12}{100} \times 6000 = 720$

పాఠశాల B లో ఉన్న విద్యార్థులు $= \frac{9}{100} \times 6000 = 540$



పాఠశాల Bలో ఉన్న మొత్తం విద్యార్థుల సంఖ్య Eలో ఉన్న బాలికల సంఖ్యకు సమానం.

జ: 2



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

రాజస్థాన్‌లో రైకాలు.. మహారాష్ట్రలో ధంగర్‌లు!

భారతీయ సంస్కృతి, సహజీవనం అంతా అనాదిగా వ్యవసాయంతోనే ముడిపడి సాగుతోంది. నేటికీ సేద్యం, దాని అనుబంధ రంగాలే జనాభాలో అధిక భాగానికి జీవనోపాధి కల్పిస్తున్నాయి. భిన్న వాతావరణ పరిస్థితులు, నేలలు ఉన్న దేశంలో వివిధ ఆహార, వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. ప్రాంతాల వారీగా రకరకాల దేశవాళీ పశుజాతులు, పశుపోషణాధారిత సమాజాలు ఉన్నాయి. దేశంలో వ్యవసాయం తీరుతెన్నులు, రాష్ట్రాల వారీగా ప్రధాన పంటలు, పరిశోధనా కేంద్రాలు, భౌగోళిక గుర్తింపు పొందిన వ్యవసాయ ఉత్పత్తులు, పంట కాలాలకు ఉన్న ప్రాంతీయ పేర్లు తదితరాలు పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. పలు పంటలకు అనువైన ఉష్ణోగ్రతలు, వర్షపాతం, ముఖ్యమైన పంటల శాస్త్రీయ నామాలు, సాగులో ఆధునిక పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలి.



శ్రీవరి

వ్యవసాయం

1. కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) వేరుశనగ శాస్త్రీయ నామం 'అరాఖిస్ హైపోజియా'

బి) వేరుశనగ పరిశోధనా కేంద్రం గుజరాత్‌లోని జునాగఢ్‌లో ఉంది.

సి) సోయాబీన్ ఉత్పత్తిలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డి) జాతీయ సోయాబీన్ పరిశోధనా కేంద్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉంది.



వేరుశనగ పరిశోధనా కేంద్రం (గుజరాత్)



1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.
4) ఎ, డి సరైనవి; బి, సి సరికావు.

2. కింది వాటిని జతపరచండి.

గేదెల జాతి	రాష్ట్రాలు
ఎ) మెహసాన	1) హరియాణా
బి) నీలి	2) ఉత్తర్‌ప్రదేశ్
సి) బదావరి	3) పంజాబ్
డి) ముర్రా	4) గుజరాత్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2


3. గోధుమ పంటకు సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) గోధుమ శాస్త్రీయ నామం ట్రిటికం వల్గేర్.

బి) ఇది ప్రధానంగా సమశీతోష్ణ మండల పంట. రబీ కాలంలో పండిస్తారు.

సి) గోధుమ ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్ మొదటి, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి.

డి) ఈ పంటకు ప్రధానంగా 15° సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు, 50-75 సెంటీమీటర్ల వర్షపాతం కావాలి.



1) ఎ, బి, సి, డి
2) ఎ, బి, సి
3) ఎ, బి
4) ఎ మాత్రమే

4. కింది వాటిని జతపరచండి.


రాష్ట్రం	భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తి
ఎ) అస్సాం	1) లాసల్‌గాన్ ఉల్లిగడ్డ
బి) కేరళ	2) అర్నిపట్టు
సి) తమిళనాడు	3) కైపాడ్ బియ్యం
డి) మహారాష్ట్ర	4) ముగా పట్టు

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-1, డి-2 4) ఎ-4, బి-1, సి-3, డి-2

5. పత్తికి సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) ప్రపంచంలో చైనా తర్వాత అధికంగా పత్తి ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్.

బి) ఈ పంటకు దక్కన్ పీఠభూమిలోని నల్లరేగడి నేలలు అత్యంత అనుకూలం.



సి) పత్తి పంటకు సరాసరిగా 15°- 22° సెల్సియస్‌ల మధ్య ఉష్ణోగ్రత, కనీసం 50 సెం.మీ. సగటు వర్షపాతం ఉండాలి.

డి) పత్తి ఉత్పత్తిలో గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ముందంజలో ఉన్నాయి.

1) ఎ, బి సరైనవి: సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
ఎ) సెల్వికల్చర్	1) శైవలాలు
బి) ఆల్గాకల్చర్	2) కలప
సి) పోమికల్చర్	3) సముద్ర జీవులు
డి) మారికల్చర్	4) ఫలాలు

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-2, బి-1, సి-4, డి-3 4) ఎ-1, బి-2, సి-3, డి-4

7. కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) ఖరీఫ్ పంటను ఒడిశాలో 'సర్రద్' అని పిలుస్తారు.

బి) రబీ పంటను బిహార్‌లో 'గర్మ', జైద్ పంటను 'బడ్వాయ్' అని పిలుస్తారు.

సి) కేరళలో 'విరిపుల' అని జైద్ పంటను పిలవగా, రబీ పంటను 'పుంజ'గా వ్యవహరిస్తారు.

డి) ఖరీఫ్ పంటను తమిళనాడులో 'సాంబ', కేరళలో 'ముండకన్' అని పిలుస్తారు.

1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిని జతపరచండి.

పశుపోషణ ఆధారిత సమాజాలు	రాష్ట్రం
ఎ) రైకా	1) ఉత్తరాఖండ్
బి) మోన్‌పెస్	2) మహారాష్ట్ర
సి) ధంగర్	3) అరుణాచల్ ప్రదేశ్
డి) బోటియా	4) రాజస్థాన్

భారత భూగోళ శాస్త్రం

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-4, బి-1, సి-3, డి-2

9. కింది వాటిలో జనుముకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) జనుము పంటకు ప్రధానంగా 110 నుంచి 240 సెం.మీ. మధ్య వర్షపాతం అవసరం.

బి) జనపనారను మన దేశంలో ప్రధానంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్.

సి) భారత ప్రభుత్వం 2005లో జాతీయ జనపనార విధానాన్ని ప్రకటించింది.

డి) మన దేశంలో మొదటి జనపనార పరిశ్రమను 1855 లో పశ్చిమ బెంగాల్‌లోని రిష్రా వద్ద ప్రారంభించారు.



1) ఎ, బి, సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కింది వాటిని జతపరచండి.

పరిశోధనా సంస్థ	ప్రాంతం
ఎ) ఇండియన్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	1) అవికా నగర్
బి) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఆన్ బఫెలోస్	2) ఇజ్జత్‌నగర్ (బరేలీ)
సి) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఆన్ గోట్స్	3) హిస్సార్
డి) సెంట్రల్ షీప్ అండ్ ఊల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్	4) ముఖ్దుమ్ (మధుర)

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-2, బి-3, సి-4, డి-1

11. కింది వాటిలో వరి పంటకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) శ్రీ వరి సాగును మొదటిసారిగా అభివృద్ధి పరిచింది హెన్రీడి లౌలానీ.

బి) శ్రీ వరి సాగును మొదటిసారిగా మడగాస్కర్‌లో పండించారు.

సి) బంగారు వరిపై మొదట అన్వేషణ చేసింది అమెరికాకు చెందిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్.

డి) ప్రస్తుతం వరి ఉత్పత్తిలో ప్రధానంగా ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ ముందంజలో ఉన్నాయి.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

వ్యవసాయం విప్లవం	సంబంధించిన వ్యక్తులు
ఎ) పసుపు విప్లవం	1) దుర్గేష్ పాలి
బి) నీలి విప్లవం	2) ఇందిరా గాంధీ
సి) వెండి విప్లవం	3) అరుణ్ కృష్ణన్, హరిలాల్ చౌదరి
డి) గులాబీ విప్లవం	4) శ్యామ్ పిట్రోడా

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

13. కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) కంగయం అనేది తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన ఒక పశుజాతి.

బి) బ్రావి అనేది మధ్యప్రదేశ్‌లోని చంబల్ ప్రాంతానికి చెందిన పశుజాతి.



కంగయం

సి) మన దేశంలో భారీ పరిమాణంలో ఉండే గేదె జాతి జెఫ్రాబాదీ. ఇది గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందింది.

డి) తెలంగాణలోని నాగర్‌కర్నూల్ ప్రాంతంలో 'పొడ తూర్పు' అనే పశుజాతి ఉంది. వీటినే 'తూర్పు ఎడ్లు' అని కూడా అంటారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరికావు.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

ప్రధాన పంటలు	శాస్త్రీయ నామం
ఎ) పత్తి	1) హెవియా బ్రెజిలియెన్సిస్
బి) జనపనార	2) సాకారం అఫిసినేరమ్
సి) చెరకు	3) గాస్సియం హెర్బెసియం
డి) రబ్బరు	4) కార్కోరస్ క్యాప్సులారిస్

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-3, బి-4, సి-2, డి-1

15. పోడు వ్యవసాయానికి సంబంధించి కింది వాక్యాలను సరిచూడండి.

ఎ) పోడు వ్యవసాయాన్ని ఫిలిప్పీన్స్‌లో 'కెయిన్ జిన్', వెనిజువెలలో 'కానుకో' అని పిలుస్తారు.



పోడు వ్యవసాయం

బి) బ్రెజిల్‌లో 'చిన', శ్రీలంకలో 'రోక'అని పిలుస్తారు.

సి) ఇండోనేసియా, మలేషియాలో 'లడాంగ్' అని పిలుస్తారు.

డి) మధ్య ఆఫ్రికాలో 'యసోలా', మయన్మార్‌లో 'తాంగ్యా' అని పిలుస్తారు.

1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.
3) ఎ, బి, సి సరైనవి. డి సరికాదు.
4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

16. కింది వాటిని జతపరచండి.

ఎ) జాతీయ పాల దినోత్సవం	1) డిసెంబరు 3
బి) కిసాన్ దివస్	2) మే 31
సి) ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం	3) నవంబరు 26
డి) వ్యవసాయ విద్యా దినోత్సవం	4) డిసెంబరు 23

1) ఎ-3, బి-4, సి-2, డి-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4
4) ఎ-1, బి-4, సి-3, డి-2



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-1; 3-1; 4-1; 5-2; 6-3; 7-1; 8-3; 9-3; 10-4; 11-3; 12-4; 13-2; 14-4; 15-2; 16-1.

బాలలకు సోషల్ మీడియా వాడకం నిషేధం

- డెన్మార్క్ ప్రభుత్వ నిర్ణయం

కోపెన్‌హెగెన్: పదిహేను సంవత్సరాల కన్నా తక్కువ వయసున్న వారు సోషల్ మీడియా వాడకుండా డెన్మార్క్ ప్రభుత్వం నిషేధం విధించింది. సోషల్ మీడియా వాడకానికి వయోపరిమితిని విధించడంతో పాటు 13 సంవత్సరాల వయసుకు చేరుకున్న పిల్లలు ఆ మీడియాను వాడేందుకు అనుమతినిచ్చే వెసులుబాటునూ తల్లిదండ్రులకు కల్పించింది. టీనేజికి చెందిన వారితో పాటు అంతకన్నా తక్కువ వయసున్న పిల్లలు సోషల్ మీడియా వ్యసనం బారిన పడకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పదహారేళ్ల కన్నా తక్కువ వయసున్న వారు సోషల్ మీడియా వాడకుండా నిషేధిస్తూ గత డిసెంబరులో ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

దిల్లీ విమానాశ్రయంలో భద్రతా వైఫల్యం

దిల్లీ: దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ భద్రతా వైఫల్యం వెలుగు చూసింది. బ్యాంకాక్ నుంచి బ్రిటన్ వెళ్లాల్సిన ఓ వ్యక్తి.. విమానం దిల్లీలో ల్యాండ్ అయ్యాక అధికారుల కళ్లు గప్పి ఇమ్మిగ్రేషన్ ప్రాంతం నుంచి తప్పించుకుని పారిపోయాడు. గతనెల 28 జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతడిని బ్రిటన్‌కు చెందిన ఫిట్జ్ ప్యాట్రిక్‌గా గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిరియా అధ్యక్షుడిపై ఆంక్షల ఎత్తివేత

ఐక్యరాజ్యసమితి: సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరాను ఐసిల్, అల్‌ఖైదా నేతల జాబితా నుంచి తొలగిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెరికా మద్దతు తెలిపిన ఒక తీర్మానానికి మండలి తన ఆమోదాన్ని తెలిపింది. ఈ పరిణామం సిరియాలో నవశకానికి నాంది పలుకుతుందని భావిస్తున్నారు. అహ్మద్ అల్ షరాతో పాటు సిరియా అంతర్గత వ్యవహారాల మంత్రి అనాస్ హసన్ ఖత్తాబ్‌ను కూడా తీవ్రవాద సంస్థల నాయకుల జాబితా నుంచి తొలగించారు. నిషేధాజ్ఞల్లో భాగంగా సిరియా అధ్యక్షుడు 2013 నుంచి ఆయుధ నిషేధం, ప్రయాణ పరమైన ఆంక్షలు, ఆస్తుల స్తంభన ఎదుర్కొంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆ ఆంక్షల్ని సడలిస్తారు. తాజా తీర్మానం సిరియాలో 2024లో అస్సాద్ ప్రభుత్వ పతనానంతరం ఒక కొత్త శకం ఆవిర్భవించిందనడానికి సూచన అని పరిశీలకులు చెబుతున్నారు. సిరియా అధ్యక్షుడు గతంలో అల్ నుస్రా ఫ్రంట్ అనే సంస్థకు నేతృత్వం వహించారు. ఆ సంస్థ అల్‌ఖైదాకు మారుపేరుగా ప్రసిద్ధం కావడంతో ఆయనపై ఆంక్షలు విధించారు.

కొందరికి మోదం... కొందరికి ఖేదం

- వందేమాతరంపై వివాదం

దిల్లీ: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రక స్వాతంత్ర్య సంగ్రామ వ్యాప్తికి తారకమంత్రంలా పనిచేసిన వందేమాతర గేయం రాజ్యాంగం నిర్దేశించిన లౌకికవాద భావజాలానికి అనుగుణంగానే ఉందా? ఈ గేయం.. ఏ మత వర్గానికైనా వ్యతిరేకమా..? అన్న వివాదం ప్రతి కొన్నేళ్లకొకసారి తలెత్తుతూనే ఉంది. ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చేసిన ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలతో మళ్లీ రగడ ప్రారంభమైంది. "1937లో ఈ గేయం నుంచి కొన్ని ముఖ్య చరణాలను తొలగించారు. దేశ విభజనకు బీజం వేసిన ఘటన అది. అలాంటి విభజన మనస్తత్వం నేటికీ దేశానికి సవాలుగానే మిగిలింది' ' అని ప్రధాని అన్నారు. భారత రాజ్యాంగ సభ 1950, జనవరి 24న వందేమాతరానికి జాతీయ గేయంగా గుర్తింపునిచ్చింది. ఈ గేయాన్ని 1896 నాటి భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం సందర్భంగా తొలిసారి ఆలపించారు. ఈ గీతానికి రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరకల్పన చేశారని 1953లో కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసారాల శాఖ ప్రచురణ ఒకటి వెల్లడించింది. ఈ గీతం 1900 ప్రాంతంలో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమానికి శక్తినందించింది.

ముస్లింలీగ్ అభ్యంతరం

ఈ దశలోనే కొందరు వేర్పాటువాద ముస్లిం నేతలు ఈ గీతానికి జాతీయ గీతం స్థాయి కల్పించడాన్ని వ్యతిరేకించడం ప్రారంభించారు. "మతతత్వ లక్షణాలు కలిగిన ఒక గీతానికి జాతీయ గేయం స్థాయిని కల్పించడం నాకు నిరాశ కలిగిస్తోంది" అని 1908, డిసెంబరు 30న జరిగిన అఖిల భారత ముస్లిం లీగ్ సమావేశంలో సయ్యద్ అలీ ఇమామ్ అనే నాయకుడు పేర్కొన్నాడు. అయితే భారత జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన మహాత్మా గాంధీ మాత్రం వందే మాతర గేయానికి అత్యున్నత గౌరవం ఇచ్చేవారు. "వందే మాతర గేయం నన్ను నా మనసును కట్టి పడేస్తూనే ఉంది. ఇది కేవలం హిందువులకో మరో మతవర్గానికో మాత్రమే పరిమితమైందన్న భావన నాకేనాడూ కలగలేదు' ' అని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. "వందేమాతరం కోట్ల మంది ప్రజల మనసులపై రాజ్యం చేస్తోంది. ఈ గేయం వారిలో దేశభక్తి భావనను పెంపొందిస్తూనే ఉంది. ఈ గేయంలోని చరణాలు బెంగాల్ భారత దేశానికి ఇచ్చిన చెరగని బహుమతి" అని మహాత్ముడు హరిజన్ పత్రికలో 1939, జులై 1న రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. హిందూ ముస్లింలు కలసికట్టుగా నిర్వహించుకుంటున్న సభలో వందే మాతరం కారణంగా ఒక్క కలహం కూడా తలెత్త కూడదని నేను కోరుకుంటానని ఆయన అన్నారు. వందేమాతరంను బలవంతంగా ఎవరిపైనా రుద్దవద్దని గాంధీజీ స్వాతంత్రానంతరం పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఈ వివాదం నేటికీ సమసిపోలేదు.



వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది

2009లో జమియాత్ ఉలమా-ఇ- హింద్ ముస్లింలు ఈ గీతాన్ని ఆలపించరాదంటూ ఫత్వా జారీ చేసింది. "మేం మా దేశాన్ని ప్రేమిస్తాం. మా ప్రేమను ఎన్నో దఫాలు నిరూపించుకున్నాం కూడా. అయితే ఇస్లాం ఏకేశ్వరవాదాన్ని నమ్మే మతం. వందేమాతరం ఆ వాదానికి విరుద్ధంగా ఉంది. మేం దేశాన్ని ప్రేమిస్తామే గానీ ముస్లింలు ఆరాధించే ఏకైక దేవుడైన అల్లాకు సమానమైన స్థాయిని కల్పించలేం" అని ఫత్వా పేర్కొంది. అయితే జమియాత్ ఉలమా-ఇ-హింద్ ఫత్వాను తీవ్రంగా ఖండిస్తూ దాదాపు 100 మంది ముస్లిం మేధావులు, సామాజిక కార్యకర్తలు, నటులు, రచయితలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వందే మాతరంపై వివాదం 1930 దశకంలోనే పరిష్కారమైపోయిందని వారు స్పష్టం చేశారు.

అడుగులతో అల్జీమర్స్‌కు విరుగుడు

- అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: వయసు రీత్యా కలిగే జ్ఞాపకశక్తి క్షీణతను రోజుకు 5,000 అడుగులు వేస్తే మూడేళ్లపాటు వాయిదా వేయవచ్చని ఒక అధ్యయనంలో తేలింది. దైనందిన నడకలో భాగంగా రోజుకు 7,500 అడుగులు వేసే వ్యక్తులు మేధో క్షీణతను ఏడేళ్లపాటు వాయిదా వేసుకున్నట్టేనని ఈ అధ్యయన నివేదిక వెల్లడించింది. దాదాపు 300 మందిపై అధ్యయనం జరిపి ఈ నివేదిక వెలువరించారు. శారీరక శ్రమ లేకుండా జీవనం సాగించేవారి మెదళ్లలో హానికారకమైన 'టావు' అనే ప్రొటీన్ పేరుకుపోతుంటుందని, ఈ ప్రొటీన్ న్యూరాన్‌లను నాశనం చేసి అల్జీమర్స్ వ్యాధికి కారణమవుతుందని అధ్యయనకర్తలు తెలిపారు. "మనిషి మేధో కార్యకలాపాలను ధ్వంసం చేసే అల్జీమర్స్ అంకురార్పణకు జీవనశైలికి సంబంధించిన అంశాలే ప్రధాన కారణం. ప్రారంభదశలోనే జీవనశైలిలో మార్పులు చేసుకుంటే అల్జీమర్స్ వ్యాధి లక్షణాలను నిలువరించవచ్చు" అని అధ్యయన నివేదిక రచయిత, అమెరికాలోని మాస్ జనరల్ బ్రిఘమ్ సంస్థకు చెందిన జస్మీర్ ఛత్వాల్ అన్నారు.

అల్జీమర్స్ వయసు మీరే కొద్దీ ముదిరే మేధో సంబంధ వ్యాధి. ఈ వ్యాధి సంక్రమించిన వ్యక్తుల జ్ఞాపకశక్తి, సంభాషణా సామర్థ్యం, ఆలోచనా శక్తి క్రమంగా



క్షీణించిపోయి కాలక్రమంలో దైనందిన కార్యకలాపాలు కూడా కష్టసాధ్యమవుతాయి. తాజా అధ్యయనంలో భాగంగా 50 నుంచి 90 ఏళ్ల మధ్య వయసు కలిగిన 296 మందిపై అధ్యయనం జరిపారు. "హార్వర్డ్ ఏజింగ్ బ్రెయిన్" స్టడీ పేరుతో నిర్వహించిన ఈ అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తులందరూ ప్రారంభ దశలో మేధో క్షీణతతో బాధపడుతున్నారు. పాల్గొన్న వ్యక్తులందరికీ పొజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (పీఈటీ) ద్వారా బ్రెయిన్ స్కాన్ చేసి వారి మెదళ్లలో పేరుకుపోయిన ప్రొటీన్ మోతాదును లెక్కించారు. శారీరక శ్రమ ఎక్కువగా చేసిన వారి మెదళ్లలో అమైలాయిడ్ సంబంధ టావు ప్రొటీన్ తక్కువగా ఏర్పడి ఉన్నట్టు గుర్తించారు. అంటే అలాంటివారిలో మేధో క్షీణత తక్కువగా ఉంటుందని, వారిలో టావు ప్రొటీన్‌లు పోగుపడటం తక్కువగా ఉందని అధ్యయన బృందం వెల్లడించింది.

బహిరంగ టెండరు వ్యక్తిగత బేరం కాదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: ప్రభుత్వ నిర్మాణ పనులకు సంబంధించిన బహిరంగ టెండర్లు వ్యక్తిగత బేరాలు కావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నిర్హేతుకమైన, లొసుగులతో కూడుకున్న టెండరు నిబంధనల విషయంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడుకున్న ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. టెండరు నిబంధనలకు అధికారులు తప్పుడు వ్యాఖ్యానం ఇస్తే అది ప్రభుత్వ పనుల అమలులో పోటీని నశింపజేస్తుందని, ప్రభుత్వానికి రావాల్సిన న్యాయమైన ఆదాయానికి గండి కొడుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. "బహిరంగ టెండరు అంటే వ్యక్తిగత బేరం కాదు. అదో పరిపాలనా సాధనం. ప్రజా సంపదకు ధర్మకర్తగా ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించే యంత్రాంగం. కేవలం ఒక విధానానికి కట్టుబడటమే దాని ఉద్దేశం కాదు. న్యాయమైన, పారదర్శకమైన పోటీ సాయంతో ప్రజలకు అత్యధిక మేలు చేకూర్చడం దాని లక్ష్యం" అని పేర్కొంది. ఒడిశాలోని కటక్ జిల్లాలో మహానది ఇసుక క్వారీ నుంచి ఐదేళ్ల పాటు ఇసుక సేకరించే కాంట్రాక్టుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలన్న తీర్పుపై నిరసన

- జంతు ప్రేమికుల ధర్నా

దిల్లీ: బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై జంతు ప్రేమికులు ఆందోళనకు దిగారు. న్యాయస్థానం ఉత్తర్వులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తీర్పు వెలువడిన వెంటనే దిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో జంతు ప్రేమికులు గుమిగూడి నిరసన ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. విద్యా సంస్థలు, ఆసుపత్రులు తదితర ప్రదేశాల్లో ఉన్న శునకాలు ఎవరికీ హాని చేయలేదని, వాటిని తొలగించడమంటే బంధించడమేనని ఓ జంతుప్రేమికుడు పేర్కొన్నారు. షెల్టర్లలో వాటిని పట్టించుకునే వారుండరని తెలిపారు.

రైళ్లలో మహిళల భద్రత కోసం 'ఆపరేషన్ రక్షిత'

- ప్రవేశపెట్టిన కేరళ ప్రభుత్వం

తిరువనంతపురం: రైళ్లలో మహిళా ప్రయాణికుల భద్రత కోసం 'ఆపరేషన్ రక్షిత' పేరుతో కేరళ ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తిరువనంతపురం, ఎర్నాకులం, పాలక్కడ్, కోజికోడ్ నాలుగు రైల్వే జోన్లలో ఈ ఆపరేషన్‌ను చేపట్టనున్నట్లు రైల్వే పోలీసులు ఓ ప్రకటనలో వెల్లడించారు. మహిళా ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే బోగీలు, రైల్వే ఫ్లాట్‌ఫాంలపై మహిళా పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది గస్తీ కాస్తారని పేర్కొన్నారు. ఇటీవల వక్కాల ప్రాంతం వద్ద తాగిన మత్తులో ఉన్న ఓ వ్యక్తి నడుస్తున్న రైలులోంచి ఓ మహిళను నెట్టేసిన నేపథ్యంలో రైల్వే పోలీసులు ఈ చర్యలకు ఉపక్రమించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై హౌడీ మోదీ స్పందనేది?

- ప్రధానిపై కాంగ్రెస్ విమర్శలు

దిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విమర్శలు గుప్పించింది. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని, రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ చాలావరకు తగ్గించిందని ట్రంప్ తాజాగా మరోసారి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం హస్తం పార్టీ మండిపడింది. ఈ వ్యాఖ్యలపై మోదీ స్పందన ఏమిటని ప్రశ్నించింది. "వాణిజ్యం సుంకాలను ఉపయోగించి ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపినట్లు ట్రంప్ పేర్కొనడం ఇది 59వ సారి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. "ప్రధాని మోదీతో మాట్లాడానని ట్రంప్ అంటుంటే, ట్రంప్‌ను భారత పర్యటనకు రమ్మని మోదీ కోరుతున్నారు. వచ్చే సంవత్సరం ఆరంభంలోనే ట్రంప్ ఇక్కడకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారం గురించి హౌడీ మోదీ ఏం చెప్పదలిచారు?" అని జైరాం ప్రశ్నించారు.

ముంబయి పేలుళ్ల కేసు నిందితుడి ఆస్తుల వేలం

ముంబయి: దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 1993లో వరుస పేలుళ్లకు కారణమైన నిందితుడు టైగర్ మేనన్, అతని కుటుంబసభ్యులకు సంబంధించిన ఆస్తులు సహా ఈ కుట్ర గురించి జరిగిన సమావేశాల ఫ్లాట్‌ను త్వరలో వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. టైగర్ మేనన్‌కు సంబంధించిన 17 ఆస్తుల వివరాలను స్మగ్లర్స్ అండ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మ్యానిపులేటర్స్ (ఫోర్ఫేయిటర్ అండ్ ప్రాపర్టీ) యాక్ట్ అథారిటీ (ఎస్ఏఎఫ్ఈఎంఏ).. ప్రత్యేక ఉగ్రవాద, విధ్వంసక కార్యకలాపాల నివారణ చట్టం (టాడా) కోర్టు నుంచి స్వీకరించిందని పేర్కొన్నారు. వీటిలో ఎనిమిది ఆస్తులను ఎస్ఏఎఫ్ఈఎంఏ స్వాధీనం చేసుకుంది. మార్చి 12, 1993 ముంబయిలోని 12 ప్రాంతాల్లో జరిగిన పేలుళ్లలో 257 మంది మరణించారు. ఈ ఘటన తర్వాత పరారీలో ఉన్న టైగర్ మేనన్ పాకిస్థాన్‌లో తలదాచుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ కుట్రలో హస్తమున్న టైగర్ మేనన్ సోదరుడు యాకూబ్ మేనన్‌ను 2015లో ఉరితీశారు. ఇతర కుటుంబ సభ్యులకు టాడా కోర్టు వేర్వేరు జైలు శిక్షలు విధించింది.

తూర్పు జలాల వైపు ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

- దక్షిణ కొరియా ఆరోపణ

సియోల్: ఉత్తర కొరియా శుక్రవారం ఓ బాలిస్టిక్ క్షిపణిని తూర్పు జలాల వైపు ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం ఆరోపించింది. అది ఏ రకమైన క్షిపణి, ఎంత దూరం ప్రయాణించిందనే వివరాలను మాత్రం విడుదల చేయలేదు. గత నెలలో హైపర్‌సోనిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించడం ద్వారా ఉత్తర కొరియా తన అణ్వాయుధ సామర్థ్యాన్ని విస్తరించింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ రెండు రోజుల పర్యటన నిమిత్తం తమ దేశానికి వచ్చిన సందర్భంగా సోమవారం ఉత్తర కొరియా.. పశ్చిమ జలాల్లోకి పది రౌండ్ల కాల్పులు జరిపినట్లు దక్షిణ కొరియా పేర్కొంది. తమ అధ్యక్షుడు లీ జే-మ్యూంగ్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర సమావేశానికి ముందు, శనివారం మధ్యాహ్నం ఇదే సంఖ్యలో కాల్పులు జరిపిందని దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది.

ఆస్తి చట్టాలను సంస్కరించాలి

- బ్లాక్‌చైన్ సాంకేతికతను పరిశీలించాలి: సుప్రీం కోర్టు

దిల్లీ: బ్రిటిష్ వలసవాద కాలం నాటి ఆస్తి చట్టాల్లో లొసుగుల్ని సుప్రీంకోర్టు శుక్రవారం ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా ఆస్తి చట్టాల్ని సంస్కరించాల్సిన అవసరాన్ని న్యాయస్థానం నొక్కిచెప్పింది. ఈ విషయంపై లా కమిషన్ అధ్యయనం జరిపి ఒక విస్తృత నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఆస్తి రిజిస్ట్రేషన్ విధానంలో బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే అవకాశాలను పరిశీలించాలని కోరింది.

బ్లాక్‌చైన్ సాంకేతిక పరిజ్ఞానం ఆస్తి లావాదేవీలకు సంబంధించి సురక్షితమైన, పారదర్శకమైన, మార్చడానికి వీల్లేని డిజిటల్ లెడ్జర్‌ను సృష్టించడానికి వీలు కల్పిస్తుంది. ఆస్తి కొనుగోలుదారులు మోసానికి వీల్లేని విధంగా యాజమాన్య హక్కుల్ని పరిశీలించుకోవడానికి వీలు కల్పిస్తుంది. జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. మ్యుటేషన్ లేదా జమాబందీ అలాట్‌మెంట్ లేని ఆస్తి విక్రయ లేదా దాన పత్రాలను రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించేందుకు రిజిస్ట్రేషన్ సిబ్బందికి అధికారం కల్పిస్తూ బిహార్ ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన సవరణను ధర్మాసనం కొట్టివేసింది. స్థిరాస్తి యాజమాన్యం కలిగి ఉండటం రాజ్యాంగ నిర్దేశిత హక్కు. తనకు ఇష్టం వచ్చినప్పుడు స్థిరాస్తిని కొనుగోలు చేయడం, ఆ ఆస్తిని తన స్వాధీనంలో ఉంచుకోవడం, ఇష్టం వచ్చినప్పుడు దాన్ని అమ్ముకోవడం కూడా ఈ హక్కులో భాగమే అని జస్టిస్ నరసింహ పేర్కొన్నారు. సమర్థంగా, పారదర్శకంగా జరిగే స్థిరాస్తి లావాదేవీలు దేశ వ్యవస్థాగత పరిణతికి, లావాదేవీల చట్రంపై ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనం అని న్యాయమూర్తి పేర్కొన్నారు. మన ఆస్తి చట్టాలు చిరకాలంగా ఆస్తి యాజమాన్యం, రిజిస్ట్రేషన్‌ల మధ్య వైరుధ్యాన్ని కొనసాగిస్తున్నాయి అని ఆయన వ్యాఖ్యానించారు. మన దేశ రిజిస్ట్రేషన్ చట్టం పత్రాల రిజిస్ట్రేషన్‌ను నొక్కి చెబుతోందే గానీ యాజమాన్య హక్కును కాదు, అని న్యాయమూర్తి అన్నారు.

అత్యాచార బాధితులకు పరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలి

- కింది కోర్టుకు సుప్రీం సూచన

దిల్లీ: అర్హత కలిగిన కేసుల్లో అత్యాచార, లైంగికదాడి బాధితులకు పరిహారం అందించేలా జిల్లా సెషన్స్ కోర్టులు, పోక్సో కోర్టులు ఆదేశాలు వెలువరించాలని సుప్రీం కోర్టు కోరింది. పరిపాలనాపరమైన నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వాలు అత్యాచార బాధితులకు పరిహారం చెల్లించడం లేదంటూ దాఖలైన ఒక పిటిషన్‌పై జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం నుంచి, జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ నుంచి స్పందన కోరింది. మహారాష్ట్రలోని అమరావతిలో అత్యాచారానికి గురైన ఓ మానసిక వికలాంగురాలికి కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్‌లోని సెక్షన్ 357ఏ కింద పరిహారం చెల్లించకపోవడంపై దాఖలైన ఒక పిటిషన్‌పై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక కోర్టులు అత్యాచార బాధితులకు పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయకపోవడం బాధితులకు పరిహారం అందకపోవడానికి గల కారణాల్లో ప్రధానమైనదని న్యాయమూర్తులు అన్నారు. "అత్యాచార బాధితులు స్వయంగా న్యాయ సేవల ప్రాధికార సంస్థకు గానీ మరే ఇతర న్యాయ మార్గాల్లో గానీ పరిహారం కోరాలి. ఈ విషయంలో బాధితుల్లో అవగాహన కొరవడింది" అని ధర్మాసనం ఇటీవల పేర్కొంది. "ఈ నేపథ్యంలో ప్రత్యేక కోర్టులు / సెషన్స్ కోర్టులు అర్హత కలిగిన కేసుల్లో బాధితులకు పరిహారం అందించేలా ఆదేశాలు జారీచేయాలి. అలాంటి ఆదేశాలను తాలూకా లేదా జిల్లా స్థాయి న్యాయ సేవల ప్రాధికార సంస్థల సాయంతో అమలు చేయవచ్చు" అని ధర్మాసనం అభిప్రాయపడింది.



గోవాలోని వాలావంతి నదీతీరంలో నిర్వహించిన త్రిపురారి పౌర్ణమి వేడుకల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

నిలిచిపోయిన గ్రేటర్ నొయిడా హౌసింగ్ ప్రాజెక్టుపై దర్యాప్తునకు సుప్రీం ఆదేశం

దిల్లీ: రెండు దశాబ్దాలుగా గృహ కొనుగోలుదారులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నొయిడాలో నిలిచిపోయిన హౌసింగ్ ప్రాజెక్టుపై దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి పంకజ్ నఖ్వీ నేతృత్వంలో ఏక సభ్య కమిటీని నియమించింది. సమగ్ర దర్యాప్తు నిర్వహించడంతో పాటు సమస్యకు ఆచరణీయమైన పరిష్కారాన్ని సూచించాల్సిందిగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఆదేశించింది. నివేదిక సమర్పణకు నాలుగు నెలల గడువు విధించింది. గోల్ఫ్ కోర్స్ సహకారీ ఆవాస్(గతంలో జేపీ గ్రీన్స్ ఎంప్లాయీస్ సహకార ఆవాస్ సమితి), గ్రేటర్ నొయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించిన ఈ వివాదంలో వందల మంది కొనుగోలుదారులు డబ్బు చెల్లించినా ప్లాట్లను దక్కించుకోలేకపోయారు.

ఉజ్జయినీలో మసీదును పునర్నిర్మించాలన్న పిటిషన్ కొట్టివేత

దిల్లీ: భూసేకరణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీలో కూల్చివేసిన మసీదును పునర్నిర్మించేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. భూసేకరణ పరిధిలోకి రావడంతో 200 ఏళ్ల క్రితం నిర్మించిన తకియా మసీదును జనవరి నెలలో అధికారులు కూల్చివేశారు. మసీదును తిరిగి నిర్మించాలని దాఖలైన పిటిషన్లను తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు కొట్టివేయగా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కూడా పిటిషన్‌ను అనుమతించలేదు.

దేశవ్యాప్త 'సర్'ను సవాల్ చేస్తూ పిటిషన్లు.. 11న విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

దిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను ఎన్నికల సంఘం చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ నెల 11 నుంచి వాదనలు వింటామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం శుక్రవారం తెలిపింది. ఈ అంశంపై సత్వర విచారణ జరపాల్సిందిగా ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఏడీఆర్) తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విజ్ఞప్తి చేశారు.

భారత్ నుంచి వచ్చిన ఆ ఫోన్ కాల్.. హసీనా ప్రాణాలు కాపాడింది..

ఇంటర్నెట్‌డెస్క్: బంగ్లాదేశ్‌లో అల్లర్ల వేళ నాటి ప్రధాని హసీనాను భారత్ నుంచి వచ్చిన ఓ ఫోన్ కాల్ కాపాడింది. ఆ కాల్‌తో మూక దాడి నుంచి కేవలం 20 నిమిషాల తేడాతో ఆమె తప్పించుకొని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. ఇంకా విడుదల కానీ 'ఇన్‌షా అల్లాహ్: ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రివల్యూషన్' శీర్షికతో ఉన్న పుస్తకం నుంచి ఈ విషయం వెల్లడైంది. గతేడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల కారణంగా.. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం దాటాల్సి వచ్చింది. ఆ పుస్తకంలో పేర్కొన్న ప్రకారం.. పరిస్థితులు ఎలా ఉన్నా దేశం వీడే ప్రసక్తే లేదని హసీనా పట్టుబట్టారు. ఆమెను ఒప్పించమని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌ను బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు రంగంలోకి దింపారు. మరోవైపు ఆగ్రహంతో రగిలిపోతున్న మూకలు అధికార భవనం వైపు వేగంగా దూసుకొస్తున్నాయి. అప్పటికే హసీనా ప్రయాణించే ఏ విమానమైనా తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

సరిగ్గా అప్పుడే (2024, ఆగస్టు 5న) అంటే మధ్యాహ్నం ఒకటిన్నరకు భారత్ నుంచి హసీనాకు బాగా పరిచయం ఉన్న ఉన్నతాధికారి ఫోన్ చేసినట్లు అని ఆ బుక్ ప్రస్తావించింది. ' 'అదొక షార్ట్ కాల్. ఇప్పటికే చాలా ఆలస్యమైందని ఆ అధికారి హసీనాకు చెప్పారు. వెంటనే గణభవన్‌ను వీడకపోతే.. చంపేస్తారని అప్రమత్తం చేశారు. తదుపరి పోరాటం కోసం జీవించి ఉండాలి కదా అని హితవు పలికారు. ఆ మాటలకు హసీనా ఆశ్చర్యపోయారు. కానీ తన మనసు మార్చుకునేందుకు మరో అర గంట పట్టింది. తర్వాత హసీనాను రెహానా బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం 2.23 గంటలకు బంగ్లాలో టేకాఫ్ అయిన చాపర్.. అర్ధగంటలోపు భారత్‌లో ల్యాండ్ అయింది. అప్పటి నుంచి దిల్లీలో గుర్తు తెలియని ప్రాంతంలో ఆమెకు భారత్ ఆశ్రయం కల్పిస్తోంది" అని ఆ పుస్తకంలో రచయితలు పేర్కొన్నారు. ఆ రోజు ఆ కాల్ రాకపోయి ఉంటే.. ఆమె కూడా తన తండ్రి (షేక్ ముజిబుర్ రెహమాన్)లాగే హత్యకు గురయ్యేవారని ఆందోళన వ్యక్తంచేశారు.



ట్రాన్స్‌జెండర్లపై ట్రంప్ నిర్ణయానికి సుప్రీం మద్దతు

వాషింగ్టన్: లింగమార్పిడి చేసుకున్న ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఇకపై పాస్‌పోర్టులలో ఎక్స్ అని చెప్పుకోవడానికి వీల్లేదనీ, వారు ఆడ లేదా మగ అని ప్రకటించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. 2021లో నాటి డెమోక్రాట్ అధ్యక్షుడు జో బైడెన్.. ట్రాన్స్‌జెండర్లకు పాస్‌పోర్టులలో తమ లింగాన్ని ఎక్స్ అని మార్క్ చేసే వెసులుబాటును కల్పించారు. దీన్ని ట్రంప్ రద్దుచేశారు. ట్రంప్ సర్కారు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు గురువారం ఆమోదించింది. ట్రాన్స్‌జెండర్లు సైన్యంలో పని చేయరాదని ట్రంప్ సర్కారు గతంలో జారీచేసిన ఉత్తర్వునూ సుప్రీం సమర్థించింది.


ముంబయి విమానాశ్రయంలో రూ.18 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మూడు వేర్వేరు కేసుల్లో దాదాపు రూ.18 కోట్ల విలువ చేసే మత్తు పదార్థాలు, రూ.25.64 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. మొదట బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి బ్యాగులో నుంచి రూ.6 కోట్ల విలువైన 6 కిలోల హైడ్రోపోనిక్ వీడ్‌ను స్వాధీనం చేసుకొని, అతన్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బ్యాంకాక్ నుంచే వచ్చిన మరో ఇద్దరు ప్రయాణికుల నుంచి రూ.12 కోట్ల విలువైన సుమారు 12 కిలోల ఇదే మత్తు పదార్థాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.

జుకర్‌బర్గ్ రహస్య పాఠశాల మూసివేత

- స్థానికుల ఫిర్యాదులతో స్పందించిన అధికారులు
- అనుమతుల్లేకుండా నాలుగేళ్ల పాటు మెటా అధినేత ఇంట్లో నిర్వహణ
- మరోచోటుకు తరలించామన్న మెటా ప్రతినిధి

ఇంటర్నెట్ డెస్క్: మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ వివాదంలో చిక్కుకున్నారు. అనుమతుల్లేకుండా నాలుగేళ్ల పాటు తన ఇంట్లో రహస్యంగా పాఠశాల నడుపుతున్నట్లు ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇది కాస్తా వివాదాస్పదం కావడంతో చివరకు ఆ స్కూల్‌ను అధికారులు మూసివేయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో సిటీలోని తన సువిశాల కాంపౌండ్‌లో జుకర్‌బర్గ్ ఈ స్కూల్‌ను 2021లో ప్రారంభించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. 'బికెన్ బెన్ స్కూల్' పేరుతో మాంటిస్సోరీ పద్ధతిలో 30-40 విద్యార్థులకు అక్కడ బోధన అందించారట. తొలుత పాఠశాల నడుపుతున్నారన్న విషయం ఎవరికీ తెలియదు. కానీ, రోజూ ఉదయం ఆ వీధిలోకి వరుసగా కార్లు రావడం.. జుకర్‌బర్గ్ నివాసం వద్ద చిన్నారులను దింపి వెళ్లడాన్ని స్థానికులు గుర్తించారు. ఆయన తన ఇంట్లో పూర్తి స్థాయిలో స్కూల్‌ను నిర్వహిస్తున్న విషయాన్ని గ్రహించారు. 2022లో దీనిపై స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కొన్ని నెలల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చివరకు 2024లో అధికారికంగా దీనిపై ఫిర్యాదు వచ్చింది. దీంతో అధికారులు చర్యలు చేపట్టక తప్పలేదు. స్కూల్‌ను మూసివేయాలని లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ ఏడాది మార్చిలో జుకర్‌బర్గ్‌కు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆగస్టులో పాఠశాలను అధికారికంగా మూసివేసినట్లు అధికారిక రికార్డుల్లో పేర్కొన్నారు. కానీ, స్కూల్‌ను పూర్తిగా మూసివేయలేదని, కేవలం మరో చోటుకు మార్చారని మెటా ఫ్యామిలీ అధికారిక ప్రతినిధి బ్రియాన్ బేకర్ చెప్పినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే, దాన్ని ఎక్కడకు మార్చారన్న విషయాన్ని బయటపెట్టలేదట.




పరారీలో ఉన్న వ్యక్తిగా.. దిల్లీ మాజీ మంత్రి సోమ్‌నాథ్ భారతి

- ప్రకటించిన రాయ్‌బరేలీలోని ప్రజాప్రతినిధుల కోర్టు

రాయ్‌బరేలీ: దిల్లీ న్యాయశాఖ మాజీ మంత్రి సోమనాథ్ భారతీని పరారీలో ఉన్న వ్యక్తిగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ ప్రజాప్రతినిధులు కోర్టు ప్రకటించింది. 2021లో దిల్లీలోని నీటిపారుదల శాఖ అతిథి గృహంలో పోలీసుల పట్ల దుష్ప్రవర్తనకు సంబంధించిన కేసులో మంగళవారం సోమ్‌నాథ్ భారతి కోర్టుకు గైర్హాజరవడంతో అదనపు చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ వివేక్ కుమార్ గురువారం అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

ఉత్తర, దక్షిణాల దారెటు?



- సుపౌల్, జముయీ జిల్లాల్లో ఎన్డీయే కోటలను ఇండియా కూటమి బద్దలు కొట్టగలదా..

ఆ రెండు జిల్లాలు.. బిహార్‌లో ఉత్తర, దక్షిణాల్లో ఉంటాయి. ఒకటి నేపాల్‌కు సరిహద్దులో ఉంటే.. మరొకటి ఝార్ఖండ్‌ పొరుగున ఉంటుంది. అవే ఉత్తరాన ఉన్న సుపౌల్‌, దక్షిణాన ఉన్న జముయీ.. ఈ రెండు జిల్లాల్లో గత ఎన్నికల్లో ఎన్డీయేదే ఆధిపత్యం. ఈసారి ఆ ఆధిపత్యానికి గండి కొట్టాలని మహాగఠ్‌బంధన్‌ గట్టిగా పోరాడుతోంది. అది ఎంతవరకు విజయం సాధిస్తుందో ఈ నెల 14న తేలిన ఓట్ల లెక్కింపు రోజునగాని తెలియదు. ఈ రెండు జిల్లాల్లోని 9 సీట్లలో ఈ నెల 11వ తేదీన పోలింగ్‌ జరగనుంది.

కోసీ నది వరదల కారణంగా ఏటా తీవ్రంగా ఇబ్బందిపడే ఈ ప్రాంతంలో 5 అసెంబ్లీ సీట్లున్నాయి. ఏటా నది తన ప్రవాహాన్ని మార్చుకుంటున్న కారణంగా అనేక ఇళ్లు, పొలాలు మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేపాల్‌ నుంచి కోసీ నది సుపౌల్‌లోకే ప్రవేశిస్తుంది. 33 గ్రామాలకు దీనివల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

- ప్రముఖ నేతలైన కేంద్ర మాజీ మంత్రి లలిత్‌ నారాయణ్‌ మిశ్ర, మాజీ సీఎం జగన్నాథ్‌ మిశ్ర, అనూప్‌ లాల్‌ యాదవ్‌లు ఈ ప్రాంతానికి చెందినవారే.
- దీంతోపాటు మద్య నిషేధం, ఉపాధి, అభివృద్ధి, శాంతి భద్రతలు ఈ ప్రాంతంలో ఓటర్ల ప్రధానాంశాలుగా ఉన్నాయి.
- ఈ ప్రాంతంలో సీనియర్‌ జేడీయూ నేత, విద్యుత్తుశాఖ మంత్రి బిజేంద్ర ప్రసాద్‌ యాదవ్‌దే ఆధిపత్యం. ఆయన 35 ఏళ్లుగా ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.
- సుపౌల్‌లోని 5 సీట్లనూ గత ఎన్నికల్లో ఎన్డీయేనే గెలుచుకుంది.
- ఈ ప్రాంతంలో బిజేంద్ర ప్రసాద్‌ చాలా అభివృద్ధి పనులు చేశారని ఓటర్లు చెబుతారు. అయితే ఇంకా మౌలిక సదుపాయాల కొరత ఉందని అంటున్నారు. బాగా చదువుకున్న ఉద్యోగాలు దొరకడం లేదని చెబుతున్నారు. దీంతో ఇతర నగరాలకు వలస పోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.
- సుపౌల్‌లోని పట్టణ ప్రాంతాల్లో యాదవ్‌-ముస్లిం సమీకరణం పని చేయవచ్చు. ఇక్కడ 20.4% ముస్లింలు, 16.5% యాదవ్‌లు, 13.15% ఎస్సీలున్నారు.

సుపౌల్ జముయీ

జముయీలో 4 నియోజకవర్గాలున్నాయి. 12.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.

- జముయీ మహావీరుడి జన్మస్థలం. ఇప్పుడు నక్సల్స్‌ ప్రభావిత ప్రాంతంగా ఉంది.
- 2020 ఎన్నికల్లో 4 సీట్లనూ ఎన్డీయే గెలుచుకుంది.
- గత ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకే ఎన్డీయే టికెట్లు ఇచ్చింది. సికంద్రా నుంచి హెచ్‌ఏఎం, జముయీ నుంచి భాజపా, ఝాఝా నుంచి జేడీయూ పోటీ చేస్తున్నాయి. చకాయ్‌ నుంచి ఎన్డీయే మద్దతున్న స్వతంత్ర అభ్యర్థి, మంత్రి అయిన సుమిత్‌ కుమార్‌ పోటీ పడుతున్నారు.
- రూరల్‌ ప్రాంతంలో యాదవ్‌లు, కొయిరీ, బనియా, ముస్లిం ఓటర్ల ప్రాబల్యం ఉంటుంది.
- సరిహద్దులోని చకాయ్‌లో నక్సల్స్‌ ప్రభావం ఎక్కువ. శాంతి భద్రతలు, అభివృద్ధి ఇక్కడ కీలకంగా ఉన్నాయి.
- విద్యుత్‌ కోతలు ఎక్కువ. వెనుకబడిన వర్గాలవారు, మహాదళితులు అధికంగా ఉన్నారు.
- జముయీ పట్టణంలో నీరు నిలిచిపోవడం, ట్రాఫిక్‌, పట్టణ సమస్యలు, మైనింగ్‌, ఉపాధి అంశాలు ఇక్కడ ప్రభావితం చేస్తాయి.
- నీతీశ్‌ కుమార్‌ పచ్చాక ఈ ప్రాంతంలో అభివృద్ధి ప్రారంభమైందని స్థానిక ఓటర్లు చెబుతున్నారు. మహిళల కోసమూ ఆయన ఎంతో కొంత చేశారని అభిప్రాయపడుతున్నారు.
- ఈ ప్రాంతంలో ఉపాధి లేదని, పరిశ్రమలు రావాలని ఓటర్లు కోరుకుంటున్నారు.

నేషనల్‌ డెస్క్‌

విశ్రాంత ఆచార్యుడు రామకృష్ణారెడ్డికి అరుదైన గౌరవం

ఫెలోగా ప్రకటించిన 'రాయల్‌ సొసైటీ ఆఫ్‌ కెమిస్ట్రీ'



అనంతపురం (ఎస్కేయూ), న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విశ్రాంత ఆచార్యుడు రాజూరు రామకృష్ణారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. యునైటెడ్‌ కింగ్‌డమ్‌లోని 'రాయల్‌ సొసైటీ ఆఫ్‌ కెమిస్ట్రీ' అనే సంస్థ ఫెలోగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 55 వేల మంది ఇందులో సభ్యులుగా ఉంటారు. అసాధారణ పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు ఇందులో చోటు దక్కుతుంది. సైద్ధాంతిక, భౌతిక, పర్యావరణ శాస్త్రాల్లో రామకృష్ణారెడ్డి పరిశోధనలు గావించారు. దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం పర్యావరణ క్షేత్రం అంశంగా కూడా పరిశోధనలు చేశారు. ఆయా రంగాల్లో 244 పరిశోధన పత్రాలు, గూగుల్‌ సైటేషన్స్‌ 6439, ఐ10 ఇండెక్స్‌ 125, హెచ్‌ ఇండెక్స్‌ 45 పొందారు. స్టాన్‌ఫర్డ్‌ విశ్వవిద్యాలయం రూపొందించిన ప్రపంచంలో ఉన్నత శాస్త్రవేత్తల జాబితాలో ఆయన పేరు ప్రస్తావించడం విశేషం. ఇస్రో, యూజీసీ, శాస్త్ర సాంకేతిక శాఖల నుంచి ఆయన పరిశోధన ప్రాజెక్టులకు కోట్ల రూపాయల ఆర్థిక సహకారం అందింది. రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో 21 మంది డాక్టరేట్లు పొందడం విశేషం.

హైస్కూల్‌ ప్లస్‌లో ఇంటర్మీడియట్‌కు అధ్యాపకుల కొరత

- రాష్ట్రవ్యాప్తంగా 1,118 మంది అవసరం
- మరో మూడు నెలల్లో పబ్లిక్‌ పరీక్షలు
- వెంటనే నియమిస్తే అదనపు తరగతులతోనైనా బోధన అందించవచ్చు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ హైస్కూల్‌ ప్లస్‌లలో ఇంటర్మీడియట్‌ బోధనకు అధ్యాపకుల కొరత నెలకొంది. కొన్నిచోట్ల ఒక అధ్యాపకుడితోనే రెండు, మూడు సబ్జెక్టులు చెప్పిస్తున్నారు. అతిథి అధ్యాపకులను నియమించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు అమల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోపక్క, షెడ్యూలులో ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలు జరగనున్నాయి. ఈ లోపు అధ్యాపకులను నియమించకపోతే ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. వైకాపా ప్రభుత్వంలో సరైన ప్రణాళికలు లేకుండానే బాలికలకు ప్రత్యేకంగా 297, కోఎడ్యుకేషన్‌కు 207 హైస్కూళ్లల్లో ఇంటర్‌ అందుబాటులోకి తెచ్చారు. వీటిని హైస్కూల్‌ ప్లస్‌లుగా మార్చారు. ప్రత్యేకంగా అధ్యాపకులను నియమించకుండానే అర్హత కలిగిన టీచర్లకు ఒక ఇంక్రిమెంట్‌ ఇచ్చి డిప్యుటేషన్‌పై నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంతో వీటిల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు పాఠశాలల్లోకి వెళ్లిపోయారు. దీంతో అధ్యాపకుల కొరత ఏర్పడింది. ప్రధానోపాధ్యాయులుగా కొందరు పదోన్నతులు పొందగా.. నివాస ప్రాంతానికి దగ్గరలో పోస్టింగ్‌ వస్తుందనే ఉద్దేశంతో మరికొందరు టీచర్లు బదిలీల్లో వెళ్లిపోయారు. అప్పటి నుంచి అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. హైస్కూల్‌ ప్లస్‌లలో ఇంటర్మీడియట్‌ బాధ్యతలను పాఠశాల విద్యాశాఖ పర్యవేక్షిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఇంటర్‌ వరకు ఇంటిగ్రేటెడ్‌ విద్యాశాఖకు అప్పగించాలని భావించినా ఈ ప్రక్రియ పూర్తి కాలేదు.

12 వేల మంది విల్లలు..

రాష్ట్రంలో 504 హైస్కూల్‌ ప్లస్‌లలో ఇంటర్మీడియట్‌లో 12,022 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది 2024-25లో జరిగిన ప్రథమ సంవత్సరం పబ్లిక్‌ పరీక్షలకు 6,574 మంది హాజరు కాగా.. 2,228(34%)మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 3,554 మంది పరీక్షలు రాయగా.. 2,134(60%)మంది ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి మొదటి సంవత్సరం 70% కాగా.. ద్వితీయ సంవత్సరం 83% ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సగటు కంటే ఇప్పటికే ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉంది.

వెయ్యికిపైగా కొరత..

అన్ని హైస్కూల్‌ ప్లస్‌లలో కలిపి 1,118 మంది అధ్యాపకుల అవసరమని పాఠశాల విద్యాశాఖ జవాబల లెక్క తేల్చింది. కేవలం బాలికలకు మాత్రమే నిర్వహిస్తున్న హైస్కూల్‌ ప్లస్‌లలో 511, కోఎడ్యుకేషన్‌ విధానంలో కొనసాగుతున్న వాటికి 607 మంది అధ్యాపకులు కావాల్సి ఉంది. ఈ పోస్టుల్లోకి అతిథి అధ్యాపకులను తీసుకోవాలని గతంలోనే ప్రభుత్వం సూచించింది. కానీ, అతిథి అధ్యాపకుల నియామకానికి పెట్టిన దస్త్రం సచివాలయంలోనే కొన్ని నెలపాటు ఆగిపోయి లేకుండా ఉండిపోయింది. తాత్కాలికంగా పిల్లలకు బోధన అందించేందుకు అతిథి అధ్యాపకులను నియమిస్తే పబ్లిక్‌ పరీక్షల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. మరో మూడు నెలల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈలోపు భర్తీ చేయకపోతే బోధన లేకుండా పరీక్షలు రాసేది ఎలాగని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అతిథి అధ్యాపకులకు ఇటీవల కూటమి ప్రభుత్వం పారితోషికాన్ని పెంచింది. దీని ప్రకారం ఒక్కొక్కరికి నెలకు రూ.27 వేల వరకు ఇవ్వాల్సి వస్తుంది. దీనికి దాదాపు రూ.33 కోట్లు అవసరం కానుంది.

'హిడ్మా' టీమ్‌పై పోలీసుల నజర్‌..

చర్ల, న్యూస్‌టుడే: కేంద్రబలగాలు భద్రతా బలగాలకు చుక్కలు చూపిస్తున్న మోస్ట్‌ వాంటెడ్‌ మావోయిస్టు నాయకుడు హిడ్మా టీమ్‌పై ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు 'గురి' పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌, మే నెలలో కర్రెగుట్టల్లో జరిగిన ఆపరేషన్‌ నుంచి త్రుటిలో తప్పించుకున్న హిడ్మా టీమ్‌ మళ్లీ తప్పించుకోకుండా తెలంగాణకు ఆనుకొని ఉన్న ఛత్తీస్‌గఢ్‌ సరిహద్దుల్లో 2 వేల మంది జవాన్లను మోహరించి చుట్టుముట్టారు. బస్తర్‌ అడవుల్లో డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్‌ రిజర్వ్‌గార్డ్‌), సీఆర్పీఎఫ్‌, ఎస్టీఎఫ్‌(స్టేట్‌ టాస్క్‌ ఫోర్స్‌) బలగాలు అప్రకటితంగా సరిహద్దుల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రధానంగా హిడ్మాతో పాటు దేవ, ఎర్ర, కేసా నాయకత్వంలోని గెరిల్లా టీమ్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. డ్రోన్లతో నిరంతరం ఈ ప్రాంతంలో నిఘా పెట్టారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు బీజాపూర్‌ జిల్లాలో ఒక హెలికాప్టర్‌ను స్టాండ్‌బై మోడ్‌లో ఉంచారు. చివరిసారి తప్పించుకున్న హిడ్మాతో సహా అగ్రశ్రేణి నాయకులు ఉన్న ప్రాంతాల వైపుగా భద్రతా బలగాలు కదులుతున్నట్లుగా సమాచారం. అబూజ్‌మడ్‌ సరిహద్దు అడవుల్లో సవాల్‌తో కూడుకున్న ఈ ఆపరేషన్‌లో హిడ్మా రహస్య స్థావరాలు గుర్తించేందుకు డీఆర్‌జీ, కేంద్ర బలగాలు మావోయిస్టు పట్టున్న గ్రామాల సాంకేతిక మ్యాపింగ్‌, థర్మల్‌ ఇమేజింగ్‌ ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగిస్తున్నాయి.



ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్‌ ఆచార్య బిద్యాధర్‌ సుబుధి

నిట్‌.. ప్యాకేజీ హిట్‌!

రికార్డు స్థాయిలో వార్షిక వేతనానికి ఎంపిక



నారాయణ త్యాగి

నిట్‌ క్యాంపస్‌, న్యూస్‌టుడే: వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్‌)లో విద్యార్థులు ఆకర్షణీయ వేతనాలతో కొలువులు సాధిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్‌ పూర్తిచేసిన విద్యార్థులకు జరిగిన ప్రాంగణ నియామకాల్లో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధిక దేశీయ ప్యాకేజీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. బీటెక్‌ సీఎస్‌ఈ విద్యార్థి నారాయణ త్యాగి రూ1.27 కోట్ల వార్షిక వేతనానికి, బీటెక్‌ ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజినీరింగ్‌ విభాగం నుంచి మొహమ్మద్‌ నహీల్‌ నష్వాన్‌ రూ.కోటి ఆఫర్‌ అందుకున్నారు. సెంటర్‌ ఫర్‌ కెరీర్‌ ప్లానింగ్‌ అండ్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ పి.వెంకటసురేశ్‌ ప్లేస్‌మెంట్‌ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజీ అందుకున్న విద్యార్థులను నిట్‌ డైరెక్టర్‌ ఆచార్య బిద్యాధర్‌ సుబుధి అభినందించారు. తొలి రెండు నెలల ప్రాంగణ నియామకాల్లో ఆరుగురు విద్యార్థులు రూ.70 లక్షలకు పైగా.. 20-70 లక్షల రూపాయల మధ్య ప్యాకేజీని 190 మందికి పైగా సాధించారు. 'మాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడా. మా నాన్న ఇంజినీర్‌, అమ్మ టీచర్‌. నా తల్లి ప్రోత్సాహంతో సైన్సుపై ఆసక్తి పెరిగింది. ఎక్కువ అంశాలను నేర్చుకోవడం, వివిధ రంగాలను అన్వేషించడం నా జీవిత లక్ష్యం' అని విద్యార్థి నారాయణ త్యాగి తెలిపారు.

డ్వాక్రా మహిళల ఉపాధికి పెద్దపీట

- మూడు క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- మరో ఆరింటికి సూత్రప్రాయ అంగీకారం
- 11 వేల మందికి లబ్ధి

ఈనాడు, అమరావతి: డ్వాక్రా మహిళల ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కల్పనకు అవకాశమున్న కీలక రంగాలను గుర్తించి వారికి చేయూత అందిస్తోంది. ఇప్పటికే 9 ప్రాంతాలను ఎంపిక చేసి కేంద్రానికి నివేదించింది. గుంటూరు జిల్లాలో పచ్చళ్ల తయారీ, బాపట్ల, కర్నూలు జిల్లాల్లో చేనేత క్లస్టర్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. మరో ఆరు క్లస్టర్ల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. వారం, పది రోజుల్లో వీటికి గ్రీన్‌ సిగ్నల్‌ లభించనుంది. తమ ఆమోదంతో సంబంధం లేకుండా పనులు ప్రారంభించాలని ఇప్పటికే కేంద్ర అధికారులు రాష్ట్రానికి సమాచారమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 11,475 మందికి లబ్ధి చేకూరనుంది.

రూ.100 కోట్ల విలువైన ప్రాజెక్టులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నాయి. 9 క్లస్టర్ల ఏర్పాటుకుగాను రూ.100 కోట్ల వ్యయం కానుంది. ఈ మేరకు ఇప్పటికే నివేదికలను సిద్ధం చేసి సెర్ప్‌ అధికారులు కేంద్రానికి నివేదించారు. పచ్చళ్ల తయారీ క్లస్టర్‌కు రూ.22 కోట్లు, చేనేత క్లస్టర్లకు రూ.5 కోట్ల చొప్పున ఇప్పటికే కేటాయించింది. పచ్చళ్ల తయారీ క్లస్టర్‌తో గుంటూరు జిల్లాలో 2,500 మంది డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరనుంది.

చేనేతకు జవసత్వాలు...

అంపశయ్యపై ఉన్న చేనేతకు ఆధునికత జోడించేందుకు క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లాలో చీరాల నేత చీరల తయారీకి ప్రసిద్ధి. వీటితో పాటు తిరుపతి, విజయనగరంలోనూ మరో రెండు చేనేత క్లస్టర్లు రానున్నాయి. ఒక్కోచోట 200 మంది చేనేతలను ఒక సమూహంగా చేసి క్లస్టర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ✦ విజయనగరం జిల్లాల్లో ప్రత్యేకంగా మిల్లెట్‌ క్లస్టర్‌ ఏర్పాటు కానుంది. దీంతో 1000 మందికి లబ్ధి చేకూరుతుంది.✦ ప్రకాశం జిల్లా కొత్తపట్నం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఇక్కడ 1500 మందికి ఉపాధి లభించనుంది ✦ ఎన్టీఆర్‌ జిల్లా జక్కంపూడి పరిధిలో సాంకేతిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి రూ.41 కోట్ల వ్యయం కానుంది. 5025 మందికి లబ్ధి చేకూరుతుంది. ✦ ప్రకాశం జిల్లా సింగరాయకొండ కేంద్రంగా ఆహార ఉత్పత్తుల క్లస్టర్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ 700 మందికి ఉపాధి లభిస్తుంది.



వందేమాతరం ఆలపిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌ రావు, ఎంపీలు డా.లక్ష్మణ్‌, డీకే అరుణ

భారతీయుల్లో స్ఫూర్తిని రగిలించిన గేయం 'వందేమాతరం'

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సుల్తాన్‌బజార్‌, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో భారతీయుల్లో 'వందేమాతరం' స్ఫూర్తిని రగిలించిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ గీతాన్ని రచించి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా దేశ గౌరవం, సమగ్రత కోసం ప్రతి భారతీయుడు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గోషామహల్‌లోని సుల్తాన్‌బజార్‌ రాయల్‌ చౌరస్తా వద్ద నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందేమాతరం రణ నినాదంతో ఎంతోమంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టారన్నారు. అమరవీరుల త్యాగాలు, వందేమాతరం గీతం స్ఫూర్తిని నేటి యువత భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఒక మతానికి సంబంధించిన నినాదం కాదన్నారు. కొందరు మతంతో ముడిపెట్టి విమర్శిస్తున్నారని మండిపడ్డారు. వందేమాతరం ఉత్సవాలను ఏడాది పొడవునా జరుపుకోవాలన్నారు. ఎంపీ డా.లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. వందేమాతరాన్ని జాతీయగేయంగా ప్రకటిస్తే అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్‌ పార్టీదని విమర్శించారు. రామచందర్‌రావు మాట్లాడుతూ వందేమాతరం అంటే ఒక గేయం మాత్రమే కాదని, భారతీయుల జీవనజ్యోతి అని పేర్కొన్నారు. వందేమాతరం ఆలాపన అనంతరం దిల్లీలోని ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ తదితరులు హాజరయ్యారు.

హైదరాబాద్‌లో ఇండియన్‌ రోడ్‌ కాంగ్రెస్‌ 85వ సదస్సు

ఈనాడు, హైదరాబాద్‌: ఇండియన్‌ రోడ్‌ కాంగ్రెస్‌ 85వ వార్షిక సదస్సుకు హైదరాబాద్‌ వేదిక కానుంది. 2026లో జరిగే ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 84వ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీ ఈ మేరకు శుక్రవారం ప్రకటన చేసినట్లు రోడ్లు, భవనాలశాఖ తెలిపింది.

మహిళా సమస్యల పరిష్కారానికి అండ!

- మండలానికి ఒక జీఆర్‌సీని అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక
- ముందుగా జిల్లాకు 4 చొప్పున ఏర్పాటుచేసేందుకు చర్యలు



విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఏర్పాటు చేసిన జెండర్‌ రిసోర్స్‌ సెంటర్‌

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో గృహహింస, వరకట్నం, లైంగిక వేధింపులు, ఇతర లింగ ఆధారిత హింస నుంచి మహిళలకు అండగా నిలిచేలా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మహిళల ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యలకు పరిష్కారం చూపేలా 'జెండర్‌ రిసోర్స్‌ సెంటర్స్‌(జీఆర్‌సీ)'ను ఏర్పాటు చేస్తోంది. ఇవి మండలానికి ఒకటి చొప్పున ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. ముందుగా జిల్లాకు నాలుగు చొప్పున ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే 64 మండలాల్లో ఇవి అందుబాటులోకి వచ్చాయి. విడతల వారీగా రానున్న నాలుగేళ్లలో మిగతా వాటిని అందుబాటులోకి తీసుకురానుంది.

ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షలు

✦ 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వీటిని ఏర్పాటు చేస్తారు.
✦ ఒక్కో జీఆర్‌సీకి రూ.5 లక్షలు వెచ్చించనున్నారు. ఏర్పాటు, మూడేళ్ల నిర్వహణకు ఈ నిధులు కేటాయిస్తారు.
✦ ముందుగా 104 జీఆర్‌సీల ఏర్పాటుకు రూ.5.20 కోట్లు విడుదలయ్యాయి.
✦ ఇప్పటికే 64 చోట్ల కొలువుదీరగా, మరో 40 చోట్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.
✦ ఇవి కాకుండా 2025-26 ఏడాదికి ఇంకో 100 జీఆర్‌సీల ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధుల మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

డ్వాక్రా మహిళల సారథ్యంలోనే..

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్‌) ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులే వీటిని నిర్వహిస్తారు. మహిళల సమస్యల పట్ల అవగాహన ఉండి, వాటి పరిష్కారం కోసం చొరవ చూపే వారిని జీఆర్‌సీల్లో ప్రతినిధులుగా తీసుకుంటారు. డ్వాక్రా సంఘాల్లో ఉండే సామాజిక యాక్షన్‌ కమిటీ, జెండర్‌ కలెక్టివ్‌ మెంబర్స్‌, మండల సమాఖ్య పదాధికారుల నుంచి 10 మందిని ఎంపిక చేస్తారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

✦ బాల్య వివాహాలను అరికట్టడం, బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వెళ్లేలా చేయడం, డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు బియ్యం కార్డు, ఇతర అర్హత కార్డుల్ని అందేలా చేయడం తదితర సమస్యలకు వీరు దారి చూపిస్తారు.
✦ వివిధ సమస్యల్లో మహిళలకు కౌన్సెలింగ్‌ ఇచ్చి చేదోడుగా ఉండటం, ధైర్యం నింపడం వంటివీ చేస్తారు.
✦ సమస్యల్లో ఉన్న వారికి తాత్కాలిక వసతి సౌకర్యం కల్పిస్తారు. ✦ ప్రతి రోజూ ఇవి ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తాయి.

12 గంటలు.. 14 బాటిళ్ల రక్తం

బాలింత ప్రాణం కాపాడిన ప్రభుత్వ వైద్యులు

పాలమూరు, న్యూస్‌టుడే: కాన్పు అనంతరం తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితికి చేరిన బాలింతను తెలంగాణలోని మహబూబ్‌నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నాలుగు రోజులపాటు శ్రమించి కాపాడారు. శుక్రవారం ఆసుపత్రి పర్యవేక్షకులు డా.రంగాఅజ్మీరా తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌ జిల్లా దేవరకద్ర మండలం నెల్లికొండి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ గత నెల 23న పురిటినొప్పులతో దేవరకద్ర పీహెచ్‌సీలో చేరారు. అక్కడ వైద్యులు సాధారణ కాన్పు చేయగా మగబిడ్డ జన్మించాడు. కానీ, ఎంత ప్రయత్నించినా ఆమెకు రక్తస్రావం ఆగకపోవడంతో వెంటనే మహబూబ్‌నగర్‌ ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రికి తరలించారు. అదే రోజు ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్‌ విజయేందిర బోయి వైద్యులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్‌ భాగ్యశ్రీకి వెంటనే మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ మేరకు వైద్యులు మాధవి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మీపద్మప్రియ, ఆశాలత వైద్యపరీక్షలు చేయగా.. ఆమె శరీరంలో కేవలం 5 గ్రా/డెసిలీటర్‌ రక్తమే ఉంది. దీంతో వైద్యులు ఆరోజు రాత్రి నుంచి ఉదయం వరకు 12 గంటల వ్యవధిలో 14 బాటిళ్ల 'ఓ' పాజిటివ్‌ రక్తాన్ని ఎక్కించారు. ఆపై 36 గంటలపాటు చికిత్స అందిస్తూ పర్యవేక్షించగా.. నాలుగోరోజు రక్తస్రావం నిలిచింది. ప్రస్తుతం భాగ్యశ్రీ పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా ఉన్నారు.

వాగ్బాణాలు... వాగ్దానాలు

- భారాసపై పదునైన విమర్శలు.. స్థానికత ఎరిగి బాసలు
- జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్‌ వ్యూహాత్మకంగా ముందుకు



ఈనాడు, హైదరాబాద్‌: ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్‌ను సొంతం చేసుకోవాలని అధికార పక్షం కాంగ్రెస్‌.. ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోంది. పదేళ్ల పాటు కొనసాగిన కేసీఆర్‌ పాలనపై, ఆయన వైఖరిపై సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రచారంలో తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ మరోపక్క కాంగ్రెస్‌ గెలిస్తే ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు. స్థానిక ఓటర్లను ఆకర్షించేందుకు ప్రతిపక్షాలు కూడా ఊహించని విధంగా బాసలు చేస్తున్నారు.

ఎన్టీఆర్‌ విగ్రహం..

అమీర్‌పేట మైత్రీవనం కూడలిలో తెదేపా వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌ హామీ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఎన్టీఆర్‌ అభిమానులు.. తెదేపా వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నంగా పరిశీలకులు భావిస్తున్నారు. కొంతకాలంగా ఎన్టీఆర్‌ విగ్రహం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఇటీవల రోడ్‌షోలో ఒక నేత ఇక్కడ ఎన్టీఆర్‌ అభిమానులు ఎక్కువని గుర్తు చేయగా వెంటనే ఆయన వ్యూహాత్మకంగా ఈ హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్‌ తెదేపాను స్థాపించారు. అలాంటి వ్యక్తి విగ్రహం కాంగ్రెస్‌ సీఎం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం పార్టీ సీనియర్లను, రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. ఈ హామీని వెంగళరావునగర్‌, మధురానగర్‌ తదితర ప్రాంతాల ఓటర్లను ఆకర్షించే ఎత్తుగడగా భావిస్తున్నారు.

బస్తీల్లో పీజేఆర్‌ ప్రస్తావన

బస్తీల్లో నిర్వహిస్తున్న ప్రచారంలో సీఎం.. ఒకప్పటి ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు పీజేఆర్‌(పి.జనార్దన్‌ రెడ్డి) గురించి ప్రస్తావిస్తున్నారు. బోరబండ కూడలిలో పీజేఆర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బస్తీవాసుల్లో పీజేఆర్‌ అంటే మంచి క్రేజ్‌ ఉండడంతో దీన్ని సానుకూలంగా మార్చేందుకు వ్యూహం పన్నారు. పీజేఆర్‌ మరణంతో ఖైరతాబాద్‌కు వచ్చిన ఉప ఎన్నికలో తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి పోటీ చేస్తే.. ఏకగ్రీవం కాకుండా భారాస అడ్డుకుందన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.
✦ షేక్‌పేట, బోరబండ, ఎర్రగడ్డ తదితర ప్రాంతాల్లో ఉన్న హెచ్‌టీ లైన్లు తొలగించి పేదల నివాసాలకు అడ్డు లేకుండా చూస్తామని హామీలు ఇస్తున్నారు.
✦ శ్మశానాలకు స్థలాలు ఇస్తామని, ఖబ్రస్థాన్‌లు ఏర్పాటు చేస్తామని, తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. అభివృద్ధికి రూ.వందల కోట్లు కేటాయించామంటూ వివరిస్తున్నారు. రేషన్‌ కార్డులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. భారాస హయాంలో రేషన్‌కార్డులు ఇవ్వలేదని తాము వచ్చిన తర్వాత ఇచ్చామని గుర్తు చేస్తున్నారు.

పోల్‌ మేనేజ్‌మెంటుపై...

ఓటర్లను ఆకర్షించడంతో పాటు తెర వెనుక వ్యూహాల్లోనూ సీఎం కీలకంగా మారారు. ప్రతి వందమంది ఓటర్లకు ఓ నేతను ఇన్‌ఛార్జిగా నియమించడం, 10 పోలింగ్‌ కేంద్రాలకు ఓ ఎమ్మెల్యే/ఎమ్మెల్సీని నియమించడం, డివిజన్‌కు ఇద్దరేసి మంత్రులకు బాధ్యతలను అప్పగించడం ఆయన వ్యూహాల్లో భాగం. ఇప్పటికే ఏ పోలింగ్‌ కేంద్రంలో కాంగ్రెస్‌ ఓట్లు ఎన్ని అని ఒక అంచనాకు వచ్చినట్లు చెబుతున్నారు. గెలుపుపై కాకుండా ఆధిక్యంపై దృష్టి పెట్టారని కాంగ్రెస్‌ నాయకులు చెబుతున్నారు. పోల్‌ మేనేజ్‌మెంటుపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు, సూచనలు చేసినట్లు చెబుతున్నారు.

ప్రతికూల పరిస్థితులు.. కూలిన రైతుల బతుకులు

ఒకరి హఠాన్మరణం.. మరొకరి ఆత్మహత్య



ఇజ్జయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



ఉపేందర్‌రెడ్డి

గంభీరావుపేట, చౌటుప్పల్‌ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ప్రతికూల పరిస్థితుల కారణంగా ఓ రైతు పొలంలోనే కుప్పకూలగా మరొక రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల పరిధి గజసింగవరం గ్రామానికి చెందిన ధ్యాసబోయిన ఇజ్జయ్య(65) తన భార్య లక్ష్మితో కలిసి పొలం వద్దకు వెళ్లారు. ఎకరం పొలం కోతకు సిద్ధంగా ఉన్నా ఇటీవలి వర్షాలకు కమతంలో తడి ఆరని కారణంగా యంత్రాలు రావడం లేదు. శుక్రవారం సమీపంలో వరి కోత మిషన్‌ వద్దకు వెళ్లి పొలం కోయడానికి రావాలని కోరారు. తిరిగి పొలం వద్దకు చేరుకొన్నారు. పైరు నేలవాలడం, కమతం ఆరకపోవడం తదితర పరిస్థితుల పట్ల తీవ్ర ఆందోళనకు గురైన రైతు పొలంలోనే ఒక్కసారిగా కుప్పకూలి.. అక్కడికక్కడే మరణించారు. తహసీల్దార్‌ మారుతిరెడ్డి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఇజ్జయ్య ఆందోళనతో గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మరొక ఘటనలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌ మండలం అంకిరెడ్డిగూడేనికి చెందిన రైతు ఇటికాల ఉపేందర్‌రెడ్డి(43) తొమ్మిది ఎకరాలతో పాటు మరి కొంత భూమిని కౌలుకు కూడా తీసుకొని పత్తి సాగు చేశారు. సాగు నిమిత్తం బంగారం తాకట్టు పెట్టడంతో పాటు అప్పులు కూడా చేశారు. అతిగా వర్షాలు కురవడంతో పత్తి నల్లబడి తీసేందుకు కూడా అక్కరకు రాకుండా పోయింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఉపేందర్‌ శుక్రవారం తెల్లవారుజామున ఇంటి వరండాలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ మన్మథ కుమార్‌ చెప్పారు.

వందేమాతరం స్ఫూర్తి శాశ్వతం

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: మన జాతీయ గేయం 'వందేమాతరం' స్ఫూర్తి శాశ్వతమని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఈ గేయం దేశభక్తి, ఐక్యత, మాతృభూమి పట్ల భక్తి, స్ఫూర్తిని ప్రతిధ్వనిస్తూనే ఉంటుందన్నారు. 'వందేమాతరం గేయం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 'దేశానికి జాతీయ గేయాన్ని రచించి, స్వరపరిచిన గొప్ప దేశభక్తుడు, దార్శనిక రచయిత బంకించంద్ర ఛటర్జీకి వందనాలు. ఆయన భారత్‌ను మాతృభూమిగా వ్యక్తీకరించారు. వందేమాతరం గేయంతో స్వాతంత్ర్య సమర యోధులను ప్రేరేపించారు. ప్రతి ఒక్కరిలో జాతి గొప్పతనం, సామరస్యం స్ఫూర్తిని బలోపేతం చేశారు'' అని శుక్రవారం 'ఎక్స్'లో గవర్నర్ పోస్ట్ చేశారు.

నేడు తెదేపా కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు శనివారం తెదేపా కేంద్ర కార్యాలయానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకుని ప్రజలు, తెదేపా కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు. తాజా రాజకీయ పరిణామాలు, జిల్లా కమిటీలు, అధ్యక్షుల ఎంపిక, రాష్ట్ర కమిటీ నియామకంపై నేతలతో చర్చించనున్నారు. తిరువూరు వివాదంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ చంద్రబాబుకు నివేదిక సమర్పించనుంది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శివనాథ్‌ల నుంచి తీసుకున్న వివరణను ఆయనకు తెలియజేయనుంది.

ప్రజావేదికలో పాల్గొనే నేతల వివరాలు

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఈ నెల 8 నుంచి 15 వరకు జరగనున్న ప్రజావేదికలో పాల్గొనే మంత్రులు, నేతల వివరాల్ని ఆ పార్టీ విడుదల చేసింది. 8న మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీసీఎంబీ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, 10న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీఎఫ్‌డీసీఎల్ ఛైర్మన్ సుజయకృష్ణ రంగారావు, 11న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్‌అజీజ్, 12న మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీఐడబ్ల్యూఏబీ ఛైర్మన్ శివప్రసాద్, 13న గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హెచ్‌బీ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, 15న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కేకే చౌదరి పాల్గొంటారు. ఆయా తేదీల్లో ప్రజలు, నాయకుల నుంచి వారు వినతులు స్వీకరిస్తారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గాల వారీ గ్రీవెన్స్‌లు జరుగుతాయి.

గొప్ప చరిత్రకు ప్రేరణ వందేమాతరం: మాధవ్



ప్రసంగిస్తున్న మాధవ్. చిత్రంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, యామినీ శర్మ తదితరులు

ఈనాడు, అమరావతి: వందేమాతరం గేయాన్ని ప్రతి ఒక్కరూ ఆలపించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వందేమాతరం గేయం 150 ఏళ్ల సంబరాల్లో మాధవ్ మాట్లాడారు. బ్రిటిష్ వాళ్లు దేశాన్ని విభజించే యత్నం చేసినప్పుడు ఈ గేయం అస్త్రంలా అడ్డుకుందన్నారు. స్వాతంత్ర్య పోరాటానికి, గొప్ప చరిత్రకు ప్రేరణగా నిలిచిందన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఈ గేయం పాడుతూ అంతా స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, నాయకులు దయాకర్‌రెడ్డి, రమేశ్‌నాయుడు, తపన చౌదరి, శ్రీనివాసరావు, సాదినేని యామినీశర్మ తదితరులు పాల్గొన్నారు. సభలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు.

ఇళయరాజాను కలిసిన భాజపా అధ్యక్షుడు

మాధవ్: సంగీత విభావరి కోసం విజయవాడ వచ్చిన ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వందేమాతరం గీతం 150 ఏళ్ల సంబరాల సందర్భంగా ఆయన్ను కలవడం ఆనందంగా ఉందన్నారు. వందేమాతరం పూర్తి గేయం ప్రజలకు అందించే ప్రయత్నంపై ఇళయరాజాతో చర్చించినట్లు వెల్లడించారు.

వచ్చే ఏడాదికల్లా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

- మంత్రి రామానాయుడు



ఫీడర్ కాలువను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు, తెదేపా నాయకులు, అధికారులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వచ్చే ఏడాది పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొంథా తుపానుతో దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కాలువను ఆయన శుక్రవారం పరిశీలించారు. నిపుణులతో కలిసి జంట సొరంగాల్లోకి చేరిన నీటిని పరిశీలించారు. నల్లమలలో కురిసిన వర్షంతో వరద నీరు పోటెత్తి ఫీడర్ కాలువకు గండి పడిందని, నీటిని తొలగించే పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ 'సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి కాకుండానే గత ముఖ్యమంత్రి జగన్ ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను వంచించారు. జగన్ హయాంలో నిర్వాసితులకు నయా పైసా పరిహారం ఇవ్వలేదు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా రూ.1,373 కోట్లు మంజూరు చేసి రూ.1,319 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.456 కోట్లు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేశాం. త్వరలో పనులు ప్రారంభమవుతాయి' అని వివరించారు. కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం తెదేపా బాధ్యుడు ఎరిక్షన్‌బాబు, ఇరిగేషన్ శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, సీఈ శ్యాంప్రసాద్, సీడీ సీఈ విజయభాస్కర్, ఎస్ఈ అబూతలీం, ఈఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్కే ప్రసాద్ ప్రొటోకాల్ వ్యవహారంపై చంద్రబాబు సీరియస్

ఈనాడు, అమరావతి: భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యురాలు శ్రీచరణి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన సందర్భంగా బీసీసీఐ మాజీ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌కు ప్రొటోకాల్ ఇవ్వకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెస్కే ప్రసాద్‌తో పాటు ఏసీఏ ప్రధానకార్యదర్శి సానా సతీశ్‌తో సీఎం వేర్వేరుగా మాట్లాడారు. ప్రొటోకాల్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఎలా అంటూ సానా సతీశ్‌పై అసహనం వ్యక్తం చేశారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో 'వందేమాతరం' సంబరాలు

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా వందేమాతర గీతం ప్రేరణ నిచ్చిందని తెదేపా నేతలు అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు నిర్వహించారు. మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. నేటికీ కోట్ల మంది భారతీయులు వందేమాతరం పాడుకోవడం చాలా గొప్ప విషయమని నేతలు కిమిడి కళావెంకట్రావు, వర్ల రామయ్య కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, గురజాల మాల్యాద్రి, బ్రహ్మంచౌదరి, హసన్ బాషా, ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా విజన్ విధ్వంసమే

మంత్రి కొలుసు పార్థసారథి



ఈనాడు, అమరావతి: వైకాపా పాలన దోపిడీమయంగా సాగిందని, విధ్వంసాన్ని విజన్‌గా చూపించారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ చేసిన మోసాలు, విధ్వంసం కారణంగానే 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితమయ్యారన్నారు.

రాష్ట్ర వేడుకగా కనకదాసు జయంతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వేడుకగా కనకదాసు జయంతిని శనివారం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాయలసీమ జిల్లాల్లో ఈ వేడుక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ముగిసిన మంత్రి దుర్గేష్ లండన్ పర్యటన

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లండన్ పర్యటన ముగిసింది. మంత్రి ప్రపంచ ట్రావెల్ మార్కెట్-2025లో పాల్గొనేందుకు వెళ్లిన విషయం తెలిసిందే. చివరి రోజైన శుక్రవారం భారత హైకమిషన్ ఏర్పాటు చేసిన హైటీలో పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ఈ పర్యటన ఎంతో దోహదం చేసిందని దుర్గేష్ తెలిపారు.

బస్సు చక్రాల కింద నలిగి భార్య మృతి

- భర్త కళ్లెదుటే దుర్ఘటన



భార్య మృతదేహం పట్టుకుని రోదిస్తున్న భర్త



శ్రీలత

గరివిడి, తెర్లాం, న్యూస్‌టుడే: ఇష్ట దైవానికి మొక్కు తీర్చుకునేందుకు వెళ్తుండగా మృత్యు శకటంలా దూసుకొచ్చిన బస్సు.. భర్త కళ్లెదుటే భార్య ప్రాణాలు తీసింది. ఈ దుర్ఘటన విజయనగరం జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెర్లాం మండలం పెరుమాలి గ్రామానికి చెందిన కొరగంజి సంఘంనాయుడు, భార్య శ్రీలత (43) చీపురుపల్లి మండలం రామలింగాపురంలోని మానసాదేవిని దర్శించుకునేందుకు శుక్రవారం సాయంత్రం బైక్‌పై బయల్దేరారు. గరివిడి మండలం చిన ఐతాంవలస సమీపంలో మలుపు దాటగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. వెనుక కూర్చున్న శ్రీలత రోడ్డుపైకి తుళ్లి పడిపోవడంతో ఆమె తలపై నుంచి బస్సు చక్రాలు వెళ్లాయి. ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందారు. గాయపడిన సంఘంనాయుడు. . భార్య మృతదేహాన్ని పట్టుకుని రోదించిన తీరు కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడిని సంఘంనాయుడిని ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడు డిస్కంతో వేదాంత ఒప్పందం

ఈనాడు, అమరావతి: వేదాంత మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్, వేదాంత లిమిటెడ్ ఛత్తీస్‌గఢ్ థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 500 మెగావాట్లు తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎన్‌పీడీసీఎల్)కు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వేదాంత పవర్ బిజినెస్ ఓ ప్రకటనలో తెలిపింది. 2026 ఫిబ్రవరి నుంచి 2031 జనవరి వరకు తమిళనాడు డిస్కం విద్యుత్ తీసుకుంటుందని తెలిపింది. టీఎన్‌పీడీసీఎల్ 1,580 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచిందని.. అందులో 500 మెగావాట్లను యూనిట్ రూ.5.38 చొప్పున సరఫరా చేసేలా బిడ్ దాఖలు చేసినట్లు వేదాంత సంస్థ తెలిపింది.



జవాబుదారీతనంతోనే పురోగతి

మీరు జీవితంలో పురోగతిని కోరుకుంటే, మీ పనులకు జవాబుదారీతనం వహించండి. మానసిక సంతృప్తిని పొందాలంటే, ఇతరుల పట్ల కృతజ్ఞతాభావంతో మెలగండి. మీరు క్రమశిక్షణను అలవర్చుకోవాలనుకుంటే, తాత్కాలిక ఆనందాలకు దూరం జరగండి. ఇవన్నీ కష్టంగానే అనిపించొచ్చు కానీ, మీ జీవితానికి దోహదపడే విలువైన అలవాట్లు.

– జేమ్స్ జాంగ్, ఫైనాన్షియల్ అడ్వైజర్

పాలకుల ప్రోత్సాహంతోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య


ఈనాడు, అమరావతి: పాలకుల ప్రోత్సాహంతోనే రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి వేళ్లూనుకుపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. "రాష్ట్ర ప్రభుత్వ నేతలు, కొంతమంది ఎమ్మెల్యేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు ఇటీవలి ఘటనల ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర సచివాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు అవినీతి విలయతాండవం చేస్తోంది. సీఎం చంద్రబాబు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరుగుతున్నాయి. గతం నుంచి పాలకులు అక్రమాలకు తెరలేపి రెవెన్యూ శాఖలో అవినీతిని ప్రోత్సహించారు. రాష్ట్రంలో అత్యధికంగా ఆదాయాన్ని ఆర్జించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోస్టింగ్, బదిలీ చేయించుకునేందుకు కొందరు అధికారులు రూ.లక్షల్లో లంచాలు ముట్టజెప్పిన ఘటనలు కోకొల్లలు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి" అని ఈశ్వరయ్య సూచించారు.

పదోన్నతులకు సీనియారిటీ జాబితా ఖరారు

ఈనాడు, అమరావతి: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోల (13 మంది) పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 13 మందిలో ముగ్గురు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. 10 మందికి పదోన్నతులు లభించనున్నాయి.

సీజేఐపై దాడి యత్నాన్ని సుమోటోగా విచారించాలి

మంద కృష్ణమాదిగ



కావలి, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 17న దిల్లీలో 'దళితుల ఆత్మగౌరవ నిరసన' పేరుతో ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో విలేకరులతో మాట్లాడారు. దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎమ్మార్పీఎస్ ముందుంటుందన్నారు. న్యాయ, పోలీసు శాఖలతోపాటు మానవహక్కుల కమిషన్ దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో ఓ రౌడీషీటర్ ఎన్‌కౌంటర్ జరిగితే మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసిందని ఆయన గుర్తు చేశారు. సీజేఐపై దాడి చేయబోయిన నిందితుణ్ని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు.

ఇది 'నరేంద్ర-నీతీశ్'పై

ప్రజల నమ్మకానికి నిదర్శనం

- బిహార్‌లో అత్యధిక పోలింగ్‌పై మోదీ వ్యాఖ్య



భభువా సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఔరంగాబాద్: బిహార్‌లో తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదవడం నరేంద్ర-నీతీశ్ ట్రాక్ రికార్డుల పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని ప్రధానమంత్రి మోదీ అన్నారు. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలోనే బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మహాగఠ్‌బంధన్‌కు ఘోర ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్‌లోని ఔరంగాబాద్, భభువాలో నిర్వహించిన సభల్లో పాల్గొన్న ప్రధాని.. 121 నియోజక వర్గాల్లో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎన్నికల సంఘాన్ని(ఈసీ) అభినందించారు.


రూ.లక్ష కోట్లకు ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా వారికి తెలియదు

ఆర్జేడీ నేతలకు రూ.లక్ష కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా తెలియదని మోదీ ఎద్దేవా చేశారు. 'నేను హామీ ఇచ్చిన పనులన్నీ పూర్తి చేస్తాను. 500 ఏళ్లుగా అన్యాయానికి గురవుతున్న అయోధ్యలో ఈరోజు రామమందిర నిర్మాణం పూర్తి అయ్యింది. ఆర్టికల్ 370ని రద్దు చేశాం. ఈ 11 ఏళ్లలో సైనిక కుటుంబాలకు వన్ ర్యాంక్ వన్ పింఛన్ ద్వారా రూ.లక్ష కోట్లు ఇచ్చాం. ఆర్జేడీ నేతలకు అందులో ఒకటి తర్వాత ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా అర్థం కాదు. కానీ కాంగ్రెస్, ఆర్జేడీ నేతలు రూ.500 కోట్లు మాత్రమే ఇచ్చామని అసత్యాలు చెబుతున్నారు' అని ప్రధాని విమర్శించారు.

పైలటే ప్రమాదానికి కారణమని

ఎవరూ విశ్వసించడం లేదు

- ఎయిరిండియా విమాన దుర్ఘటనపై సుప్రీంకోర్టు
- కేంద్రం, డీజీసీఏకు నోటీసులు



దిల్లీ: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంపై న్యాయస్థానం పర్యవేక్షణలో సుప్రీంకోర్టు మాజీ జడ్జి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలన్న పిటిషన్లకు సంబంధించి కేంద్రం, పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ)కు నోటీసులు జారీ అయ్యాయి. విమాన ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలట్ సుమీత్ సభర్వాల్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ సందర్భంగా శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. ప్రమాదానికి పైలట్ల తప్పిదమే కారణమని దేశంలో ఎవరూ విశ్వసించడం లేదు. ప్రమాదంపై జరిగిన ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణ మాత్రమే బయటకు వచ్చింది' అని పేర్కొంది. పైలట్లే ప్రమాదానికి కారణమంటూ అమెరికా మీడియాలో వచ్చిన కథనాన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రస్తావించగా...దానిని ఆ దేశ కోర్టులోనే సవాల్ చేయాలని ధర్మాసనం తెలిపింది. ఈ క్రమంలోనే పిటిషన్లపై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రం, డీజీసీఏతో పాటు ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ నవంబరు 10కి వాయిదా వేసింది.

నీట్-పీజీ పరీక్ష 'కీ' విడుదలపై మీ వైఖరి తెలపండి

- ఎన్‌బీఈని కోరిన సుప్రీం

దిల్లీ: వైద్య విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదలపై తమ వైఖరిని తెలపాలంటూ జాతీయ పరీక్షల బోర్డు (ఎన్‌బీఈ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. సమాధాన పత్రాలు, ఫలితాలు వంటి వివరాలు గతంలో నీట్-పీజీ అభ్యర్థులకు అందుబాటులో ఉండేవి కాదు. దీంతో ఎన్‌బీఈ పారదర్శకతపై అనుమానాలను వ్యక్తం చేస్తూ చాలా పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ పీఎస్. నరసింహా, విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం.. ప్రాథమిక 'కీ' విడుదలపై వైఖరిని వివరిస్తూ నివేదికను సమర్పించాలని ఎన్‌బీఈకి స్పష్టం చేసింది.

రష్యాలో భారత వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

మూడు వారాల క్రితం అదృశ్యం



అజిత్ సింగ్

ఇంటర్నెట్ డెస్క్: రష్యాలో మూడు వారాల క్రితం అదృశ్యమైన భారత్‌కు చెందిన వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. యుఫా నగరానికి సమీపంలో ఉన్న డ్యామ్‌లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని రాజస్థాన్‌లోని అల్వార్‌కి చెందిన అజిత్ సింగ్ చౌధరి(22)గా గుర్తించారు. 2023లో రష్యా వెళ్లిన అతను బష్కీర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. అక్టోబరు 19న అరగంటలో వస్తానని ఉదయం పాలు కొనడానికి వెళ్లిన అజిత్ తిరిగి రాలేదని అతని స్నేహితులు తెలిపారు. అజిత్ అదృశ్యమైన 19 రోజులకు స్థానికంగా ఉన్న వైట్ నది సమీపంలో అతడి దుస్తులు, ఫోన్, బూట్లను అధికారులు గుర్తించారు. నదిలో గాలించగా అక్కడ ఉన్న డ్యామ్‌లో గురువారం మృతదేహం లభించింది. విద్యార్థి మృతి గురించి కుటుంబసభ్యులకు, రాజస్థాన్ అధికారులకు మాస్కోలోని భారత ఎంబసీ సమాచారం అందించింది. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని స్వదేశానికి పంపనున్నట్లు తెలిపింది. అజిత్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

షట్‌డౌన్‌తో అమెరికాలో విమానాల తగ్గింపు

న్యూయార్క్: ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా అమెరికా వ్యాప్తంగా విమానాల రాకపోకలను తగ్గించాలంటూ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయి. ఎఫ్ఏఏ ఎంపిక చేసిన 40 విమానాశ్రయాలు రెండు డజనుకు పైగా రాష్ట్రాల్లో ఉన్నాయి. వీటిలో అట్లాంటా, డాలస్, డెన్వర్, లాస్‌ఏంజెలెస్, నార్త్ కరోలినా వంటివి ఉన్నాయి. న్యూయార్క్, హ్యూస్టన్, షికాగో, వాషింగ్టన్ సహా కొన్ని మెట్రోపాలిటన్ ప్రాంతాల్లోని విమానాశ్రయాలూ ప్రభావితమవుతున్నాయి. ఎఫ్ఏఏ ఆదేశాల ప్రకారం విమానయాన సంస్థలు గురువారం నుంచే విమానాల సమయాలను సర్దుబాటు చేశాయి. కొన్ని సంస్థలు పలు సర్వీసులను రద్దు చేయడం ప్రారంభించాయి. అమెరికా వ్యాప్తంగా 815 విమానాలు రద్దయ్యాయి. డెల్టా ఎయిర్‌లైన్స్ శుక్రవారం దాదాపు 170 విమానాలు రద్దు చేసినట్లు తెలిపింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్ సోమవారం వరకు రోజుకు 220 విమానాలను తగ్గించాలని నిర్ణయం తీసుకుంది.

ఓట్ల చోరీతోనే మోదీ ప్రధాని అయ్యారు

- టోకుగా ఓట్లు దొంగలించే పనిలో భాజపా నిమగ్నం
- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు



బంకా జిల్లాలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న రాహుల్‌గాంధీ

దిల్లీ, పట్నా: ఓట్ల చోరీ అంశంపై భాజపా, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో పెద్ద మొత్తం(టోకుగా)లో ఓట్లను చోరీ చేసే పనిలో భాజపా నిమగ్నమైందని, ఈ విధంగానే మోదీ ప్రధాని అయ్యారని ఆరోపణలు చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. "ఓట్ల చోరీపై మా దగ్గర చాలా సమాచారం ఉంది. ఈ విషయంలో మేం విశ్లేషణలు కొనసాగిస్తున్నాం. హరియాణా ఎన్నికల్లో ఓట్ల చోరీపై ఇటీవల నేను ప్రజంటేషన్ ఇచ్చాను. అందులో నకిలీ ఓట్లు, నకిలీ ఫొటోలను బయటపెట్టాను. కానీ, ఎన్నికల సంఘం(ఈసీ) నుంచి సమాధానం లేదు. భాజపా మాత్రం ఈసీని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓట్లను భాజపా ఎలా దొంగలిస్తుందనే విషయాన్ని యువత, జెన్-జడ్‌కి కాంగ్రెస్ స్పష్టంగా వివరిస్తుంది. ఇందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో భాజపా ఇలానే ఓట్ల చోరీ చేసింది'' అని రాహుల్ ఆరోపించారు. దీన్ని భాజపా ఖండించింది. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఈసీపై రాహుల్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టింది.

దిల్లీలో ఓటేసిన భాజపా నేతలు బిహార్‌లోనూ వేశారు

దిల్లీలో ఓటు హక్కు వినియోగించుకున్న భాజపా నేతలు బిహార్ తొలివిడత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటు వేశారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్‌లోని బాంకా జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. హరియాణాలోని 2 కోట్ల ఓటర్లలో 29 లక్షలు నకిలీవని పునరుద్ఘాటించారు. ఇదే తరహాలో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోనూ చేశారన్నారు. ప్రస్తుతం బిహార్‌లో ఓట్ల చోరీకి యత్నిస్తున్నారని ఆరోపించారు.

ఓటు చోరులు భూమి దొంగిలించారు: రాహుల్

దిల్లీ: మహారాష్ట్రలో దళితుల కోసం రిజర్వు చేసిన రూ.1,800 కోట్ల విలువైన భూమిని ఒక మంత్రి కుమారునికి కారుచౌకగా కట్టబెట్టారని, ఓటు చౌర్యం చేసి అధికారానికి వచ్చిన ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడిందని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం దాల్చడాన్ని విమర్శిస్తూ ఆయన సోషల్ మీడియా పోస్టు పెట్టారు. మహారాష్ట్రలో మీ ప్రభుత్వం మనుగడ దళితుల హక్కుల్ని కాలరాస్తున్న వారిపై ఆధారపడింది కాబట్టేనా మీరిలా మౌనం దాల్చింది? అని రాహుల్ మోదీని ప్రశ్నించారు. "ఈ వ్యవహారంలో స్టాంప్ డ్యూటీని కూడా రద్దు చేశారు. అంటే ఇది కేవలం భూ దోపిడీ మాత్రమే కాదు స్టాంప్ డ్యూటీ మాఫీ అక్రమం కూడా'' అని రాహుల్ పేర్కొన్నారు.

పంజాబ్ మాజీ డీజీపీ దంపతులపై సీబీఐ కేసు



ముస్తఫా, రజియా దంపతులు (మధ్యలో) కుమారుడు అఖ్తర్

దిల్లీ: పంజాబ్ మాజీ డీజీపీ మొహమ్మద్ ముస్తఫా, అదే రాష్ట్ర మాజీ మంత్రి రజియా సుల్తానా దంపతులపై వారి కుమారుడు అఖిల్ అఖ్తర్ (35) 'హత్యకేసు'కు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అఖ్తర్ భార్య, సోదరి పేర్లను కూడా ఇందులో చేర్చింది. హరియాణాలోని పంచకులలో గల ఇంట్లో అక్టోబరు 16న అఖ్తర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెంది ఉండగా పోలీసులు గుర్తించారు. మృతుడికి, అతడి కుటుంబానికి మధ్య విభేదాలు ఉన్నట్లు హత్య, నేరపూరిత కుట్ర కింద నమోదైన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. మరణానికి ముందు ఆగస్టు 27న అఖ్తర్ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియో పోస్టు చేశాడు. తన భార్యకు, తండ్రికి మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లుగా అందులో తెలిపాడు. తల్లితో సహా కుటుంబమంతా కలిసి తనను అంతం చేయాలని లేదా తప్పుడు కేసులో ఇరికించాలని చూస్తున్నట్లు ఆరోపణలు చేశాడు. అఖ్తర్ సన్నిహితుడొకరు చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారంపై పంచకుల పోలీసులు నమోదుచేసిన కేసును హరియాణా ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది.

ఇండోనేసియా మసీదులో పేలుళ్లు

55 మందికి గాయాలు

జకార్తా(ఇండోనేసియా): ఇండోనేసియా రాజధాని జకార్తాలో ఒక ఉన్నత పాఠశాలలోని మసీదులో శుక్రవారం ప్రార్థనలకు ముందు భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో 55 మంది గాయపడ్డారు. వారిలో అధికులు విద్యార్థులేనని పోలీసులు తెలిపారు. ఈ పేలుళ్లకు గల కారణంపై విచారణ జరుపుతున్నామని జకార్తా పోలీస్ చీఫ్ ఎసెప్ ఎది సుహేరి తెలిపారు. ఇవి ఉగ్రదాడిలో భాగంగా జరిగాయన్న వాదనను పోలీసులు తోసిపుచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మసీదు లోపలా, బయటా రెండు భారీ పేలుళ్లు విన్నామని ప్రత్యక్ష సాక్షులు స్థానిక టీవీ స్టేషన్ల ప్రతినిధులకు తెలిపారు. విస్ఫోటనల తీవ్రత కారణంగా భయభ్రాంతులైన విద్యార్థులు సురక్షిత ప్రదేశాలకు పరుగులు తీశారు.

పంజాబ్ వర్సిటీలో మార్పుల్ని రద్దు చేసిన కేంద్రం

దిల్లీ: పంజాబ్ విశ్వవిద్యాలయ సెనేట్, సిండికేట్‌ల నియమావళిని, కూర్పును మారుస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను కేంద్ర విద్యాశాఖ శుక్రవారం రద్దు చేసింది. విశ్వవిద్యాలయానికి సంబంధించిన సెనేట్, సిండికేట్ సభ్యుల సంఖ్యను తగ్గించడంతో పాటు, వారిని నామినేట్ పద్ధతిలో నియమించేందుకు వీలు కల్పించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై పంజాబ్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కేంద్ర నిర్ణయాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రాజ్యాంగ విరుద్ధమైనదిగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ రాజ్యాంగాన్ని, సెనేట్, సిండికేట్‌ల కూర్పును మారుస్తూ వెల్లడించిన నిర్ణయాన్ని రద్దు చేయాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది అని ఆ శాఖ అధికారిక ప్రకటన ఒకటి తెలియజేసింది.

మా వాళ్లను మా దేశానికి పంపేయండి

రష్యా సైన్యంలోని భారతీయుల కోసం మాస్కోను కోరిన భారత్

దిల్లీ: రష్యా సైన్యంలో పనిచేస్తున్న మన దేశ పౌరుల సంఖ్య తాజాగా 44కు పెరిగిందని కేంద్రం వెల్లడించింది. ఇటీవల మాస్కో చేపట్టిన నియామకాల నేపథ్యంలో ఈ సంఖ్య పెరిగిందని తెలిపింది. ఈ క్రమంలో వారందరిని మన దేశానికి తిరిగి పంపేయాలంటూ విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) రష్యాను కోరింది. అలాగే భారతీయులను సైనికులుగా నియమించుకోరాదని ఆ దేశ సైన్యానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ తెలిపారు. సెప్టెంబరు నాటికి రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారత పౌరుల సంఖ్య 27గా ఉండటం గమనార్హం.